SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

శుక్రనీతిసారము

చెన్నపురి, 1918

Record no. 315

Śukranītisāramu

Cennapuri, 1918

Record no. 315

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

శుక్రనీతిసారము / ఇది పురాణపండ మల్లయ్యశాస్త్రులచే సంస్కృతమునుండి తెనిఁగింపఁబడినది.- 2. కూర్పు.- చెన్నపురి : ఆంధ్రపత్రికాకార్యాలయము, 1918.

(1), 2, 9, 262, 5, 2 p. ;20 cm.

Record no. 315

Śukranītisāramu / idi Purāṇapaṇḍa Mallayyaśāstrulacē Saṃskṛtamunuṃḍi Teniṁgimpaṁbaḍinadi.- 2. kūrpu.- Cennapuri : Āṃdhrapatrikākāryālayamu, 1918.

(1), 2, 9, 262, 5, 2 p. ;20 cm.

Record no. 315

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB   Date filming began:

[illegible]

JANATA BOOK BINDING WORKS
Prop: N. Yadagiri
Sultan Bazar, Kandaswamy Lane,
HYDERABAD - A. P.

శ్రీరస్తు.

శుక్రనీతిసారము

ఇది

శ్రీ పీఠికాపురము ఆర్. సి. హెచ్. హైస్కూలులో

తెనుఁగు పండితులగు

పురాణపండ మల్లయ్యశాస్త్రు[illegible]

సంస్కృతమునుండి [illegible]

68

శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయము

విభాగము ...

విభాగ సంఖ్య ...

చెన్నపురి:

ఆంధ్రపత్రికాకార్యాలయమున

ముద్రితము

౧౯౧౭

All Rights Reserved

Copy-right Registered

వెల రు 1-4-0

PRINTED AT THE
ANDHRA PATRIKA PRESS
MADRAS—1919

FOREWORD.

This is a Telugu translation of the well-known Sanskrit book called Sukraneetisaram-essence of Sukra's treatise an polity. The book deals, as its name implies with polity in its various aspects and is, in parts, so up to-date that some may be tempted to suspect its antiquity which is however, beyond all doubt. Many a present day Indian, being fed entirely on western culture, is apt to think that there is nothing worthknowing or caring for in India's past histoty or its literature. This book cannot fail to act asan eye opener to such men and to instil in them some degree of national respect without which there can be no national progress and it is to be hoped that the study of the subject will receive the encouragement which it deserves. The name of the translator Brahmasree Puranapanda Malliah Sastry Garu is a guarantee that the translation is correct. The language used in the book is correct and chaste.

22nd September, 1918. **J. RAMAYYA.**

శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషానిలయము,
విభాగము ....
విభాగ సంఖ్య ....

గ్రంథకర్తృవిజ్ఞాపనము.

విద్వాంసులార !

శుక్రనీతిసార మను నీపొత్తము సంస్కృతభాషయం దున్న దానిని నాతికఠినమైన శైలిని దెనిగించి మున్ను సరస్వతీపత్రికయందుఁ బ్రకటించితిని. ఇపుడు శ్రీ శ్రీ శ్రీ పీఠికాపుర మండలాధీశ్వరులు నాకుఁ బోషకులు, భాషాభిమానులుఁ గవితారసజ్ఞులు, మహావదాన్యులు, సద్గుణగరిష్ఠులు, సి. బి. ఇబిరుదాంచితులు నగు మ. రా. రా. శ్రీ శ్రీ శ్రీ రాజా రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహదరు ప్రభువారు ద్వితీయ ముద్రణమున కగు నట్టి సకల వ్యయమును నాయం దనుగ్రహించి దయచేసి ముద్రింపించి నన్నుం గృతార్థుఁ జేసిరి. నా రచించిన దాన విద్యాస్వరూప నిరూపణము కడ నొక్కింతమూలమున కధికముగ వ్రాయంబడియె; కాని తక్కిన యెల్లచోట్ల మూలమున కంతరము లేకుండనే సాధ్యమగునంతవఱకు వ్రాసితిని. పురాతన ముద్రణమునందలి లోపములను బుస్తకాంతరసహాయమున జాగ్రత్తగఁ బూరించితిని. అయిన నల్పజ్ఞుఁడ నగుటం జేసి నా యజ్ఞానమున నేని ప్రమాదమున నేని దోషములు పెక్కు లుండంబోలును గాఁబట్టి నాయందు వాత్సల్యముంచి క్షమియింపుఁ డని సవినయముగఁ బ్రార్థించుచున్నాను. మూలగ్రంథప్రాశస్త్యము నుపోద్ఘాతమునఁ గవితావిశారదులు ననేకభాషల విద్వాంసులు మున్ను మహోద్యోగములఁ గావించి యిపు డుపకారవేతనము నందుచున్నవారు నగు మ. రా. రా. శ్రీ-బ్ర-శ్రీ జయంతి రామయ్య పంతులుగారు

వ్రాసిరి కాఁబట్టి మరల నే వ్రాయుట నావశ్యకము. శ్రీ రామయ్యపంతులవారు నే నడిగినంతమాత్రమున నా ప్రార్థన మన్నించి యింగ్లీషుభాషలో నుపోద్ఘాతము వ్రాయించి దయ చేసినందులకుఁ గృతజ్ఞతాపూర్వకముగా నమస్కరించు చున్నాను. నేను ప్రధానమంత్రిముఖంబున వేఁడికొన్నంతనే యీ పొత్తము ద్వితీయముద్రణమున కగు నట్టి సకలవ్యయ ముం బ్రసాదించి ముద్రింపించి దయచేసిన శ్రీ శ్రీ శ్రీ పీఠికా పుర మండలాధీశ్వరుల కధికాయురారోగ్యైశ్వర్యముల దయ చేసి పుత్త్రమిత్త్రాదిసకలబంధుసమేతముగఁ జిరకాలము పర మేశ్వరుఁడు రక్షించుఁగాత మని యహరహముం బ్రార్థించు చున్నాను. మఱియు మున్నిట ముఖ్యమంత్రిపదంబున నున్న వారుఁ బరోపకారైకపరాయణులు ననేకవిద్యార్థులఁ బోషించిన వారు నిపుడు కథావశిష్టులు నగు బ్ర. శ్రీ. మ. రా. శ్రీ మొక్కపాటి సుబ్బారాయఁడు పంతులుగారు నే నాంధ్ర సాహిత్యపరిషత్సభకుఁ జెన్నపురము వెళ్లినపు డీపుస్తకము ద్వితీయముద్రణము గూర్చి విన్నవించినంతమాత్రాన నా విన్న పమును మన్నించి శ్రీ శ్రీ శ్రీ ప్రభువువారికి లేఖారూప మునఁ దెలిపి వాక్సహాయము చేసినందుల కెంతయు నభినందించుచు వారికిఁ బరలోకసుఖమును వారి కుటుంబమువారి కిహ లోకసుఖముం బ్రసాదింప సర్వేశ్వరు వేఁడికొనుచు నా విన్న పమును ముగించుచున్నాను.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

పీఠాపురము.
4-4-19.

పు॥ మల్లయ్య శాస్త్రి.

విషయసూచిక

ప్రథమాధ్యాయము

	పుటసంఖ్య.
1. నీతిశాస్త్రప్రశంస	1
2. నీతిశాస్త్రాభ్యాసము రాజునకు ముఖ్యము	2
3. రాజు కాలప్రవర్తకుఁడు	3
4. రాజునకు గుణములచేఁ ద్రైవిద్యము	3
5. వర్ణభేదము	4
6. వర్ణగుణములు	,,
7. కర్మవిచారము	5
8. రాజుప్రవర్తనము	6
9. రాజ్యాంగస్వరూపము	,,
10. రాజునావశ్యకత	,,
11. రాజనిర్మాణహేతువు. నతనియందలి దేవాంశములును ...	7
12. రాజునకుఁ బ్రజకు నన్యోన్యానురాగ మావశ్యకము ...	8
13. ఇంద్రియనిగ్రహము	9
14. కామజంబులగు వ్యసనంబులనింద	10
15. కామాదు లెక్కుడమంచివి యెచటఁగావు	11
16. తపఃపాపఫలములు	,,
17. రాజుగుణదోషములు	,,
18. రాజు కామక్రోధాదుల నవశ్యము విడువవలయును ...	13
19. రాజునకు విద్యాభ్యాసమావశ్యకము	,,
20. ఆన్వీక్షిక్యాదులస్వరూపము	14
21. రాజుకర్తవ్యాకర్తవ్యములు	14
22. రాజ మండలేశ్వరాదుల భేదమ్ము [illegible]	15

విషయము. ... పుటసంఖ్య.

23. భూపరిమాణము 17
24. రాజు భూమినెట్లేలియవలెను 19
25. పత్తనిర్మాణము-రాజగృహనిర్మాణము ... ... ,,
26. పాంథశాల 24
27. రాజుదినచర్య ... ... ,,
28. రాజాశ్రితులకుఁ జేయు నేర్పాటు 25
29. రాజవశ్యముచేయవలసిన శాసనములు 26
29 (అ) రాజులాదాయము నెట్లు వ్యయము చేయవలెను ... 27
30. రాజచారసంభాషణాదికము 29
31. రాజ్యంబెట్టిది కావలయు - రాజుదాయాదులపట్ల నెట్లుండవలయు 30
32. రాజు కార్యములనెపు డాలోచింపవలెను 31
33. రాజు లేఁటేఁట స్వదేశమునం జరించి చేయవలయుపని... 33

ద్వితీయాధ్యాయము.

1. రాజు సేవకుల నవశ్యము గ్రహింపవలెను ... 35
2. యువరాజు గాఁదగినవారు 36
3. యువరాజును రక్షించువిధము ... ... ,,
4. యువరాజు చేయవలయుపనులు 38
5. సుసేవకులయు దుస్సేవకులయు గుణములు ... 39
6. పురోహితుఁడు ప్రధానుఁడు మొదలగువారి గుణములు 40
7. తక్కిన చిన్నయుద్యోగుల నేర్పఱచువిధము ... 44
8. సేవకధర్మములు 52
9. పలువిధములగు దస్తావేజులు 60
10. ఆయవ్యయంబులస్వరూపము 62
11. మానసంఖ్యాదిస్వరూపము-ద్రవ్యధనస్వరూపము ... 64
12. లిఖితములు వ్రాయువిధము 65
13. వేఱువేఱు మానంబులయుఁ గాలంబులయు స్వరూపము 67

విషయము. ... పుటసంఖ్య.

14. భృతివిభాగము మొదలగునవి 67
15. సేవకభేద భృతిభేదములు-సేవకుఁడు పనిచేయవలసినకాలము 69
16. రాజు సేవకులకీయవలయు సెలవు మొదలగునవి. ... ,,
17. రాజు భటులకు విరోధమునను రాగము కలిగించువిధము 70
18. రాజు సేవకుల కిట్టివస్తువుల నీవలయు 71
19. పురోహితాదులయు గ్రామాధికారులయు జాతినిరూపణము 72

తృతీయాధ్యాయము.

1. మనుజుఁడు లోకుల సంతసిల్లఁజేయువిధము ... 78
2. మనుజుఁడు దూరదృష్టి కలవాఁడు గావలయును ... 80
3. మిత్రప్రశంస ... ... ,,
4. విద్యాదులవలని గర్వము 81
5. విద్యాదిఫలము 82
6. మనుజుఁడు చేయవలసినవి; విడువవలసినవి. ... ,,
7. గౌరవార్హులు 84
8. దాఁపవలసినవి 85
9. దేశసంచారాదులవలనిఫలము ... ... ,,
10. అతిథిపూజాదులు 86
11. జనసమ్మతుఁడగువిధము 87
12. స్త్రీలదుర్గుణములు 89
13. రక్షింపవలసినవారు ... ... ,,
14. కన్యాదానము 90
15. విద్యాధనముల సంపాదనము ... ... ,,
16. విభాగవిషయము 92
17. మిత్రునియెడఁ బ్రవర్తిల్లువిధము 93
18. ఉత్తమాదిస్వరూపము ... ... ,,
19. దానప్రశంస ... ... ,,
20. వివిధములగు దానములు 94

విషయము.	పుటసంఖ్య.
21. మంచినడువడి- చెడునడువడి-వానిఫలము ...	,,
22. ఖలస్వరూపము	97
23. మంచిపుత్త్రులు-చెడుపుత్త్రులు	98
24. భార్య మొదలగువారి ప్రాశస్త్యము	,,
25. దుఃఖహేతువులు	99
26. మనుజుల వేలువేలుకోర్కులు	100
27. బ్రాహ్మణప్రాశస్త్యము	,,
28 వృత్తిభేదములు	101
29. బుద్ధిప్రశంస	,,
30. అల్పభాగ్యాదులయప్రాశస్త్యము	102
31. నాశహేతువులు	,,
32. సంసర్గమహిమ	,,
33. సుఖహేతువులు	,,
34. అంతఃపురసేవార్హులు	103
35. మార్గమున సుఖహేతువులు	,,
36. జరాకారణములు	104
37. స్తుతి	,,
38. దుర్గుణహీనము	104
39. సాధునకు నసాధునకుఁ గావించిన యుపకారము ...	105
40. జనుల రంజించు విధము	,,
41. వ్యవహారము తెలుఁగు సాధనము	107

చతుర్థాధ్యాయము

ప్రథమప్రకరణము

1. మిత్రామిత్రుల లక్షణము	108
2. సహజమిత్రులు - సహజశత్రులు	109
3. రాజు శత్రులయెడను మిత్రులయెడను బ్రవర్తించు విధము	110

విషయము.	పుటసంఖ్య.
4. ఉపాయస్వరూపము - వానిఁ బ్రయోగించు విధము...	111
5. మంచిరాజు ప్రవర్తనము	114
6. రాజు శిక్షింపవలయు విధము	115
7. శిక్షార్హులు - శిక్షయు	118

ద్వితీయప్రకరణము

8. కోశస్వరూపము - దాని సంగ్రహించు విధము ...	121
9. ధాన్యసంగ్రహము	123
10. రత్నసంగ్రహము - వాని స్వరూపాదులును ...	125
11. రత్నములవెల	127
12. లోహస్వరూపము - వాని మూల్యములును ...	129
13. ఆవు మొదలగు పెంపుడుజంతువుల వెల ...	130
14. పన్ను గ్రహించు పద్ధతి	132



తృతీయప్రకరణము

15. రాష్ట్రస్వరూపము	135
16. చాతుర్వర్ణ్యస్థితియుఁ - ధర్మములును ...	136
17. విద్యాకలాస్వరూప సంఖ్యానిర్ణయము ...	137

చతుర్థప్రకరణము

18. ఆశ్రమములు	149
19. స్త్రీ సాధారణధర్మములు	,,
20. శూద్రధర్మము	152
21. జన్మ గుణముల ప్రాశస్త్యము	153
22. పనివాండ్ర లక్షణము	,,
23. వృక్ష లతాది స్థాపనము	154
24. కూపాదుల నిర్మాణము.- దేవాలయ నిర్మాణము ...	155
25. ప్రతిమాభేదము - వాని స్వరూపనిర్మాణము	156

పంచమప్రకరణము

విషయము.	పుటసంఖ్య.
26. రాజుల ధర్మము	169
27. సభానిర్ణయము	,,
28. సభాంగములు	173
29. వాదుకలలో నున్న ధర్మములు	174
30. రాజు వాదిం బరీక్షించి యతని వాదమును విను విధము	174
31. శిక్షార్హులు	175
32. న్యాయముల విచారించు విధము	,,
33. ఛలములు	176
34. అపరాధములు	177
35. నృపతిపదములు – రాజజ్ఞేయములు	,,
36. ఆసేధభేదములు	178
37. సభకు రాఁదగనివారు	179
38. ఎప్పుడెల్లవారును సభకు రావలెను	180
39. ప్రతినిధులు	,,
40. ప్రతినిధుల నంగీకరింపరాని నేరములు	182
41. ప్రతిభూగ్రహణము	,,
42. గ్రాహ్యాగ్రాహ్యపక్షాదులు	183
43. లిఖితాదిపరీక్ష	185
44. లిఖితవిభాగము	187
45. సాక్షిస్వరూపము	189
46. అగ్రాహ్యసాక్షులు	,,
47. సాక్షివిచారము	190
48. సాక్షిశ్రావణము	191
49. సాధనములు–వానిబలాబలములు	,,
50. అగ్న్యాదిపరీక్ష	193
51. తీర్పు	197
52. వాదముల పునర్విమర్శనము	198

విషయము.	పుటసంఖ్య.
53. పదార్థస్వామ్యము–దానివిభాగము	199
54. దండింపఁదగినవారు	203
55. గనులనుండి తీయువస్తువుల కరనిర్ణయము	,,
56. చేసినవస్తువులస్వరూపము	204
57. స్వర్ణరజతాదివస్తునిర్మాణమునకు భృతినిర్ణయము	,,

షష్ఠప్రకరణము

58. దుర్గభేదములు	206

సప్తమప్రకరణము

59. సేనాస్వరూపము–దానిభేదములు	208
60. ఆయమునుబట్టి గ్రహింపవలసిన సేనయు, సంవత్సర వ్యయమును	210
61. రాజుసంపాదింపవలయు రథగజాదులు	211
62. గజభేదమును దల్లక్షణములును	,,
63. అశ్వపరిమాణమును లక్షణమును వానిభేదమును	212
64. అశ్వగతులు	222
65. వృషభోష్ట్రస్వరూపము	,,
66. నరాదులవయోనిర్ణయము	223
67. ఎద్దు మొదలగువానివయసు పరీక్షించువిధము	,,
68. గజాదుల శిక్షాసాధనములు	224
69. వృషభాదుల రాజువిడియించుచోట్లు – దండువిడియు విధము – శత్రులవశపఱచికొనువిధమును	225
70. శస్త్రాస్త్రస్వరూపము, వానిభేదమును	227
71. అగ్నిచూర్ణస్వరూపము	228
72. బాణములవిడుచువిధము, ఆయుధపరిమాణమును	229
73. ఎట్టిరాజు యుద్ధకాముఁడు గావలయును	,,
74. యుద్ధస్వరూపము– దానిభేదములును	230

విషయము.	పుటసంఖ్య.
75. యుద్ధానుకూలకాలము-దేశము	,,
76. అసారాదిబలములకు నెప్పుడు జయము కలుగును ...	231
77. సంధివిగ్రహములస్వరూపము - వానివిభాగములు - నుపయోగించువిధమును	,,
78. సేనానాయకుల ముఖ్యకార్యము	234
79 సేనాపతి యెప్పు డెట్టి వ్యూహమును రచింపవలెను ...	,,
80. సైనికులు పోవువిధము	235
81. వ్యూహస్వరూపము-వానిభేదము	236
82. రాజు సేనల నెట్టు నిల్పవలయు - శత్రుల నెట్లు వశపఱచి కొనవలయు	,,
83. ఓడినవారిసొమ్ము గ్రహింపవలయువారు	237
84. రాజుపాయములను నిశ్చయింపనప్పు డెట్లుండవలెను...	,,
85. కార్య మెట్లు సిద్ధించును - ఎట్లు సిద్ధింపదు ...	,,
86. రాజే యుపాయము నే గుణమును గ్రహింపవలెను...	238
87. రాజెప్పుడు తప్పక యుద్ధము సేయవలెను ...	,,
88. రాజున కెట్టి మరణము ప్రశస్తము	239
89. శౌర్యాభివర్ణనము	240
90. రాజు విద్వాంసులతో నెప్పు డాలోచింపవలయు నెప్పుడు గూడదు	,,
91. రాజు యుద్ధమునఁ బలాయితుఁ డైన నేమి? ...	241
92. రాజెవని విడువరాదు	,,
93. రాజు బ్రాహ్మణాదుల నెప్పుడు చంపిన దోషి కాఁడు...	,,
94. బ్రాహ్మణు లెట్టికాలమున యుద్ధముచేసిన దోషులు కారు	,,
95. యుద్ధ మెద్ది యుత్తమము - ఎద్ది తదితరము ...	242
96. యుద్ధస్వరూపము	,,
97. బాహుయుద్ధ విభాగము	,,
98. యుద్ధమున సేనల నిల్పు విధము	243
99. రాజు స్వసేనల నెప్పుడు రక్షింపవలెను	,,

విషయము.	పుటసంఖ్య.
100. యుద్ధకాలమున రాజు చేయవలయు నేర్పాటులు ...	244
101. యుద్ధమున వధానర్హులు	245
102. కూటయుద్ధము	,,
103. స్వకార్యము సాధించు విధము	,,

పంచమాధ్యాయము

1. నీతిశేషము	252

శ్రీరస్తు

శుక్రనీతిసారము

నీతిశాస్త్రప్రశంస

శ్రీమంతం బగు స్వావాసంబున సుఖాసీనుండైన భార్గవుని నమస్కరించి పూజించి పూర్వదేవతలు నీతిశాస్త్రముపదేశింపు మనిన నతఁడు సర్వాదికారణం బగు దేవునకు మ్రొక్కి యిట్లనియె. మున్ను లోకహితంబునకై పరమేశ్వరుండు శతలక్షశ్లోకపరిమితం బైన నీతిశాస్త్రంబుఁ గావించె. అల్పాయువు లగు నరులయు నరపతులయు నుపయోగంబు కొఱకుఁ దర్కవిస్తృతం బైనదాని వసిష్ఠాదుల మైన మేము సంగ్రహించితిమి. క్రియైకదేశబోధకంబు లగు శాస్త్రంబులు పెక్కులున్నను జతుర్వర్గసాధకం బైన నీతిశాస్త్రంబు సకలలోకోజ్జీవకంబు. శబ్దశాస్త్రంబు నభ్యసింపకయు లోకవ్యవహారానుసారంబుగఁ బదార్థసంబంధజ్ఞానంబు నందవచ్చు. కాణాదాదుల నేరువకయ ప్రాకృతంబులైన వస్తువుల నెఱుఁగవచ్చు. ఉపనిషదాది పరిజ్ఞానంబు నొందకయు దేహాదుల నాశంబు తెల్లంబుగాఁ గానవచ్చు. బుద్ధికౌశల్యజ్ఞాపకంబులైన శాస్త్రంబు లెల్లను దత్తత్కర్త్రభిప్రాయంబుల వెల్లడించుఁ గాని వ్యవహారుల కుపయోగింపవు. మఱియుఁ దత్తచ్ఛాస్త్రంబుల నధిగమింపక యెట్టులేని తత్త్వజ్ఞానంబు నొందుఁ

గాని జంతువులకు నిరశనంబున నసువులు నిలువనియట్లు నీత్యభావంబున లోకమర్యాద నిలువ దనుట యెల్లరకుఁ దెల్లంబ.

నీతిశాస్త్రాభ్యాసము రాజునకు ముఖ్యము

సర్వాభీష్టదంబును నెల్లరకు సమ్మతంబు నగు నీతివిద్య లోకపాలకుం డగుట ఱేని కత్యావశ్యంబు. అపథ్యాశికి రోగంబులవోలె నీతిహీనుండైన యేలికకు శత్రువులు సద్యస్కాలంబునఁ గొందఱుఁ గాలాంతరంబునఁ గొందఱు వొడమి బాధింతురు. రాచవారికిఁ బ్రజాపాలనంబు ముఖ్యధర్మంబు; అయ్యది దుష్టనిరసన శిష్టరక్షణ రూపంబై యుండు. ఇవి రెండును దుర్నయునకు దుష్కరంబులు. రాజునకుఁ జెడునడతయ యత్యాహితకరంబును శత్రువృద్ధికరంబును స్వబలహ్రాసకరంబు నగుట నయంబు వదలి చరించు స్వతంత్రుఁడైన రాజు దుఃఖభాజనం బగు; అట్టివాని సేవయు నసిధారావలేహనంబై యుండు. నీతిమంతుఁ డగు రాజు స్వారాధ్యుండు ననీతిమంతుం డగు రాజు దురారాధ్యుఁడు నగు. నీతియు బలంబునుగల పుడమిఱేనియింట సిరి యచంచలయై యుండు. కావునఁ దన ప్రేరణంబు నొందకయ యెల్లరుఁ దనకు హితంబు సేయున ట్లాత్మహితంబు గోరు సమ్రాట్టు నీతిధారణంబు సేయునది. బలరాష్ట్రామాత్యగణంబు భిన్నంబగుటకు సామి యకౌశలంబుకంటె నొండుహేతువు లేదు. శాసనపాలనంబులచే రంజకుం డగు రాజు బుద్ధిబలంబుచేఁ దేజస్వంతుండై పూర్వసుకృతంబున నైహికంబైన తపోవిశేషంబునను మహీమండలంబు ధరియించు.

రాజు కాలప్రవర్తకుఁడు

వృష్టి శీతోష్ణాదులచేతను బెక్కు లగు నాచారాదులచేతను గ్రహనక్షత్రగతి విశేషంబులచేతను గాలంబు పలువిధంబు. నృపాలుం డాచారప్రవర్తకుండు గావునఁ గాలమూలం బని యెన్నంబడు. కాలవిశేషంబునన యట్టి యాచారంబులు గలుగు ననిన వానిఁ గావించువారికి ధర్మాధర్మంబు లొదవనేరవు. రాజదండంబునకు వెఱచియే లోకంబు స్వధర్మనిరతంబై దాన నుత్తమతేజంబు వడయుచుండు. స్వధర్మాచరణంబు సుఖకరంబైన తపంబు. అట్టితపంబుఁ గావించువారి కింద్రాదులుం గింకరు లగుదురు. మనుజులమాట వేఱ చెప్పనేల? రాజు స్వధర్మనిరతుండు గాఁడేని యతని తేజంబు క్షయించు. కావున నభిషిక్తుండైనఁ గానివాఁడైనఁ బాలనంబు సేయ నారంభించిన నాఁటఁగోలె నచ్ఛిద్రుండై స్వధర్మపగతంత్రుండై బుద్ధి శౌర్య తపోబలంబులచేఁ బ్రజఁ దనప్రజఁబోలెఁ బాలించుచు దుర్జనుల మహాభయహేతువు లగు దండంబులచే భీతులఁ జేయుచు స్వధర్మాచరణంబునకు మఱల్చునది.

బుద్ధిమంతు కార్యమునకు నల్పం బేని దోసఁగుపొసఁగఁ బోలదు. నీతి బుద్ధి శౌర్య బల ధనసంపన్నునకుఁ దిర్యక్కులును వశగతంబు లగును.

రాజునకు గుణములచేఁ ద్రైవిధ్యము

సాత్త్విక రాజస తామసంబు లగు తపంబుల నెద్దాని రా జాచరించుఁ దద్గుణప్రధానుం డగు. ఉదారుండును

స్వధర్మనిరతుండును క్షమియు విషయనిస్పృహుండును సాత్త్వికుండు శూరుండు నగు రాజైహికసుఖంబుల నొంది యవసానంబున మోక్షంబు నొందు. నిర్దయుండు మత్తుండు హింసారతుండు శఠుండు నీచప్రియుండు స్వతంత్రుండు దాంభికుండు భోగైకపరాయణుండు ననృతవాదియు నగు రాజు నరకభాజనంబై తదవసానంబునఁ దిర్యక్త్వంబు నొందు.

సాత్త్వికుం డుత్తమభోగంబులను దామసుం డధమభోగంబులను రాజసుండు మధ్యమభోగంబుల ననుభవించుఁ గావునఁ జిత్తంబు సత్త్వంబునం బనుపఁజుచునది. సుకృతదుష్కృతకర్మంబుల సుగతిదుర్గతులు వాటిల్లు. ఎట్టివాఁడు క్షణంబు నక్రియుండై యుండ నేరఁడు.

వర్ణభేదము

బ్రాహ్మణాదివర్ణంబు లెల్లను గుణకర్మంబులచే భేదిల్లుం గాని జననంబుచే భేదిల్లవు. జననంబు వలన బ్రహ్మతేజస్సంపత్తి యొదవనేరదు గావున బ్రహ్మవలన నుత్పత్తిలినవారి నెల్ల బ్రాహ్మణు లనంజనదు.

వర్ణగుణములు

ఎఱుక వలనను గర్మోపాసనాదులవలనను శమదమంబుల వలనను దయాదాక్షిణ్యంబుల వలనను బ్రాహ్మణుండు నాఁబడు. ప్రజాసంరక్షణ సామర్థ్యంబు పరాక్రమంబు నింద్రియనిగ్రహంబు దుష్టనిగ్రహ శైలియుం గలవాఁడు క్షత్రియుండు. క్రయవిక్రయనైపుణ్యంబుఁ బశుపాల్యంబుఁ గృషియుఁ గలవాఁడు వైశ్యుఁడు. ద్విజార్చనాసక్తుఁడు జితేంద్రి

యుండు శూరుఁడు సీరకాష్ఠాదివహుఁడు శూద్రుఁ డన నొప్పు. స్వకులోచితధర్మంబుఁ బరిత్యజించి పరపీడనంబుఁ గావించు చండులైన యవివేకులు మ్లేచ్ఛు లనఁబడుదురు.

కర్మవిచారము

తొలిమేనఁ జేసిన చేఁతవలనన పున్నెంబునుం జట్టులు దుం దలఁపు వాఁడము. దాని నొందు తెఱఁగున గావింప మాన్పికి వెరవు దోఁపదు. సహాయంబులుం దాని కనుగలంబులైన వ యమరు. అదృష్టంబు న్మెఱ నేవాఁడును వెరవరి గాఁడను చింతయు నిక్కంబు గావునఁ గర్తవ్యాకర్తవ్యంబులైనకర్జంబులదెస నుపదేశంబు వితయనంజనదు. శిష్టచరితులైన బుద్ధిమంతు లెల్లం బౌరుషంబుఁ గొనియాడుదురు; స్వశక్తిచేఁ గార్యంబుల నెఱవేర్పఁ గావనేరని క్లీబు లదృష్టంబు గొనియాడుదురు. సకలకార్యంబులు దైవపౌరుషంబులయందు సుప్రతిష్ఠితంబులై యుండు. కర్మంబు పూర్వకృతంబు నైహికంబునియు నిరుదెఱఁగు లయియుండు. ఇం దెయ్యది బలవత్తరం బది తక్కటిదానికిఁ బ్రతికారి యగు. తద్బలాబలపరిజ్ఞానంబు ఫలంబున ననుమేయింపఁదగు. ఫలోపలబ్ధికి బ్రత్యక్షంబైన హేతువు లేకున్న నది పూర్వకర్మజన్యం బని యెన్నందగు. మానిసిజతనం బల్పం బయ్యు నొక్కతఱి నెక్కుడుగ ఫలించెనా యదియు ముందటికర్మంబున నయ్యె నని కొందఱు నిప్పటిదానన యని కొందఱు నందురు. కొందఱు దివ్వియ చమురును వత్తియుం గలదియయ్యు పయ్యరవలన రక్షింపమి నుత్సన్నం బగునట్లు ఫలంబు పూర్వకర్మసంచితం బయ్యు

నిప్పటి వ్యాపారంబు లేమి లభియింపద యండ్రు. అదియట్లుండె. తప్పక కాఁగలవానికి మాఱుచేత కలదేని చెఱుఁగులకు బుద్ధి బలానుసారంబుగఁ బ్రతివిధానం బాచరించుటయ లెస్స.

రాజుప్రవర్తనము

రాజు స్వానుకూల ప్రతికూలఫలంబులచే దైవానుకూల్యాదుల నెఱిఁగి ప్రవర్తించునది. తొల్లి రావణదుర్యోధనులకు వనభంగగోగ్రహంబులయందు హనూమదర్జునులవలన దైవప్రాతికూల్యంబును రాఘవార్జునులకు దైవానుకూల్యంబును విస్పష్టంబయ్యెఁ గాదె. దైవం బనుకూలం బగుడు స్వల్పక్రియయు మహాఫలంబు గావించు; తత్ప్రాతికూల్యంబున బలిహరిశ్చంద్రులకుఁ బోలె సుకర్మంబు ననిష్టఫలదం బగు. ఎల్లను సత్కర్మంబువలన సత్ఫలంబును నసత్కార్యంబు వలన నసత్ఫలంబు నగు నని శాస్త్రంబువలన నెఱుకపడుఁ గాన దుష్కర్మంబు విడిచి సత్కర్మం బాచరించునది. క్షత్రియుండు కాలంబున కెల్లఁ గారణంబు గానఁ దన చరితంబు నను దండంబునఁ బ్రజను స్వధర్మమ్మున నిలుపునది.

రాజ్యాంగస్వరూపము

రాజ్యాంగంబు లేడింటను నృపుండు శిరంబు చక్షువమాత్యుండు చెలికాఁడు చెవి కోశంబు మొగమ్ము సేన మనంబును హస్తంబులు దుర్గంబు పాదంబులు రాష్ట్రంబు నని చెప్పుదురు.

రాజు నావశ్యకత

సదాచారంబునఁ బ్రవర్తించు నరపతి చందురుఁడు మున్నీటికిఁ బోలె నిజ్జగంబున కభివృద్ధిహేతువు. బాగుగఁ

బాలించు భూపతి లేఁడేని యిజ్జగం బకర్ణధారంబగు కలంబు సంద్రంబం దవియునట్లు విపన్నంబగు. రాజు లేనినాఁడు జనము స్వధర్మాచరణనిరతంబు గానోపదు; జనసమాజపీడనుండైన ఱేఁడును రాజిల్లఁడు; న్యాయప్రవృత్తుఁడైన ఱేఁడు దన్నుం బ్రజను ద్రివర్గంబుతో ననుసంధించు. యుధిష్ఠిరుండు ధర్మంబునఁ జిరకాలంబు భూమి భుజించె; నహుషుఁడధర్మంబున స్వర్గపదభ్రష్టుండై రసాతలంబునఁ బడియె; వేనుఁ డన్యాయంబున నుత్తమపదచ్యుతుండై మేనుతొఱంగె; పృథు వుత్తమకర్మంబున బహుకాలంబు రాజ్యంబు సేసి తన పేరు లోకవిదితంబు గావించి యెన్నఁటికిం జెడని పదవి నొందె; కావునఁ బార్థివుండు ధర్మంబు పురస్కరించుకొని పరిపాలనంబునకుఁ దొడంగునది.

రాజనిర్మాణహేతువు, నతనియందలి దేవాంశములును

మున్నొకప్పుడు నాయకుండు లేమిని జను లన్యోన్యపీడితు లగుడుఁ జతుర్ముఖుండు లోకపాలురయుఁ జంద్రార్కులయు నంశంబులచేఁ దపస్సామర్థ్యంబునఁ జరాచరాత్మకంబగు నిజ్జగంబున కొడయని నిర్మించెం గావున భూవిభుఁడింద్రుండునుం బోలె రక్షణదక్షుండును భాగభాక్కునై గంధంబునకు వాయువువోలె కర్మంబులకుఁ బ్రేరకుండై, ధర్మప్రవర్తన తమోనిరసనంబుల రవిం బోలి, దుష్కర్ములయెడ దండంబున సమవర్తిత్వంబునం జము ననుకరించి, శౌచంబున నగ్నిసదృశుండై, రసంబున వరుణుండువోలె, స్వధనంబుల లోకంబుఁ గాపాడుచుఁ, జంద్రుండు స్వకరంబుల జగదాహ్లా

దంబు నీయునట్లు స్వచరితంబుల నెల్లర సంతసిల్లఁజేయుచుఁ గుబేరుఁడు నిధులకుం బోలెఁ గోశంబులకుఁ గావలియై తొల్లి యంశంబులకంటెఁ జంద్రాంశంబు గారవించునది. మఱియు జనకుఁడట్లు సద్గుణం బలవర్చుచుఁ దల్లియుఁబోలె నపరాధంబు సైఁచి పుష్టి గావించుచు గురువువలె హితం బుపదేశించుచు సోదరుండువోలె శాస్త్రానుసారంబుగ భాగంబు హరియించుచు బంధుమిత్రులుంబలె స్త్రీధనాదుల నరయుచు వైశ్రవణుండుఁబోలె ధనంబుల నొసఁగుచు దండధరుండువలె సుదండంబుఁ గావించుచు నీగుణసప్తకంబు నేమఱకుండ వలయు. ఈ గుణములు మంచిరాజునం దుండును.

ఎవ్వాఁడు శిక్షింప సమర్థుం డయ్యు నపరాధంబు క్షమియించు నాతఁడు క్షమి యనఁబడును; సర్వగుణసంపన్నుఁ డయ్యు భూపతి యోరిమి లేనివాఁ డయ్యెనా భాసిల్లఁడు; దుర్గుణంబులఁ బరిత్యజించి యతివాదంబుల కోర్చి దానమానంబుల లోకరంజకుండై దాంతిశౌర్యంబులు గలిగి యరినిషూదనుం డై యస్వతంత్రుఁ డై శస్త్రాస్త్రకౌశలంబు వడసి జ్ఞానవిజ్ఞానయుక్తుం డై నీచమైత్రి వర్జించి దీర్ఘదర్శనవృద్ధసేవనంబుల నెడపక గుణవత్సంగంబు గావించుచుఁ బాలించు రాజు దేవాంశకుండును విపరీతవర్తనుండు పూర్వదేవాంశకుండును నరకభాజనుండు నని నీతికోవిదులు పలుకుదురు.

రాజునకుఁ బ్రజకు నన్యోన్యానురాగ మావశ్యకము

రాజసచివాదులును "యథా రాజా తథా ప్రజా" యని యున్నందున వాని యంశంబునకుఁ దగినవారల యగుదురు. అట్టి సచివాదులు చేయు కార్యంబులకు నియతిబలంబున రా జనుమోదించుచుండు. జన్మాంతరకర్మఫలం బవశ్యానుభావ్యం బైనను బ్రతివిధానంబు గావించినఁ జికిత్సితగదుండు బాధం బాయునట్లు తత్కర్మోపభోగంబు వాయు. సర్వజనంబు మనంబున సుఖంబ కోరుఁ గావున ననిష్టంబు గురూపదేశంబున విదితంబైన నేవాఁడును జెడు కర్జంబునకుఁ దొడరమి సద్బోధంబు నొందియే రా జేకార్యంబున నైనఁ దొడరునది. నయంబున కడంకువయు దానికి శాస్త్రజ్ఞానంబును దాని కింద్రియజయంబును నిదానం బై వెలయు. భూపతి దన్ను మున్ను వినయవంతుం గావించుకొని పదంపడి పుత్రులన్ మిత్రుల న్మంత్రుల న్భృత్యుల న్లోకులం గ్రమంబున వినయవంతులం జేయునది. రాజు పరోపదేశమాత్రంబునఁ గుశలుండుగాఁ జనదు గానఁ దాను సత్కర్మరతుం డగునది. రాజు సద్గుణుఁ డయ్యు నొకప్పు డధికారహీనుఁడు గావచ్చును. ఇంద్రాణి యవిధవయైనట్లు ప్రజ దుర్గుణ యయ్యు నెప్పుడు రాజవిహీన గానోపదు. సంపన్నాశం బొదవెనేని రాజునకుఁ గాని మంత్రికిఁ గాదు. పుత్రులను దాయాదులం దన్ను స్సన్మార్గంబున నడుపుచు రాజు ప్రజాపాలనతత్పరుండు ననురక్తప్రకృతియునై శ్రీసమృద్ధి నొందు.

ఇంద్రియనిగ్రహము

దుష్టభోగారణ్యంబునం బ్రధావించు నింద్రియగజంబు జ్ఞానాంకుశంబున వశపఱుచునది. విషయామిషలోభంబున నింద్రియంబులఁ బ్రేరించు మనంబు నిరోధించిన నెల్లయింద్రియంబులు జితంబుల యగు. ఒకటియగు మనంబు జయింపఁ

వశీకృతుం డైనవాఁడు ససాగరవనద్వీప యగు వసుమతి నెట్లు జయింపనోపు? అవసానంబున విరసంబులైన భోగంబులచే నాకృష్టుండు కరికరణి బంధంబు నొందును. శబ్దస్పర్శరూప రసగంధంబుల నొక్కటొక్కటియె నాశంబు నొందించు; విషసన్నిభంబు లగు విషయంబు లన్నియుం గూడినఁ జెప్ప నేల? శుచియు దర్భాంకురాహారంబు సుదూరలంఘనజంఘాలంబు నగు మృగంబు లుబ్ధకగానమోహంబున వధంబు నొందుఁ గాదె. గుంటి శిఖరంబుఁ బోలు నాకారంబు గలిగి నగంబుల నున్మూలింపఁజాలు వారణంబు కరిణీస్పర్శంబున బంధంబు నొందు; దివ్వెసెగఁ జూచి చంచలదృష్టియై పతంగంబు మోహంబున మిత్తివాతఁ జొచ్చు; అగాధజలంబుల నున్న మీను సామిషంబైన గాలంబు గ్రసించి కాలధర్మంబు నొందు; ఉత్కర్తనంబున సమర్థంబయ్యు నుద్గమనంబునకుం దగినది యయ్యు భ్రమరంబు గంధలోభంబునఁ గమలంబునఁ జిక్కువడును.

కామజంబు లగు వ్యసనంబుల నింద

ధనపుత్రమతిప్రదంబు లయ్యు ద్యూతస్త్రీమద్యంబులు మహానర్థమూలంబులు. నలధర్మప్రభృతిభూపాలురు జూదంబున నాశంబునొందిరి. కామినీస్మరణంబును మనోవికారంబు గావించు; దర్శనవిలాసభాషణంబులు సెప్ప నేల? మృదుగద్గదభాషిణియైన యువతి రక్తాంతలోచనయై యెవ్వాని వశుం గావింపనోపదు? జితేంద్రియు లగు మునులను సైతము లోఁబఱుచు నన, నజితేంద్రియుల వార్త చెప్ప నేల? ఇంద్రదండకనహుషరావణాదులు పలువురు స్త్రీమూలం

బునఁ గీడువొందిరి; మద్యంబునర దగులు వెల్లయిన నది బుద్ధి నాశకం బగు; ఇవియె తజ్జ్ఞులకుఁ బ్రభూతధనంబును సుఖంబును బుద్ధినైర్మల్యంబును గలిగించు.

కామాదు లెక్కడ మంచివి, యెచటఁ గావు

విజిగీషు వగు రాజు ప్రజాపాలనంబునఁ గామంబును శత్రువులయెడఁ గ్రోధంబును, సేనాపరిగ్రహంబున లోభంబును వినియోగించి యొందుచోఁ జొరనీకుండునది. పరస్త్రీలయందుఁ గామంబును నన్యధనంబుల లోభంబును స్వప్రజలయందుఁ గ్రోధంబు నుత్తముఁ డైనవానికి వలవదు. పెఱయింటివలనఁ గుటుంబియనియు నన్యధనంబువలన ధనికుఁ డనియు స్వజనదండంబున శూరుండనియుఁ బ్రతిష్ఠ యేవానికిఁ గలుగదు. బాగుగం బ్రజ నరయని రాజును నతపస్వి యైన బ్రాహ్మణుని దాతగాని ధనికుని దేవతలు హింసించి యధోలోక నివాసిఁ గావింతురు.

తపః పాప ఫలములు

ప్రాభవంబు నీఁగియు ధనిత్వంబును దపఃఫలంబులు. యాచనయు నిర్ధనత్వంబు దాస్యంబుఁ బాపఫలంబులు.

రాజు గుణదోషములు

ప్రభు వైహికాముష్మికసుఖంబులకొఱకు శాస్త్రంబు లన్నియుం బరిశీలించి యాత్మజయంబు నొంది స్వవృత్తంబు నిర్మలంబు గావించునది. దుష్టుల శిక్షించుటయు దానంబును బ్రజాపరిపాలనంబును రాజసూయాదియజనంబు న్యాయంబునఁ గోశార్జనంబు రాజుల నరిగాఁపులఁ గావించుటయు శత్రు

సంహారంబు దేశంబుల యాక్రమణంబు ననునెన్మిదియు రాజునకు వలయు. అనీకాభివృద్ధిఁ గావింపనివారు, రాజులఁ గరదులఁ గావింపనివారుఁ జక్కఁగఁ బ్రజఁ బాలింపనివారు నగు రాజులు షండతిలల్లు నాఁ దగుదురు. మనుజులెవ్వాని వలన మిక్కిలి వెఱతురేని, చరితంబు నిందింత్రు, మ తెవ్వఁడు గుణధనసంపన్నులచే విడువఁబడయు, నెవ్వఁడు నటవిటగాయక గణికామల్లషండాల్పజాతులయం దనురక్తుఁడు, వాఁడు శత్రుముఖంబున నున్నవాఁడు. బుద్ధిమంతుల నెల్లపుడు ద్వేషించుచు, మోసగాండ్ర స్నేహించుచుఁ, దన దుర్గుణంబుల నెఱుఁగక, సైఁపఁదగు తప్పుల నోర్వక, స్వదుర్గుణశ్రవణంబున లోకంబుల్ బీడించువాఁడు, ప్రబలదండుఁడు, ధనహారకుఁడు, నగు రాజాత్మనాశనంబునకు యత్నించువాఁడు. లోకంబు కలఁత నొంది భిన్నం బయినయెడ, రాజు గూఢచారులవలనఁ దన్ను భూషించువారి దూషించువారిఁ దెలిసి, దానికిఁ గారణం బారసి సచివులకుఁ దనయందుఁ గల యభిప్రాయంబు నేకతంబున గ్రహించి, తన దుర్గుణంబులఁ గీర్తించువారి దౌరాత్మ్యంబున నాగ్రహింపక, యశంబుఁగోరి ప్రజ నవమానింపక, చెడుగొ[illegible]ముల విడువవలయు. తొల్లిసీత సాధ్వి యని యెఱింగియు, రజకు దండింప శక్తుఁ డయ్యు, వశీకృతరాజపుంగవుఁ డయ్యు, రాముఁ డల్పం బేని శిక్షింపక, లోకాపవాదభయంబునం బ్రియాంగనఁ బరిత్యజించెఁ గాదె? ఎట్టితప్పులైన రాజు సమక్షంబున జనులు దత్తాభయులయ్యు నుడువ వెఱతురు. దేవతలు సయితము స్తుతిప్రియులని వేదంబు లుగ్గడించు; మానవులు స్తుతిప్రియు లని చెప్పనేల? క్రోధము నిందచేఁ బుట్టు గానఁ బణిదిముఖంబునఁ

సర్వంబు విని రాజు క్షమియై లోకరంజనంబుగ దండించునది. జవ్వనంబుఁ బ్రద్దిమియు డెందంబును జాయయు సిరియుఁ నేల్బడియుఁ దటిచ్చంచలంబు లని తెలిసి ప్రభువు ధర్మపరాయణుండు గావలయు.

రాజు కామక్రోధాదుల నవశ్యము విడువవలయును

దానంబు చేయమి నవమానంబుచేతను గాపట్యంబునను బరుషభాషణంబునను దండాధిక్యంబునఁ, బ్రజ భూపు విడుచు. వీని విపరీతగుణంబుల రాగిల్లు. దుర్గుణం బొకటియె దుర్యశంబు గావించు. పెక్కులు గావించునని చెప్పనేల? మృగయాద్యూత మద్యంబులు రాజునకు గర్హితంబులు. తొల్లి పాండు నైషధ యాదవులు వానివలనన నశించిరి. కామాది షడ్వర్గంబు జయించురాజు సాగియు. మున్ను కామంబున దండకుండు, క్రోధంబున జనమేజయుండును లోభంబున నైలుండు మోహంబున వాతాపిదానవుండును, మానంబునఁ బౌలస్త్యుండు, మదంబున దంభోద్భవుండును, మడిసిరి. పరశురాముండు నంబరీషుండును గామాది శత్రువర్గంబు నోర్చి చిరకాలంబు మహి ననుభవించిరి.

రాజునకు విద్యాభ్యాస మావశ్యకము

విద్య నేర్చినవాఁడు సత్సమ్మతుండు వినయవంతుఁడు నగు. విద్యాభ్యాసంబునకు సద్గురుసమాగంబు మూలంబు. ధర్మార్థంబు లార్జించుచు, నింద్రియంబుల జయించి, గురుసేవనంబుఁ గావించుచు, రాజు ప్రతిదినంబు కలల విద్యల నేర్చునది. విద్వాంసుండు దుర్జనులు ప్రేరించిన నసత్కార్యంబునం దగులక శ్రుతిస్మృతి లోకజ్ఞానంబున నాత్మనిశ్చయంబునను

సత్కార్యంబు చేయ నిచ్ఛయించు. నీతిశాస్త్రానుసారియై జితేంద్రియుండైనవాని భాగ్యంబును గీర్తియు మిన్నుముట్టు.

ఆన్వీక్షిక్యాదుల స్వరూపము

ఆన్వీక్షికి, త్రయి, వార్త, దండనీతి యను విద్యలను రా జవశ్య మభ్యసింపవలయు. ఇం దాన్వీక్షికి తర్కవేదాంతముల వెల్లడించు. త్రయి ధర్మార్థకామంబుల వివరించు. అర్థానర్థంబుల వార్తయు నయానయంబుల దండనీతియు బోధించు. వీనివలన వర్ణాశ్రమంబుల తెఱంగుం దేటపడు; అంగంబులు వేదములు మీమాంసయు న్యాయంబు నర్థశాస్త్రంబు పురాణంబులుం ద్రయి యనంబడు. కుసీదకృషి వాణిజ్య గోరక్షణంబులు వార్తచేఁ జెప్పఁబడు. వార్తాజ్ఞానంబు గల సాధువు వర్తనంబునకు వెఱవఁడు. దమంబు దండంబు నాఁబడు. దండంబునకు రాజు హేతువు గాన నతండు దండుఁడనఁబడు. తన్నీతి దండనీతి. సర్వాభీష్టప్రాపణంబున నీతిశబ్దం బన్వర్థసంజ్ఞ నొందు. ఆన్వీక్షికి యాత్మవిజ్ఞానంబు గావించి శోకహర్షంబుల నపనయించు. యథావిధి త్రయి నధిగమించినవాఁడుభయలోకసౌఖ్యంబుల నొందు. ఎల్లవారియెడ నానృశంస్యంబు పరమధర్మంబు గాన రాజు దానితోడ కృపణంబగు జనమును బాలించునది. రాజు స్వసుఖాభిలాషం బరపీడనంబు గావింపఁజనదు.

రాజు కర్తవ్యాకర్తవ్యములు

కృపణం బైన జనంబు పీడ్యమానం బై స్వమృత్యుభయంబునఁ బార్థివు బాధింపనోపు. సుజనసేవితుం డైన రాజు మిగుల శోభిల్లుఁ గాన సుజనసంగంబు కర్తవ్యంబు.

దాన ధర్మసుఖాభివృద్ధియు నగు. చందురుండు నవోత్ఫుల్లోత్పలం బైన సరసిం బోలె సుజనవేష్టితుం డైన భూపాలుండు జనంబుల మనంబు తనియం జేయు. సూర్యకిరణతప్తం బై నిరాశ్రయం బై యుద్వేజనకరం బైన మరుస్థలంబుఁ బోలె దుర్జనసంగంబు నుజ్జగించునది. నిశ్వాసనిష్ఠ్యూతానలధూమధూమ్రముఖం బైన పాఁపకులంబు తోడి చెలిమి దుర్జనసంగతికంటె వరంబు. ఎడఁద హితంబుఁ గోరువాఁడు సాధువునకుఁ గావించు వందనంబుకంటె సాధుతరంబుగ నసాధువునకు నది గావించునది. దాత యయ్యు రాజు వాక్పారుష్యంబున జనుల కుద్వేజకుం డగుఁ గాన మృదువచనంబున లోకాహ్లాదంబు గావించునది. మేధావి పీడితుఁ డయ్యు జనంబునకు హృదయతాపకరం బగునుడి నుడిగి మిత్రులయందే నమిత్రులయందే శిఖికేకనుంబోలె మధురోక్తిఁ బచరించునది. విపశ్చితుల వాక్యంబులు వోలె శిఖిహంసకలకంఠంబుల పలుకు లేని మనంబు హరియింపనేరవండ్రు. ప్రియంబు భాషించుచు సత్కారం బభిలషించు ననవద్యచరితు లైన శ్రీమంతులు నరవిగ్రహధారులైన దేవత లనఁబడుదురు. నెయ్యంబునకు భూతదయకు దానంబునకు మధురవాక్యంబునకు సాటియగు సంవననంబు ముల్లోకంబుల నెందును లేదు. ఆస్తిక్యసంపన్నుఁ డై దేవతాపూజఁ గావించుచు సుహృదుల నాత్మంబోలెఁ జూచుచుఁ బ్రణిపాతంబున నొజ్జను సదాచారంబున సత్పురుషులను భక్తిచే దేవతలను సద్భావంబున బంధుమిత్రులనుఁ బ్రేమమానంబుల స్త్రీభృత్యులను దాక్షిణ్యంబున నితరజనంబును స్వాభిముఖులఁ గావించునది. బలబుద్ధిసంపన్నుం డై యుక్త

పరాక్రముఁ డగు రాజు వసుపూర్ణం బైన వసుమతి నెల్ల నేలఁగలవాఁ డై సద్భావుఁడు నాఁ బ్రసిద్ధి వడయు. బుద్ధిబలశౌర్యపరాక్రమంబులు రాజున కుత్తమగుణంబులు; అన్యసుగుణసంపన్నుఁ డయ్యు ధనికుఁ డయ్యు నీగుణంబులు లేని వాఁడు స్వల్పం బేని నేల నేలఁదగఁడు. పార్థివుండు స్వల్పదేశంబున కధిపతి యయ్యు బుద్ధ్యాదిగుణంబులను ధనంబు ననుఁ దేజస్వియు నవ్యాహతాజ్ఞుండు నగు; సాధారణగుణంబుల భూప్రసాధనంబున నశక్తుం డగు; దేవదానవవిమర్దిని యగుభూమి యెల్లధనంబులకు గని యగుటం జేసి పుడమితేండ్లు తదర్థం బాత్మవినాశంబే నిచ్ఛయింత్రు. ఆత్మభోగనిమిత్తంబు ధనజీవితంబులు రక్షించుచుఁ బ్రజారక్షణంబుఁ గావింపనిరాజుల ధనజీవితంబులు వ్యర్థంబులు. సదాయసహాయంబు నొందక యిచ్చవచ్చినట్లు వెచ్చింప సంచితధనంబు నిధీశ నిధిసదృశం బయ్యు నలంభావంబు నొందమి న్యాయమార్గమున ధనం బార్జించుచు వెచ్చింపవలయు. ప్రభువు బలశౌర్యాదులచే గారవింపఁబడిన ట్లుత్తమకులజననంబున శోభిల్లఁడు. కావున నెట్టిజేని కేని బలశౌర్యాదు లావశ్యకంబులై యుండు.

రాజమండలేశ్వరాదుల భేదము

లక్ష రాజతకర్షంబులకుం దక్కువ కాకుండ లక్షత్రయంబుకంటె నధికంబు గాకుండ నేఁటేఁట బ్రజవలనఁ బీడ గావింపక నరిగొనురాజు సామంతుం డనఁబడు. నాలుగు లక్షలు మొదలు పదింటిదనుకఁ బలుచంబు గొనువాఁడు మండలేశ్వరుఁ డనియు దానికంటె నధికముగ నిరువదిలక్షలకు మించని యులుపా (కప్పము) గొనువాఁడు రాజనియుఁ బిమ్మట నేఁబదిలక్షంబులదాఁకఁ గరంబుగొనువాఁడు మహారాజనియుఁ దరువాతఁ గోటిపర్యంతంబు పన్ను గొనువాఁడు స్వరాట్టనియుఁ బదంపడి దశకోటి పరిమితభాగధేయంబు నొందువాఁడు సమ్రాట్టనియుఁ దదధికబలి నార్జించువాఁడు విరాట్టనియుఁ జెప్పఁబడుదురు. పంచాశత్కోట్యధికభాగధేయము గొనుచు సప్తద్వీప యగు సర్వంసహ వశపఱిచికొన్నవాఁడు సార్వభౌముండు. రాజు బ్రహ్మచే స్వభాగభృతిని బ్రజకుఁ బాలనార్థంబు స్వామి యనుపేర దాస్యంబున నియుక్తుం డయ్యె. సామంతాదులకు సములగు భృత్యులు రాజుచే నధికృతులై రాజభాగంబు గొనుచు సామంతాదినామంబులు వడయుదురు. సామంతాదిపదమునుండి భ్రష్టులై తత్తుల్యవేతనమున మహారాజాదులచేఁ బోషితు లగు వారు హీనసామంతులు నాఁబడుదురు. నూఱు గ్రామంబుల స్వతంత్రాధికారంబు గలవాఁడు సామంతుఁడు. శతగ్రామాధిపాలనమున రాజుచే నియుక్తుఁడు నృసామంతుఁడు. దశగ్రామసంరక్షణ నియమితుఁడు నాయకుఁ డనియు నయుతగ్రామంబుల భాగంబు ననుభవించువాఁ డాశాపాలుఁ డనియు స్వరాట్టనియు నెన్నంబడు.

భూపరిమాణనిరూపణము

క్రోశమాత్రపరిమితం బై సహస్రరూప్యకర్షంబులు రాజభాగ మొసంగునది గ్రామంబనియు గ్రామార్ధంబు పల్లియనియుఁ బల్ల్యర్ధంబు కుంభం బనియు వ్యవహరింతురు. కరసహస్రపంచకంబునం బ్రాజాపత్యం బైన క్రోశమును జతు

స్సహస్రహస్త పరిమాణమున మానవక్రోశమును నగు. బ్రహ్మమానంబునఁ గ్రోశక్షేత్రంబు (Area) సార్ధద్వికోటి హస్తంబులే నిరువదేనుదండంబులే నగు. మధ్యమామధ్యమ స్వర్గ్యంబున నేని యవాష్టకంబున నే నొక్కయంగులము. దానిస్థాల్యమైదు యవలంతయగు. అంగులములు చతుర్వింశతి యైన నొక బ్రాహ్మం బగుకరము. భూమి మానంబునం బ్రాహ్మం బుత్తమంబు. మిగిలినవి యధమంబులు. చతుఃకరాత్మకంబు ప్రాజాపత్యదండంబును, బంచకరాత్మకంబు లఘువు (మానవంబగు దండంబు) నగును. మానవం బగు నంగులంబు పంచయవ పరిమాణంబు. ప్రాజాపత్యం బగు దండంబునకు వసుమణ్ముని యవపరిమాణంబును, మానవ దండంబునకు షట్ఛతయవ పరిమాణంబు నుండును. ఇరువదియైదు దండంబులు నివర్తనమను నిది యుభయ సమ్మతంబు. మూఁడువేల యంగులంబుల పరిమాణంబున నేని, పదియునైదువేల యవల పరిమాణంబున నేని, నూఱు నిరువదియైదు హస్తంబుల పరిమాణంబున నేని మానవం బగు నివర్తనం బగును. ఏకోనవింశతి సహస్రద్విశతయవ పరిమాణంబున నేని, చతుర్వింశతి శతాంగులంబుల పరిమాణంబున నేని, శతకర పరిమాణంబున నేని ప్రాజాపత్యం బగు నివర్తనం బగు. పంచవింశత్యుత్తరషట్ఛతదండంబు లుభయ మతంబునను, నివర్తనక్షేత్రం బగు. దాని రెండుపార్శ్వంబులు ప్రత్యేకం బిరువదైదు దండంబు లుండుఁ గాన నట్లయ్యె. డెబ్బదియైదు వేల యంగులంబుల మానవ పరివర్తనంబు, నఱువదివేల యంగులంబులఁ బ్రాజాపత్య పరివర్తనంబునగును. పంచవింశ

త్యధికంబు లగు నేకత్రింశచ్ఛత హస్తంబుల మానవ పరివర్తనంబును, నిరువదియైదువందల హస్తంబులఁ బ్రాజాపత్య పరివర్తనంబును బ్రఖ్యాతంబులు. మఱియుఁ బాదోన చతుర్లక్షంబులగు యవలపరిమాణంబున మానవపరివర్తనంబును, నాల్గులక్షలు నెనుబదివేల యవలపరిమాణంబునఁ బ్రాజాపత్య పరివర్తనంబు నగును. మఱియు నాల్గువేల హస్తంబులు, గాని యెనిమిదివందల దండంబులు గాని ముప్పదిరెండు నివర్తనంబులు మానవమానంబున నగును. పరివర్తనముభుజ (ప్రక్క) పరిమాణంబున నిరువదియైదు దండంబులు. కానఁ బదివేలకరంబులు పరివర్తన క్షేత్రంబు. కరగ్రహణంబు ప్రాజాపత్యమానమున నన కావించునది. రాజు స్వాపత్కాలంబున మనుమానమున నేని గ్రహింపఁదగు. లోభంబునఁ బ్రజలఁ బీడించురాజు ప్రజతోడ క్షయించు. రాజు ద్వ్యంగులం బేని భూమి స్వత్వనివర్తనపురస్సరంబుగ నీఁ దగదు.

రాజు భూమి నెట్లీవలెను

వృత్త్యర్థం బేని కేని గ్రహీతృజీవితావధికముగ భూమి నీఁదగు. బుద్ధిమంతుఁ డగు రాజు దేవళోత్సవాదులకు భూదానము గావించునది. మఱియుం గుటుంబిం బరికించి గృహార్థం బారామార్థంబుం దగునంత నేల నీఁజను.

పత్తననిర్మాణము - రాజగృహనిర్మాణము

నానావృక్షలతాకీర్ణం బై పశుపక్షిగణావృతం బై సుబహూదకధాన్యం బై తృణకాష్ఠసమృద్ధం బై నాతిదూరమహీధ్రరం బై నౌకామార్గంబున వారాశికిం గొంపోవు నదీతీర సురమ్య సమభూతలంబున వలయాకారంబున నే

నర్ధచంద్రాకారంబుననేఁ జతురశ్రాకారంబుననే వాపీకూప తటాకాదియుతంబు చతుర్ద్వారంబు సుమార్గారామవీథికంబు దేవాలయ సంయుతంబు సపరిఖప్రాకారంబు మఠపాంథ శాలావిరాజితంబు నగు రాజధానిం గల్పించి రాజు సుగుప్తుండై ప్రజతో నట వసియించునది. రాచగీము నడుమఁ గొలువుకూటంబును గోష్ఠంబు, సాహిణంబు, సేనికసాలయు, మంచినీటి డిగ్గియలు, నర్థవ్రులు, నీటియంత్రంబులుం గలదియై యన్నిదెసల సరికొలఁదియై దక్కినంపుఁగడ నున్నతంబై యుదగ్భాగంబున నవనతంబై, విషమబాహుకంబు నై తనర్ప వలయు. బహుభుజపరిణాహ మైన శాల చతుశ్శాల మైనఁ గ్రాన్పి రాజిల్లదు. అయ్యది శస్త్రాస్త్రకుశల సంయుతం బై ప్రాకారయంత్ర సురక్షితంబై సత్రికక్షుంబై నాల్గుదెసల ద్వారంబులు గలిగి దివారాత్రం బాయుధధారులై పరివ రక్షులైన యామికులచే నెల్లకక్షల సుగుప్తంబు నానాగృహాపకార్యోట్ట సంయుతమునై వెలయవలయు. స్నాన పాక భోజన యజన వస్త్ర మార్జనగృహంబులు తూర్పుదెసఁ బాననిద్రా విహార రోదన ధాన్య ఘరట్టాది నిలయంబులు నుత్సర్గదాస నిశాంతములు జమునిదిక్కున గో మృగోష్ట్ర గజాలయంబులు పడమటికడను వాజి రథ ద్రవ్య శస్త్ర వస్త్ర వ్యాయామ విద్యాభ్యాసనిలయంబు లుత్తరాశాముఖంబునను సుమనోజ్ఞంబుగ సుగుప్తముగ నొనరించునది. ముందటి యేర్పాటుల నతిక్రమించి యేనియు రాజు లిండ్ల సుఖదాయకములుగా నొనర్పవచ్చు. ధర్మాధికరణశిల్పశాలలు స్వనివాసము నుత్తరమున నిర్మింపఁదగు. గృహవిస్తారమునకుం బంచమాంశోచ్ఛ్రాయంబు భిత్తిప్రమాణం బగు. దాని స్థౌల్యంబు కోష్ఠవిస్తార షష్ఠాంశము. మీఁదటి పరిమాణం బేక భూమికంబున కుక్తంబు. అనేక భూమికంబులకు దీనిం బట్టి పరిమాణాధిక్యంబు గావలయు. కంబంబుల నయినఁ గుడ్యములనైనఁ గోష్ఠముల వేఱుపఱుచునది. త్రికోష్ఠం బేని పంచకోష్ఠం బేని సప్తకోష్ఠం బేని యెనిమిదిద్వారములు గల యది గృహము. గృహమధ్యభాగము ద్వారాంశము గాన నటఁ దక్క నన్య స్థలమున ద్వారము నిలుపఁదగదు. అపవరకములం దెల్ల వేర్వేఱ సుఖదంబు లగు వాతాయనము లుండవలయు. ద్వారమునకు నన్యగృహద్వారవేధయు కోణకూపమార్గ వృక్షస్తంభాదివేధయు నుండఁజనదు. ప్రాసాదమండప ద్వారముల మార్గవేధాది దోషంబు లేదు. గృహపీఠం బౌన్నత్య చతుర్థాంశము. అది ప్రాసాద మండపంబుల కర్థాంశ మని కొందఱ మతంబు. ఇతరజాలకవిద్ధంబైన గవాక్షుం బప్రశస్తంబు. కప్పు దానఁ గురిసిన జలంబు చుల్కన జాఱఁదగినదిగ విస్తరార్థాంశ మధ్యోచ్ఛంబు ఖర్పరసంభవము నుండవలయుఁ గాని నిమ్నంబు గాఁ జనదు. లోఁగిటికి సరికొలఁదినే నెచ్చు కొలఁదినే నర్థపరిమాణంబుననే మూలంబు గల్గునట్లు పచ్చొకాండ్ర లాఁగున కఠక్యం బగునట్లును నిచ్చలు గావలి లెంకలచే సురక్షితంబును నాళీకాస్త్రయుతంబును బహుదృఢ ఘల్మంబును సుగవాక్షప్రణాళికమును నగు ప్రాకారము పొడవున కర్థవిస్తరమున నిర్మించి దానికిం జుట్టును నాతిసమీపంబుగ నగాధసలిల యగు పరిఖను లోఁతుకంటె ద్విగుణ విశాలముగఁ ద్రవ్వింపవలయు. సుసాధన యోధవర్జితం బైన

దుర్గనివాసంబు రాజునకు మేలొందవింపక బంధనకారి యగు. అపవరకంబుల మూటనే నైదింటనే నేడింట నేని యథాకామంబుగ విస్తృతం బైన యినసభంబు శిరోగృహ యుక్తముగ నిర్మించి యెల్లగదుల తోరణగండ్లు నిలిపి ప్రక్కగదుల కంటె ద్విగుణ వైశాల్యంబు మధ్య భవనంబుల కేర్పఱుచునది. మధ్యమకోష్ఠంబు నౌన్నత్యము విస్తరముకంటెఁ బంచమాంశాధికముగను పార్శ్వగతంబులకు విస్తారసమంబుగనే మీఁదటియట్లే నొనర్పవలయు. వానిపై మిద్దెయేఁ గప్పె నొనర్చి మధ్యమము నేకభూమికమును పార్శ్వగతంబుల ద్విభూమికములఁగనుఁ గావింపవలయు. అయ్యది స్తంభములచే నేర్పడి చతుర్మార్గంబై జలయంత్రయుతంబై సుస్వర యంత్రంబుల వాతప్రేరక యంత్రంబులఁ గాలప్రబోధక యంత్రముల స్వాదర్శంబులఁ బ్రతిమలఁ గలిగి కార్యాలోచనంబునకుం దగినదిగ నుండవలయు. అట్లమాత్యులకు లేఖకులకు నితర యుద్యోగులకుఁ గార్యస్థానంబులు వేర్వేఱ రాణివాసంబునకు శతహస్తదూరంబు వదలి తూర్పున నేనుత్తరదిశ నేని కల్పింపవలయు. రాజనివాసంబునకు ద్విశతకర దూరంబున బలిష్ఠం బైన శాలలను సేనానివేశంబునకుఁ గట్టించి శ్రేష్ఠజాతిక్రమంబునఁ బ్రజానిలయంబులు స్వనివాసంబునకు నాల్గు దిక్కులం గట్టించునది. పురంబునం బ్రకృతులకు నధికృతులకు సేనాధిపతులకుఁ బదాతులకు సాదులకు మావటీలకు బృహన్నళిక యంత్రంబులకు స్వగాల్మిక బలమ్ములకుఁ బిమ్మట నారణ్యక సేనకుఁ గ్రమముగ నిండ్లు గట్టింపవలయు; మఱియు సజాతీయగృహంబుల వరుసఁగఁ గట్టిం

చునది. సుజలాశయములై సుగుప్తమ్ములైన పాంథశాలల నటనట నిర్మింపఁదగు. పురమందైన గ్రామమందైన నివేశనంబు తూర్పుకేని యుత్తరమునకే నభిముఖంబుగ నుండవలయు. బజాఱున రాచతెరువున కిరుప్రక్కల ధనికగృహంబుల నిలిపి యొక్కొక్క తెగ యంగళ్ళ నొక్కొక్క నెలవున నిలుపవలయు. ఇట్లు పురంబేని గ్రామంబేని సృజియించి రాజమందిరంబు నలువలఁకుల రాజమార్గంబుల నుంపవలయు. ముప్పదిచేతుల వైశాల్యంబు గల రాజమార్గం బుత్తమంబు. వింశతికరమితంబు మధ్యమంబు. పంచదశశయమానం బధమంబు. త్రికరాత్మికపద్య యనియుఁ బంచకర ప్రమాణవీథి యనియు, దశకరవిస్తీర్ణము మార్గమనియుఁ జెప్పఁబడు. పురమధ్యంబునుండి ప్రాక్పశ్చిమగాములు నుదగ్దక్షిణాభిముఖంబులు నగు మార్గంబుల దాని కోలఁదికిం దగినన్నిటి నృపుఁడేర్పఱుపవలయు. పద్యయు వీథియు నగరియందుఁ గూడవు. ఆఱుయోజనముల యరణ్యంబున నుత్తమ రాజమార్గంబును సాధారణముగ దాని నడుమ మధ్యమమార్గంబును దన్మధ్యంబున నధమపుఁ ద్రోవయు నుండవలయు. గ్రామంబులం దెల్ల దశకరాత్మకంబు లైన మార్గంబులు ప్రశస్తంబులు. మార్గభూమిఁ గ్రామసేవకులచేఁ గూర్మపృష్ఠ సదృశంబుగ సేతువు గావించి దాని యిరుఁగెలఁకుల జలనిర్గమార్గంబు కాల్వలఁ ద్రవ్వించి యుభయపార్శ్వ గేహంబులను మార్గాభిముఖంబుగ ద్వారంబుల నేర్పఱిచి గృహంబులకు వెనుకటిదెస నొక వీథియు దానికి సమీపంబున మలనిర్మోచనస్థానంబులు నేర్పఱిచి మార్గభూమి కేఁటేఁట సుధాశర్కరల సంఘటించుచు

ననుదినంబు తన్మార్జనంబునకు నూరి కొలువుడుకాండ్రనేని బందులనేని రాజు నియోగింపవలయు.

పాంథశాల

స్వదేశమం దెల్ల రెండు గ్రామంబులకు మధ్యంబునఁ బాంథశాలలు వేయించి దానిని గ్రామాధికారులు శుభ్ర పఱిచి రక్షించునట్లు చేసి యచటి యధికారి వచ్చు తెరువరులనెల్ల నేకారణంబున నేకడనుండి యెక్కడకుఁ బోయెదరు, సత్యంబు చెప్పుఁడని వారి జాతినామంబులఁ బరికించి శస్త్రవాహనంబులు శోధించి యభిజననివాసంబుల నెఱిఁగి వ్రాయుచు సాయంసమయంబున వారిశస్త్రంబులఁ బుచ్చుకొని సావధానులరై నిద్రింపుఁడని యాజ్ఞయిచ్చి వారి లెక్కించి శాలలోనికిం బంచి ద్వారంబు మూసి ప్రతీహారుల వలన దాని రక్షించుచు వేకువ నెల్లకాలిపి యాయుధంబుల నిచ్చి సీమాంతంబుదనుక గ్రామ్యజనసహాయంబు నొసఁగి వారి ననుపుచుండు నట్లేర్పఱచునది.

రాజుదినచర్య

రాజు రాజధాని న్వసియించుచుఁ బశ్చిమయామంబున నిద్రనుండి లేచి ముహూర్తద్వితియంబున నియతాయవ్యయంబులనుఁ, గోశభూతద్రవ్యంబున వెచ్చింపఁబడినదానిని బ్రత్యక్షంబునను లేఖలవలనను దెలిసికొని, నాఁటివెచ్చంబునకుం దగినద్రవ్యంబు గోశంబునుండి పుచ్చుకొని, తక్కటిదానిం బదిలంబుచేసి, యొక్క ముహూర్తంబున వేగనిరోధితుంబును, స్నానంబును గావించి, సంధ్యాదాన పురాణశ్రవణంబులకు రెండు ముహూర్తంబుల కాలంబు వినియోగించి గజాశ్వాదియాన

వ్యాయామంబున రెండుగడియలు గడపి, యొక్కముహూర్తంబునఁ బారితోషికంబుల నిచ్చి, వస్త్ర ధాన్య స్వర్ణ రత్న సేనల యాయవ్యయ లేఖన పరీక్షణమునఁ బ్రహరంబుగడిపి, సుహృద్బంధు సమేతుఁడయి ఘటికాద్వయము సుఖము భుజియించి, బాల వృద్ధ నవీన సందర్శనంబున నొక్క ముహూర్తంబు పుచ్చి, రెండుముహూర్తంబులఁ బ్రాడ్వివాకాదిబోధిత వ్యవహారుండై, ముహూర్తద్వయమున మృగయాక్రీడనంబుగావించి, ముహూర్తమాత్రంబు వ్యూహాభ్యాసంబుచేసి, పిమ్మట నొక్కముహూర్తంబు సంధ్యోపాసన తత్పరుండై, భోజనమున నొక్కముహూర్తంబు వెచ్చించి, వేగులవారివార్తల రెండుముహూర్తముల వినుచుఁ, ద్రియామ నెన్మిదిముహూర్తంబుల నిద్రించుచుండవలెను. ఇట్లహోరాత్రములు ముప్పదిముహూర్తములచే విభజించి విహరించువానికి సుఖము మిక్కుటముగఁ గలుగు. వ్యర్థంబుగఁ గాలక్షేపము సేయఁ జనదు. మఱియు, స్త్రీమద్యపానాదుల గాలంబుపుచ్చక యెక్కాలమున నెద్ది కర్తవ్యం బక్కాలమున నది యశంకితుఁడై శీఘ్రంబునఁ జేయవలయు.

కాలవృష్టి సస్యాభివృద్ధికి నకాలవృష్టి తన్నాశంబునకుం గారణం బగునట్లు సమయోచితకార్యాచరణంబు రాజాభివృద్ధికిఁ దదనుచితకార్యాచరణంబు నృపవినాశంబునకుం గారణంబగు.

రాజారక్షకులకుఁ జేయు నేర్పాటు

ఎల్ల కార్యస్థానంబుల నాయుధపాణులైన యారెకులచే రాత్రియంతయు సురక్షితంబులం గావించుచు వానియం దనుదినంబు జరుగుకార్యంబులు లేఖకాధిపముఖంబున విను

చు యామికులం బ్రతిదినంబుం బరివర్తించునది. యామిక స్థానంబు గృహపఙ్క్తి కభిముఖంబుగ నొనరించి యాయిండ్ల యందలి భృతిమంతులచే గేస్తులచేం దద్వృత్తాంతంబు నర యుచుండవలయు. రాజధానిం గ్రొత్తవారు ప్రవేశించునపుడు పౌరులు గ్రామాంతరము పోవునపుడునుం బ్రఖ్యాతవృత్తశీలురం దక్కం బ్రతిభువులం బుచ్చికొనక విడువవలదు. ఎల్ల నిశలం బ్రతియామంబుం గొంద ఱారక్షకు లన్నివీథుల జార చోరనివృత్తికొఱకుం బర్యటించుచుండున ట్లాజ్ఞయీవలయు.

రాజవశ్యము చేయవలసిన శాసనములు

మఱియు సకలప్రజలను, నూడిగపువానియం దేని కొలువుకానియందేని పెండ్లమునందేని కొమరునందేని నానేల నున్నవారు వాగ్దండపారుష్యములు సేయంజన దనియుం, దులయందు మానపాత్రములయందు నాణెకములయందు నిర్యాసములయందు ధాతుపదార్థములయందు మధుదుగ్ధఘృతాదుల యందుం గూటంబు సేయవలదనియు, నుత్కోచగ్రహణంబును స్వామికార్యవిలోభనంబును దగదనియు, దుష్కర్ముని జోరుని జారుని మద్ద్వేషిని నప్రకాశంబుగ రక్షింపవలదనియును, పితృపూజ్యవిద్వత్సద్వృత్తశాలులకు నవమానంబొండె నుపహాసంబు నొండె గావించిన శిక్షింతు ననియు, దంపతులకు స్వామిభృత్యులకు భ్రాతలకు గురుశిష్యులకుం బితృపుత్రులకుం బైశున్యంబున భేదంబు పుట్టింపంజనదనియు, మార్గంబుల వాపీకూపారామ ధర్మశాలా దేవాలయంబుల నిరోధంబు వలదనియు, హీనాంగుల నుపహసింపవలదనియు, ద్యూతమద్య సంధాన మృగయా శస్త్ర సంధారణంబులును

గో గజాశ్వ మహిషీ నృ స్థావర రజత స్వర్ణ మాదక ద్రవ్యంబుల క్రయ విక్రయంబులును క్రయ దాన ఋణ నిర్ణయ పత్రంబులును, వైజాతికంబు, మహాపాపాభిశమనంబును, నిధి గ్రహణంబు, నవీన సమాజ నిర్ణయంబును జాతిదూషణంబును బ్రహీణగ్రహణంబును రాజాజ్ఞనొందక కావింప రాదనియు, రాజుల దుర్గుణంబుల దాఁపకుండునది యనియు స్వధర్మ పరిత్యాగంబు ననృతంబు పరదారాభిమర్శనంబు కూటసాక్ష్యంబుం గూటలేఖ్యంబు నిర్ధారితకరాధిక్యంబు స్తేయసాహసంబు మనంబుననేని చింతింపవలదనియు శాసింప వలయు. భృతియందు శుల్కంబునందు నరియందు దర్పబలచ్ఛలంబుల నాధర్షణం బేరికేని కావింపవలదనియు నెల్ల జనుల గుణసంపన్నులరై యుండనియు నాతతాయిని గ్రహించి సాహసాధిపతి కొప్పగింపుఁడనియు నాజ్ఞాపింపవలయు. రాజు న్యాసంబుల నెల్ల స్వముద్రా ముద్రితంబులం జేయుచు వృషోత్సర్జనంబు నేరేని గావించిన నా వృషంబుల సుయంత్రితంబులం జేసి వార రక్షింప వలయుననియు, నా శాసనంబు విని పాటింపని పాపకారుల మహాదండంబున శిక్షింతు ననియు నప్పుడప్పుడు శాసన డిండిమంబులం బ్రజల బోధించుచు శాసనంబులు వ్రాయించి చదుకంబునం గట్టించునది. శత్రులందు దుష్టులందు నెల్లకాలంబు నుద్యతదండుం డై నీతిపురస్సరంబుగ నెల్లవారిం బాలించుచుం బాంథ బాధకుల శిక్షించుచుం గార్పటిక సుఖంబుకొఱకు మార్గసంరక్షణంబు తప్పక చేయుచుండవలయు.

రాజు లాదాయము నెట్లు వ్యయము చేయవలయు

పుడమిఱేఁడేఁటేఁటఁ దనయాయంబు పండ్రెండుపాళ్లు చేసి యందు మూఁట దండును గాపాడుచు నొక్కయఱపాలు భాగంబున వెచ్చించుచు సాంబాలిచేఁ బౌరులనరయుచు సంగోరున నధికారుల జీతంబు లిచ్చుచు సాము నాత్మసుఖోపభోగంబుల వినియోగించుచు నొక్కపాల గ్రామాధికారుల జీతంబు లిచ్చుచు మిగిలిన యాఱుపాళ్లఁ గోశంబు పెంచుచుండవలయు. మీఁదిధర్మంబు లన్నియు సామంతాదులకుఁ గాని తక్కువరాజులకుఁ గావు. అట్టిరాజు రాజ్యకీర్తిధనగుణంబులయందుఁ బ్రాప్తంబుల రక్షించుచు నప్రాప్తంబులకు సుప్రయత్నుఁడు గావలయు. పాండిత్యంబు శౌర్యంబు వక్తృత్వంబు దాతృత్వంబు బలపరాక్రమోత్థానంబులు నొకప్పుడేని యేమఱక యుండవలయు. పరాక్రమోత్సాహసంపన్నుండై స్వకార్యమున నేని స్వామికార్యమున నేని యనీకంబునఁ బ్రాణభయంబుఁ దొలఁగి మార్తుర మార్కొనువాఁడు శూరుండు. పక్షపాతంబు విడిచి బాలుండు పలికినను సుభాషితంబు గ్రహించి ధర్మతత్త్వంబు విమర్శించు రాజు పండితుఁడు. దోషంబులు గుణతుల్యంబు లని స్తుతియింపక సమక్షంబున నవిశంకితుఁడై వక్కాణించువాఁడు వక్త. పాత్రుల కీరాని పదార్థం బొక్కండు లేదని యెద్దియేనీ సాహసించువాఁడు దాత. దేనఁ గార్యం బవిశంకితుఁడయి చేయంజాలునది బలంబు. ఎద్దాన విమతనృపతులు కింకరులగుదు రది పరాక్రమంబు. యుద్ధానుకూల వ్యాపారం బుత్థానంబు. భోజనవేళ విషదోషభయంబున నన్నంబు కపి

కుక్కుటాదులచేఁ బరీక్షించునది. హంసలు విషాన్న దర్శనంబునఁ దడఁబడు. భృంగంబులు కూజితంబు సేయు. మయూరంబులు నృత్యమాడు. క్రౌంచంబు మత్తిల్లు. కుక్కుటంబు విరావంబు గావించు. కపి రేచనంబు గావించు. బభ్రువు పులకోద్గమంబు గావించు. శారిక యుద్వమించు. ఇట్టి వికారంబులు సూచుచు షడ్రసంబు నహీనంబు ననతిరిక్తంబు నగు భోజనంబు గావింపవలయుఁ గాని యేకద్విత్రి రససంకులంబు భుజియింపఁ జనదు. అతి కటు మధుర క్షార సంకులంబును వలదు. ఎవ్వఁడే కార్యము మనవియొనర్చిన నమాత్యాదులతోఁ గలిసి యప్రమత్తుండై వినవలయు.

ప్రకృతి నటగాయక మాగధైంద్రజాలికులతోడను స్త్రీలతోడను నొక్కొక్కయవసరంబున నారామాదుల వాహ్యాళి సలుపవచ్చు. గజాశ్వరథారోహణాభ్యాసంబు ప్రాతస్సాయంసమయంబుల ననుకూలంబై యుండు. సైనికులకు వ్యూహంబులఁ దా నేర్పుచు నేర్పించుచుండవలయు. దుష్టసత్త్వనిపాతనంబు సేయుచు వ్యాఘ్రాదిమృగంబుల మయూరాద్యండజంబులఁ గ్రీడింపించుచు నాఖేటనంబు గావింపవలయు. మృగవ్యంబున శౌర్యాభివృద్ధియు లక్ష్యసంధానంబు నకాతరత్వంబును శస్త్రాస్త్ర శీఘ్రపాతనంబును నను గుణంబులును మహత్తరంబైన హింసాదోషంబును గలవు.

రాజచారసంభావణాదికము

ప్రజలయు నధికృతులయుఁ బ్రకృతులయుఁ శత్రుసైనిక సదస్య బాంధవ శుద్ధాంతంబులయు నింగితచేష్టల జతనంబున నెఱుఁగుచు గూఢచారులవలన నిశీథంబున సావ

ధానచిత్తుఁ డయి యవధరించుచు నాత్యయిక విషయంబుల సిద్ధశాస్త్రాస్త్రుండై లిఖియించునది. అసత్యవాదియైన ప్రణిధిని శిక్షింపనిరాజు జనప్రాణ ధనాపహుం డైన మ్లేచ్ఛుఁ డనఁ బడు. వర్ణియుఁ దపసియు సన్న్యాసియు సిద్ధస్వరూపియు నగు చరుని ఛలంబునం బ్రత్యక్షంబునం బరికింపవలయు. వానిని శోధింపక నిజంబు తెలియఁజాలఁడు. అపరిశోధకుఁడైన రాజువలన స్పశుఁ డనృతవాదంబున భయపడఁడు. చారునిఁ బ్రకృతులవలన నుద్యోగులవలన రక్షించుచుండవలయు.

రాజ్యం బెట్టిదిగావలయు - రాజు దాయాదులపట్ల నెట్లుండవలయు

రాష్ట్రం బేకనాయకంబు గావలయుఁ గాని బహు నాయకంబు ననాయకంబు గా వలవదు. రాచకొలంబునఁ బురుషులు పెక్కం డ్రున్న జ్యేష్ఠుఁడు రాజును దక్కినవారలు తత్కార్య సాధకులుం గావలయు. వా రితర సహాయులకంటె గరీయసులు. వర్షిష్ఠుం డాంధ్య కుష్ఠ బాధిర్యాది బాధితుం డయ్యె నేనియు షండుఁడు మూకుఁడు నయ్యె నేనియు నతఁడు రాజ్యార్హుండు గాఁడు. వానిపుత్త్రు డొండె రాజు సోదరుఁ డొండె నన్నకొడు కొండె రాజు చిన్నకొడు కొండె దానికిం దగు. ఇట్లగ్రజుఁడు లేనపుడు కనిష్ఠులు రాజ్యార్హులు. దాయాదైకమత్యంబు రాజునకు మిగుల శ్రేయస్కరంబు; తత్పార్థక్యంబు రాజ్యమ్మునకుం గులంబునకు న్వినాశకంబు. కావున నేలిక జ్ఞాతుల స్వసదృశభోగులం జేయవలయు. విభాగంబున రాజ్యం బల్పిష్ఠం బయ్యెనేని శత్రువులు గ్రహింప నిచ్ఛయింతురు గాన నద్దాని విభజింపం జనదు. దాయల రాజ్యచతుర్థాంశ దానంబున నేని మహోద్యోగంబున నేని

నల్గడల నుండం బనుపవలయు. గోగ జాశ్వ ఖరోష్ట్రకోశం బుల యాధిపత్యంబున నేని వారి నియోగించునది. బానసం బునఁ దల్లినైన నట్టి సాధ్వి నితరనైన నియోగించి బంధువగు శ్యాలుని సేనాధికారంబున నిలిపి సుహృదుల న్గురుల నాత్మ దోషంబుల నెఱిఁగి తెల్పుఁ డని వేఁడుచు వస్త్రాలఙ్కార పాత్రరక్షణంబున స్త్రీల నియమించి యన్నింటిం గ్రమం బునఁ దాన పరిశీలించికొను చుండవలయు.

రాజు కార్యముల నెపుడాలోచింపవలయు నేరితోఁ జేయవలయు

కార్యాలోచనంబు నడికిరే యంతర్గృహంబున నేని దివాభాగంబున శోధితనిర్జనారణ్యంబున నేని మంత్రులతోఁ గూడి కావింపవలయు. ఱేఁడు నెయ్యుదతోడను దమ్ముల తోడను గొమరులతోడం జుట్టమ్ములతోడ దళవాయులతోడ సభ్యులతోడం గూడి రాచకర్జంబు కొలువుకూటంబున విచా రింపవలయు. సభామధ్యంబున సింగంబుగద్దియ నమర్చి దానఁ దాను గూర్చుండి తక్కటివారల న్నలుదెసల నిలుపవలయు. కొమరులు, మనుమలు, సోదరులు, భాగినేయులు, వెనుకటి దెసను గూఁతురుకొడుకులు దక్కినంపుదెసను, దండ్రితోఁ బుట్టువులు శ్రేష్ఠులైనస్వవంశ్యులు సభ్యులు సేనానులు దన యెదుటను నెడమప్రక్కను మామలు మఱఁదులు, మాతా మహుని వంశంబువారు, మంత్రులు, బాంధవులు, నధికారులు నుండవలయు. తనకు సరియైన చెలికాఁడు దగ్గఱ నైనఁ దన యాసనార్ధభాగంబున నైన నుండవలయును. జామాతను భగినీ పతిని వామదక్షిణ పార్శ్వంబుల నిల్పునది. శ్రేష్ఠాసనంబున నున్నయార్యుండు దండ్రియోజఁ బూజ్యుండు. లేఖరు లెల్లరు

మంత్రికిం బృష్ఠపార్శ్వాగ్రభాగంబుల నుండవలయు. పరిచారకులందఱును వెనుకటిదిక్కున నిలుచునది. ప్రవేశనతిబోధకులైన స్వర్ణవేత్రహస్తులు పార్శ్వంబున నిలువవలయు.

రాజు ముకుటము ధరియించి వస్త్రమాల్యసుభూషణభూషితుండై మైమఱువుదొడిగి విశిష్టచిహ్నయుతుండై, సావధానుండు, సిద్ధాస్త్రుండు నగ్నశస్త్రుండు నై సభకు రావలయు. "సర్వస్మాదధికో దాతా శూర స్త్వం ధార్మికో హ్యసి" యను వంచకు లగు స్తుతిపాఠకుల వాక్యముల ననాదరుండు గావలెను. ఎద్దియే నొక్క కార్యంబు గావింప రా జభిలషించిన మంత్రులు రాగలోభభయముల మూఁగలువోలె దాని గుణదోషంబులు వక్కాణింపక యూరకుందురు. తావన్మాత్రమున నది వారికి సమ్మతం బని తలంపక వేర్వేఱ వారియభిమతము హేతుయుక్తముగ వ్రాయించి బహుసమ్మతం బైనకార్యము గావించుచు నితరము పరిత్యజించుచుండవలయు. ప్రతిదినము భృత్యదాసరథాశ్వగజములయందుఁ గార్యక్షమముల నరయుచుఁ గడుజీర్ణంబులఁ దొలఁగించుచుండవలయు. రాజు నూఱుక్రోసులదూరమునఁ బుట్టిన వార్తనేని యొక్కదినమునఁ దెప్పించుచుఁ గొందఱకు జీవితం బొసఁగి విద్యలం గళలు నేర్పించుచు నేర్చిన వారిం దగిన యుద్యోగములు నిల్పుచు విద్వాంసులం గళాభిజ్ఞుల నేఁటేఁట సత్కరించుచుఁ దనదేశంబున విద్యాభివృద్ధియుఁ గలాభివృద్ధియు నగునట్లు ప్రయత్నించుచుండవలయు. మఱియుఁ దాను గజారూఢుండై ముందును వెనుకను మిక్కిలి నీతివిశారదులును గ్రూరవేషధారులును నగ్నశస్త్రులు నగుభటుల న్నాతిదూరమున నిలిపి

ప్రజారంజకుండై యుత్తము లగుప్రధానులతోడను దనకుం దుల్యులగు బంధుమిత్రులతోడను బురమున సంచరించుచుండవలయు. రాజయానారూఢుం డెట్టివాఁడేని సంభావనార్హుండ కావున నొకప్పుడేని నీచజనులతో నేగఁజనదు. నీచులగువారు సాధువులకంటె మార్దవంబునఁ గాన్పింత్రు గాని నీచుల సాధువుల మిథ్యోపచారంబుల సత్యోపచారంబుల నెఱుఁగవలయు.

రాజు లేఁటేఁట స్వదేశమునఁ జరించి చేయవలసిన పని

గ్రామంబులం బురముల దేశములఁ బ్రతివత్సరంబు సంచరించుచు నధికారులవలన రంజితులుఁ బీడితులు నగు ప్రజల వ్యవహారంబుల సత్యంబు పరికించి సేవకపక్షపాతంబు విడిచి జనులపక్షం బవలంబించి పెక్కండ్రు జనులతో విరోధించిన యుద్యోగిం దొలఁగించుచు మంత్రి నేనొక్కమాఱు అన్యాయగామిని రాజు రహస్యంబున దండించుచుఁ బెక్కుమాఱు లట్లయినఁ బరిత్యజింపవలయును. అన్యాయవర్తు లయినవారి రాజ్యంబును సర్వస్వంబు నపహరించుచుఁ బరాజితుల దేశంబున ధర్మాధికరణంబు [illegible]లకు వారిచరితంబు ననుసరించి భృతి నొసం[illegible]చుండవలయు. సురూపయు సుసంశుద్ధయుఁ బ్రియవాదినియు సుభాషయు [illegible]నురక్తయు నగు పత్నిం బరిగ్రహింపవలయును. [illegible]ములు నిద్రించువానికి సుఖాధిక్యంబు గలుగుఁగా [illegible]ంపవలయును. రాజులుఁ గేశంబులు నఖంబులు దంతంబులు స్థానభ్రంశంబున శోభింపమిని స్త్రీలుఁ బండితులుఁ [illegible]వులు స్లతలు నిరాశ్రయంబునఁ గొ[illegible]సాఫల్యంబు [illegible]ని రాజు దుర్గ

నివాసంబు పరిత్యజింపకయే నీతిచే శత్రుల జయించుచు నాపత్కాలంబున గిరిదుర్గంబు లాశ్రయించి తదాశ్రయంబున దస్యువృత్తిచేనైన స్వరాజ్యంబు మరల హరియింపవలయు. ఎవ్వాఁడు కులకన్యాదూషణంబు గావింపక పరదారవైముఖ్యంబు నొంది యసజ్జనుల ధనంబుల హరియించుచు నెల్లప్పు డొక్కచో వసియింపక యెట్టివారినేని నమ్మక ప్రాణనాశమ్ము గణియింపక సర్వకాలంబు సావధానుఁడై స్వకర్మంబున నిర్ఘృణుండై సదోద్యుక్తుం డగు వాఁడు దస్యువు నాఁబడు. పుత్త్రులుం బోలెఁ బాలితు లగుభృత్యులు పగవా రైనను మహాప్రయత్నంబునఁ జేసిన కర్జంబు నిష్ఫలం బైనను దనప్రయత్నలోపం బని యెంచక భాగధేయం బలియ యని నిశ్చయించి తపంబున కేఁగవలయు.

సంక్షేపంబున రాజకృత్యం బిందుఁ జెప్పఁబడియె. మిశ్రంబున నింకను జెప్పంబడు. ఇది శుక్రనీతిసారంబున రాజకృత్య ప్రకరణం బను ప్రథమాధ్యాయము

శ్రీరస్తు

శుక్రనీతిసారము

ద్వితీయాధ్యాయము

రాజు సేవకుల నవశ్యము గ్రహింపవలెను

శ్రీకరం బగు కార్యం బల్పంబైన నేకాకిచే సుసాధంబు గాదన మహత్తరంబైన రాజ్యం బసహాయునిచే దుష్కరంబని చెప్పనేల? ప్రభువు సద్విద్యాకుశలుఁ డయ్యు మంత్రవిదుఁడయ్యుఁ బ్రధానుల విడిచి యొక్కండు సర్థచింత సేయం దగదు. స్వతంత్రుఁడైన ప్రభువున కనర్థంబు లవశ్యంబు గలుగుఁగానఁ బ్రాజ్ఞుఁడైన రాజు సభ్యాధికారి ప్రకృతులతో నాలోచించి వారికి సమ్మతంబైన కార్యంబు సేయఁజనుఁగాని యొకప్పు డేని స్వాభిప్రాయానుసారంబుగఁ బ్రవర్తింపఁ జనదు. అట్లయిన రాష్ట్రజనులు నమాత్యాదులు ననురక్తు లగుదురు. ప్రతిపురుషంబును బుద్ధివైభవంబు భిన్నంబుగఁ గాన్పించుటను నాప్తవాక్యంబున ననుమానంబున నాగమంబున సాదృశ్యంబునఁ బ్రత్యక్షంబున ఛలంబున బలంబున వ్యవహారనిర్వాహంబు భిన్నంబగుటను నివి యన్నియు నొక్కమానిసిచేఁ దెలియ నశక్యం బగుటను గులీనులు సుశీలురు శూరులు హితోపదేశకులుఁ గ్లేశసహులు ధర్మాసక్తులు కామక్రోధాదివర్జితులు ననలసులు ననసూయులునుఁ గుమార్గగా

మిఱ్ఱైనఁ దన్నును సన్మార్గంబునకుం ద్రిప్పందగినవారు శుచులునయిన సహాయుల రా జవశ్యంబు వరియింపవలయు. కుకర్మంబునను గుసహాయంబునను రాజు తప్పక రాజ్యభ్రష్టుం డగు. మున్ను బలాధికులయ్యు దైత్యులు కుకర్మంబునను దుర్యోధనాదులు గుసహాయంబున న్నాశంబు నొందిరి. కావునఁ బార్థివుండు సుసహాయుండు సుచారిత్రుండుఁ గావలయు. యువరాజు నమాత్యగణంబును భూపతికి దక్షిణవామ భుజంబులు నయనంబులుఁ గర్ణంబులు గాన వారిసహాయంబు నొందని రాజు భుజాద్యవయవంబులు లేనివాఁడువోలె నిరర్థకుం డగు.

యువరాజు గాఁదగినవారు

ఔరసుఁడగు రాజన్యుఁడు, కనిష్ఠసోదరుఁడు, పితృవ్యుఁడు, భ్రాతృపుత్రుఁడుఁ, దత్తుఁడు, దౌహిత్రుఁడు, మేనల్లుఁడుఁ గ్రమమ్మున యౌవరాజ్యార్హులు. ఇం దెవ్వని నేని యువరాజు నేర్పఱిచి ముద్రాధికారంబునఁ గాక తక్కినరాజకార్యంబులం దెల్ల నియోగించునది. స్వహితం బపేక్షించి యెన్నఁడు న్వారి బాధింపఁ జనదు.

యువరాజును రక్షించు విధము

మఱియు వారి స్వధర్మనిరతుల శూరుల భక్తుల నీతిమంతులఁ గావించి సుఖంబులఁ దనుపుచు సుయత్నంబున రక్షింపవలయు. వా రరక్షితులైన నర్థలోభంబున హింసింతురు. మదోద్వృత్తులైన రాజపుత్రులు రక్ష్యమాణు లయ్యు ఛిద్రంబుల సింగంపుఁగొదమలు ద్విపంబుం బోలె జనకునేని సోదరునేని హింసింతురు. మోఱకును

బాలుండును గూడ స్వామ్యం బభిలషింతురు; యువం జెప్ప నేల? రాజు నిపుణు లగు భృత్యులచేతనుఁ దానును గైతవంబున వారి యభిప్రాయంబును దెలియుచుఁ దన సన్నిధిన వారి నెప్పుడు రక్షించుచు నమాత్యులు మొదలగు వారిచే నీతికుశలులను ధనుర్వేదవిదులను శూరుల యుద్ధరతులన్ సుశిక్షితులఁ జేయుచు వస్త్రభూషణాదుల నలంకరించుచుఁ గ్రీడనంబుల లాలించుచు నాసనాదుల నర్చించుచు సుభోజనాదులఁ బాలించుచు నర్హకాలంబున యౌవరాజ్యంబున నభిషేకింపవలయు. అవినీతకుమారంబైన కులంబు నశించుఁ గాన గ్రమంబునఁ గుమారుల శిక్షించుచుండవలయు. సుదుర్వృత్తుండైన రాచకొమరుఁడు క్లిశ్యమానుండగుచుఁ బరాశ్రయంబున రాజునకు హాని గావింపనోపుఁ గానఁ బరిత్యాగార్హుండు గాఁడు. కుమారుండు దుర్వ్యసనాసక్తుం డగునేని నొప్పించుచు నుద్వృత్తుండైన దుష్టగజంబుంబోలె సుఖబద్ధుం గావించుచు మిగులఁజెఱునడతగల దాయల నెక్కుడు జతనంబున వేఁగులచేఁ బగఱచే ఛలంబున హింసించుచుఁ బ్రజకుఁ దనకు నభివృద్ధి యగునట్లు నృపుఁడు జాగరూకుఁడై మెలఁగవలయు. వేఱొకలాగున నయ్యెనేని వారు ప్రజకు రాజునకు బాధకులగుదురు. జ్ఞాతులు స్వసద్గుణంబుల రాజునకు నిచ్చలు ముదంబు గావింపనినాఁడు తమ భాగంబునకు జీవితంబునకు దూరులగుదురు. స్వకులంబున జన్మింపని దత్తాదులు ధనాపేక్షఁ దన్నుఁ బ్రేమింతురు గాన మనంబున నేని వారిని బంధులని యెన్నఁదగదు. పిండదానంబునఁ బుత్త్రదౌహిత్రులకు విశేషంబు లేమిని గన్యక పుత్త్రుండువోలె స్వోత్పన్న యగు

టను బుత్రికాపుత్రుండు దత్తాత్ములకంటె నధికుఁడు. సధనుఁ డయ్యేనేని రాజు దత్తునిఁ గేవల ప్రజాపాలనార్థంబు రక్షింప వలయు. మనుజుఁ డన్యోత్పన్నునియందుఁ బుత్రత్వంబు గల్పించుకొని దాన యాగాదులకు వెచ్చింపక సుఖోప భోగంబులకు వినియోగింపక సర్వస్వంబు వాని కొప్పగించుటకంటె నచ్చెరువు గలదే?

యువరాజు చేయవలయుపనులు

యువరాజభిషేకంబు నొంది స్వసంపన్మదంబున వికారంబు చెంది తల్లిదండ్రులకు భ్రాతలకు భగినికి రాజపురుషులకు గురువులకు రాష్ట్రంబు నందలి మహాజనులకు నవమానం బొండెఁ బీడనం బొండెఁ గావింపకుండునది. జాతిబాహ్యులు రాజదర్శనం బపేక్షించిన మహాజనులు సమ్మతింపరు గావున వారికది సంఘటింప కుండునది. కొమరులకుఁ బిత్రాజ్ఞాపాలనంబు భూషణంబు గావున మహాసమృద్ధి నందియు వారి మాట జవదాఁటక వర్తింపవలయు. తొల్లి భార్గవరాముండు శాపానుగ్రహసమర్థుం డైన జనకు నాన జననిహింసించె ననియు శ్రీరాముఁడు రాజ్యత్యాగంబుఁ జేసి వనంబునకుఁ జనియె ననియు వారు పితృతపస్సామర్థ్యంబునఁ దల్లిని రాజ్యంబును మరల సంపాదించి రనియు నెల్లరకుం దెల్లంబ. మున్ను దుర్యోధనుండు భాగార్హభ్రాతల నవమానించి పొలిసెఁ గాన రాజపుత్త్రుఁ డెన్నఁడును సోదరులయెడఁ దన యాధిక్యంబుఁ బ్రకటింపఁదగదు. తండ్రిచే నుత్తమపదంబున నభిషిక్తులయ్యుఁ దదాజ్ఞోల్లంఘనంబున రాజన్యులు విశ్వామిత్రపుత్రులుంబోలె యయాతిసుతులుంబోలెఁ బదభ్రష్టులై

దాసతుల్యు లగుదురు. యువరాజు వాక్కాయమానసంబులఁ దండ్రికిం బ్రియంబు సేయుచు నప్రియంబు విడుచుచుఁ బితృ విద్వేషిని ద్వేషించుచుఁ దత్సఖునితో మైత్రి సలుపుచు నతనికి సమ్మతంబు నవిరుద్ధంబు నగు కార్యంబు సేయుచు సూచకచార దోషంబునఁ దనయం దన్యాభిప్రాయంబు జనకునకుం గలిగిన మంత్రులయనుమతిని మంతనంబున నతనికి యథార్థంబు విన్నవించుచుఁ గపటంబునం బ్రకృతుల యభిప్రాయం బెఱుఁగుచు వేగుఁబోకఁ దల్లికిం దండ్రికిం గురువునకు వందనంబు గావించి పూర్వదినంబునఁ గావించిన కార్యంబు రాజునకు మనవి చేయుచు విద్యచేతఁ, గర్మంబుచేత, శీలంబుచేతఁ బ్రజల రంజించుచు స్వజనావిరోధంబుగఁ బ్రవర్తించుచుఁ జాగంబున సత్యంబున నెల్లరఁ దనవశంబున నిల్పుచుండవలయు. ఇట్టి వృత్తంబు గల రాజపుత్రుండు శుక్లపక్షసుధాంశుండుబోలె వర్ధిల్లి క్రమంబుగ నకంటకం బైన రాజ్యంబు నొంది యమాత్యులతో సుఖంబుగఁ జిరకాలంబు వసుంధర భుజియించు నని యువరాజలక్షణంబు సమాసంబునఁ జెప్పి శుక్రుం డమాత్యాదుల లక్షణంబు సెప్పందొడఁగె.

సుసేవకులయు దుస్సేవకులయు గుణములు

పరీక్షకులు మార్దవంబునను, గౌరవంబునను, వర్ణంబున నుశబ్దాములను సువర్ణంబు గరఁగి పరీక్షించునట్లు రాజు భృత్యునిఁ గర్మంబున సహవాసంబున గుణంబున శీలంబునఁ గులంబునఁ బరీక్షించి విశ్వాస్యుని విశ్వసింపవలయు. కర్మశీల గుణంబులు పూజ్యంబు లగునట్లు కేవల జాతికులంబు లేనాఁడును బూజ్యంబులు గావు. జాతికులంబుల వలన శ్రై

ష్యంబు రామి వివాహంబుల భోజనంబులం దక్క నుద్యోగంబులఁ గులజాతిపరీక్షణం బనావశ్యకంబు. సత్యవాదులు నభిజనవంతులు ధనికులు సద్వంశ్యులు సుశీలురు సత్కర్మనిరతులు స్వకార్యంబునందలి యత్నంబు కంటె రాజకార్యంబునఁ బెక్కుమడుఁగులు యత్నాధిక్యము గలవారు భృతిచే తన సంతసించువారును బరోపకారదక్షులు నపకారపరాఙ్ముఖులు రాజున కపరాధంబు గావించు పుత్త్రునేని తండ్రినేని రాజున కర్పించువారును సత్కార్యంబున నచిరక్రియులు ననలసులు నసత్కార్యంబునఁ జిరక్రియులు ప్రభు వన్యాయగామియైన దామట్టి వారు గాక ప్రబోధించువారు రాజునందు రాణివాసంబునందు రాజపుత్త్రునందు మిత్త్రులందు దోషంబులు దడవనివారు వారిని శ్లాఘింపనివారు నిందింపనివారు రాజదత్తంబైన వస్త్రమాల్యాదులు నతనియెదుట ధరియించువారు నన్యాధికారంబుఁ గోరనివారు నాయంబునకుం దగిన వ్యయంబు గలవారు దయాళురు శూరులు రాజునకార్యంబు రహస్యంబున బోధించువారు నగు భృత్యులు ప్రశస్యులు. దండంబునం బీడితులు జీవితంబు లేనివారు శఠులు కాతరులు నిచ్చకములాడువారు వ్యసనులు లంచంబునం దిచ్చగలవారు జూదరులు నాస్తికులు దాంభికులు ననృతవాదులు తొలుతఁ దమచే నవమానితులు పగఱకు మిత్త్రులు పూర్వవైరులు ధర్మహీనులు నైనవారు సుసేవకులు గారని సంగ్రహంబున సదసద్భృత్యలక్షణంబు సెప్పి పురోహితాదుల లక్షణంబు సెప్పుచున్నాఁడు.

పురోహితాదుల కుండవలసిన గుణములు

పురోధసుఁడు ప్రతినిధి ప్రధానుఁడు సచివుండు

మంత్రియుఁ బ్రాడ్వివాకుఁడు పండితుఁడు సుమంత్రుఁడు నమాత్యుఁడు దూతుండు నను పదుండ్రు రాజునకుం బ్రకృతులు. పూర్వపూర్వం డుత్తరోత్తరున కధికుండు; కొందఱ మతంబునఁ బురోధసుని దూతను వదలి యెనమండ్ర ప్రకృతులని చెప్పంబడియె. ప్రకృతు లెనమండ్రకుం భృతియుండుఁ డాల్యంబు వలయు. మంత్రానుష్ఠానసంపన్నుండు సాంగవేదవిదుఁడు ధనుర్వేదాధ్యాపకుఁడు జితేంద్రియుఁడు క్రోధ లోభ మోహ వర్జితుఁడు నీతివిదుఁడు శస్త్రాస్త్రంబుల నేర్చినవాఁడు వ్యూహాభ్యాసకుశలుండు తనకోపంబున రాజునేని భీతుఁజేయ సమర్థుఁడు శాపానుగ్రహశక్తుండు నగువాఁడు పురోధసుఁడు (Family priest) గావలయు.

ఎవ్వరి నిరోధంబున రాజు వెలుచు నట్టివారు సత్ప్రకృతులు. రాజునకు వెఱపు పుట్టింపలేక ప్రజలను గోశంబును రాజన్యుని సుచరితంబును రాజ్యంబును వృద్ధినొందఁ జేయలేని ప్రకృతులవలనం బ్రయోజనంబు లేదు. కార్యాకార్యంబుల నెఱుఁగువాఁడు ప్రతినిధి. సర్వదర్శి ప్రధానుఁడు. సేనావిజ్ఞానంబు గలవాఁడు సచివుఁడు. నీతివిద్యాకుశలుండు మంత్రి. ధర్మతత్త్వజ్ఞుండు పండితుండు. లోకశాస్త్రనయజ్ఞుండు ప్రాడ్వివాకుండు. దేశగణనంబు నెఱింగినవాఁ డమాత్యుండు. ఆయవ్యయప్రవిజ్ఞాత సుమంత్రుఁడు. ఇంగితాకారంబులు దేశకాలంబులు నెఱింగి స్మృతిమంతుండై సాడ్గుణ్యంబు నధిగమించి వాగ్మియు వీతభయుండు నగువాఁడు దూత (Ambassador). రాజునకు నహితంబైన సమయోచితంబుగఁ గావింపనుహితంబైన నొకప్పుడు మానను సమయాసమ

యంబుల నెఱిఁగి బోధించి కార్యంబులు చేయింపను మాన్పింపను స్వాతంత్ర్యంబున నొకప్పుడు చేయను మానను సమర్థుం డగువాఁడు ప్రతినిధి (Vice-regent). రాచకర్జంబుల నెల్ల సత్యాసత్యంబుల నిరూపించి యందఱకుం గర్తవ్యాకర్తవ్యంబుల నిశ్చయించి చెప్పువాఁడు ప్రధానుఁడు. (Chief secretary) ఏనుఁగులలో గుఱ్ఱంబులలో రథంబులలో నొంటెలలో నెద్దులలో నివి కార్యక్షమంబులు నివి కార్యాక్షమంబులు ననియు నివిమున్నిటివి యివి మనము గడించినవనియుఁ గాలరులలో, వాయిదంబుల గురుతులు బాసలసంకేతంబులు మొద్దనంబులు నెఱిఁగినవారిలో, నూడిగపువారిలోఁ గార్యసమర్థు లిందఱు గలరనియు మఱిందఱు గావలయుననియు శస్త్రగోళకాగ్నిచూర్ణయుక్తంబైన సాంగ్రామికసంభారం బింత గలదనియు మఱింత కావలయుననియుఁ దెలిసి రాజునకుఁ దెలియఁజేయుచు సంఘటించుచుండువాఁడు సచివుఁడు (War-minister.) సామదానభేదదండంబుల నెప్పు డెట్లెట్టివారియెడ నుపయోగింపవలయు నెట్లుపయోగింప నుత్తమాది ఫలంబులు గల్గునది నిశ్చయించి భూపతికి నివేదించువాఁడు మంత్రి. (Diplomatist.)

సాక్షులచే భోగంబులచేఁ బత్రంబులచే ఛలంబులచే మునుపటివ్యాపారంబులచే సంప్రాప్తంబులైన వ్యవహారంబుల విమర్శించుచు నేతగవుల మానుషంబులైన ప్రమాణంబులుపయోగించు వేనియందు దివ్యసాధనంబులు గావలయునది యుక్తులచేతను శాస్త్రజ్ఞానంబునను బ్రత్యక్షాదులను నిశ్చయించి బహుప్రమాణ సమ్మతంబైన దాని రాజు

నకు విన్నవించు న్యాయాధికారి ప్రాడ్వివాకుం డగు. (Chief-justice.)

సనాతనధర్మంబు లివియనియు వర్తమానాచారంబు లివియనియు శాస్త్రోపదిష్టంబు లివియనియు లోకవ్యవహారసిద్ధంబు లివియనియు నీధర్మంబు లిప్పటివారికి విరుద్ధంబులనియు నీయాచరణంబులు లోకశాస్త్రవిరుద్ధంబు లనియు విచారించి యిహలోకంబున బరలోకంబున సుఖప్రదంబులగువాని రాజునకు విజ్ఞాపించువాఁడు పండితుండు. (Learned adviser.) ఈవత్సరంబున నింతసొమ్ము సమకూడె నింతయుధమర్ణులవలన రావలయు నింతవ్యయంబయ్యె నింతమిగిలినది దీన నింతస్థావరం బింత జంగమంబు నని యెఱిఁగి రాజునకు విదితంబు చేయు నుద్యోగి సుమంత్రుండు (Finance minister.) నాఁబడు.

మనరాష్ట్రంబునఁ బురంబులు గ్రామంబులు నరణ్యంబులు నిన్నికలవనియు నీయేఁ డింతభూమి దున్నఁబడెననియు నింతయరిపీఁ డిచ్చెననియు నింతకరం బింకనుపీఁ డీవలయు ననియు నకృష్టభూమి యింత యనియు భూమివలన భాగం బింతయనియు శుల్కద్రవ్యం బింతయనియు దండజంబైన ద్రవ్యం బింతవచ్చెననియుఁ గొఱకులపంట యింతయనియు నారణ్యకద్రవ్యంబులిన్నియు ఖనిజంబులిన్నియు నస్వామిక ద్రవ్యం బింతయుఁ దస్కరాహృతం బింతయు సంఘటిల్లె ననియు రాజునకు నివేదించు సేవకుఁ డమాత్యుఁ (Ordinary Minister) డగు. సంక్షేపంబునఁ బ్రకృతిదశలక్షణంబుఁ గృత్యం బిట్లు చెప్పంబడె.

తక్కిన చిన్నయుద్యోగుల నేర్పఱుచు విధము

మఱియు రాజు వారు లిఖించుదాని సర్వంబు నప్రమత్తుండై పరీక్షించుచు వీరిం బరస్పరోద్యోగంబుల కప్పుడప్పుడు మార్చుచుం దనకంటె నధికబలసంపన్నుల కుద్యోగంబు లీయక యన్యోన్యానురక్తుల సమబలులం గార్యంబుల నియోగించుచు నొక్కకార్యంబున మూవుర నియమించుచు నం దొక్క ప్రాజ్ఞతముని ముఖ్యుని నితరుల నప్రధానులం గావించుచు వారికార్యప్రావీణ్యంబు పరిశీలింపనీక నిద్దఱ నియమించుచుం బరిశీలకుల నేఁటేఁట మార్చుచు మూఁడు నైదు నేడు పది సంవత్సరంబులు వారికార్యకౌశలంబు పరీక్షించి నివర్తింపఁ దగువారి నివర్తించి తక్కినవారిం దప్పక యుద్యోగాంతరంబునకుం బరివర్తించుచుండవలయును. అధికారమదంబున మత్తిల్లనివాఁడు దుర్లభుండు గాన నెట్టిగుణ్యు నేని చిరకాల మొక్కయుద్యోగంబున నుండనీక యా యధికారంబునకు దక్షుం డగువాని వాని క్రింది కొలువరి నేని తగువాఁ డయ్యె నేని పరివర్త్యుని పుత్త్రు నేని నియమించుచుం గ్రమంబుగ శ్రేష్ఠపదంబు నొందినవానిం బ్రకృతిపదంబున రాజు నియోగించుచుం గార్యానుసారంబుగ దర్శకులం బెక్కండ్ర నే నొక్కమీఁదియధికారి నే నియోగించుచుం గర్మసచివులను గజాశ్వ రథపాదాత పశూష్ట్ర మృగపక్షులకు సువర్ణ రత్న రజతాదులకు విత్తంబులకు ధాన్యాదులకుం బాకంబులకు నారామంబులకు సౌధగేహంబులకు సంభారంబులకు దేవోత్సవంబులకు దానంబులకు వేర్వేఱ నధిపతుల నియమించుచు నెల్లపురంబులందు గ్రామంబులయందు

* సాహసాధిపతిని § గ్రామణిని × భాగహారుని ♦ లేఖకుని + శుల్కగ్రాహుని బ్రతిహారుని నేర్పఱిచి తపస్వులను దానశీలుర శ్రుతిస్మృతిపురాణాదుల నెఱిఁగినవారి శాస్త్రజ్ఞుల దైవజ్ఞుల మాంత్రికులఁ దాంత్రికుల వెజ్జులఁ గర్మకాండజ్ఞుల బుద్ధిమంతులుఁ బూజ్యులు జితేంద్రియులు గుణవంతులు నగు నితరజనంబుల దానమానంబుల వేతనంబులఁ బోషించుచుండవలయు. అట్లు చేయనినాఁడు రాజకీర్తిఁ బొందుటయే కాక హానియుం బొందు.

కార్యంబులు బహుజనసాధ్యంబులు కావున నాయాయికార్యంబులఁ గుశలు లగువారి నెఱిఁగి నియోగించునది. అమంత్రంబగునక్షరంబును ననౌషధం బగు మూలంబును నప్రయోజనం బగుజనంబును లేదు. దాని యుపయోగం బెఱిఁగి నియోగించువాఁడు దుర్లభుఁడు. గజంబులలో భద్రాదిజాతిభేదంబులును జికిత్సితంబును శిక్షయు వ్యాధియుఁ బోషణంబు నారోహణనైపుణియు గమనవిశేషంబును దాలుజిహ్వానఖంబులచేఁ దద్గుణంబులను దెలిసినవాఁడు గజాధ్యక్షుండు గావలయును. అట్టి హస్తిపకుండ కరిహృదయహారకుండగు. అశ్వహృదయంబును వాని జాతివర్ణ భ్రమంబులచే గుణంబులను, గమనంబును, శిక్షయు, వెజ్జఱికంబును, రోగంబును, సత్త్వంబును, వాని హితాహితంబులు పోషణంబును, దంతం

---

* సాహసాధిపతి=Magistrate. ♦ లేఖకుఁడు=కరణము. × భాగహారుఁడు=పన్నువసూలుచేయువాఁడు. + శుల్కగ్రాహుఁడు=దేశాంతరమునుండి వచ్చిన సరకులకుఁ బన్ను పుచ్చుకొనువాఁడు. § గ్రామణి=గ్రామాధిపతి.

బులు వయసు నెఱింగిన శూద్రు నశ్వపాలనంబున నియోగింపవలయు. మీఁదటి గుణంబులు గలిగి ధుర్యంబుల, రథ్యంబుల, యుగ్యంబుల దెలిసి రథ[illegible]గమన భ్రమణ పరివర్తనంబుల నేర్చి యోద్ధనంబుల నెఱిఁగి పగవారు సమీపించునపుడు వారిశస్త్రాస్త్రలక్ష్యసంధానంబు వితథం బగునట్లు రథంబు నడుపఁ గలవాఁడు రథాధ్యక్షుండు గావలయు. శూరులు, దృఢాంగులు, శస్త్రాస్త్రయుద్ధకోవిదులు, ప్రాజ్ఞులు, వ్యూహవిశారదులు, హయగతిజ్ఞులు, నగువారిని రాజు సాదులఁ జేయునది. మఱియు నశ్వబలానుసారంబుగ శిక్షింప నేర్చినవారు, చక్రితము, రేచితము, వల్గితకము, ధౌరితము, నాప్లుతము, తురము, మందము, కుటిలము, సర్పణము, పరివర్తనము, నాస్కందితమునను నశ్వగతుల నెఱింగినవారు హయశిక్షణంబునకును దృఢాంగులు శూరులుం బల్యాణాది నియోగకుశలులు, నశ్వసేవనంబునకును నర్హులు. నీతిశాస్త్రనిపుణులు బల్లిదులు శస్త్రాస్త్రవిదులు జితేంద్రియులు స్వధర్మనిరతులు స్వామిభక్తులు రిపువిద్వేషులునగు శూద్రులనేని బాలురు వృద్ధులు గానివారు దృఢాంగులు నగువారి క్షత్రియులనేని మ్లేచ్ఛులనేని సేనాధిపతులను సైనికులను జేసి జయార్థియగు రాజు సంధరించునది. పదగాముల కయిదార్గురకు నొక్కయధిపతిని నియమింపవలయు. ఆయధిపతిం బత్తిపాలుఁ డండ్రు. తర్వాత ముప్పదుండ్రు సైనికుల కొకయధికారి గావలయు. ఆతని గాల్మికుం డందురు. నూఱుగురుయోధుల కధ్యక్షుండు శతానీకుండు. వానిమీఁది యధికారియనుశతికుండు. వాని కధికుండు సేనాని. సేనానికొక్క లేఖకు నేర్పరుపవలయు. వీరు

శతసైనికులక యధికారు లగుదురు. వేగురు భటుల కధికారి సాహస్రికుండును దశసహస్రాధ్యక్షుఁ డాయుతికుఁడు నని వ్యవహరింపఁబడుదురు.

అనుదినంబు ప్రాతఃకాలంబునను సాయంసమయంబునను జోదులకు వ్యూహంబుల నేర్పుచు యుద్ధకౌశలంబు నలవరించు నధికారి శతానీకుఁడు. శతానీకునకుఁ గరంబు పోరి తెఱంగు నేర్పు సాధకుఁ డనుశతికుఁడు. యుద్ధసంభారంబుఁ దెలిసి కార్యయోగ్యులగు సైనికులను యామికులను దగిన కార్యంబుల నియోగించువాఁడు సేనాని. యామికులఁ బరివర్తించు నధికారంబు పత్తిపాలునిది. గాల్మికుఁడు యామికుల జాగ్రత్తం బరిశీలింపవలయు. సైనికు లిందఱనియు నితని కింత వేతనంబనియు వీరు క్రొత్తవారు వీరు ప్రాఁతవారు నని యెఱిఁగి యిందఱు గ్రామాంతరంబునన్నవా రింద ఱిచటఁ గలరని లేఖకుండు వ్రాయుచుండవలయు. ఇరువదిగుఱ్ఱంబుల కేని గజంబుల కేనధికారి నాయకుం డనంబడు, పైయుద్యోగులనం దఱ వారికిఁ దగినచిహ్నంబులతో లాంఛితు లయియుండ రాజు నియమించునది. మఱియు నుష్ట్రమేషమృగాదిజంతు పోషణంబునం దగినవారి నియోగించుచు శ్యేనాదులకుఁ బాతంబును శుకాదులకు సంభాషణంబును దద్హృదయజ్ఞులచే రాజు నేర్పించుచుండవలయు. యుద్ధప్రవృత్తికుశలురఁ దిత్తిర్యాదిపక్షి పోషణంబున నియోగించునది. మానంబునను వర్ణంబునను జాతిని రత్నంబులమూల్యంబు లెఱిఁగినవాఁడును సౌవర్ణరాజతనాణకంబులఁ బరిశీలింప నేర్చినవాఁడును ధనికుఁడు దాంతుఁడు వ్యవహారవిదుఁడు ధనప్రాణుండు నగుకృప

ణుని భూపతి కోశంబులకు రత్నంబులకు నధ్యక్షునిఁ గావింపవలయు. దేశభేదంబులచే జాతిభేదంబులచేఁ గౌశేయాదుల మూల్యంబులును స్థూలసూక్ష్మవస్త్రంబుల క్రయద్రవ్యంబును నెఱిఁగినవాని వస్త్రాధిపత్యంబున నియోగించి రంజనాదుల నేర్చి కంచుకనిర్మాణంబు నెఱిఁగి దూష్యరచనఁ దెలిసి శయ్యామండపాలంకారంబు నుపధానాదిసంధానంబును వితానవియోజనంబును నెఱిఁగినవాని వితానాధిపత్యంబున ఱేఁడు నియోగించునది.

ధాన్యంబుల జాతులు వాని గుణంబులు శోధనంబును గొలఁతయుఁ దూనికయు నెఱిఁగినవానిఁ గొల్చున కధిపతిం జేసి పదార్థంబుల శుద్ధియుఁ బాకంబును రసంబును నేర్చి పదార్థగుణంబుల నెఱిఁగి నాతనిం బాకనాయకుఁ జేయవలయు. పుష్పఫలాదివృద్ధిహేతు వగు దోహదంబు నేర్చి కాలానుకూలంబుగఁ బాదపంబుల నాటుటయు, జలాదులచే వాని పోషణంబును భేషజంబును దెలిసినవాని నారామపాలుం జేయవలయు. ప్రాసాదంబుల నగడ్తల దుర్గంబులఁ బ్రాకారంబులఁ బ్రతిమల యంత్రంబుల వాపీ కూప తటాకంబుల జలోర్ధ్వగతిక్రియల శిల్పశాస్త్రానుసారంబుగ నిర్వర్తింప సమర్థుం డగువాని గృహాధిపత్యంబునఁ బ్రభువు నియమించి, రాజకార్యంబులకుఁ దగిన వస్తువుల నెఱిఁగి కాలానుసారంబుగ వాని సమకూర్చువాని సంభారాధిపుం జేసి స్వధర్మాచరణమున దక్షుని నిస్పృహుని దేవతారాధనాసక్తుని దేవతోత్సవాధికారమున నియోగించునది. యాచకున కాశాభంగంబు గావింపనివాఁడు నర్థుల సంగ్రహింపనివాఁ

డును దానశీలుఁడు నిర్లోభుఁడు దయాళువు మృదువచనుండు దానపాత్రజ్ఞుఁడు నగు [illegible]ంతుని [illegible]కారంబున నియోగింపవలయు. [illegible]దులు [illegible] వృత్తశీలగుణాన్వితులు నిరాలసులు [illegible] నదృశులు జితక్రోధులు న[illegible] ప్రియంవదులు నగు నెల్ల జాతుల వారి వయోవృద్ధుల సభ్యుల (Members of council) నియమించునది. సర్వభూతదయాపరుఁడు నిస్పృహుఁడు నతిథిపూజకుఁడు దానశీలుఁడు నగువాని సత్త్రాధికారంబున రాజు నిలుపవలయు. పరోపకారనిరతుని నిర్మత్సరుని గుణగ్రాహిని బరమర్మాప్రకాశకుని విద్వాంసుని బరీక్షాధికారంబున నియమించునది. ప్రజల కతిభీతి గల్గకుండ నపరాధానుసారంబుగ దండించువాని నతిమార్దవంబు నతిక్రౌర్యంబు లేనివాని సాహసాధిపతి నూరూర నియమించి తల్లిదండ్రులువలెఁ బ్రజారక్షణదక్షునిఁ జోరులవలన సాధర్షకులవలన నధికారిగణంబు వలనను గావఁ దగినవాని గ్రామాధిపత్యంబున నేర్పఱచి, మాలకరి వృక్షంబులఁ బెనిచి పుష్పంబులు ఫలంబులు గొనునట్లును మధుకరంబు మరందంబు గొనునట్లును జనులకు మనసు నోవకుండ నుపకారంబుల గావించుచుఁ గరంబు గొనువాని భాగహారణంబున నియోగించి, స్పష్టంబుగ నగూఢార్థంబుగను లిఖింప నేర్చిన వాని వేఱ్వేఱు దేశభాషలఁ జక్కఁగ నెఱింగిన వాని గణనాకుశలుని లేఖకు నేర్పఱిచి శస్త్రాస్త్రకుశలుండు నిరాలసుఁడు వినయవంతుఁడు నగు దృఢాంగునిఁ బ్రతీహారకుఁ జేసి బేహారుల మూలధనంబునకు హానిగలుగకుండ శుల్కంబు నాకర్షించువాని సుంకంబు గ్రహింప నేలిక నియమించునది.

మంత్రపారాయణంబునందు నాహారనియమంబునందు నాసక్తుండు నిస్పృహుండు క్షమియు నగువాఁడు తపోనిష్ఠుండగు. ఎద్దియేనియు సంగ్రహింప నపేక్షింపక నిరంతరంబు యాచకులకు నిచ్చువాఁడు దానశీలుం డగు. శ్రుతి స్మృతి పురాణాధ్యయనాధ్యాపన సమర్థుఁడు నభ్యాసశీలుండు శ్రుతజ్ఞుఁ డగు. సాహిత్యశాస్త్ర నిపుణుండును సంగీతజ్ఞుఁడు సుస్వరుండు సర్గాది పంచకజ్ఞాతయు నగువాఁడు పౌరాణికుఁడు. మీమాంసా తర్క వేదాంత శబ్ద శాసన తత్పరుండును వాని బోధింప సమర్థుండు నగువాఁడు శాస్త్రజ్ఞుఁ డనంబడు. సంహితయు హోరయు నెఱిఁగి గణితతత్త్వంబు దెలిసి త్రికాలజ్ఞుఁడగువాఁడు జ్యోతిష్కుండగు. బీజానుసారంబుగ మంత్రంబుల గుణదోషంబుల గ్రహించి మంత్రానుష్ఠాన నిరతుండును సిద్ధదైవతుండును నగు మహానుభావుండు మాంత్రికుండు.

రోగోత్పత్తి కారణంబునను దాని చిన్నెలను వ్యాధి స్వరూపంబును దన్నివారణసాధనంబులు నెఱిఁగి సాధ్యాసాధ్యంబుల నిశ్చయించి చికిత్సోపక్రమంబు సేయువాఁడు సద్వైద్యుండు. శ్రుతి స్మృతీతర మంత్రానుష్ఠానంబుల దేవతార్చనంబు గావించుచు రాజునకు హితతమం బగు కార్యంబు సేయ యత్నించువాఁడు తాంత్రికుఁడు. సత్యవచనులు ప్రియంవదులు సత్కులులు సురూపులు నగు నపుంసకుల రాజు రాణివాసంబు సంరక్షణంబున నియోగించునది. స్వామిభక్తులు, ధర్మాసక్తులు, దృఢాంగులు, మధ్యమవయస్కులు, సేవాకుశలులు, రాజుచే నియుక్తంబులయిన కార్యంబుల నీచంబులనేని నిరాకరింపక చేయువారు లేని యానతి నతిక్రమింపనివారు నగు పరిచారకు

లేలికచే నియుక్తులు గావలయు. విభుండు దాయలయుఁ బ్రజలయు సేవకులయు వృత్తంబుల రహస్యంబున నెఱుఁగ నిపుణులును యథార్థబోధకులు నగు వారిగూఢచారుల నేర్పఱుపవలయు. రాజు తన్ను సమీపించువారికి నతియును స్థానంబును బోధించు కుశలుల వేత్రధరులఁ గావించి సప్తస్వరంబుల స్థానంబు లెఱిఁగి నృత్యంబు దెలిసి కంఠంబున వీణను నిపుణంబుగ గానంబు సేయ సమర్థుం డగు పురుషునేని యట్టివిధము గలదియు సుందరాంగియు శృంగారరస తత్త్వజ్ఞయు నిర్లజ్జయు ననురాగవతియు సుస్మితాననయు నగు వేశ్యనేని గాయనాధికారంబున నియోగించి చిత్తరంజకు లగు వైతాళికుల దండధరుల శిల్పజ్ఞులఁ గలావిదుల ప్రాణజ్ఞుల వస్త్రకుల వేషధారుల నైంద్రజాలికుల దుర్గనిర్మాతల మహానాళికయంత్రగంబులయిన గోళంబులచే లక్ష్యభేదనంబు సేయువారల లఘుయంత్రకారుల నాగ్నేయచూర్ణబాణాసిగోళకారుల నానావిధశస్త్రధనుస్తూణాదికారుల స్వర్ణరత్నాద్యలంకారఘటకుల రథకారులఁ బాషాణలోహాదిక్రియాకుశలుల ధాతువిలేపకుల గుంభకారులఁ దక్షుల మార్గకరుల నాపితుల రజకుల వాంశికుల మలీహారకుల వాసికుల (అంపమునం గట్టులఁ గోయువారల) వార్తాహారుల సౌచికుల రాజచిహ్నంబు లయిన ఛత్రాదుల ధరించువారల నావికుల ఖనకుల వ్యూహముల నిర్మింపఁగలవారల భేర్యాదులయు వేణుశంఖాదులయు ధ్వనులచే యానవ్యపయానంబుల బోధించువారల వ్యాధుల భారవహుల శస్త్రోత్తేజనకరుల నాపణికుల గణికల వాద్యజాయాజీవులఁ దంతువాయుల శాకునికులఁ జిత్రకరులఁ జర్మకరుల గృహపాత్రాది

సమ్మార్జనకరుల శయ్యావితానాస్తరణంబులు రచియించువారల స్వేదంబుపుట్టింపని పరిమళవిశిష్టధూపంబుల రచియించువారలఁ దాంబూలికుల మఱియు హీనకర్మకరుల నల్పకర్మకరులఁ దత్తత్కార్యానుసారంబుగ నియమించి వారికార్యంబులు పరికించుచు నాత్మహితంబుకొఱకుఁ బోషింపవలయు. సత్యంబును బలోపకరణంబును బుణ్యతమంబులు గాన వానియందాసక్తులగు భృత్యుల రాజు పోషించునది. హింసయు నసత్యభాషణంబును మిగులఁ బాపకార్యంబు లొకటఁ జేసి తదాసక్తులయిన భృత్యుల నొకప్పుడేనియు రాజు సంధరింపఁ జనదు. ఏకాలంబున నెయ్యది కర్తవ్యం బెయ్యది యకర్తవ్యం బద్దానిఁ దప్పక రాజునకు బోధించి చేయించువాఁడు సద్భృత్యుండు. సద్భృత్యుండు పశ్చిమయామంబున నిద్రనుండి లేచి కాల్యకరణీయంబులఁ దీర్చి గృహకృత్యంబు విచారించుకొని దేవతాప్రార్థనంబు గావించి కార్యశాలకుం బోయి కార్యాకార్యంబుల నిశ్చయింప వలయును. దౌవారికుఁడు రాజాజ్ఞనొందక దుర్గంబుఁ బ్రవేశించువారి నిరోధించి వారి వచ్చిన కార్యంబు దెలిసి యిట్టివారు దేవరదర్శనంబున కిట్టి పనికై వచ్చిరని రాజునకు నివేదించి యాజ్ఞప్తుండై విడుచుచుండవలయు.

సేవకధర్మములు

దండధరుండు సభామధ్యంబునకు వచ్చినవారిం జూచి రాజునకు మున్ను నివేదించి పిమ్మట వారి నమస్కారంబు విన్నవించి వారికిం దగిన స్థలంబుల సంజ్ఞచేఁ దెలియఁజేయవలయు. కార్యాలయంబు ప్రవేశించి కొలువుకాఁడు రాజుచే

నాజ్ఞప్తుండైనఁ బ్రాంజలియై తత్సన్నిధిం బడసి రెండవవిష్ణుం బోని ప్రభువునకు యథాన్యాయంబుగ వినమ్రుండై యతని యందదృష్టి నిల్పి చిత్తజ్ఞుఁడగునతనికి సమ్మతుండై దీప్తాగ్నిం బోలె వినీతుండై సమీపించి యలిగిన నాశీవిషం బని యెన్నికొని ప్రాణధనేశ్వరుండగు ప్రభువు నవధానంబున సేవించుచు నెందునకేని నేఁ గానక ప్రసంగంబున రాజుపక్షంబు సమర్థించుభాషితంబు సెప్పుచుఁ దదనుయోగంబున సునిశ్చితంబైనయర్థంబు వాక్రుచ్చుచు సుఖగోష్ఠిని వివాదను వాదుల యభిప్రాయం బెఱింగియు నవద్యంబైన వచనం బుడుగుచు ననుద్ధతవేషుండై నతిపూర్వకంబుగా రాజువచనంబు విని ముందు వారియాజ్ఞ నౌదల ధరియించి పదపడి వస్త్రాంతరితముఖుండై తనకార్యంబు విన్నవించునది.

మఱియు రాజుమ్రోల నాసీనుండు గాక వినమ్రుండై యభిముఖమ్ముగఁ బార్శ్వంబున నిలువవలయు. కాసప్రహాసననిష్ఠీవన కుత్సనజృంభణగాత్రభంగపర్వస్ఫోటంబులు రాజుసమ్ముఖంబునఁ బరిహరించి రాజాజ్ఞప్తంబైన స్థలంబున నామోదంబునఁ గూర్చుండి ప్రవీణోచిత మేధాసంపన్నుండయి యభిమానంబు వర్జించి యాపత్కాలంబున నున్మార్గగమనంబునఁ గార్యకాలాత్యయంబున ననుయుక్తుండయ్యు సేవకుండు రాజహితార్థియై ప్రియంబుఁ బథ్యంబు ధర్మార్థసహితంబు సప్రమాణంబు నగు వాఙ్నిచయంబున నీతిఫలంబైన రాజన్యుల కీర్తి నతనియొద్ద నుగ్గడించి హితంబుం బోధింపవలయు. "ఓ రాజా! నీవుదాతవు శూరుండవు ధార్మికుఁడవు నీమనంబున దుర్నీతి యెన్నఁడును లేదు" అని స్తుతి

యించుచుఁ జెడునడతలచేఁ బదభ్రష్టులయినరాజుల నతని యెదుట సేవకుఁడు నిరూపించుచుండవలయుఁ గాని యందఱు రాజులకంటె నధికుఁడవని విశేషించి యెన్నందగదు.

మఱియు భృత్యుండు దేశకాలజ్ఞుఁడై పరార్థంబు సాధించుచు నొకప్పుడేనియుఁ బరకార్యభంగం బగునట్లు సంభాషింపక పరోపకార మిషంబున నెల్లపుడు రాజుల బాధింపకయుఁ జరింపవలయు. పండితుఁడు క్షుధాపరిగతుండై కృశించియు స్థాణువుంబోలి యుండఁదగుఁ గాని యనర్థసంపన్నం బయిన వృత్తి నేనాఁడు నపేక్షింపఁ దగదు. ఎవఁ డెక్కార్యంబున నియుక్తుం డయ్యె నతఁడు దానఁ దత్పరుండు గావలయుం గాని యన్యాధికారంబు నిచ్ఛగించి యితరులయం దసూయాపరుండు గాఁజనదు.

ఇతరులకు మేలుసేఁతకంటె మిత్రసంపాదనసాధనం బొండు లేదు గావున సేవకుఁ డితరుల ఛిద్రంబు లన్వేషింపక స్వశక్త్యనుసారంబున వానిం బూరించుచుండవలయు. రాజానుచరుఁడు సమర్థుఁ డయ్యేనేని యర్థికార్యంబు సరగఁ జేయవలయుఁ గాని కార్యంబు కావింతుఁ గావింతు నని చిరకాలం బాశాబద్ధుఁ జేయఁదగదు. భృత్యుండు రాజు రహస్యంబును మంతనంబును బ్రకటింపక యతని విద్వేషంబును నాశంబును మనంబుననేని చింతింపక రాజు నాకుం బరమమిత్త్రుం డని యిచ్ఛానుసారంబుగఁ జరియింపక యతని నభిలషించు స్త్రీలతోడను బాపులతోడను జేనిదాయులతోడను దన్నిరాకృతులతోడను నేకకార్యాచరణంబును సాహిత్యసంసర్గంబులును వర్జించి వేషభాషల రాజు ననుక

రింపక సంపన్నుండయ్యు బుద్ధిమంతుండై రాజుగోనంబుల నీసుఁ జెందక కుశలుండయి రాజు రాగాపరాగంబు లెఱుఁగుచు నింగితాకార చేష్టలఁ దదభిప్రాయంబు దెలిసి తనయం దనురక్తుం డగురాజు సేవించుచు విరక్తుం డగువాని వర్జింప వలయు. విపత్తాభ్యుదయంబు సేయుచుఁ దనకు నాశ గల్పించియుఁ ఫలనాశంబు గావించుచుఁ గ్రోధంబు లేనివాఁడయ్యు నున్నట్లు నటియించుచుఁ బ్రసన్నుండయ్యు నిష్ఫలుండయి సగర్వంబుగ మాటాడుచు వృత్తిచ్ఛేదంబు సేయుచు స్వగుణకీర్తనంబున విముఖుం డగు రాజు విరక్తుం డనియుఁ దన్నుఁ జూచి ప్రసన్నుండై మనవి యొనర్చు దాని నాదరంబున వినుచుఁ గుశలప్రశ్నపూర్వకంబుగ నాసనాదు లిప్పించుచు వివిక్తంబుగ దర్శనం బిచ్చుచు రహస్యంబుననేని తనయెడ శంకింపక హృష్టవదనుండై తాఁ జెప్పుదాని నప్రియం బేని మన్నించుచు స్వల్పం బేని తా నిచ్చు నుపాయనంబు గ్రహియించుచుఁ గథాంతరంబులయందుఁ దన్ను స్మరించు రా జనురక్తుఁడనియు సేవకుఁ డెఱుంగునది. కొలువరి రాజదత్తంబు లయిన వస్త్రభూషణచిహ్నంబుల ధరియించుచు నిచ్చలు స్వాధికారంబునందలి న్యూనాధికభావంబుల నివేదించుచుఁ బ్రణిధి సూచక దోషంబున రా జెద్దియేని తాఁ జెప్పినదానికిం బ్రతికూలంబుగఁ జెప్పిన మౌనావలంబియై దాని విని నిజం బని యనుమోదింపకుండునది. ఒక్కమా అయినఁ బ్రేమదత్తం బయిన యెవ్వాని యన్నంబు భుజియించు వానికి మేలుసేఁత సల్లక్షణంబు. నాఁ జిరపాలకుం డగు రాజునకు మేలాలోచించుట చెప్పనేల? కావున సునృపతి యూ

పద్గతుండయిన విడువందగదు. అత్యంతసేవనంబున నప్రధానుండు ప్రధానుండును సేవాలస్యంబునఁ బ్రధానుఁ డప్రధానుండును నిత్యసంసేవనరతుండగు భృత్యుండు రాజునకుఁ బ్రియుండును నగుంగావున భృత్యుండు తనకు నియుక్తంగుబకార్యంబు సత్వరంబుగ నిర్వర్తించుచుండునది. నీచకార్యంబులు సాహసంబున రాజాజ్ఞాపింపను నుత్తమసేవకుండు చేయను దగదు. అయ్యును దత్కార్యంబు సేయ సర్హుఁడగు సేవకుఁడు లేనితఱి నుత్తముఁడయిన రాజున కావశ్యకంబగు నీచకార్యంబును జేయన తగు. భృతకుఁడు రాజు సంతసిల్లు కార్యంబున ననిష్టంబును స్వాధికారగౌరవంబును జూపఁదగదు. రాజును నియుక్తులగువారు తమయధికారంబు రక్షించుకొఱకుఁ బరస్పరాసూయఁ జెందకుండవలయు. రాజు నధికారిగణంబునెచట సద్వృత్తంబుననుండు నచట లక్ష్మి సుస్థిరయైయుండు. అధికృతుం డన్యాధికారివృత్తంబు విన్నను రాజునకు విన్నవింపను నన్యముఖంబున నన్యాధికారివృత్తంబు రాజు వినను సమ్మతింపంజనదు. రాజునకు హితాహితంబులు బోధింపని యధికారులు భృత్యరూపచ్ఛన్నులయిన వైరులు. మంత్రిముఖంబున హితాహితంబులు వినని రాజు ప్రజాధనంబు రాజరూపంబున హరియించుదస్యువు. రాచకొమరులచే వ్యవహారంబులఁ బ్రష్టులయి వారితో విరోధించు మంత్రులు తస్కరులు. రాజపుత్రులు బాలురయ్యు మంత్రులచే మిగుల సన్మానింపఁబడఁ దగినవారు. మంత్రులు బహుమానపూర్వకవాక్యంబుల వారి బోధింపవలయు. స్త్రీపుత్రమోహంబు బలవంతంబు గావున వారి యసచ్చరితంబు నెన్నఁడు రాజునకు

నివేదింపం దగదు. మఱియు వారి నిందించుటయు శ్రేయంబు గాదు. రాజునకవశ్యంబగు కార్యంబు దనకుఁ బ్రాణసంశయకారి యయ్యు నన్నాజ్ఞాపింపుఁడు నేఁ జేయఁగలనని యనుజ్ఞ నొంది కర్మోపజీవి శక్తికొలఁదిఁ దత్కార్యంబునకు యత్నించుచు మహాకార్యంబు తటస్థించునపుడు కుటుంబపోషణార్థంబు ప్రాణంబు నేని యొసఁగునది. కాని వ్యర్థంబుగఁ బ్రాణత్యాగంబు దగదు. రాజులు యుద్ధాదిమహాకార్యంబులయందు యుక్తిపూర్వకంబుగ భృతిచే భటులప్రాణంబులు గొందురు. భటులు భృతిచే ధనమాత్రంబు గొందురు. భృతికంటె వేఱుగ రాజధనంబుగొను భృత్యుండును నిష్కారణంబుగ భృత్యప్రాణంబులు గొను రాజు నాత్మనాశకు లగుదురు. రాజును యువరాజును నమాత్యాదులచే మిగుల మాన్యులును వారికంటె నమాత్యాదులు న్యూనులు నగుదురు. అమాత్యాదులకంటెఁ దక్కిన యధికారిగణంబు న్యూనంబు. ఆయుతికుండు మంత్రితుల్యుండు; అతనికంటె సాహస్రికుండు న్యూనుండు. రాజుతో సమంబుగ నమాత్యాదులు క్రీడింపందగదు; క్రీడించిన రాజును విశేషింపఁ జేయవలయు. మంత్రులచే రాజునవరోధంబును, బంధులును; మిత్రులును, మిగులఁ బూజనీయులు. సేవకుఁడు రాజుచే నాహూతుండగుడుఁ గార్యశతంబేని త్యజియించి సత్వరంబుగఁ బోవుచు వారిచే సుమంత్రితంబయిన కార్యంబు మిత్రునకే నెఱిఁగింపక భృతిందక్క నదత్తంబయిన రాజద్రవ్యంబు నభిలషింపక రాజునానతి నొందక కార్యమాధ్యస్థికభృతి నపేక్షింపక యాపత్కాలంబునఁ బుత్రధనప్రాణాదుల నేని రాజు

రక్షించుచు నుత్కోచం బెన్నండేని గ్రహియింపక, ద్రవ్యలోభంబున సత్కార్యంబుఁ జెఱుపక రాజునకు దుర్బోధంబు సేయక శాస్త్రవ్యతిరేకంబుగను దీక్ష్ణంబుగను దండించు భూపుని రాజ్యగుప్తికై యేకాంతంబున నిగ్రహించి బోధించుచుండవలయు. నవీనకరశుల్కాదులచే లోకంబు పీడనొందుఁ గాన రాజునకు హితంబును లోకంబునకు నహితంబును నగు కార్యంబు సేయింపన్వలదు. రాజు గుణనీతిబలద్వేషియు సత్కులజుండయ్యు నధార్మికుండు నయ్యెనా రాష్ట్రనాశకుండగు నతనిఁ ద్యజియించి తత్పదంబున గుణయుక్తుండగు తద్వంశ్యునిఁ బ్రకృత్యనుమతంబు నొంది రాజ్యరక్షణార్థంబు పురోధసుం డభిషేకించునది. సాస్త్రుం డగువాఁడు రాజునకు నస్త్రపాతంబునకుఁ దగనిదూరంబునను నశస్త్రుండు పదిహస్తంబుల దూరంబునను బ్రియు లాజ్ఞానుసారంబుగను మంత్రులు లేఖకులు నయిదుహస్తంబుల దూరంబునను బేరోలగంబున నుండవలయు.

సేనాధికృతులు గానివారు శస్త్రాస్త్రంబులతో సభం జొరరాదు. రాజసేవకులలో సేనాని శ్రేష్ఠుఁడు; పురోహితుఁడు శ్రేష్ఠతరుఁడు; సుహృదుండును బంధుండును సములు; మంత్రులెల్లనుత్తములు; తక్కిన యధికారిగణంబు మధ్యమంబు; దర్శక లేఖకగణం బధమంబు; పరిచారకగణం బధమతమంబు; నీచకార్యసాధకు లంతకంటె న్యూనులు. రాజు పురోహితాదులకుఁ బురోగమనోత్థానస్వాసన సన్నివేశకుశల ప్రశ్న స్మితదర్శనాదులఁ గ్రమంబుగఁ గావించుచుండవలయు. రాజు మఱియు నితరు లగు నధికారులకు సభాస్థలంబునఁ

ప్రేమపూర్వకంబుగ దర్శనంబిచ్చుచు విద్వాంసులయెడ శరచ్చంద్రుని విద్వేషులయెడ నిదాఘార్కునిఁ బ్రజలయెడ వసంతభానునిఁ బోలి త్రివిధుండయి యుండవలయు. ప్రభువు ద్విజేతరులయెడ మార్దవంబుఁ బొందెనేని వారు హస్తిపకులు గజంబుం బోలె నెకిమీనిఁ బరిభవించి యెల్లవారు స్వార్థపరుల కావునఁ దమ కర్జంబు సిద్ధించుకొఱకు వేర్వేఱఁ దమ కార్యంబు గుణవంతం బని బహువిధంబుల బోధించుచు ఱేనివచనంబు వికల్పించి యవమానించి స్వపదంబునఁ దుష్టినొందక ఱేని యానతి నొందక రాజభోగ్యంబు లనుభవించుచు నతని లోపంబును మంత్రంబును వెలివుచ్చుచు నిర్లజ్జు లయి యతఁడు కోపించినఁ బరిహసించి భాషించుచు నాజ్ఞోల్లంఘనంబునకు వెఱవక యకార్యంబునకు జడియక మోసంబు సేయుచుందురు. మీఁది దోషంబు లన్నియు రాజునకు సేవకులతోడి పరిహాసక్రీడన క్షమలవలనం బుట్టు. కాఁబట్టి రాజు భృత్యులు మొదలగువారితోఁ బరిహాసక్రీడనంబులఁ గావింపఁ జనదు. ప్రమాదంబు పురుషధర్మంబు గావునను లేఖ్యంబు నిర్ణాయకంబు గావునను సేవకుఁడు నృపునిలేఖం బొందక యొక్కపుడేని రాచకర్జంబు గావింపను గార్యం బల్పం బైన నధికం బయినను లేఖం బంపక రా జాజ్ఞాపింపను దగదు. లిఖితరూపమునఁ గాక వాఙ్మాత్రమునఁ గార్యంబు సేయ నాజ్ఞాపించు రాజును నట్టి యానతి నన్నించి కార్యము నావటించు సేవకుఁడును బరస్పర వంచకు లగుదురు. నృపముద్రాముద్రితంబయిన లేఖ్యంబ నృపుఁడు గాని రాజు స్వరూపంబున నృపుఁడు గాఁడు. రాజలిఖితం బయిత

న్ముద్రాముద్రితంబైన లేఖ్యం బుత్తమోత్తమంబు. రాజలిఖితం బుత్తమంబు. మంత్రి లోనగువారిచే లిఖితంబయినది మధ్యమంబు. పౌరులచే వ్రాయఁబడినది యధమంబు. అన్నియుఁ గార్యసాధకంబుల యగు. రాజుచే నాయాయి కార్యములయందు నియుక్తు లగు యువరాజాదులు తత్తత్కార్యంబుల లేఖ్యంబులు దినంబునను మాసంబునను వర్షంబునను బహువర్షంబులను రాజునకు నివేదించుచుండవలయు.

పలువిధము లగు (దస్తావేజులు) లిఖితములు

కాలం బతిక్రమింప మనుజులకు భ్రాంతి వొడముట సహజం బగుటను విస్మరణంబు సంభవించుటను ననుభూత వ్యవహార స్మృత్యర్థంబు బ్రహ్మ లిఖితంబు నిర్మించుటను, రాజు మొదలగువారిచే లిఖితం బయి తన్ముద్రాంకితం బయిన లేఖ (Order) కు స్మృతిపత్రంబు (నకలు) వ్రాసి యత్నంబున రక్షింపవలయు. ప్రాచీనులచే లేఖ్యంబు వృత్తలేఖ్యం బనియు నాయవ్యయలేఖ్యం బనియు ద్వివిధంబుగ విభజింపఁబడె. వ్యవహారభేదంబుచే నవి రెండును బహుప్రకారంబుల భిన్నంబు లయ్యె. లోకవ్యవహారసంబంధి యగు లేఖ్యంబు వృత్తలేఖ్యంబు. అందు వాదిప్రతివాదులచే సకారణముగఁ జెప్పఁబడిన సాధ్యార్థంబుతోఁ గూడినదియు సిద్ధాన్తయుక్తంబును నగునది జయపత్రం బగు (Decree). భృత్య సామంతాదులకు రాజు కార్యానుసారంబుగ నాజ్ఞాపించి వ్రాయు లేఖ యాజ్ఞాపత్రం బనంబడు.

పూజ్యు లగు ఋత్విక్పురోహితాచార్యాదులకుఁ గార్యంబు విన్నవించుచు వ్రాసినది జ్ఞాపనపత్రంబు. "ఇద్ది

యెల్లవారు నిట్లు మదీయాజ్ఞానుసారంబుగఁ దప్పక చేయునది" యని కాలసంపన్నంబుగ రాజహస్తంబున లిఖితం బయినది శాసనంబగు. రాజు సేవాశౌర్యవైదుష్యాదుల సంతసించి దేశగ్రామాదుల లిఖితపూర్వకంబుగ నిచ్చి. వ్రాయించు పత్రంబు ప్రసాదపత్రం బగు. అదియె పురుషావధికం బొండె గాలావధికం బొండె నయిన యుపాయనం బయ్యెనా భోగపత్రంబు నాఁబడు. భ్రాత్రాదులు పరస్పరారుచిని విభక్తధను లయి వ్రాసికొనునది భాగలేఖ్యం బగు. గృహభూమ్యాదులఁ దగినవారి కిచ్చి స్వపుత్రాదులు దాని హరియింపకుండ వ్రాయించి యిచ్చినది దానపత్రంబు నాఁబడు. గృహక్షేత్రాదులఁ దగిన మూల్యంబునకు విలిచి వ్రాయించుకొనునది క్రయపత్రంబు. స్థావరపదార్థంబునే జంగమపదార్థంబునేఁ గుదువయుంచి రక్షించుటయు ననుభవించుటయు నిర్ణయించి వ్రాయునది సాధిలేఖ్యంబగు. రెండు గ్రామంబులవారు వివాదము లేకుండ నడువ వ్రాసికొన్నది సత్యలేఖ్యంబును నిద్దఱు రాజు లట్లు వ్రాసికొన్నది సంవిత్పత్రంబు నాఁబడు. సొమ్ము వడ్డితో నీయఁ బుచ్చికొని వ్రాసియేని వ్రాయించియేని యిచ్చు సాక్షిమంతం బయిన పత్రంబు ఋణపత్రం బని మనీషులు చెప్పుదురు. అభిశప్తునకు విద్వాంసులు ప్రాయశ్చిత్తంబు సేసిన పిదప నిచ్చెడు ససాక్షికం బయిన పత్రంబు శుద్ధిపత్రంబు. సాధకులు వ్యవహరించు నిమిత్తము స్వధనాంశంబులు గలిపి వ్రాసికొన్న పత్రంబు సామయికం బనంబడు. సభ్యాధికార్యార్థులచే నకృతంబై వాదులచే నంగీకరింపఁబడిన స్వవ్యవహారజ్ఞాపకపత్రంబు సమ్మతిసంజ్ఞ మెప్పు. భద్రవాచకపదార

ర్థంబై యసందిగ్ధంబు నగూఢార్థంబునై యధికారితారతమ్యంబున స్తుత్యర్థ బహువచనాదులతోఁ గూడి యన్యవ్యావర్తకంబగు నట్లు పిత్రాదినామయుతంబై లిఖిత వత్సర మాస దివ నామజాత్యాదికం బయి కర్తవ్యకార్యబోధకంబగు సేవ్యసేవార్థంబైన పత్త్రంబు క్షేమపత్త్రం బని వ్యవహరింత్రు. పై లక్షణంబులు గల్గి యాధర్షకుఁ దెలియఁజేయునది వేదనా (=అభియోగ) పత్త్రంబు. సంగ్రహంబున వృత్తలేఖ్యస్వరూపంబు చెప్పి యవశిష్టంబైన యాయవ్యయలేఖ్యంబు చెప్పుచున్నాఁడు. అయ్యాది వ్యాప్యవ్యాపక భేదంబులచే, మూల్యమానాదులచే భిన్నంబగు.

ఆయవ్యయంబుల స్వరూపము

ప్రతిదినంబు ప్రతిమాసంబు ప్రతివత్సరంబు స్వాయత్తీకృతంబయిన పశుహిరణ్యధాన్యాది రూప ధనం బాయం బనంబడు. అట్లు పరాధీనంబు సేసినధనంబు వ్యయంబనంబడు. సాద్యస్కంబు ప్రాచీనంబు నగు నాయంబు సంచితంబు నాఁబడు. వ్యయం బుపభుక్తంబు వినిమయాత్మకంబు నని ద్వివిధంబు. సంచితంబు నిశ్చితాన్యస్వామికంబు వనిశ్చితాన్యస్వామికంబు నిశ్చితస్వస్వత్వంబు నని త్రివిధంబు. అందు నిశ్చితాన్యస్వామికం బౌపనిధ్యంబు యాచితకంబు నౌత్తమర్ణికంబు నని త్రివిధంబయ్యె. సజ్జనులచే విశ్వాసంబున నిల్లడయిడిన ధనం బౌపనిధ్యంబు. వృద్ధి లేకుండ డాఁపనొప్పికొన్న [illegible] యలంకారాదికంబు యాచితంబు. వడ్డితో నీయ నొప్పికొని యితరులవలన గ్రహించిన ధనం బౌత్తమర్ణికంబు. అన్యాక్రాంతంబు గాని స్థలంబున సంప్రాప్తంబైన లిబ్బి లోనగునది

యజ్ఞాతస్వామికంబు. స్వస్వత్వ వినిశ్చితంబు సాహజికంబు నధికంబు నని ద్వివిధంబు. అందుఁ గుసీదంబు నను యాజనాదులను బారితోష్యంబున నెక్కువ వెలను విజయంబునను బ్రాప్తంబైన ధనం బధికంబు. తక్కిన పైతృకంబైన ధనం బెల్ల సాహజికంబు. స్వాధీనద్రవ్యం బెల్లను బూర్వవత్సర శేషంబు వర్తమానాబ్దసంభవంబు నని ద్వివిధంబగు. మఱియు బహు భేదభిన్నంబైన సంచితంబు పార్థివంబు నితరంబు నని ద్వివిధంబు. భూమిభాగ సముద్భూతంబు పార్థివంబు. అది దేవమాతృకంబులు నదీమాతృకంబులు బహు మధ్యాల్ప ఫలదంబులు నగు భూభాగంబులచే ననేకప్రకారం బగు. శుల్కంబునను దండంబున నాకరంబులను భాటకంబున నుపాయనాదులను బ్రాప్తంబగునది యితరంబు. అందుఁ గొన్ని యాయంబులఁ దన్నిమిత్తంబునకు వ్యయపఱుపందగు. వ్యయంబు పునరావర్తకంబు, స్వత్వనివర్తకంబు నని ద్వివిధంబు. పెఱలయింట దాఁచినదియు భూనిహితంబును గుసీదంబున నుపయుక్తంబును వినిమయాత్మకంబును బునరావర్తకంబు. వడ్డి గలుగునట్లొండె లేనియట్లొండె నప్పిడినది కుసీదోపయుక్తంబు. వస్తువులఁ గొని మూల్యంబుగ నిచ్చినది వినిమయంబు.

స్వత్వనివర్తకంబు పారలౌకికంబు నైహికంబు నని ద్వివిధంబు. ప్రతిదానంబును బసదనంబును వేతనంబు భోగ్యంబు నని యైహికంబు చతుర్విధంబు.

పరలోకసాధనం బయిన వ్యయంబు జపహోమార్చాదానంబులచే బహుప్రకారంబగు. పదార్థంబులఁ గొనియిచ్చు వెల, ప్రతిదానము. సేవాశౌర్యాదులచే దుష్టి చెంది యిచ్చి

నది పసదనంబు. భృతిరూపంబున దత్తంబు వేతనంబు. ధాన్య వస్త్ర గృహారామగోగజాది సంపాదనంబునకు విద్యాభ్యాసంబునకు రాజ్యార్జనంబునకు ధనార్జనంబునకు వాద్య శస్త్రాస్త్ర ధాన్య సంభారగృహంబులకు మంత్రి శిల్ప మృగపాక నాట్యనిష్క వైద్యాదిశాలలకు వెచ్చించిన సొమ్ము భోగ్యంబగు. మీఁదటి యాయవ్యయంబు లన్నియు నాయవ్యయలేఖకుఁడు జాగ్రత్తగఁ బరిశీలించుచు వ్యయంబున ముందు లిఖించియె వెచ్చించుచు నాయంబున ముందు గ్రహియించియె వ్రాయుచు వ్యవహరింప హానివృద్ధు లతనిఁ జెందకుండు.

మానసంఖ్యాది స్వరూపము - ద్రవ్య ధన స్వరూపము

పదార్థభేదంబునను దేశభేదంబునను మాన సంఖ్యోన్మానప్రమాణంబు లెల్లఁ బదార్థంబులకు వ్యవహారవిదులు నిర్ణయించిరి. ఇవి కొన్నింట సమాహారంబుగను గొన్నింటఁ బ్రత్యేకంబుగను నుపయోగింతురు. అంగుళపదహస్తాదికంబు మానంబు. తుల యున్మానంబు. ప్రస్థాదిపాత్రంబు పరిమాణంబు. ఏకద్వ్యాదికంబు సంఖ్య. వ్యవహారార్థంబు ముద్రితంబయిన స్వర్ణరజతతామ్రంబులును వరాటంబు మొదలు రత్నంబుదనుక నున్న పదార్థజాతంబును ద్రవ్యంబు నాఁబడును. పశుధాన్యవస్త్రాదికంబు తృణాంతంబయిన పదార్థం బెల్ల ధనంబనం బడు.

ఏద్రవ్యవ్యయంబున జనులకుఁ బదార్థలాభంబుగల్గు నది మూల్యంబు. పదార్థంబుల సౌలభ్య దౌర్లభ్యంబులఁ బట్టియు మంచి చెడ్డలం బట్టియు నానియర్ఘంబు హీనంబు నధికంబు నగుచుండు. రతనంబులకు సువర్ణాది ధాతుపదార్థంబులకుఁ దక్కువ వెల కల్పింపఁదగదు. వానికిఁ దక్కువ వెల రాజదౌష్ట్యంబునన యగు.

లిఖితముల వ్రాయువిధము

ఎద్దియేని వ్రాయునపుడు పత్రంబు దీర్ఘంబుగ నాల్గు మడతలుగ మడిచి వ్రాయనలసిన యంశంబు కొలఁదిఁ బరికించి యెడమభాగంబున మూఁట నొక్కపాలేని రెంట నొక్క భాగం బేని నాల్గవయంశం బేని విడిచి కాగితంబున నడ్డంబుగఁ బదావళి వ్రాయవలయు. రాజు లేఖ్యంబుల సొరిదిఁ బరికించి చూచి దానిఁ దాఁ జూచినట్లు గుఱుతుగ వ్రాయు వ్రాలును దన యభిప్రాయంబును నిచ్చవచ్చినట్లు వ్రాయఁ దగు. వ్యవహారవిషయంబు లయిన వ్రాఁతలు మున్మున్న మంత్రియుఁ బ్రాడ్వివాకుండుఁ బండితుఁడు దూతుఁడును బరస్పరవిరోధంబు లేకుండ వ్రాయవలయు. పిమ్మట సమాత్యుఁడు దానిం బరీక్షించి యిది సాధు వనియు ననంతరము సుమంత్రుండు దీనిఁ బరిశీలించితి నిది నిర్దుష్టం బనియుఁ దర్వాతఁ బ్రధానుఁ డిది యథార్థంబనియు ననంతరము ప్రతినిధి యిది యంగీకరింపఁ దగు ననియు యువరా జంగీకరింపవలసిన దనియుఁ బురోహితుఁ డీ లేఖ్యంబు సమ్మతం బనియు దానిపై వ్రాయుచు గడపటఁ దమ ముద్రలచే ముద్రింపవలయు.

పిమ్మట రాజు దాని నంగీకరించితినని వ్రాసి ముద్రింపవలయు. రాజు కార్యాంతరవ్యగ్రుఁడు కావుటం బట్టి లేఖ్యంబు సర్వంబు పరీక్షింప నవకాశంబు చాలమిని మంత్రిగణం బెల్లను

యువరాజును దాని స్వముద్రాముద్రితంబు చేసియె యొసఁగవలయు. రాజు దానిఁ జక్కఁగఁ బరిశీలింపనెడము లేనియపుడది చూడంబడినది యని రైనదానిపై వ్రాయుచుండవలయు. ఆయవ్యయంబులు వ్రాయునపుడు పత్రంబు వామభాగంబున ముందాయంబు వ్రాసి దక్కినంపు దెస వ్యయంబును గ్రమంబుగ వ్రాయవలయు. వ్యయంబులలో మూల్యాదులను వేర్వేఱనా పఙ్క్తియందు వ్రాయుచు వ్యాప్య వ్యాపకంబులు రెండును విశేషించి యున్నపుడు మీఁది బంతుల మొత్తమును గ్రింది వరుసయందు వ్రాయవలయు. బహువృత్తియు నవయవియు వ్యాపకంబును న్యూనవృత్తియు నవయంబులు వ్యాప్యంబును నగు. సజాతీయంబులగు నాయంబులయు వ్యయంబులయు సముదాయ లేఖనంబును మొదట యథాప్రాప్తంబుగఁ సముదాయలేఖనంబును గావింపవలయు. ఈ లేఖ్యంబు స్థానవివరణంబును దక్కినది సంఘవివరణంబనంబడు. ఆయంబులివి వ్యయంబులివి మిగిలిన దింతయనీ విభాగజ్ఞానంబు దీన స్పష్టంబుగఁ గలుగఁదగు. ముందు యథాప్రాప్తంబుగ నాయవ్యయపదార్థంబుల లిఖియించి పిమ్మట వాని వివరణంబు లిఖియింపవలయు. లేఖ్యంబులయందుఁ దిథులు వ్యాప్యంబు లయ్యు గ్రహింపఁగఁదగినవి. ఈ లేఖ్యంబుల నిశ్చితాన్యస్వామికంబులు నితర గతాయంబులుఁ బునరానర్తకంబులు నన్ని విధంబులయిన వ్యయంబులు వాని మొత్తంబులు వ్రాసి వ్రాసినవారి చిహ్నంబులతోడను బైయధికారుల ముద్రలతోడను ముద్రింపవలయు. ఇ ట్లెల్లవారికి స్మృతిసాధనం బయిన లేఖ్యంబు సెప్పె.

కొన్నియు మానంబులయుఁ గాలంబులయు స్వరూపము

గుంజామాషకర్షపదార్థప్రస్థంబు లను పరిమాణంబుల నొకదానికంటె నొకటి గ్రమంబుగ దశగుణాధికం బగు. అయిదు ప్రస్థంబు లొక్క యాఢకంబు (కుంచము). ఎనిమిది యాఢకంబు లొక్కయర్మణంబు నిరువది యర్మణంబు లొక్క ఖారియు నగు. ఇప్పరిమాణంబు దేశభేదంబున భేదిల్లు. ఆయిదంగుళంబుల లోఁతును నాలుగంగుళంబుల వైశాల్యంబును గల పాత్రంబు ప్రస్థంబునఁ జతుర్థభాగం బగు. సంఖ్య యొకటి మొదలు పరార్థంబు దనుక నుండు. అంతకంటె నధికంబు లేదు గావుననే బ్రహ్మయాయువు రెండుపరార్థంబు లందురు. అంకంబులయందు దక్షిణపుగడనుండి వామభాగంబునకు లెక్కింప నొకదానికంటె నొకటి దశగుణాధికం బగు. అది యేకంబు దశంబు శతంబు సహస్రంబు నయుతంబు నియుతంబు ప్రయుతంబు కోటి యర్బుదంబు నబ్జంబు ఖర్వంబు నిఖర్వంబు పద్మంబు శంఖంబు నబ్ధి మధ్యమంబు నంతంబు పరార్థంబు నని చెప్పఁబడు.

కాలమానంబు చాంద్రంబు సౌరంబు సావనంబు నని ముత్తెఱంగుల నుండు. సేవకులకు జీవితంబు లిచ్చునెడ సౌరమానంబును ధనధాన్యాది వృద్ధులయందుఁ జాంద్రమానంబును 'రోజుకూలి' యందు నవధియందును సావనమానంబును గ్రాహ్యంబు లగు.

భృతివిభాగము మొదలగునవి

కార్యమానయుఁ గాలమానయుఁ గార్యకాలమితియు నని భృతి ముప్విధంబుల నుండు నని తజ్ఞులు చెప్పుదురు. ఎట్టి

భృతియైనఁ జెప్పిన ప్రకారము రాజు తప్పక యిచ్చునది. ఈభారం బిచటనుండి యచటికిఁ జేర్చునది, యీకార్యంబు నీ కింత సొమ్ము నీకిచ్చెదనని నియమించి కార్యసమాప్తి యయిన తరువాత నిచ్చునది కార్యమానభృతి యని విజ్ఞులు వక్కాణింతురు. భృత్యులఁ గార్యంబుల నియోగించి వత్సరాంతంబుననే మాసాంతంబుననే దినాంతంబుననే నింత వేతనం బిచ్చెదనని చెప్పి యట్లిచ్చునది కాలమానభృతి యనియు నిక్కార్యం బింత కాలంబునఁ జేయునది యనియు దీని కింత ద్రవ్యంబు నీ కిచ్చెదననియు నేర్పఱచి సాంగం బయినపిదప నిచ్చునది కార్యకాలమితంబయిన జీతం బనియుఁ జెప్పుదురు.

రాజు వేతనంబు[illegible] లోఁ దవిలంబంబు లొకప్పుడేనియుఁ గావింపక నియతకాలంబున నిచ్చుచుండునది. పనిచేయు నొక్కనిపోషణంబునకుఁ దగిన భృతి యధమం బనియు నతఁడవశ్యము పోషింపఁదగినవారికి నతనికిని వస్త్రాదులకుఁ బోషణంబునకుఁ జాలిన భృతి మధ్యమం బనియు నతని నతనిపోష్యులను సేవకులను నేకొఱంత లేకుండ రక్షింపఁదగిన భృతి యుత్తమం బనియుఁ జెప్పంబడు. రాజు భృతకుని కార్యకౌశలంబు సద్గుణసంపత్తియుఁ బరీక్షించి యతని జీవితంబు నాత్మహితార్థంబు జతనంబున నెచ్చించుచుండవలయు. కొలువుకాని యనుజీవివర్గం బెల్ల నతని వలనన సుఖంబుగ జీవింపవలయుఁ గాన సద్భృత్యునకు భృతి రాజల్లేర్పఱుచునది. తక్కువ జీతముగల సేవకులు రాజునకు స్వయంకృతశత్రులు గావ వారు ఛిద్రంబులయందుఁ బరకార్యసాధకు లయి కోశాదుల హరియింత్రు; ప్రజల బాధింతురును. మాంసభోజను లయిన నీచ

సేవకులకు నన్నవస్త్రంబులకుఁ దగినసొమ్ముకంటె నధికరం బొసఁగినఁ బాపం బగుంగావున వారిజీవితంబు తావన్మాత్రంబ యగునట్లు జేయు నిర్ణయింపఁదగు. బ్రాహ్మణుఁ డపహరించిన ధనంబును లోకాంతరోపకారియు, శూద్రున కిచ్చినధనం బేనియు నరకకారియు నగు నని యెఱుంగునది.

సేవకభేద భృతిభేదములును సేవకులు పనిచేయవలసిన కాలము

కొలువరు లెల్లను మందమధ్యశీఘ్రభేదంబునఁ ద్రివిధులు. వారిభృతియు నధమంబు, మధ్యమంబు, శ్రేష్ఠంబు నయి యుండవలయు. జేయు భృత్యుల నెల్లరఁ బగటికాలంబున నొక్కజాము స్వగృహకృత్యంబు నిర్వర్తింపను రేయి మూఁడుజాములు నిద్రింపను విడిచి తక్కిన కాలంబున వారిచేఁ బని గొనవలయు. దినభృత్యునిఁ బగట నాల్గుగడియలు వదలి పని గొనునది. మఱియు నుత్సవదివసంబులయందును బితృదినంబుల యందును వారికి సెలవొసంగు చుండవలయు. అయిదేండ్లు తప్పక కొలువుచేసిన సేవకుఁడు రోగార్తుఁడయ్యెనా నాల్గింట మూఁడుభాగంబులు జీతమిచ్చుచు మూఁడుమాసంబుల దనుక ననుజ్ఞ యీఁదగు. మఱియు నతఁడు దీర్ఘవ్యాధియుతుండయిన నాఱుమాసంబు లట్ల సెలవీయవచ్చు. సంవత్సరంబు దాఁక నయినఁ బ్రతినిధిని గ్రహింపక సెలవీఁదగదు.

రాజు సేవకుల కీవలయు సెలవులు

మఱియు వర్షపంచకంబుకంటెఁ దక్కువకాలంబు నెక్కువకాలంబు సేవసేసినవారికి సేవాతారతమ్యంబున ననుజ్ఞ యీవలయు. ఆఱుమాసములకంటె నెక్కువకాలంబు సేవ

కునకు భృతియిచ్చుచు నెల నీ నసర్వాంబు. రోగపీడితున కొక్కవార మైన యెడలఁ బూర్ణముగ వేతనం బిచ్చుచు నెలవిచ్చునది. మిగుల సద్గుణసంపన్నుం డయిన భృత్యుఁడు రుగ్ణుఁడయిన నతనికి భృతియం దర్ధంబు నీవలయు. భృత్యునకు వత్సరంబున కొకసారి యొక్కపక్షంబు జీవితం బొసఁగుచు ననుజ్ఞయీవచ్చు. నలువది యేండ్లుకొలువుచేసినవానికి నృపుఁడు సేవ సేయకుండ యావజ్జీవంబు నతని బ్రదిమికి వేతనంబునఁ దర్ధంబు నీవలయు. అతనికిఁ గార్యాక్షముండు బాలుఁడు నగు పుత్త్రుఁ డున్నను సుశీల యగు భార్య యయిన నట్టి కన్యయైన నున్న నతని భృతియందు జతుర్థాంశంబు వారిజీవనార్థం బిచ్చుచుండవలయు. రాజుకొలువుకాండ్ర కెల్లఁ బ్రతివత్సరంబు వారి భృతి ననిమిదవ యంశంబు పారితోషికంబుగ నిచ్చుచు, నత్కృష్ట కార్యంబు సేసిన నరగఁ బారితోషికం బిచ్చుచు స్వామికార్యంబున హతప్రాణుం డైన వానిపుత్త్రునకు బాల్యంబు వదలు నంతపఱకు వానితండ్రి భృతి యిచ్చి రక్షించుచుం బిమ్మట వాని గుణంబులఁ బరిశీలించి తండ్రి వేతనంబున నాల్గవయంశం బేని యాఱవ యంశం బేని యీఁదగిన సేవను నియోగించి రక్షించుచు రెండు మూఁడేండ్లయిన వెనుకఁ దగినయెడఁ దండ్రి జీతంబంతయు నేని సగం బే నీఁదగు.

రాజు భటులకు విరోధము ననురాగముం గల్గించు విధము

రాజు వాక్పారుష్యంబునను, నల్పభృతిని, బ్రబల దండంబున నవమానంబునను సేవకులకు శత్రుత్వంబు నేర్పు. భృతిచే సంతుష్టులును మానంబున నభివర్ధితులును మృదువాక్యంబుల సాంత్వితులు నగుభృత్యులు రాజును విడువ

కోపరు. అధములు ధనంబును మధ్యములు ధన మానంబులును నుత్తములు మానంబుం గోరుదురు; వారికి మానంబ ధనంబు గాదె. రాజు గుణసంపన్ను లయిన సేవకులలోను బ్రజలలోనుఁ గొందఱ వారి కభీష్టంబు లయిన ధనాది దానంబులను మృదుమధుర వచనంబులను, మఱికొందఱ హాస్యవచనంబులను గొందఱ నపాంగవీక్షణంబునను, గొందఱ భోజనంబుల నింకఁ గొందఱఁ దాంబూల వసనాదులఁ గొందఱ వాహనాది దానంబులను గొందఱ నాభరణాది దానంబులను, గొందఱ నుపకార కీర్తనంబునను, గొందఱ నపరాధ సహనంబునను, గొందఱ ఛత్త్రాతపత్త్ర చామర దీపికాది దానంబునను, గొందఱ భక్తిని, గొందర జ్ఞానంబునను, గొందఱ సన్మానంబునను, గొందఱఁ బ్రేమంబునను, గొందఱ నర్ధాసన దానంబునను, గొందఱ సమీపోప వేశనంబునను, గుణ తారతమ్యంబున రంజించుచుండవలయును.

రాజు సేవకుల కిట్టివస్తువు నీవలయు

రాజు స్వకార్యంబుల నియుక్తులయిన [illegible]ల్ల జనులు దూరంబునన చూచి వీ రిట్టి యధికారులని యెఱుఁగ సువర్ణంబున నేని, రత్నంబుల నేని, రజతంబున నేని, రీతినేఁ దామ్రంబున నేని, లోహంబున నేని, యధికారతారతమ్యంబున రచియింపఁబడిన గుఱుతు లగు వస్తువులను, వస్త్రంబులను, శిరస్త్రాణంబులను, స్వలాంఛనలాంఛితంబులఁ గావించి బహుమానపూర్వకంబుగ నీయఁదగు. మఱియు సేవకుల కెల్ల వాహనంబుల వాద్యంబుల వస్త్రంబులఁ బరస్పరవిలక్షణంబు

లయినవాని వేర్వేఱ నొసఁగవలయు. కాని విశిష్టంబయిన స్వచిహ్నంబు (బిరుదంబు) నెరికి నీఁదగదు.

పురోహితాదులయు గ్రామాధికారులయు జాతినిరూపణము

మున్ను సెప్పిన పురోధ మొదలగు ప్రకృతులు పదుండ్రును బ్రాహ్మణుల కావలయు. వారు తగినవారు లభింపకున్న క్షత్రియులు వైశ్యులు నానియోగంబునకుం దగుదురు గాని గుణవంతు లయ్యు నితరు లక్కార్యంబు సేయఁదగరు. గ్రామంబుల భాగహారియు సాహసాధిపతియు క్షత్త్రియుండ కావలయు. గ్రామణిత్వంబునకు విప్రుండ తగు. కాయస్థుండ లేఖకుండు గావలయు. సుంకంబు గొనువాఁడు వైశ్యుండును బ్రతిహారుఁడు శూద్రుండు నుండవలయు. సేనాధిపతి బాహుజుండ కావలయుఁగాని సంభవింపనినాఁడు బ్రాహ్మణుండును గాఁదగు. ఈ యధికారంబునకు వైశ్యాదులు భీరువులు నెప్పుడుం దగరు. మఱియు నీకొలువునకు నేకొలంబువా రయినను శూరుల తగుదురు. రాజు లేకొలపువా రగుదు రాజాతివారు సుఖియింతురు.

ఉపకారంబు స్మరియింపక సుసేవనంబునఁ దుష్టినొందక కథాంతరంబులఁ దలంపక, కోపించి నెఱఁకుల నాటనాడుచు సర్వదా శంకించు రాజును భృత్యుండు విడువవలయు.

ఇది శుక్రనీతిసారంబున నాంధ్రీకృతంబున యువరాజాది లక్షణకథనం బనునది ద్వితీయాధ్యాయము.

శ్రీరస్తు

శుక్రనీతిసారము

తృతీయాధ్యాయము

మనుజుఁడు లోకుల సంతసిల్లఁజేయు విధము

పూర్వాధ్యాయంబున రాజుయొక్కయుఁ దత్సేవకులయొక్కయుఁ బ్రవర్తనం బుపదేశించి యీ యధ్యాయంబున ర్వసాధారణమైన నీతిఁ జెప్పుచున్నాఁడు.

ఎల్ల జంతువులకుఁ బ్రవృత్తులు సుఖార్థంబ కావునను, సుఖంబు ధర్మంబు వదలిన నొదవమిని నరుండు ధర్మపరుండు గావలయు. వేదప్రతిపాద్యంబై ప్రయోజనవంతంబగు నర్థంబు ధర్మంబు నాఁబడు. ఏవాఁడునుఁ ద్రివర్గశూన్యంబైన కార్యం బాచరింపఁజనదు. త్రివర్గంబునందును బరస్పర బాధనంబు చేయందగదు. మనుజుండు మలాయనుండు గావునఁ బ్రాతస్స్నానశీలుండును సుసురభిగంధుండు సువేషుండు ననుల్బణోజ్జ్వలవేషుండును నీచరోమన ఖశ్మశ్రువునై యెల్లధర్మంబుల ననుమోదించి యాచరించుచు నాత్మరక్షణార్థంబు సతతంబు సిద్ధమణిమంత్రౌషధంబుల ధరియించుచు సంచరించునపుడెల్ల నాతపత్రంబు పదత్రాణంబులు ధరియించి యుగమాత్ర దర్శనుండై చరించుచుండవలయును. రేల సంచారంబు దగదుగాని

యాత్యాయికొంతైన కార్యంబు తటస్థించిన దండంబును శిరస్త్రాణంబును గూడ ధరియించి చరించునది. వేగితుండై యన్యకార్యంబునకుఁ బోవవలదు. బలంబువలన వేగంబుల నిర్బంధింపనురాదు. ఇతరజనంబులకుఁ బరాఙ్ముఖుండై తనకు మేలు సేయు మిత్రుల సేవింపవలయు. హింసయు, స్తేయంబు, పైశున్యంబు, అన్యథాకామంబు, పారుష్యంబు, ననృతంబు, సంభిన్నాలాపంబు, నవినయంబు, దుస్సంకల్పంబు, మిథ్యాదృష్టియు ననుపదియుం బాపకర్మంబులు గాన వాని నరుండు మనోవాక్కాయంబులఁ ద్యజించునది. శక్తికొలఁదిఁ బుణ్యకార్యంబులకు యత్నించువాఁడుఁ బాపకార్యంబులకు యత్నించువాఁడు నొకప్పుడు సాధన సామగ్రి చాలమి సిద్ధింపకయున్నను దత్ఫలంబుఁ దప్పక పొందుదు రని ధర్మవిదులు వక్కాణింతురు గాన మనుజుండు సత్సంకల్పుఁడు గావలయు. దీనులకు రోగులకు శోకార్తులకును బలానుసారంబుగ నుపకరించుచుఁ గీటపిపీలికంబు నైతము తన్నుంబోలెఁ జూచుచు నపకారపరులైన పరులకేని యుపకారంబు గావింపఁ గోరుచు మానవుండు సంపదయందు నాపదయందు నేకమనస్కుండై ఫలంబునం గాక హేతువునందు [illegible] జెందుచు నుచితకాలంబున హితంబు మితంబు నవిరుద్ధంబు పేశలంబు నగుపల్కు పలుకుచుఁ బూర్వభాషియై సుముఖుండు సుశీలుండు సకరుణుండునై వర్తింపవలయు. సుఖియై యొక్కఁడు నొక్కచో నుంటయు నెల్లరయందు విశ్వాసంబును నన్నిచోట్ల ననర్థశంకయుఁ దన పగఱఁ బ్రకటించుటయు దానిట్టివారికి దాయ ననుటయుఁ

ప్రభువునకుఁ దనయందలి నిస్స్నేహత్వంబుఁ దన యవమాన ప్రకాశనంబును మనుజునకుఁ దగవు. జనుండు పరారాధన పండితుండై యెవ్వఁ డెట్టివితంబున సంతసించు నవ్విధంబు గ్రహియించి యనువర్తింపవలయు. ఇంద్రియంబుల మిగులఁ బీడింపను లాలింపను దగదు. బలవంతంబుగ నవి మనంబును హరియించు. ఏణగజపతంగభృంగమీనంబులు శబ్దస్పర్శరూపగంధరసంబులచే మోహితంబులై హతంబు లగుట చూచుచుంటిమి. శబ్దాదులయందు పరవర్జినీ స్పర్శనంబు మునులకేని స్వాంతహారి గాన నప్రమత్తుండై సముమోహితంబుగ విషయంబుల సేవించునది. తల్లితోడనేని చెల్లెలితోడనేని కూఁతుతోడనేని యేకాంతంబునఁ దడవు వసించుట పురుషునకుం దగదు. కార్యానుసారంబుగ వారిం బిలిచి తగినట్లాదరపూర్వకంబుగ సంభాషించుచు బంధుస్త్రీలనేని యన్యకాంతలనేని సోదరీపర్యాయంబులఁ బిలుచుచుండునది. మఱియు స్త్రీల నెల్లపుడు గృహకృత్యంబుల నియమించుచుఁ బరపురుషులతో సహవాసంబు సేయను, బ్రకాశంబుగ నైన భాషింపను నన్యగృహంబునకుఁ బోవను వారికి స్వాతంత్ర్యంబు క్షణంబైన నొక్కాలంబునను దండ్రియేని మగఁడేని కొమరుఁడేని మామయేని చుట్టములేని తేఁడేని యీఁదగదు. దండశీలుఁడు చండుఁడు షండుఁడు నకాముఁడు చిరప్రవాసి సుదరిద్రుఁడు పరస్త్రీరతుఁడు రోగియు నగుపతినిఁ జూచి స్త్రీలు విరక్తలగుదురు; వేఱొకనే నాశ్రయింతురు. కావున నిట్టి దుర్గుణంబుల విడిచి పురుషులు సుయత్నంబున స్త్రీల రక్షింపవలయును. మఱియు వస్త్రాన్నభూషణమృదువాక్యంబుల వారి

సన్మానించుచు నెప్పుడు నింతులం బుత్త్రుల సన్నిధిని రక్షించు చుండవలయు. మనుజుండు చైత్యపూజ్యధ్వజప్రశస్తచ్ఛాయలను భస్మంబు నుముకయు నశుచిపదార్థంబులను శర్కరాలోష్టంబులను బలిస్నానభూములు నెకప్పుడేనియు నాక్రమింపం జనదు. నది నెన్నఁడు బాహులతోఁ దరింపఁ దగదు. స్కన్నం బగునగ్నికే నభిముఖంబుగఁ బోవలదు. శీర్ణతరిని శిథిలవృక్షంబును దుష్టయానంబును నారోహింపఁజనదు. నిష్కారణంబుగ నుంగుటంబున భూలేఖనంబును నిరుగేలం దలగోఁకుటయు నంగంబుల విగుణంబుగఁ గదల్చుటయుఁ జెట్ట యగు. శ్రమంబు గలుగుటకు ముందే మనోవాక్కాయచేష్టల మడుగునది. ఊర్ధ్వజానుఁడై చిరం బాసీనుండుగాఁజనదు. రాత్రుల వృక్షసేవయు ముంగిటం బరుండుటయు, రచ్చకుం జదుకంబునకుం బోవుటయు, గంజాప్రవేశంబును హానికరంబులు. శూన్యాటవీ శూన్యగృహ శ్మశానంబులం బవలును సేవింపఁజనదు. ఎల్లప్పుడు సూర్యు దర్శించుటయు శిరంబున భారంబు మోచుటయు సూక్ష్మవస్తువులను దీప్తవస్తువులను నమేధ్యాప్రియవస్తువులను జూచుటయు సంజల నభ్యవహారస్త్రీస్వాప్నాధ్యయనచింతనంబులును దగవు. మద్య విక్రయ సంధానంబు లెకప్పుడేనియుం దగవు. బుద్ధిమంతులకు లౌకిక కార్యంబులయందు లోకంబ గురువు గాన నెల్లకార్యంబులయందును బరీక్షకుండు లోకంబు ననుకరించునది. రాజులయాచారంబును దేశంబు నాచారంబును కులాచారంబును బంధుల యాచారంబును వేదవిహితాచారంబును దూషింపఁ గీడగు. మనుజుండు శక్తుఁడయ్యు లోకాచారంబు నుల్లం

ఘింపఁ జనదు. ప్రమాదంబున నయుక్తం బగుకార్యంబు సేసియు నట్టిపల్కు పల్కియు యుక్తులచే దాని సమర్థింప జతనంబు సేయఁదగదు. ప్రత్యక్షంబున దుర్గుణంబుల వక్కాణించువారు విరళులు గాన ధీమంతుఁడు లోకంబునను శాస్త్రంబువలనను నిషిద్ధంబుల నెఱిఁగి త్యజింపవలయువానిఁ ద్యజించునది.

న్యాయకార్యంబుం బోలిన యన్యాయకార్యంబు మనంబుననేనిఁ జింతింపం దగవు కాదు. పెక్కు లపరాధంబుల నేఁ జేసితి స్వల్పాపరాధంబున నాకేమి యగు నని కొంచెపు టపరాధంబును సాహసించి చేయరాదు. బిందువుచేత నైనను ఘటంబు పూరితం బగుఁ గాదె. రేలుం బగళ్లును నేనేమిపని చేయుచుండఁ గడచుచున్నవి యని చింతించుచుఁ వ్యర్థంబుగ గాలక్షేపంబు సేయనివాఁడు దుఃఖభాజనంబు గాఁడు. సమాసాదిభేదంబునను బుద్ధివిశేషంబునను నర్థవిశేషంబుఁ గల్పింపక యర్థవాదంబులు త్యజించి గ్రంథంబుల సారంబు గ్రహించుచు ధర్మతత్త్వంబు గహనంబు గావున నరుండు విచక్షణుండై సత్సేవితంబును శ్రుత్యాదిప్రసిద్ధంబు నగు కర్మంబుఁ గావించునది. రాజవిరుద్ధం బగుమిత్త్రు నేని గురు నేని సుతు నేని దాఁపఁదగదు. మఱియు నధర్మనిరతుని స్తేనుని నాతతాయిని రక్షింపఁజనదు. అగ్నిదుండు, గరదుండు, శస్త్రోన్మత్తుండు, పారదారికుఁడు, క్షేత్రాపహర్తయు, ధనాపహర్తయు నను నార్వురు నాతతాయులు. బాలుని, రోగంబును, స్త్రీని, దాసుని, పశువును, ధనంబును, విద్యాభ్యాసంబును, సత్సేవనంబును క్షణంబయిన

నేమఱం జనదు. ఏదేశంబున రాజును ధనికుఁడు శ్రోత్రియుండు భిషగ్వరుండును దనకు విరుద్ధు లగుదురు మఱియు నెద్దేశంబునకు బాలమూర్ఖసాహసు లధికారు లగుదు రెచటి యాచారంబు దన కసమ్మతం బగు నెచటిరాజవివేకియు సభ్యులు పాక్షికులు విద్వాంసులు త్యక్తసన్మార్గులు సాక్షు లనృతవాదులు నగుదు రెచట స్త్రీలకు దురాత్ములకు నీచులకుఁ బ్రాధాన్యంబు గలుగు నచట ధనమానజీవితంబులను నాశంబును బ్రాజ్ఞుండు కోరం దగదు. తల్లి బాల్యంబున రక్షింపకున్నను దండ్రి బాగుగ శిక్షింపకున్నను రాజు విత్తంబు హరియించినను సుసేవితులైన మిత్రస్వజనబాంధవులు కోపించినను దర్పంబున నాప్తవాక్యంబు నాదరింపమి విపరీతఫలంబు ప్రాప్తించినను దుఃఖంబు వొందిన నిష్ప్రయోజనంబు. మనుజుండు సావధానుండై రాజును దేవతలను గురువులను దపస్వులను ధర్మవృద్ధుల జ్ఞానవృద్ధుల నగ్నిని నిత్యంబు సేవించునది. మాతాపితలతోడను గురులతోడను స్వామితోడను భ్రాతలతోడను బుత్త్రులతోడను జెలికాండ్రతోడను మనంబున నైన విరోధింపం దగదు. మఱియు వారి కపకరించుట యెన్నండును దగదు. స్వజనంబుతోడను బలీయునితోడను స్త్రీ బాలమూర్ఖులతోడను వివాదింపఁదగదు. స్వాదుభోజనంబును, నర్థచింతనంబును, మార్గగమనంబును, పెక్కండ్రు నిద్రింప మేల్కొని యున్కియు నొక్కనికిఁ దగవు. ఒకప్పుడేని యన్యధర్మంబు సేవించుటయుఁ దెగడుటయుఁ హీనకర్మగుణ లగు స్త్రీలతో నేకాసనంబున నుండుటయుఁ గీడులు. శ్రేయస్కాముం డగువాఁడు నిద్రాతంద్రలును గ్రోధ

భయంబులు నాలస్యదీర్ఘసూత్రతలు నను నాఱుగుణంబులు కార్యవిఘాతుకంబు లగుట విడువవలయుఁ. మనుజుఁ డుపాయజ్ఞుఁడును దత్త్వజ్ఞుఁడు యోగజ్ఞుఁడు స్వధర్మనిరతుఁడుఁ బరస్త్రీపరాఙ్ముఖుండు వక్తయు నూహాపోహావిచక్షణుఁడును నప్రతిహతవచనుండును జిత్రకథాజ్ఞుఁడు నై చిరకాలంబు విని శీఘ్రంబు గ్రహియించి యెల్లకార్యంబులఁ బ్రవర్తించునది గాని యిచ్ఛానుకూలంబుగ నొకప్పుడేనియుఁ గార్యంబు సేయంజనదు. క్రయవిక్రయంబులం దతిలిప్సయు స్వదైన్యంబు నెన్నఁడు ప్రకటింపఁదగదు. కార్యంబు లేనపుడు దన నుజ్ఞాతుఁడై యన్యగృహంబులకుం బోవలదు. అననుయుక్తుండై యెవ్వనికిని గృహకృత్యం బుపదేశింపఁ దగదు. బహ్వార్థంబు నల్పాక్షరంబు కార[illegible]గు పల్కు పల్కునది. లోకానుభవంబునకు విరుద్ధంబుగ నాత్మశ్లాఘనంబు సేయం జనదు. పరాభిప్రాయంబు [illegible] నెఱిఁగి యనుకూలుఁ డయి యుత్తరం బుపక్రమింపనగు[illegible]నది. [illegible]పతుల [illegible]యందును బితృపుత్త్రుల కలహంబులందును [illegible] కార్యంబు.

మనుజుండు సుగుప్తుండుఁ గృతమం[illegible] శరణాగతు విడువక శక్తికొలఁది [illegible] సేయ[illegible] నెవ్వని నెఱుకులు నోనాడక యాప[illegible] మోహంబున[illegible]క యమంగలంబులు క్రీడాకరంబులు ని[illegible] వాక్యంబుల నుడుగుచు, లోకవిద్విష్టంబు ధర్మ్యంబైనను వదలుచు నెట్టివాని వాక్యంబేని తన హేతువులచే ఖండింపక యెవ్వఁ డేమి యడిగిన సాహసింపక విచారించి యుత్తరం బిచ్చుచు శత్రువులవేనియు సుగుణంబుల గ్రహించుచు గురువులవేనియు

దుర్గుణంబుల విడుచుచు నుత్కర్షాపకర్షంబులును గలిమి లేముపలును బ్రాక్కర్మవశంబునఁ బ్రాప్తంబు లగుఁ గావున నితరుల నిందింపక, సర్వభూతంబులతోడ మైత్రి నెడపకుండునది.

మనుజుఁడు దూరదృష్టి కలవాఁడు గావలయు

ఎల్లపుడు దీర్ఘదర్శియై యొకప్పుడు ప్రత్యుత్పన్నమతియు సాహసియు నగుచు దీర్ఘసూత్రుం డెన్నండునుం గాక చరియించిన సుఖయించు. మహాఫలంబైన కార్యంబు సేయ యత్నించువాఁడు దీర్ఘదర్శియైనఁ జిరకాలంబు సుఖయించు. ప్రత్యుత్పన్నమతి కాలానుసారంబుగఁ గార్యంబు నిర్వర్తించుఁ గాని చాంచల్యంబునను గార్యగౌరవంబునను సిద్ధి సంశయగ్రస్త యగు. కాలంబున యత్నింపక దీర్ఘసూత్రుం డయ్యెనా నశియించు. క్రియాఫలంబు నెఱుఁగక మహాకాలంబున నల్పకర్మంబు గావించుసాహసి పశ్చాత్తాపంబు నొందుఁ గావున నెల్లవాఁడు దీర్ఘదర్శి గావలయు. ఒకప్పుడు సువిచారితంబైన కార్యంబున నల్పఫలంబును నవిచారితంబైన కార్యంబున మహాఫలంబు నైనను సాహసించి చేసినకార్యం బనర్థకారియె యగు. సత్కార్యంబున ననిష్టఫలంబును నసత్కార్యంబున నిష్టఫలంబు నొకప్పుడైనను నవియు నసత్కార్యంబునకుఁ బ్రేరకంబులు గావు.

మిత్రప్రశంస

భృత్యుఁడు, పత్నియు, భ్రాతయుఁ, బుత్రుండు నెక్కార్యంబునకు సమ్మతింప రద్దాని నవిశంకితుండై మిత్రుండు సేయు. ఎవఁడైనను మందప్రజ్ఞుడై సత్యం బెఱుఁగక పరుని

మిత్రుఁడని నమ్మి స్వకార్యంబున నియోగించువాని కార్యంబు నశియించు. మానసికంబైన మైత్రి దుర్లభంబు గావున నది సిద్ధింప మహాప్రయత్నంబు సేయునది. ఎల్లవారికి ధనస్త్రీరాజ్యలోభంబు బలవంతంబు గావున నమ్మఁదగిన పుత్రునేని భార్యనేని సోదరునేని యమాత్యాద్యధికారులనేని యత్యంతంబు విశ్వసింపఁదగదు

ప్రామాణికుని ననుభవంబున నెఱిఁగిన యాప్తునిఁ దన్నుంబోలె నమ్మి గూఢంబుగ వాని కార్యంబులఁ బరిశీలించుచు నట్టివారి వాక్యంబున ననర్థంబు చింతింపక స్వధర్మపరులతోడను నీతిబలసంపన్నులతోడను మైత్రి సేయుచుండవలయు.

విద్యాదులవలని గర్వము

పూజ్యుల దానమానసత్కారంబుల నెప్పుడుం బూజించుచు దండాధిక్యంబునను బరుషవచనంబునను నాలుబిడ్డలుం బీడనొందుదురు గావునను బశువులును దానమృదుభాషణంబుల వశంబు లగుం గావునను బరుషవచనాదుల నుడుగుచు విద్యాశౌర్యధనాభిజనంబులచేతను బలంబుచేతను మత్తుండు నభిమానియుఁ గాక ప్రవర్తించునది. విద్యామత్తుఁ డాప్తోపదేశంబు యుక్తులచే నిరసించి విననొల్లక మహాజనుల మార్గం బుల్లంఘించి స్వాభిమతం బనర్థంబయ్యు మహార్థంబకాఁ దలఁచు. శౌర్యమత్తుండు వ్యూహాది యుద్ధకౌశలంబు త్యజియించి సాహసంబున యుద్ధంబు సేసి యసువుల విడుచు. శ్రీమత్తుం డజంబు స్వమూత్రగంధంబుంబోలెఁ దన దుష్కీర్తి నెఱుంగఁడు. అభిజనమత్తుం డెల్లవారి నవమానిం

చుచు నకార్యంబున బుద్ధి నిలుపు. బలమత్తుఁ డెల్లవారి బాధించు. మానమత్తుఁడు జగంబు తృణంబుగఁ దలఁచుచు నసహ్యుం డయ్యు నెల్లవారలకంటె నుత్తమాసనం బపేక్షించు. విద్యాదులు సజ్జనులకు దమహేతువులును గర్వితులకు మద హేతువులు నగు.

విద్యాదిఫలము

విద్యకు జ్ఞానవినయంబులును శ్రీకి యజ్ఞదానంబులును బలంబునకు సద్రక్షణంబును శౌర్యంబునకు శత్రుదమనం బును నభిజనంబునకు శమదమార్జవంబులును మానంబునకు నెల్లవారియెడ నాత్మసమభావంబును ఫలంబు లగు. సువిద్య యు మంత్రంబును భైషజ్యంబును స్త్రీరత్నంబును సాధకుండు మానంబు వర్జించి దుష్కులుని వలననైనను గ్రహింపందగు.

మనుజుఁడు చేయవలసినవి – విడువవలసినవి

ఏవాఁడును జేయిన దానికి వగవక ప్రాప్తంబునకు సంతసించుచు స్త్రీలను బాలురను మిగుల లాలింపక బాధిం పక స్త్రీలను గృహకృత్యములందును బుత్రుల విద్యాభ్యా సంబునను గ్రమంబున నియోగించునది. పరద్రవ్యం బదత్తం బల్పంబైనను గ్రహింప మహాఘంబగు. ఇతరుల పాపకార్యంబు నుచ్చరించుటయు స్త్రీల దూషించుటయు నకృత్యంబులు. సాక్ష్యంబున ననృతంబు వలుకుట నరకహేతువు. మహా కార్యంబు సాధించునపుడును బ్రాణాత్యయంబునను ననృతంబు వల్కుట దూషణీయంబు గాదు.

కన్యాదాతకు నిర్ధనుని, జోరునకు సధనుని, జిఘాంసు నకు గుప్తుని, నెఱిఁగియు వెలువరింపఁ దగదు. భార్యాభర్తల

కును సోదరులకును మిత్రులకును గురుశిష్యులకును స్వామిభృ త్యులకును వైరంబు పుట్టింపం జనదు. మాట్లాడువారి నడుమ నుండి యేగుట పాతకంబు. సుహృదునకు బంధునకు సోదరునకు యథాశక్తి యుపకరింపవలయు. గృహాగతుండు క్షుద్రుం డయ్యు శక్త్యనుసారంబుగఁ గుశలప్రశ్నంబునను బాద్యా దులను సత్కార్యుండగు. సపుత్రకుం డగువాఁడు పుత్రవతి యగుపుత్రికను జీవద్భర్తృకయగు సోదరినిఁ దనయింటఁ జిర కాలం బుండ నీఁదగదు. వారనద లైనఁ దప్పక రక్షించు నది. సర్పంబు క్రూరంబగుటను నగ్ని తీక్ష్ణంబగుటను రోగంబు వృద్ధిఁ జెందుటను నల్పంబు లయ్యు ననుపేక్ష్యంబులు.

నరుండు రాజును జామాతను శత్రులను భాగినేయుని బాలురయ్యు దణ్డభయంబునను బుత్రికాభయంబునను వృద్ధి భయంబునను బితృపిండలోపభయంబునను సాదరంబున నుపచరింపవలయు. ఋణశేషంబును రోగశేషంబును శత్రు శేషంబును మిగుల్పకుండునది. అర్థులచే నర్థితుండయినవాఁడు వారికార్యంబు సమర్థుండయునఁ జేయును జేయింపను దగుం గాని వాఁడిమైన యుత్తరంబు వల్కం దగదు. [illegible] శూరులయు దాతలయు ధార్మికులయుఁ జరితంబులు [illegible] బున వినవలయుఁ గాని వారి ఛిద్రంబుల నన్వేషింపఁదగదు.

మఱియు నియతకాలంబున హితమితాశనుండు విఘ సాశనుండు నదీనాత్ముండు సుస్వప్నుండు శుచియు నెల్లపుడు వ్యవసాయియు సుఖవ్యాయామాభ్యాసియు నగునది. నరుండు స్వస్థుండై యన్నంబు నిందింపక విజనంబున నాహారవిహా రంబులు నిర్హారంబు సల్పుచు షడ్రసంబు మధురోత్తరంబు

నగు నాహారంబు ప్రశస్తంబు గావున నట్టిద గ్రహించుచు స్వదారలతోడన విహారంబు గావించుచు వేశ్యాదుల దెస ననాదరుండై నియుద్ధకుశలులతో వ్యాయామంబు సల్పుచుఁ బ్రాక్పశ్చిమయామంబులు వదలి మధ్యమ యామంబుల నిద్రించుచు దీ నాంధ పంగు బధిరుల నొకప్పుడే నుపహసింపక దుష్కార్యంబు సేయఁ దలఁపక మానంబు విడిచి బుద్ధిబల ధైర్య పరాక్రమోద్యోగార్జవ సాహసంబుల నెద్దాననేని శీఘ్రంబుగ స్వకార్యంబు సాధించుకొనుచుండవలయు.

దేనఁ గార్యంబు సిద్ధించునట్టి కలహంబు వరంబ కాని నిరర్థకకలహంబు సుఖంబును నాయువు ధనంబు యశంబును హరియించు. బుద్ధిమంతుఁ డేవానికే ననిష్టంబు పల్కను లోపంజెప్పను వృత్తిలోపంబు సేయను దగదు. మఱియు నసత్కార్యంబున నియోగించు గురునేని నిరసించునది.

జేని యానతిని మహాత్ముల యాజ్ఞను నొకప్పుడే నుల్లంఘింపఁ జనదు. సత్కార్యబోధకుఁడు లఘీయసుఁ డయినను మన్నించునది. స్త్రీ అనర్థంబునకుఁ గుదురు గానఁ దరుణియైన స్త్రీకి గృహంబున స్వాతంత్ర్యం బిచ్చి దేశాంతరంబునకుఁ బోవఁజనదు. మద ద్రవ్యంబులయందును గుసంతతియందును బ్రమాదంబును మోహంబును జెందక జాగరూకుండు గావలయు.

గౌరవార్హులు.

మనుజుఁడు సాధ్వియగు భార్యను దల్లిని దల్లిసవతులను బాలను దండ్రిని గోడలిని గతభర్తృకయు ననపత్యయు నగు కూఁతును నట్టి స్వసను మాతులానిని బ్రజావతిని బితృ

మాతృష్వసలను ననపత్యం డయిన మాతామహుని నట్టి గురుశ్వశురమాతులులను బాలుం డగు తండ్రిలేని దౌహిత్రుని నట్టిభగినీసుతుని సోదరులను నవశ్యంబు శక్తికొలఁది రక్షించునది.

మఱియు వైభవ మున్నను లేకున్నను సుహృదునిఁ బితృకులమువారిని మాతృకులమువారిని భార్యకులమువారిని దాసీదాసభృత్యవర్గమును నెట్లయిన శ్రమంపడి తప్పక రక్షించుచు వికలాంగులను బరివ్రాజకులను దీనానాథులను యథాశక్తి పాలించునది. సర్వగుణసంపన్నుం డయ్యు నెవ్వఁడు మహాయత్నంబు కుటుంబభరణార్థము సేయకుండు నతఁడు జీవన్మృతుం డగు. ఏవాఁడు కుటుంబము పోషింపక శత్రుల సాధింపక ప్రాప్తము రక్షింపక యాత్మంభరి యగునట్టివాని జీవితంబునఁ బ్రయోజనం బొకండు లేదు. స్త్రీజితుండును ఋణియు సుదరిద్రుండును యాచకుండును గుణహీనుండును బగఱకు లోఁగినవాఁడును జీవించియు మృతుల యగుదురు.

దాఁపవలసినది

ఆయువును విత్తంబును గృహచ్ఛిద్రంబును దానమానాపమానంబులును మంత్రంబు నౌషధంబును నింతులపొత్తునను తొమ్మిదియు మనీషులచే గోప్యంబులు.

దేశసంచారాదులవలని ఫలము

దేశాటనమును రాజసభాప్రవేశమును శాస్త్రచింతనమును వేశ్యాదిదర్శనంబును విద్వన్మైత్రియు మనుజున కవశ్యకర్తవ్యములు. దేశాటనమున ననేకధర్మంబులను బదార్థము

లను జెక్కువిధములగు పశువులను బర్వతములను నరులను నెఱుంగవచ్చు. రాజసభాప్రవేశమున రాజపురుషప్రవర్తనమును న్యాయాన్యాయములును సత్యవాదులయు మిథ్యావాదులయు స్వరూపమును లోకశాస్త్రసమ్మతం బయిన వ్యవహారప్రవృత్తియు నరుచేఁ దెలియఁబడు. శాస్త్రముల తత్త్వచింతచే వరుఁ డహంకారమును ధర్మాంధ్యమును విడుచు. వ్యవహారము మిగుల గొప్పది. గావునను నేకశాస్త్రాధ్యయనమున సత్యవ్యవహారజ్ఞానము వొడమమిని ధీమంతుఁ డెక్కుడు జతనమునఁ బెక్కులగు నాగమముల నేర్చునది. రోవెలఁది ప్రజల సొమ్ము గ్రహియించియు వారికి స్వాతురాలు గాక వారి స్వవశమున నుంచునట్లు మనుజుఁడే వారికి నధీనుఁడు గాక జగంబెల్ల స్వవశంబున నుండునట్లు సేయు సామర్థ్యము వారవనితాసందర్శనమున నేర్చవలయు. పండితుల చెలికారంబున శ్రుతిస్మృతిపురాణార్థవిజ్ఞానముం బ్రశస్తబుద్ధియుఁ గలుగు.

అతిథిపూజాదులు

ఆత్మార్థంబు పాకము సేయువాఁడు నరకార్థంబు జీవించుఁ గాన నేఁడును దేవపిత్రతిథుల కీక యశనం బేనాఁడును గుడువంజనదు. నడుచునపుడు గురులకును బలవంతులకును రాజులకును వ్యాధిగ్రస్తులకును శవంబునకును శ్రేష్ఠునకును మానారూఢునకును మార్గం బిచ్చి యోరసిలి పోవునది. మఱియు శకటమున కైదు హస్తములును గుఱ్ఱమునకు నెద్దునకుఁ బదిహస్తముల దూరమును నేనుఁగులకు బహుదూరమును తొలఁగి చరించునది. దీ[illegible]ంబులగు కొమ్ములేని గోళ్లవి

కొఱ లెని గల మెకంబులను దుర్జనులను యువతులను నదీకూలంబును నమ్మి యెన్నఁడును సమీపింపఁదగదు.

జనసమ్మతుఁడగు విధము

మార్గంబునఁ బోవుచు నమలుటయు హసించుచు భాషించుటయు గతంబునకు వగచుటయు స్వకృతంబయిన సుకృతము వాక్రుచ్చుటయు శంకితుల సమీపంబునకుఁ బోవుటయు నీచుల సేవించుటయు మనుజులకుఁ దగని పను లగు. మనుజుఁడు పొంచుండియే వారి సల్లాపంబును వినఁదగదు. వేల్పుల యనుజ్ఞ నొందక సుధాపానంబు సేయ రాహువు శిరము దెగియెఁ గావున నుత్తములచే ననుజ్ఞాతుం డయి వారితో నేకకార్యము సేయ నిచ్చగింపఁ జనదు. అన్యులకుఁ మృత్యుకారణం బయిన విషపానంబు శివునకుఁ బోలె మహాత్ముల కసత్కారంబును భూషణంబ యగు. అగ్నియట్లు తేజస్వి సర్వపదార్థంబుల భుజించియు దోషి గాఁడు. గురువకు రాజునకుఁ దనకంటె గరీయసుఁ డగు సేవానికి నెదుటఁ గూర్చుండఁదగదు. రాజు తనకు మిత్రుం డని యిచ్ఛానుసారంబుగఁ బ్రవర్తిల్లిన హాని యగు. పండితుఁడు మొఱకులకు స్వామిత్వముకంటె మహాత్ములకు దాస్యంబేసి యిచ్ఛయించునది. జ్ఞానలవదుర్విదగ్ధుని రంజిపను వానితో విరోధింపను జతనము సేయఁ దగదు. బుద్ధిమంతుఁడు ప్రాప్తంబు లగు కార్యంబుల నాలోచించి యవశ్యంబు లగు వాని ముందు సరగఁజేసి యనావశ్యము లగు వాని వెనుక విలంబంబునఁ జేయుచు గురువు లాన యిచ్చినను జెషుకర్జమునకు గాతమపుత్రుండు పిత్రాజ్ఞప్తంబైన మాతృవధంబునకుఁ బోలె నాల

సించునది. మఱియుఁ బెరిమనేని స్తుతివినయంబులనేని సేవాకౌశలముల నేని కళలనేని కథల నేని జ్ఞానార్జవంబుల నేని శౌర్య ప్రత్యుత్థానాభిగమనంబుల నేని స్మితభాషణంబున నేని యుపకారమున నేని దానమున నేని జగమెల్ల వశపఱిచికొనునది. మీఁదటి వశ్యకరము లయిన యుపాయము లన్నియు దుర్జనులయెడ నిష్ఫలంబులగుం గాన వానితోడి నెయ్యము వర్జించి ప్రాజ్ఞుఁడు శక్తుఁడయ్యెనా వాని దండంబున నొండె ఫలభూతము లయిన యుపాయాంతరముల నొండె జయించునది. సాంగములయిన వేదములను స్మృతి పురాణేతిహాసములను నభ్యసించు టాత్మహితం బగు. మృగయాక్షస్త్రీపానంబులు వ్యసనములు గాన వీని ధీమంతుఁడు పరిత్యజించి యొకప్పుడు యుక్తిపూర్వకముగాఁ దదాసక్తుఁడు గాఁ దగు. ఏవానికిని వృత్తిలోపంబును గూటవ్యవహారంబును నహితమును మనమునను జింతింపను జేయను దగదు. కాలత్రయమునను సుఖదమును దృఢమును మృతుఁడైన స్వర్గమును జీవించిన నిర్మలంబగు కీర్తిని గావించు కార్యంబు ప్రాజ్ఞుండు సుప్రయత్నమునం గావించునది. ఆధి వ్యాధి బాధితుండును, జోరుండును బలియునితో వైరంబు గొన్నవాఁడును, విషయాసక్తుండును, ధనలోలుపుఁడును, కుసహాయుండును భిన్నామాత్యసుహృజ్జనుండు నగు రాజును నిద్రలేక కుందుదురు. కాన బాగుగ నాలోచించి మతిమంతుఁ డీలోపంబుల నివారించుకొని సుఖంబుగ నిద్రింపవలయు. రాజును శ్రేష్ఠజనులను వేషభాషణాదుల ననుకరింపఁ జెడుగగు. వ్యాఘ్రాది దుష్టసత్వంబులఁ జోరులను బాధింప నేకాకియై చనంబోలదు. గురువు

నయిన నాతతాయియయిన జిఘాంసువును హింసింప నిచ్ఛగించునది. కలహంబున నేవానికిని దోడు నూపందగదు. ఒజ్జల యెదుటను తేండ్ల యెదుటను మహాసనంబునఁ గూర్చుండను ప్రౌఢపాదుఁ డయి వారి వాక్యంబులఁ దన హేతువులతో ఖండింపను దగదు.

ఏవాఁడు చేయఁ దలఁచిన కార్యం బితరు లెఱుఁగరు మఱి యేవాఁడు చేసినకార్యంబు సువిదితంబగు నేవాఁడు తన సుకృతంబును గర్తవ్యంబును బరుల కెఱిఁగింపకుండు నతఁ డుత్తముఁ డగు.

స్త్రీల దుర్గుణములు

అనృతంబును జెగువయు మాయయు మోఱకుఁదనంబును నశౌచంబును నిర్దయయు లౌభ్యంబును దర్పంబు నను నెన్మిదియు నింతులకు సహజములయిన దుర్గుణంబులు గావునఁ బ్రియురాలిచేఁ జెప్పఁబడిన స్నుషామాత్రాదుల యపరాధంబు ననుభవంబునఁ బరిశీలింపక సత్యంబని యొప్పఁదగదు. పదియునాఱు వత్సరంబులకంటె మీఁదఁ బుత్రునిని బదియురెండు వత్సరములకంటె మీఁద స్నుషాదిస్త్రీజనంబును దాడనంబు నను దుర్వచనంబులను బీడింపఁజనదు.

రక్షింపవలసినవారు

దౌహిత్రులు, భాగినేయులు, భ్రాతలును బుత్రులకంటె నధికంబుగను స్నుషలు, భ్రాతృభార్యలు, స్వసలు దుహితలకంటె నధికంబుగను బాలనీయులు. గృహపతికుటుంబపోషణార్థంబు పదార్థంబుల నార్జింపను రక్షింపను మిగుల జతనంబు సేయు. తక్కినవారు తస్కరులం బోలుదురు. ఉవిద

లకు సాహసానృతమౌర్ఖ్యంబులుం గామంబు నధికంబులు గావున వారితో నేకాసనంబునఁ గామకాలంబునఁ దక్క శయనించు టనుచితంబు.

కన్యాదానము

కులంబును ధనంబును శీలరూపంబులను విద్యను వయోబలంబులను బరికించి యుత్తమునకుఁ గన్యనీయవలయు. విద్యావయోరూపసంపన్నుం డగువాఁడు నిర్ధనుండయినను భార్యార్థియయ్యెనా వానికిఁ గన్య నీఁదగు. కేవలధనవయోరూపసంపత్తిని గన్యాదానార్హుండు గాఁడు గావున ముందు కులంబును బిమ్మట విద్యయుఁ దర్వాత వయసును ననంతరము శీలంబును బదంపడి ధనరూపంబులును వెండియు దేశంబును బరిశీలించి యుత్తమునకుఁ గన్యాదానముచేసి మైత్రి నెఱపునది. కన్య రూపంబును దల్లి ధనంబును దండ్రి విద్యయు బాంధవులు కులంబును దక్కినవారు మృష్టాన్నంబును గోరుదురు. వరుఁడు భిన్నర్షిగోత్రజాతయు భ్రాతృమతియుఁ గులీనయు యోనిదోషవర్జితయు నగుకన్యను భార్యగా వరియించునది.

విద్యాధనముల సంపాదనము

ధనార్థియు విద్యార్థియుఁ గణంబును క్షణంబును బరిత్యజింపక కణంబుకొలఁదిని క్షణంబు కొలఁదిని ధనంబును విద్యను సంపాదింపఁ గడఁగునది. అనురక్తయగు భార్యను మిత్రులను రక్షింపను దానార్థంబును ధనార్జనంబు హితంబు. కళత్రాదులు లేనివానికి ధనంబుతోడను బ్రపంచంబుతోడను బ్రయోజనం బొకఁడు లేదు. శతవర్షంబులు జీవింతు ననియు ధనంబుల మోదింతు ననియు భావిసంరక్షణక్షమం బయిన

ధనం బార్జింపవలయు. దానంబున వర్ధిల్లునదియుఁ జోరులచే ననపహార్యంబును భారంబు లేనిదియు నగు విద్యాధనం బెల్ల ధనంబులకు మూలంబు గావున నెల్లవాఁడును నిరువదియైదేండ్లయినఁ దదర్ధంబయినఁ దదర్ధంబయిన విద్యాసంపాదనమునకు మొదలఁ గడఁగవలయు. దుర్గుణుం డయ్యు ధనవంతుఁ డెల్లవారికిఁ బూజ్యుండును సేవ్యుండును నిర్ధనుండు ప్రశస్తగుణుం డయ్యు దారపుత్రాదులచేతనుం ద్యాజ్యుండు నగుం గావునను సంసారంబున సుఖజీవనమునకు సుసాధనంబుగా ధనంబు పరిగణితము గావునను సూపాయము లగు సువిద్యాసుసేవాశౌర్యంబుల నేని కళల నేని కృషికుసీదప్రతిగ్రహంబుల నేని బేహారమున నేని యెద్దియే నొక్కవృత్తిని ధీమంతుఁడు ధనముసంపాదించునది. ధనికుని గృహద్వారమున గుణవంతులుం గింకరులు వలె నిల్తురు. వాని దోషములును గుణములట్ల వినుతిఁ జెందు. నిర్ధనుని గుణములును దోసములట్ల యగు; మఱియు నతఁ డెల్లవారిచే నిందింపంబడు. కొందఱు దారిద్ర్యంబున నాశముఁ బొందిరి. మఱికొందఱు దేశాంతరములకుఁ బర్వతములకు నరణ్యములకుఁ బలాయితులయిరి. ఇంకఁ గొందఱు వేదురు గొనిరి. మఱియుఁ బెక్కండ్రు శత్రులకు వశంపడి దాస్యమును జేయ నీకొనిరి. ధనవంతుండు ధనపరిమాణమును ధనస్థానమును బుత్ర మిత్ర కళత్ర బాంధవు లెఱుంగని యపుడు వ్యవహారులకు లిఖితముకంటె స్మారకము లేదు గావున లిఖితపూర్వకముగఁ బదిలము సేయునది. మఱియు బుధుండు లేఖ్యము లేకుండ వ్యవహారం బెన్నండును జేయందగదు. మిగుల నోరిమి గలిగి నిర్లోభుఁడయిన

రాజునొద్దను విశ్వస్తుం డయిన ధనికునొద్దను సంచితధనము పత్రము వ్రాయించికొని దాఁచికొనునది గాని మిత్రునకుఁ గావలసినపుడు కుసీదము లేకుండఁ దగినంతధనం బీఁదగు. ఏయధమర్ణునకు నిచ్చిన మూలధనంబునకు హాని లేకుండు నట్టి వ్యవహారక్షముం బరికించి లగ్నకుం బుచ్చికొని సాక్షిమంతముగఁ దగునట్లు వృద్ధి నిర్ణయించి లిఖితము వ్రాయించికొని ధనవంతుండు ఋణం బొసఁగిన సుఖప్రత్యాగమం బగు. వృద్ధిలోభమున సంచి మొదలు నశించునట్లు పర్యాదంచనం బీనర్హము గాదు. ధనం బిచ్చునపుడు మైత్రీకరమును మరల గ్రహించునపుడు శత్రుకరము నగుం గావున వ్యవహారమున భోనమునంతయుం బోతె నిర్లజ్జుండైన వ్యవహారి మిగుల సాగియు. ధీశాలి మనమున మహౌదార్యము గలిగియు వెలుపటఁ గార్పణ్యము సూచించుచుఁ దగిన కాలమున సముచితవ్యయంబు తప్పక చేయునది. మఱియు సుభార్యాపుత్రమిత్రాదులను సకలధనమును వెచ్చించియేని శక్తికొలఁది రక్షించుచు మనుజుఁడు జీవించిన భద్రశతముం జూచుఁ గావునను దాఁగల్గిన సకలపదార్థములు సుసాధములు గావునను ధనాదుల నన్నిట నాత్మరక్షణము గావించుకొను చుండునది.

విభాగవిషయము

సదారులుం బ్రౌఢవయస్కులు నగు సుతుల శ్రేయోర్థియగు తండ్రి విభజించునది. సదారులుం బ్రౌఢవయస్కులు నగుభ్రాత లేకోదరులయ్యు విభక్తధనుల కావలయు. అట్లు కాని నాఁడు తప్పక ముప్పుఁ జెందుదురు. స్త్రీయుగళమును నొక్కచో వసియింపఁ బొసఁగ దనఁ బెక్కండ్రు యువతులొక్కచో నివసింప నెట్లు పొసఁగు. వృద్ధికారణం బయిన ధనమును నాధమర్ణికం బయిన ధనమును దేయం బయిన యాత్తమర్ణికధనమును బుత్త్రులును భ్రాతలును విభజించికొనందగదు.

మిత్రునియెడఁ బ్రవర్తిల్లు విధము

నరుం డేవానితో నుత్తమం బయిన సౌహార్దము సేయ నపేక్షించు వానితో నర్థసంబంధమును వాని పరోక్షమునఁ దత్స్త్రీసంభాషణమునను నతని లోపము లన్వేషించుటయు నతని నెదిర్చి వాదించుటయు నతని కార్యమునకు సహాయము సేయమియు నతని యనిష్టోపేక్షణమును జేయవలవదు. వడ్డికలుగునట్లని లేనియట్లని పుచ్చికొన్న ధనము నుభయుల కుం గ్లేశము లేకుండ నీవలయు.

ఉత్తమాదిస్వరూపము

కేవలాత్మగుణములఁ బ్రసిద్ధుఁ డుత్తముఁడును బితృగుణములచేతన విదితుఁడు మధ్యముండును భ్రాతృగుణములన ప్రథితుఁ డధముఁడును మాతృగుణమాత్రమున విఖ్యాతుఁడు నీచుండును నగుదురు. కన్యకాభాగ్యమునను సోదరీధనమునను భార్య సొమ్మునను జీవించు నరుం డధమాధముం డగు.

దానప్రశంస

మహాధనుం డగు బుధుండు పోష్యవర్గమును లెస్సగఁ బోషించుచుఁ గొంచెమైన నేవానికైన దానము సేయకుండ నొక్క దివసమును గడపంగూడదు. నేను మిత్తినోట నున్నవాఁడ మీఁదటి క్షణమున జీవింతు నను ప్రమాణము లేద

నియు. దానధర్మములకంటెఁ బరలోకమున సహాయముసేయు నొండు లేదనియుఁ దలఁచి యెల్లవాఁడును ధానధర్మపరుండు గావలయు.

వివిధము లగు దానములు

దానశీలు నాశ్రయించి లోకము జీవించుం గాని శఠు నాశ్రయించి కాదు. దానమున విద్వేషు లున్మిత్రు లగుదు రన నితరములఁ జెప్ప నేల? దేవతోత్సవములకును యజ్ఞాదులకును బ్రాహ్మణ జీవనమునకును గోరక్షణమునకును నిచ్చినధనము పరలోకహితకరమును సంవిద్దత్తము నని కోవిదులు చెప్పుదురు. మఱియు వంది మాగధ మల్ల నటాదులకు దత్తంబయిన ధనము పారితోష్యంబనియుఁ గీర్త్యర్థంబయిన ద్రవ్యంబు శ్రీదత్తం బనియు సుహృత్సంబంధిబాంధవులకు వివాహాదికార్యముల నుపాయనీకృతం బాచారదత్తంబనియు రాజునకును బలవంతునకును గార్యఘాతుకునకును గార్యార్థము దత్తంబైన ద్రవ్యమును భాపభయమున దత్తమును భీదత్తంబనియు హింసించు వారల కిచ్చునదియు జూదమున నోటువడ్డదియుఁ జోరహృతమును నష్టంబనియు బరస్త్రీదత్తము పాపదత్తం బనియు వ్యవహరింత్రు.

మంచినడవడి – చెడునడవడి – వానిఫలము

తా నుపాసించు దేవుఁ డుత్కృష్టుఁ డని చెప్పుచుఁ దన్యూనత్వము కల్పింపక సుఖముగ నతని సేవించుచు బ్రీతి సేయుచుండ వలయు. దానార్జవములకంటె వశీకరణసాధనం బొకండు లోకమున లేదు. దానక్షీణుండగు శుక్లపక్షశశి వక్రుఁ డయ్యు వర్ధిష్ణువు నయున సుభగుఁడు నగుం

గాదె. జనుండు మిగుల నాలోచించి యేవానితో నయిన నెయ్యంబేని పగయేని గావించి దానికి దోసఁగు పొసఁగకుండ మిత్రున కుపకారమును శత్రున కపకారమును గావింప యత్నించు చుండవలయుఁ గాని వ్యత్యయము దగదు. మఱియు నతిక్రౌర్యము నతిశౌర్యము నతివాదము నతికార్యాసక్తియు నత్యాగ్రహమును నతిమార్దవమును నతిశౌర్యమును విడుచుచు ననర్థకారి యగుట నతిని సర్వకార్యములఁ ద్యజించునది. అతిక్రౌర్యమున జనము పీడ నొందు. కార్పణ్యాధిక్యమున నిందించు. మార్దవాతిశయమున నరకు సేయకుండు. అతివాదమున నవమానించు. అతిలోభమునఁ దిరస్కరించు. అతిదానమున దారిద్ర్యము ఘటిల్లు. అత్యాగ్రహమునను నత్యాచారమునను నరునకు మోహకుఁడనమును ననాచారమున ధర్మహానియునగు. బుద్ధిమంతుఁ డేనందఱకంటె నధికుండ నా శక్యుఁడు తెల్వియుం గల దనియు ధర్మతత్త్వం బిది యనియు నెన్నఁడు నిశ్చయింపక తిమింగిలమును దద్గిలమును గలుగున ట్లెల్ల కార్యముల నొక్కనికంటె నొకఁ డధికుండు గలఁడని తలఁచునది. నరుఁడు దేవతలయందును బ్రాహ్మణులయందును గోవులందును స్వామ్యంబనర్థకారిగావున దానినభిలషింపక యాత్రితయమున భజనపూజనసేవనతత్పరుండు గావలయు. ఎవనియం దెట్టి బ్రహ్మవర్చసము సుప్రతిష్ఠితంబై యుండునది యెవ్వఁడెఱుఁగు. తరుణీధనపుస్తకములు పరాధీనములు సేసిన నవి దుర్లభంబులగు. దైవానుగ్రహమున లబ్ధములయ్యేనేని భ్రష్టనష్టవిమర్దితములగు. మనీషి యల్పసాధనసాధ్యమును మిగులలాభకారియు నగుకార్యము మానను బహ్వర్థసాధ్యమును నల్పఫలదమును

నగు కార్యం బభిమానమునఁ జేయును. మహాసాధనసాధ్యం బయినను సత్కీర్తికరం బయిన కార్యము విడువనుం దగదు. శంక లెఱుంగమి ననుసక్తి వల్కిన నీసును నలుకయు నొందఁ జనదు. మేధావి నెయ్యునకు ప్రీతికరమును మర్మభేదకమును నగు పల్కు వినోదమున నేని వచియింపఁదగదు. ఎవ్వని యొద్ద సూక్తదురుక్తములు సదృశము లయి బధిరునొద్ద గాననైపుణ్యముంబోలె నిరర్థకం బగు నతనియొద్ద భాషింపకుండునది. ఆపన్నగ్నుం డగు సుహృను ననునయించి యాదరింపనివాఁడు నృశంసుఁడు. దాయలకుఁ గలహంబు ప్రాప్తంబయిన సర్వయత్నంబుల మాధ్యస్థ్యంబు నంగీకరింపనివాఁడు మిత్రుఁడనం దగఁడు. మానసమున నాటిన దురుక్తిశల్యం బుద్ధరింపఁ గరణం బొండు లేదు గావున నాజన్మసేవితుండును దానమానంబులఁ బోషితుం డయిన చెలికాఁడును బరుసపు మాటల నప్పుడ పగవాఁ డగు. తన బలం బధికం బగునంత దనుక నమిత్రుని గండంబున నయిన వహించి వాని బలంబు హీనం బగుడు ఱాత ఘటంబుం బోలె భేదించునది. అలంకారంబులును రాజ్యంబును బౌరుషంబును విద్యయు ధనంబును సౌజన్యంబుం బోలె మనుజు నలంకరింపం జాలవు. అశ్వమునకు జవంబును వృషంబునకుఁ భారవహన సామర్థ్యంబును మణికిఁ గాంతియు రాజునకు క్షమయు వేశ్యకు హావభావంబులును గాయనునకు మధురస్వరంబును జోదునకు యుద్ధోత్సాహంబును గోవునకు బహుదుగ్ధసంపత్తియుఁ దపస్వుల కింద్రియనిగ్రహంబును ధనికునకుఁ జాగంబును విద్వాంసునకు వావదూకతయు వివాదపదనిర్ణేతల

కపటపాతంబును భృత్యులకుఁ బ్రభుభక్తియు సాకిరులకు సత్యవచనమును మంత్రులకు హితోక్తియు మూఢులకు మౌనమును స్త్రీలకుఁ బాతివ్రత్యమును సుభాషణమును విపరీతము దుర్భాషణము నగు. శక్తుఁడు హింస్రు నుపేక్షింపక తత్క్షణంబ దండించునది. పైశున్యంబును గోపంబు మాత్సర్యంబును (పరశుభద్వేషము) గార్యఘాతిత్వంబు ననృతవాదంబు నాలస్యంబు (సోమరితనము) గుణవంతుల కున్నను గుణంబుల నాచ్ఛాదించి దోషంబుఁ బ్రకటించు. బాల్యంబున మాతృవియోగంబును జవ్వనంబున భార్యావియోగంబును వార్ధకంబునఁ బుత్రనాశ ధననాశంబులును మహాపాపఫలంబులు. శ్రీమంతుల కనపత్యతయు దుర్గతులకు మౌర్ఖ్యంబును భామినులకు నపుంసకుండు పతి యగుటయు మహాదుఃఖకరంబులు. యథాజాతుఁ డగు పుత్త్రుఁడును విధవ యగు కూఁతురును జండి యగు భార్యయుఁ బేదతనంబును నీచసేవయు ఋణంబు నను నీయాఱును మహావ్యథాకరంబులు.

ఖలస్వరూపము

అధ్యయనంబునను నధ్యాపనమునను దేవునందు నొజ్జయందు నితిహాసాగమదేశభాషాలిపిజ్ఞానాది కళలయందు సత్సేవయందు గానంబునను ఋజుప్రవర్తనంబునను రమణియందును దపంబునను సాహిత్యంబునను నేవాని మనంబు రమింపకుండు నట్టివాఁడు ఖలుండు నరరూపధరుండయిన పశువును గావలయు.

కానినాఁడు ముక్తుఁ డయినం గావలయు. ఇతరుల వృద్ధి నోర్వని వాఁడు పరుల తప్పులనె వెదకువాఁడు నొరుల

నిందింపం గడఁగువాఁడు నన్యులకుఁ జెఱుపు సేయ యత్నించువాఁడు మనంబున దురాలోచనంబు గల్గియుఁ బ్రసన్నాస్యుండగువాఁడు ఖలుండు నాఁబడు. ఆశ గలవానికిఁ బ్రపంచంబునఁ గల యర్థం బెల్ల నొక్కనికి చాలదు. సాధుఁడు కార్యంబు సేయుచు బోధించుచు ననుమోదించుచు నుండు. ధూర్తులన్యోపదేశంబున సాధువులువోలె నుందురు గాని స్వప్రయోజనంబునకై యకార్యశతంబేని చేయ నిచ్ఛయింత్రు.

మంచిపుత్త్రులు - చెడుపుత్త్రులు

తల్లిదండ్రుల యాజ్ఞ జవదాఁటక యనలసుండై నీడవలె వారి సేవించుచు ధనాగమార్థంబేని వేదార్థజ్ఞానార్థంబేని యత్నించుచు సర్వవిద్యాకుశలుం డగు పుత్త్రుండు ప్రీతిదాయకుండును విపరీతవర్తనుండు దుర్గుణుండు ధననాశకుండు నగువాఁడు దుఃఖదాయకుండు నగు.

భార్య మొదలగువారి ప్రాశస్త్యము

మగనియం దనురక్తయు గృహకృత్యంబునఁ గుశలయు సుశీలయు భర్తృసేవాతత్పరయుఁ బుత్త్రప్రసువు నగు పత్ని పతికిం బ్రియురా లగు. నిసువుల యపరాధంబులు సైఁచి పోషించు మాత ప్రీతిదాయకురాలు దుశ్చరిత దుఃఖదురాలు నగు. పుత్త్రునికి విద్యాగమార్థంబు జీవనార్థంబు నిచ్చలు యత్నించుచు నెల్లపుడుఁ దగునట్లు శాసించుచు నుండు పితరుఁ డుత్తముఁడు ననృణియు నగు. ఎవఁ డెల్లకాలంబు స్వకార్యంబులకు సహాయము గావించుచు నొకప్పుడేనియుం బ్రతీపంబు వలుకక సత్యమును హితంబు నుపదేశించుచుఁ

దనయొద్దఁ గలదాని నెద్దియే నిచ్చుచుఁ బుచ్చికొనుచుఁ దనయింటికి వచ్చుచుం బోవుచుండు వాఁడు సన్మిత్త్రం బగు.

దుఃఖహేతువులు

నీచులతోడి యతిపరిచయంబును బరగృహంబులకుఁ బలుమాఱు పోకయు జాతియందును సంఘంబునందును బ్రాతికూల్యంబును దారిద్ర్యంబును మానహానికరంబు లగు. వ్యాఘ్రంబులతోడను, వహ్నితోడను, సర్పంబులతోడను, హింస్రులతోడను సంఘర్షణంబు గీడు గావించు: సుహృదులకు దౌర్మనస్యంబును బగఱకుఁ బ్రాబల్యంబును విద్వాంసులకు బీదతనంబును దరిద్రున కపత్యబాహుళ్యంబును దుఃఖహేతువు లగు. కన్యయొక్కత యయ్యు సంతాపకారిణి. తల్లిదండ్రుల యాచనంబు దుఃఖదంబు. ధనికుఁడు గుణవంతుఁడును వెజ్జును ఱేఁడును సుజలాశయంబును లేని యూర నివసింప సుఖంబు గలుగదు. పతి ధనరూప సంపన్నుండయినను బలాధికుఁ డయినను విద్వాంసుఁ డయినను యథేష్టంబుగఁ బ్రవర్తింపనివాఁ డింతులకు సుఖదుండు గాఁడు. సంధారణ లాలనంబుల శిశువు వశంపడునట్లు మానసం బెఱింగి యభిలాషానుసారంబుగఁ జరించువానికి స్త్రీ వశురా లగు. జ్ఞాని కార్యసాధనం బయిన వ్యయం బెంత యధికం బయినం జేయుఁ గాని నిరర్థకంబయిన వెచ్చ మల్పం బయినఁ జేయఁ దలఁపఁడు. మఱియు నధికవ్యయంబు నల్పలాభంబు నగు పని చేయక విపరీతంబగు దాని నుపాయంబుతో సేవించు. పణ్యంబు లయిన వస్తువుల మూల్యంబును మానంబును యత్నంబున

నెల్లరుం దెలియ వలయు. తపస్స్త్రీ కృషిసేవలందు నుప భోగ్యంబులందును భక్షణంబునను గాక యన్యకార్యంబుల హితకారి యగు ప్రతినిధిని నియోగింప నవచ్చు.

మనుజుల వేర్వేఱు కోర్కులు

మధురపదార్థంబులఁ దినఁ గోరు వాఁడును జోరుఁడును బొజుఁగును విజనప్రదేశంబును, బలవంతుతో విద్వేషంబు గొన్నవాఁడు సహాయమును, వేశ్య ధనికమైత్రియుఁ, గున్నృపతి ఫలంబును, దేవజీవకుఁ డగ్నియు దంభతపంబును, శ్రోత్రిడి నిజకాంతుని, జ్ఞానితత్త్వంబును జఱభి దురాచారుని, వ్యాధితుఁడు వైద్యుని, ధృతపణ్యుఁడగు బేహారి మహార్ఘంబును, గుసేవకుఁడు రాజద్రవ్యంబును, యాచకుఁడు దానశీలుని, భీతుఁడు రక్షకుని, దుర్జనుఁడు ఛిద్రంబును, వెదకుచుందురు. పాలసుఁ డొకపుడు మిగులఁ గోపించుచు విరుద్ధంబుగ భాషించు. నిద్రించు. మాదకద్రవ్యంబుల భక్షించు. నిష్ఫలంబు ననిష్టఫలంబు నగు కర్మంబేని కావించు. క్షాత్త్రంబయిన తేజంబు తమఃప్రధానమును బ్రాహ్మము సత్త్వగుణప్రధానమును నితర తేజంబు రజఃప్రధానము నగుఁ గాని సత్త్వప్రధానం బయిన తేజం బన్నిటం బ్రశస్యతమం బగు.

బ్రాహ్మణప్రాశస్త్యము

బ్రాహ్మణుం డెల్లవారికంటె స్వకర్మమునన యధిక తేజస్వి యగు. క్షత్త్రియాదులందుఁ దత్తేజముకంటె నను తేజముండు. స్వధర్మాచరణనిరతుఁ డయిన బ్రాహ్మణుం జూచి యితరులు భీతిల్లుదురు. కనుక స్వధర్మముం జేయునది.

వృత్తిభేదములు

ఎల్లవారికి స్వధర్మమునకు లోపము గావింపని వృత్తి యుత్తమ యగు. మఱియు నెద్దేశమునఁ గుటుంబపోషణము సుఖముగ నగు నద్దేశము ప్రశస్యము. కృషి సరిన్మాతృకం బయ్యెనా యుత్తమవృత్తి యనందగు. వాణిజ్యము మధ్యమవృత్తియు భారవహనాదుల జీవనం బధమమును దపస్వులందుఁ దక్క యాచ్ఞావృత్తి యధమతమము నగు. మఱియు నొకప్పుడు ధర్మశీలుండగు రాజుసేవయు నుత్తమంబని యెన్నుదురు. యాజనమును బేహారమును గరిసనమును రాజసేవయుంబోలె విపులం బయిన ధనంబు గావింపం జాలవు గాని యది బుద్ధిమంతులకుఁ దక్క నన్యులకు నసిధారయుంబోలె నతిగహనంబు నశక్యమునై యుండు. వ్యాళగ్రాహి వ్యాళంబును మంత్రి నృపునిని మంత్రబలమునన వశపర్చికొందురు గాని రాజునెడ బుద్ధిమంతులకు వెఱ పగ్గలం బగు.

బుద్ధిప్రశంస

మతిమంతుఁడు దూరమున నున్నను సమీపమున నున్నవాఁడు వోలె బుద్ధిపాశమున బంధించి యెవ్వానినే నాకర్షింపఁ జాలు. బ్రాహ్మతేజంబు బుద్ధిమంతులందును క్షాత్త్రంబు రాజునందును బ్రతిష్ఠితంబులు. మందప్రజ్ఞుఁడు సమీపమున నున్నను దూరస్థుఁడ యగు. వేదాభ్యాసపాటవమునఁ దేరినబుద్ధి సర్వతంత్రములం బ్రవేశింపఁ జాలమి వ్యవహారక్షమము గానోపదు.

అల్పభాగ్యాదుల యప్రాశస్త్యము

అల్పం బయిన కలిమికంటె లేమియు దుష్టయానారోహణముకంటెఁ బాదగమనంబును మృతాపత్యతకంటె ననపత్యతయుఁ బగఁగొనుకంటె నౌదాసీన్యమును దేశాచ్ఛాదనముకంటెఁ జర్మమునఁ బాదగూహనమును బరునింటఁ గాఁపుర ముండుటకంటె నడవి వసించుటయు నల్పజ్ఞానముకంటె నజ్ఞానమును దుష్టభార్యాగార్హస్థ్యముకంటె మరణం బేనియు సన్న్యాసం బేనియు వరమును సుఖదము నగు. ఋణమును గర్భధారణమును నధికారము ఖలసఖ్యమును నపథ్యభోజనమును మొదల సుఖమును దర్వాత దుఃఖమును గావించు.

నాశహేతువులు

రాజు దుర్మంత్ర్యమునను రోగి దుర్వైద్యమునను బ్రజ దురాధిపత్యమునను గులము గుసంతతిని గుబుద్ధి నాత్మయు నశియించు.

సంసర్గమహిమ

హస్త్యశ్వ వృష బాల స్త్రీ శుకములు సంసర్గమునం జేసి శిక్షకుని గుణములు ధరియించు. సమయోచితభాషణమున జయమును సద్వ్యసనములఁ బ్రసిద్ధియు విద్యచే సభయందు మానమును నధికారమున మూఁడును సంఘటిల్లు.

సుఖహేతువులు

సత్క్షేత్రమును సుపుత్త్రుఁడును సువిద్యయు సుధనమును సుమిత్త్రుఁడును వశంవదుండయిన దాసుఁడును నట్టిదాసియు నారోగ్యసంపన్నం బయిన దేహమును సుఖవాసార్హం

బయిన సదనమును సున్నృపతియు ననుపదియు మనుజునకు సుఖము గావింపంజాలు. ఇం దెద్దియేఁ గొఱఁతవడిన సుఖమునకుఁ గొఱఁత యగు.

అంతఃపురసేవార్హులు

వృద్ధులు సుశీలురు విస్రంభార్హులు సదాచారులు నగు పురుషులనేని యట్టి యింతులనేని క్లీబులనేని నరుం డవరోధరక్షణమున నియోగింపవలయుం గాని మిత్త్రునేని యువను నియోగింప మేలు గాదు. ఎల్లవాఁడును గాలము నియమించి కార్యములు సేయుచుండవలయుఁ గాని వ్యర్థముగఁ గాలక్షేపము సేయంజనదు. గవాదులం దన్నుఁబోలెఁ బాలించుచు నన్నసంసిద్ధికిఁ దల్లిని దన్ను ధర్మార్థంబులను స్వశిక్షణమునకు గురులను నియోగించుచు ననియమముగ నంతిపురమున కప్పుడప్పుడు నరుండు పోవుచుండ వలయు.

మార్గమున సుఖహేతువులు

అనపత్య యగు పెండ్లమును సద్యానమును బరువు మోయువాఁడును సంరక్షకుండును అనలసుఁ డగు సేవకుండును బరక్లేశహారం బగు విద్యయుఁ బ్రవాసమున సుఖహేతువు లగు.

చేయఁగూడని పనులు

మార్గము నిరోధించి యెక్కుపుడయినను సమర్థుండును నిలువఁదగదు. దేశాధిపతియయ్యు సద్యానముననేని హట్టమార్గమున బోవఁ గీడగు. అధ్వగామి సహాయము కలిగియె పయనంబు సేయుచు సన్మార్గమునకు సమీపమున నున్న యూర

సుజలము నభయమ్ము నగుదాన విడియు వలయుం గాని మార్గమున నరణ్యమునను నాఁగఁగూడదు.

జరాకారణములు

బహుదేశాటనమును ననశనవ్రతమును స్త్రీసంసర్గాధిక్యము నతిశ్రమానుభవమును శీఘ్రంబుగ జరాగమన కారణంబు లగు. వాగ్రూపము లయిన విద్యలయందును క్రియారూపము లయిన కలలయందును నిరంతరాభ్యాసమును జరాకారియ యగు.

స్తుతి

దుర్గుణములను సద్గుణము లని కీర్తించువాఁడు ప్రియుండన గుణాధిక్యము స్తుతించు వాఁడు సఖుం డెట్లు కాకుండు? ప్రియుం డయ్యు దుర్గుణముల నెదుట వక్కాణించువాఁడ ప్రియుండగునన గుణంబులు దోషంబు లనువాఁ డప్రియుండని చెప్పనేల? దేవతలును స్తుతిచే వశ్యు లగుదు రన మనుజుల మాట చెప్పనేల? లోకమున నెల్లరును స్తుతిప్రియు లగుటఁ బ్రత్యక్షముగ నేవాఁడును దోషము నుడువ వెఱచుఁగాన లోక జ్ఞానమునను శాస్త్రాభ్యాసపాటవమునను నెల్లవాఁడు నాత్మ దోషముల నెఱిఁగి విసర్జించు చుండవలయు.

దుర్గుణహానము

తన దుర్గుణములు విని యెవ్వఁడు కోపింపక సంతసించుచు స్వదుర్గుణములఁ దెలిసికొన యత్నించుచు శ్రుతము లయిన దురభ్యాసముల విడుచుచు నాత్మగుణంబుల నిన్న

నుప్పొంగక నే దుర్గుణాకరుండ జ్ఞానహీనుఁడ నాయందు గుణాధానం బెట్లగునని తలఁచువాఁ డెల్లరకంటె నధికుండును సాధువు నగుం గావున నతని కలాలేశంబు దివ్యులుం బోలరు. మహాత్ములకు గావించిన యుపకారం బల్పం బయ్యు మహత్త్వము వడయు

సాధునకు నసాధునకుఁ గావించిన యుపకారము

ఖలులకుఁ గావించిన మే లధికం బయ్యు సర్షపముకంటె నల్పముగఁ దలఁతురు. సాధువు క్షమ గలవాని బలవంతుఁ డనియు దుర్జనుఁడు బలహీనుఁ డనియుఁ దలఁచు. సాధుని దుర్వచనంబును క్షమించునది. కాని దుర్జనునిది క్షమింపరాదు.

జనుల రంజించు విధము

ఏవారికిని గలహంబు గలుగున ట్లుచ్ఛృంఖలంబుగఁ గ్రీడింపను, వినోదంబునను నీభార్య చెడిప యగునా యను నిట్టి పల్కు పల్కనుండగదు. స్నేహాధిక్యము నచేవారియందు నపశబ్దములఁ బ్రయోగింపఁ జనదు. మిగుల గోప్యం బయినను మిత్రునకు దాఁపక వాని గోప్యంబుఁ బ్రకటింపక వానితోఁ గాలవశమునఁ బగ చేకూడినను దాను ము న్నెఱిఁగిన వాని రహస్యంబుఁ బ్రకటింపక వాని దౌష్ట్యము నుగ్గడింపక మాన్ప గుప్తంబుగ యత్నించుచు శక్తికొలఁదిఁ బ్రతిక్రియ సేయుటుచితం బగు. యథార్థం బయినను బలవంతులకు విరుద్ధం బగు నుడి నుడుగుచు నరుఁడు బలవంతులకుఁ బ్రతికూలం బయిన వచనం బొకయుపుడు విన్నను విననియట్లు నట్టి కార్యంబు చూచినం జూడనియట్లును వ్యవహరించుచు స్వాప

త్కాలమున మూకుని బధిరుని ఖంజునిని బోలియుండవలయు. అట్లు కానివాఁడు దుఃఖము వాటిల్లు. నయ జ్ఞాన సంపన్నుఁడు వృద్ధానుకూలం బయిన వచనంబు సమయమునకుఁ దగునట్లు పల్కవలయుఁ గాని కోమలప్రజ్ఞుఁడు గాఁ దగదు. ప్రసంగమున నన్యగృహంబునకుఁ బోయినను వాని కాంతాజనంబు వంక దృష్టిప్రసారము సేయందగదు. అధను నను జ్ఞ వొందకయె వాని కార్యంబున యాజమాన్యంబు వహింపను దగు. బాలుర వివాదమునఁ దన బాలుర శిక్షింపవలయును గాని యపరాధుల నేని యన్యుల బాలుర శిక్షింపఁదగదు. వాదిప్రతివాదుల మతంబు యథార్థంబుగ నెఱింగినను నధికారినియుక్తుండు గాక చెప్పినహీనుండు శత్రు వగుం గాన నేవాఁడు నట్లు చేయఁదగదు. అన్యవివాదంబు గ్రహించి తానెన్నఁడు సేనానితోడను వాదింపఁ దగదు. అధర్మనిరతుఁడు ఛలాంతరుఁడు నతిపీడకుఁడు నీతిహీనుఁడు నగు నధికారి యెచట నుండు నా గ్రామంబు పరిత్యజించి యన్యస్థలమున బుద్ధిమంతుఁడు నివసించునది. పెక్కండ్రు సంఘీభవించి రాజమంత్రము తర్కింపఁ గీడు మూఁడు. జ్యోతిషంబు ధర్మనిర్ణయమును నీతియు దండంబును జికిత్సయుఁ బ్రాయశ్చిత్తంబును గ్రియాఫలంబును దత్తచ్ఛాస్త్రజ్ఞానంబు సంపాదింపక చెప్పవలదు.

అప్రవాసియు స్వతంత్రుండు నగు గృహమేధి సుఖంచును. స్వాతంత్ర్యంబుకంటె సుఖంబును బారతంత్ర్యంబుకంటె దుఃఖంబును లేదు.

వ్యవహారముం దెలియు సాధనము

ప్రాచీనులు నవీనులు నగు వ్యవహారవిదుల బుద్ధివిశేషంబునను బ్రతిక్షణంబును వ్యవహారంబు నవనవం బగుచుండుఁ గాన దాని నిర్ణయంబు దుస్సాధం బయ్యు ననుభవంబునను యుక్తి నుపమానంబునను నాప్తోపదేశంబునను సుసాధం బయియుండు నని నృప రాష్ట్ర సాధారణం బయిన నీతి చెప్పె.

ఇది శుక్రనీతిసారంబున నాంధ్రీకృతంబున నృపరాష్ట్ర సామాన్య లక్షణం బనునది తృతీయాధ్యాయము

శ్రీ ర స్తు

శు క్ర నీ తి సా ర ము

చతుర్థాధ్యాయము

ప్రథమప్రకరణము

మిత్రామిత్రుల లక్షణము

వెనుకటి యధ్యాయంబున జనసాధారణం బయిన నీతి నుపదేశించి మిశ్రంబున సుహృదాదుల లక్షణంబు సమాసంబునఁ జెప్పెద వినుఁడని హితశ్రోత లగు రక్కసులకు శుక్రుం డిట్లనియె. సుహృదుఁడు దుర్హృదుఁడును గర్తయుఁ గారయితయు ననుమంతయు సహాయకుఁడు నని నలుఁదెఱఁగుల నుందురు. ఎవ్వని మనం బన్యదుఃఖంబున ద్రవించు; మఱెవ్వఁ డితరుల ప్రేరణంబు నొందకయ యిష్టకార్యంబు సేయ జతనంబు సేయుచు సత్కరించు; ఇఁక నేవాఁ డాపత్సమయంబున నాత్మ స్త్రీ ధనాదులకు శరణం బగు నతఁ డుత్తమమిత్రుండును గొన్ని కర్జంబులయంద సహాయం పడువాఁడు రెండవ మిత్రుండు నగుదురు. ఒక్కఁ డపేక్షించిన పదార్థంబును మఱియొక్కఁ డపేక్షించుటయు నన్యుని యిష్టంబునకు నాశంబు గావించుటయు వైరిలక్షణం బగు. సోదరులు లేరేని పితృద్రవ్యం బంతయు నాక యగు నితని

వశంబున నేమియు ద్రవ్యం బుండదు. నిస్సపత్నంబుగ నంతయు నే నొక్కరుండన యనుభవించెద నను వారు పరస్పర వైరులు. ద్వేషించువాఁడును ద్వేషింపఁబడినవాఁడు నేకతరవైరు లగుదురు. శూరుండు నుత్థానశీలుండు నీతిబల సంపన్నుండు నగు రాజున కెల్లనృపులు గూఢవైరులు కాల ప్రతీక్షకులు నగు నమిత్రుల యగుదురు. ఎల్లరకు రాజ్య లోభంబు మెండు గావున నది యంత వింతయుఁ గాదు. రాజు లేవారికి నేవారు రాజులకును మిత్రులు గారు గాని వారలు పరస్పరంబు కార్యవశంబున మిత్రులు తఱుచుగ నగుచుండ్రు.

సహజమిత్రులు - సహజశత్రులు

మఱియుఁ గొందఱు స్వభావంబునన యెప్పుడు మిత్రులును శత్రులు నగుదురు. తల్లియుఁ దత్కులంబువారును దండ్రియు నతని తల్లిదండ్రులు దండ్రిపితృవ్య పుత్రికయు నాత్మకన్యయు భార్యయు నామె కొలంబువారును బితృమాతృ భ్రాత్మభగినులు దుహితృ సంతానంబును సత్ప్రజాపాలకుండును గురువును సహజమిత్రు లగుదురు. విద్యయు శౌర్యంబు దాక్ష్యంబు బలంబును ధైర్యంబును బుధులకు జీవనసాధనంబు లగుం గావున సహజమిత్రంబు లగు. పిత్రాజ్ఞానువర్తి యగు పుత్త్రుండు పుత్త్రుండు. గుణహీను లగు నూర్వురకంటె గుణవంతుఁ డగు పుత్త్రుఁ డొకఁడు శ్రేష్ఠుఁడు.

హింస్రుండును దుర్వృత్తుండును ఋణి యగు తండ్రియు ధర్షణి యగు తల్లియు నాత్మసోదరులుం బితృసోదరు

లును వారి భార్యలుం బుత్త్రులును స్నుషాశ్వశ్రువులును సపత్నులును ననాందయుఁ దోడికోడండ్రును మూర్ఖుండగు పుత్త్రుండును గువైద్యుండును రక్షకుఁడు గాని పతియును గోపనుండగు ప్రభువును దాత గాని ధనికుఁడుం బ్రజలకును సహజశత్రు లగుదురు. దుష్టులకు రాజును గులటలకుఁ బతివ్రతయు ఖలులకు సాధువును మూర్ఖుల కుపదేశకుండును శత్రువులు. భుజంగంబులకు క్షీరపానంబు విషంబుంబోలె నుపదేశంబు మూర్ఖులకుఁ గ్రోధంబు వర్ధిల్లఁజేయును. రాజులకు నలుదెసలను సన్నికృష్టులును వారి తరువాతివారును వారి యవతలివారు నగు రాజులు గ్రమంబున హీన బలాఢ్యులు నరిమిత్త్రోదాసీనులు నగుదురు. తన కతిసమీపంబున నుండు కర్మసచివులు నమాత్యాదులుం గర్షితు లయి శత్రు లగుదురు.

రాజు శత్రులయెడను మిత్త్రులయెడను బ్రవర్తింపవలయువిధము

రాజు హీనబలులు నధికబలులు నగు మిత్త్రులయందుఁ గ్రమంబున బృంహణంబును గర్షణంబు నుపయోగించుచు శత్రులకు సామాద్యుపాయంబులచే భేదనంబుఁ బీడనంబు నాశనంబు గావించుచు నెయ్యురను దాయలను వశవర్తులం జేయునది. ఉపాయంబున వ్యాళ గజ సింహాదులును వశంబడును. భూమిష్ఠు లుపాయంబున స్వర్గంబుం జొత్తురు. బుద్ధిమంతు లుపాయంబున వజ్రంబు భేదింత్రు. సుహృత్సంబంధులయందును స్త్రీ పుత్త్ర ప్రజా శత్రులందును సామాద్యుపాయంబుల వేర్వేఱ నుపయోగించునది. ఏక శీల వయో విద్యా జాతి వ్యసన వృత్తులకు సాహచర్యంబు నార్జవంబు గలిగిన

మైత్రి సంఘటిల్లు. నీతోడం దుల్యుండగు చెలికాఁడు నాకింకొకఁడు లేఁడను నుడికారంబు మిత్త్రునియందు సామంబగు. నాకున్న దంతయు జీవితంబుతోడ నీద యని యర్పించుట మిత్త్రునందు దానంబును మిత్త్రునొద్ద నన్యమిత్త్రుని సద్గుణకీర్తనంబు గావించుటయ మిత్త్రునందు భేదప్రయోగంబు నగు. నీ విట్టి పనులు సేయుచున్న నీతో నింక నేస్తంబు సేయఁగలవాఁడఁగా నను నుడియె దండంబగు. ఏవాఁ డిష్టంబు సంఘటింపఁడు మఱియు ననిష్టంబు నుపేక్షించు నతఁ డుదాసీనుండగు. నేను నీకును నీవు నాకును నెన్నండు ననిష్టంబు చింతింప వలవదు. నేను నీకును నీవు నాకును గావలసినపుడు సహాయంబవశ్యంబు చేయవలయు నని నిశ్చయించి పల్కుటయు పగవారియందు సామప్రయోగంబును బ్రబలు లయిన శత్రుల సేఁట మితంబులగు గ్రామంబులనే నరినేని యథాయోగ్యంబుగ నారాధించుట దానంబును శత్రులకు సాధనవైకల్యంబు గావించుటయుఁ దాను బ్రబలుల నాశ్రయించుటయు నతనిచే నిష్కాసితు లయినవారి నుద్ధరించుటయు భేదంబును దస్యు ద్వారంబున ధనధాన్యంబులు హరియించి శత్రులఁ బీడించుటయు వారిఛిద్రంబు లన్వేషించి నీతిచే నుగ్రబలులచే భీషణంబును బ్రాప్తంబైన యుద్ధంబునకుఁ దొడరి మరలక త్రాసంబు గావించుటయు దండంబు నగు. క్రియాభేదంబున నుపాయంబులు భేదిల్లు.

ఉపాయస్వరూపము - ఉపాయములఁ బ్రయోగించువిధము

నీతిజ్ఞుఁ డయిన పార్థివుఁ డరిమిత్త్రోదాసీనులు తన కంటె నధికులు గాకుండ సర్వోపాయంబుల యత్నించుచుండ

వలయు. సర్వకార్యంబులకుఁ బ్రధానసాధనంబును శ్రేష్ఠంబు నగునది సామంబును దదనంతర సాధనంబు దానంబును దర్వాతిది భేదంబు నగును; కాని ప్రాణసంశయకాలంబున దండంబు సమాశ్రయణీయంబు. రాజు ప్రబలులగు నరులయందు సామదానంబు లేని సామభేదంబు లేని వినియోగించుచు సముఁ డగు పగవానియందు భేదదండంబులు ప్రయోగించుచు హీనబలుం డగు రిపునియందుఁ దప్పక దండం బుపయోగించునది. మిత్రులందు సామదానంబులె కాని భేదదండంబు లెప్పుడును బచరింపఁ దగదు. పుడమిఱేఁడు స్వవిజయార్థంబు శత్రురాజులచే బాధింపఁబడిన గుణవంతు లగు జనుల సామదానంబుల సంగ్రహించుచు దుష్టులకు స్వదేశంబునుండి నిర్వాసనంబు గావించుచుండవలయుం గాని తన ప్రజలయందు దండభేదంబులు గావించిన రాజ్యవినాశంబు గలుగుఁ గావునఁ దన పాలనంబున నున్న వారియెడ నవి చూపందగదు; మఱియుఁ బ్రజ లత్యధికులు నతిహీనులు గాకుండ వారిం బాలించునది. చెడునడవడినుండి నివృత్తిదమనంబు; అది దండంబునన సంభవించు. దీన జంతువు దమియింపంబడు నది దండోపాయంబు. రాజు సర్వంబునకుఁ బ్రభువు గాన నాయుపాయంబు దదధీనంబయియుండు. నిర్భర్త్సనంబు నవమానంబు ననశనంబును జెఱసాలం బెట్టుటయుఁ దాడనంబును ద్రవ్యహరణంబు పురనిర్వాసనంబు నంకనంబు నేకదేశ క్షౌరంబు నసద్యానారోహణంబు నంగచ్ఛేదంబు వధంబు యుద్ధంబు నను నివి యన్నియు దండభేదంబు లగు. దండంబునఁ బ్రజధర్మాసక్తిఁ జరియించు; మఱియుఁ

బూజ్యులకుఁ దిరస్కారంబు ననృతభాషణంబు గావింప నోడు. క్రూరులు మార్దవంబు నొందుదురు. దండంబునఁ బశువులును వశంపడు. చోరులు దండంబునకు వెఱచి యూడనిఁ బాడుదురు; కొండెగాండ్రు మూఁగ లగుదురు; ఆతతాయులు వెఱతురు; కొంద ఱరి యీనొప్పికొండ్రు; కాన నధిపతి ధర్మరక్షణార్థంబు నిచ్చలు దండధరుండు గావలయు. గురుం డయినను గార్యాకార్యంబు లెఱుంగక గర్వించి యుద్వృత్తుం డయినఁ దప్పక దండార్హుం డయగు. జన్నంబులయందుఁ బశ్వాలంభంబుఁబోలె నసాధువులందు హింసయు వేదచోదితంబు గావున నహింసయ యనఁదగు. రాజులకు నెల్లకార్యంబులు దండనీతిన సిద్ధించు; మఱియు నెల్లధర్మంబులకు నదియ శరణం బగు; దండ్యుని దండింపమి నదండ్యుని దండించుటను బరుసంపు దండంబునను రాజు గుణవంతులచేఁ బరిత్యక్తుండును బాతకియు నగు. అల్పదానంబున మహాఫలంబును దండప్రణయనంబునఁ బుణ్యంబును శాస్త్రంబులయందు మునివరులు ప్రవృత్త్యర్థంబును భయార్థంబును నిర్వచించిరి గాని యశ్వమేధాది మహాయాగంబులవలని ఫలంబు స్తోత్రపాఠంబునను తమచేఁ గల్గు పుణ్యంబు దండంబునను గలుగదు. స్వప్రజాదండంబున రాజులకెట్లు శ్రేయంబు గలుగు? తద్దండంబున నకీర్తియు ధన పుణ్యవినాశంబును గల్గు. కృతయుగంబున రాజు నెల్ల ప్రజలును గేవల ధర్మపరులు గాన దండంబు లేదు. త్రేతయందధర్మలేశంబు గలదు గావున దండంబు పూర్ణంబుగ వలయు. ద్వాపరంబున సంగోరుధర్మంబు గలదు గావునఁ బాదోనంబుగ దండంబు గావలయు. కలియందు రాజు

దౌష్ట్యంబువలనఁ బ్రజ నిస్స్వ కావున నర్థదండంబు విహితంబు. జనులకు ధర్మాధర్మంబు లలవఱుచుటంబట్టి రాజు యుగప్రవర్తకుఁ డగు. నృపుఁ డెద్దాన నంతసిల్లు దానిఁ బ్రజ లోభంబునను భయంబునను నాచరించుం గాన మనుజుల యపరాధంబునను యుగంబుల దోషంబునను గాదు గాని రాజుల యపరాధంబునన యధర్మంబు గలుగు.

మంచిరాజు ప్రవర్తనము

రాజు సుశిక్షితుం డయిన జనం బెట్లు ధర్మపథంబున నడువకుండు? ఎద్దేశంబున మహీపతి ధర్మిష్ఠుం డగు నచటి జనులు ధర్మనిరతులు, నెచట భూపతి యధర్మనిరతుఁ డగు నచటివా రధర్మపరులు నగుదురు. అధర్మవర్తనుల దేశంబునఁ బర్జన్యుండు కాలంబున వర్షింపఁడు, భూమియు మిగుల ఫలింపదు; మఱియు రాష్ట్రంబునకు హ్రాసంబును ధనక్షయంబును బగఱ కభివృద్ధియుఁ గలుగు. భూమీశుండు మిగుల స్త్రీవ్యసక్తుండును నతికోపనుండు నగుటకంటె మద్యపుఁ డయినను వరం బగు. ప్రథముఁడు వర్ణలోపంబును ద్వితీయుఁడు లోకతాపంబును గావింప నోపుదురు. మద్యంబు త్రావువాని కొక్కనికి బుద్ధిభ్రంశంబును వ్యవహారభ్రంశంబును గావించును గాని కామక్రోధంబు లితరులకును బాధకంబు లగుట మద్యంబుకంటె బలవత్తరంబు లగు. రాజున కతిలోభంబు గలిగినఁ బ్రజల ధనప్రాణంబులు హరియింప నోపును; కావున మీఁదటి దోషంబులు మూఁడును విడిచి రాజు దండధరుండు గావలయు. మఱియు రాజు తన ప్రజల దండించునపుడు మనంబున దయా

ళువు వెలుపటఁ గ్రూరుండునై శిక్షించుచుఁ దనకు స్వభావంబున నహితంబు గావించువారియెడ నుగ్రదండకల్పుండు గావలయు. శాస్త్రంబునకుఁ గర్ణేజపులచే హాని గల్గుఁ గాన రాజు సూచితుఁ డయ్యు బాగుగఁ గార్యంబు విమర్శించుచుండవలయు. ఆత్మదోషంబులు రాష్ట్రజనుల దోషంబులును గనుఁగొని వ్యవహరించు రా జుత్తముఁడు. రాజు మొదట దన్ను శిక్షించికొని పిమ్మట భృత్యులను బిమ్మటఁ బ్రజలను శిక్షింప యత్నించునది.

రాజు శిక్షింపవలయు విధము

అపరాధంబు కాయికంబు వాచికంబు మానసికంబు సాంసర్గికంబు నని నలుఁదెఱఁగు లయియుండు. ఇవన్నియు బుద్ధికృతంబులు నబుద్ధికృతంబులు నని ద్వివిధంబులు. అవి మరలఁ గారితంబులు (చేయింపఁబడినవి) ననుమోదితంబులు (సమ్మతింపఁబడినవి) నని యిరుదెఱంగు లయ్యె. మఱియు నివి యెల్ల సకృత్కృతంబులు నసకృత్కృతంబులు స్వాభావికంబులు నభ్యస్తంబులు నని చతుర్విధంబులు. నేత్ర ముఖాద్యవయవంబులవికారంబుల మానసికంబును గ్రియచే గాయికంబును బరుషవచనంబున వాచికంబును సాహచర్యంబున సాంసర్గికంబును బాగుగఁ దెలిసికొని వాని గౌరవలాఘవంబులఁ బరికించి చేసిన యపరాధంబులకుఁ జేయఁగల యపరాధంబులకు రాజు దండంబు గావించునది. ఉత్తముఁడు మొదల నల్పాపరాధంబు గావించిన ‘నిట్టి తప్పు గావించుట నీబోఁటివానికిఁ దగునా’ యని యుపహాసంబు గావించి చీవాట్లు వైచి యట్టి యపరాధంబు మఱిమఱి కావించిన

మీఁదటి యట్ల త్రిగుణాంబుగను ద్విగుణంబుగను మందలించి మధ్యమాపరాధంబు గావించిన మొదట ధిగ్దండంబును బిమ్మట నట్లు కావించినఁ బ్రథమాపరాధ దండంబును దర్వాతివానికిఁ గ్రమంబుగ నధికంబుగను దండించుచు నుత్తమాపరాధంబు గావించిన ముందు ప్రథమాపరాధదండంబును ననంతరము మధ్యమాపరాధ దండంబును దర్వాత నుత్తమాపరాధంబునకుఁ దగిన దండంబును గావించి యింక నపరాధంబు గావించిన ద్విగుణంబుగ రాజు శిక్షించి కడపట నవరోధంబు గావించునది. మీఁదటి దండకల్పనంబు బుద్ధికృతం బయిన నరహత్యకుఁ గాక యితరాపరాధంబులక చెప్పంబడియె. ఈ ప్రకరణంబున నుత్తమ మధ్య మాధమ భావంబులు ముఖ్యంబుగ గుణంబునను దర్వాత గులంబునను ధనంబునను జెప్పంబడె. మధ్యమునిఁ బ్రథమాల్పాపరాధంబున ధిగ్దండంబునను రెండవసారి యర్ధదండంబునను మూఁడవసారి పూర్ణదండంబునను శిక్షించి పిమ్మట నతఁడు దోషియయ్యెనా ద్విగుణంబుగను ద్రిగుణంబుగను శిక్షించుచుఁ గడపట సంరోధంబు గావించి నీచకర్మంబు సేయ నియోగించునది. మధ్యముఁడు మధ్యమాపరాధంబు గావించిన మొదట నర్ధదండంబునకును బిమ్మట విహితదండంబునకును దర్వాతను నట్లు కావించెనా ద్విగుణదండంబునకును ద్రిగుణదండంబునకును ననంతరంబు బంధనంబునకును దగును.

మధ్యముఁడు మహాపరాధంబు గావించిన మొదట మధ్యమాపరాధదండంబునను దర్వాత యథోక్తదండంబునను గ్రమంబుగ ద్విగుణమునను ద్రిగుణంబునను రాజు శాసించి

పిమ్మటను దోషి యయ్యెనా జీవితావధికముగ బంధనాగారమున నుంచునది. అధముఁ డల్పాపరాధంబు చేసిన ముం దర్ధదండంబునను బిమ్మటఁ బూర్ణదండంబునను శిక్షించి యనంతరము సంరోధనంబు గావించి యతనిచే నధిపతి మార్గసంస్కారము సేయించుచుండవలయు. అధముఁడు మధ్యమాపరాధమున మొదటిమా అల్పాపరాధ దండమునను రెండవసారి చేసిన యపరాధమునకుఁ దగిన దండమునను మూఁడవసారి ద్విగుణదండంబునను దండ్యుఁ డగు. అధముఁ డుత్తమాపరాధంబు గావించిన మొదట మధ్యమాపరాధ దండమును దర్వాత విహితదండమును గావించి యనంతరపర్యాయమున ద్విగుణముగ శిక్షించి తర్వాత యావజ్జీవమును నిగళమున బంధించి నీచకార్యంబులన సేయ నతని నధికారి నియోగించునది. ఎవ్వఁడు ధనగర్వమున నపరాధము గావించు నాతని ప్రథమాపరాధమున నర్ధంబునఁ జతుర్థాంశంబు బోముచేసి పుచ్చికొని యనంతరాగంబున నర్ధంబును దృతీయమంతువున సకలధనమును హరియించి తర్వాత జీవితం బుండునంతదనుక బంధనాలయమున నుండ రాజు శాసించునది. సహాయగౌరవమునను విద్యామదంబునను బలదర్పమునను బాపంబు గావించువాని శృంఖలంబుల బంధించి పలుమాఱు కశల మోదించునది. భార్యయుఁ బుత్త్రుఁడు భగినియు శిష్యుఁడు దాసుండుఁ గోడలు ననుజుఁడు నపరాధము గావించిన గృహస్థుఁడు సన్నంపుఁద్రాటనేని యట్టి వేణువుననేని శరీరమునకుఁ జరమభాగమునఁ గొట్టవలయుం గాని యుత్తమాంగమున నెన్నఁడు దండింపఁ గూడదు.

అల్లివఁడయిన దండించిన రాజు ఎ-సఁ చోరదండమున దండింపవలయు. మఱియు రాజు పాపాత్ముని దప్పునకుఁ దగినట్లు మాసం బేని మూఁడుమాసంబు లేని యాఱునెల లేని వత్సరం బేని యావజ్జీవం బేని బంధనాలయంబున నుంచి నీచ కర్మముల నియోగించుచుండవలయుం గాని యెట్టి యపరాధినైనను వధదండంబున దండింపఁదగదు. భూతంబుల హింసింపఁ దగదని వేదంబు లుగ్గడించుఁ గాన రాజు సర్వప్రయత్నంబులను వధం బుజ్జగించి యవరోధమునను బంధనంబునను దాడనమునను దోషిని బాధింపవలయును, కాని లోభంబున ధనదండంబును విధింపఁ దగదు. తప్పు గావించినవానికి సహాయులు గాని పిత్రాదిబంధువులు దండ్యులు గారు. ఇది క్షమాశీలుం డయిన రాజు దండ ప్రకారంబు. రా జుగ్రదండుండు ధనహారకుండు నై యపరాధముల సైఁపనప్పుడు లోకంబు కలఁత నొంది శత్రుభేదమునకు సుసాధం బగుం గావున క్షమాపతి క్షమావంతుఁడు రంజకుండు నయి జనుల యెడ న్యాయ్యంబుగ దండంబు ప్రయోగించుచుండవలయు.

శిక్షార్హులు - శిక్షయును

మద్యంబు ద్రావువాఁడు జూదరియుఁ జోరుండును జారుఁడును బరహింస గావించువాఁడును వర్ణాశ్రమాచారములఁ ద్యజించినవాఁడును నాస్తికుఁడు శఠుఁడును మిథ్యాభిశాపకుఁడు కర్ణేజపుఁడు (Tale-Bearer) నార్యుల దేవతల దూషించువాఁడు ననృతవాదియు న్యాసహారియుఁ (దాఁచికొన్న సొమ్ము హరించినవాఁడు) బరులవృత్తికి హాని చేయువాఁడును బరులసంపద నోర్వనివాఁడును లంచంబున నాసక్తుఁడును

చెడుకార్యంబులఁ గావించువాఁడును మంతనము వెలువఱుచువాఁడును గార్యంబులఁ జెడనడఁచువాఁడును బరుసములు ననిష్టంబులు పల్కువాఁడును సుజలాశయముల నారామములఁ బాడుచేయువాఁడును నక్షత్రసూచియు రాజవిద్వేషియుఁ గుమంత్రియుఁ గుసాక్షియు డాంబికుండును స్వామిద్రోహియు న్యాయంబుకంటె నెచ్చు వెచ్చించువాఁడును జిచ్చుపెట్టువాఁడును విషంబు ప్రయోగించువాఁడును బ్రబలదండంబు గావించువాఁడును బాక్షికుండయిన ధర్మాధికారియు బలంబున లిఖితంబు (దస్తావేజు) గ్రహించువాఁడును గలహాశీలుండును యుద్ధపరాఙ్ముఖుండును రాజశత్రుల సేవించువాఁడును గ్రామకంటకుఁడును దల్లిదండ్రులకు నొండె సతి యగు భార్యకొండె మిత్రులకొండె ద్రోహము సేయఁ దలఁపుగొన్న వాఁడును గుటుంబభరణమునకుఁ దగిన వెరవు సూపక విద్యాభ్యాసంబునకుఁ దపంబునకు నరుగువాఁడును తృణకాష్ఠాదుల మోచికొన శక్తుఁ డయ్యు బికిరంబున జీవించువాఁడును రాజుదాయల దాఁచువాఁడును గన్యావిక్రేతయు రాజు ననిష్టం బుపేక్షించువాఁడును గుటుంబవృత్తికి హానిచేయువాఁడును నగు పురుషుల యందును గులటయుఁ బతిం బుత్త్రులను హింసించునదియు నెల్లపుడు గృహకృత్యంబుల విడిచినదియు దురాచారురాలు స్నుషయం దప్రియయు నగునింతులయందును స్వభావదుష్టు లగువారిం దెలిసికొని యపరాధానుసారంబుగ రాజు దేశంబునుండి వెడలనడఁచుచు ద్వీపాంతరమున నేని దృఢబంధము గావించి దుర్గమధ్యంబున నేని వసియింపఁ జేయుచుఁ గదన్నంబునను న్యూనభోజనంబునను గృశింపఁ జేయుచు మార్గసం

స్కరణమున నియోగించుచుఁ దత్తజ్జాత్యుచితంబు లయిన కర్మంబులు వారిచేఁ జేయించుచు నిట్లు సంసర్గమున దుష్టులగు వారి సయితము దండించుచు నెల్లవారిని సన్మార్గమునకుఁ ద్రిప్పునది. మఱియు రాజు తనకును రాష్ట్రజనమునకును మంత్రిగణమునకును శత్రుసంబంధమున వినాశంబు గావింపఁ గడంగువాని సరగ వధించునది. సమాజమున దౌష్ట్యంబు గలప్పుడు తేఁడొక్కమాఱు గణంబునకు హానిసేయక పర్యాయమునఁ దన్నాశంబు సేయవలయు. రాజధర్మనిరతుఁడయి నపుడు ధర్మశీలుండు నతిబలుండు నగు నతనిశత్రు నాశ్రయించి జనంబు లతని భయపఱుచునది. రాజెంతదనుక ధర్మైకపరాయణుం డగు నంతదనుక రాజగు. ధర్మశీలుఁడు గాకున్నఁ బ్రజలును రాజును శీఘ్రముగ నశియింత్రు. నిరపరాధు లగు తల్లిం దండ్రిని భార్యను బరిత్యజించిన భృత్యుని నిగడంబుల బంధించి మార్గశోధనంబున నియోగించి యతని భృతియం దర్ధంబు వారిజీవనంబున కిచ్చుచుండవలయు. మహాపరాధంబునకుఁ బణసహస్రంబు దండంబని రాజెఱుఁగునది. రాజముద్రాముద్రితంబయిన దశమాషమాత్ర తామ్రనాణకంబు పణంబునాఁబడు. సార్ధశతవరాటికామూల్యంబయిన తామ్రనాణకంబు కార్షాపణంబు. మధ్యమాపరాధంబులకు నూఱుపణంబులును బ్రథమాపరాధంబున కందున నర్ధంబును రాజు దండంబు విధించునది. ఇట్లు మిశ్రంబున నుపాయములతో నరిమిత్రోదాసీనులు చెప్పంబడిరి.

ఇది చతుర్థాధ్యాయంబునఁ బ్రథమప్రకరణము.

చతుర్థాధ్యాయము

ద్వితీయప్రకరణము

అనంతరము మిశ్రంబున ద్వితీయమైన కోశప్రకరణంబు నుపక్రమించి చెప్పెద నని శుక్రుం డిట్లనియె.

కోశ (Treasure) స్వరూపము – దాని సంగ్రహించువిధమును

సజాతీయార్థసముదాయంబు వేఱ్వేఱఁ గోశంబు నాఁబడు. రాజెద్దియే నొక్క యుపాయంబున ధనంబు సంపాదించి దాన రాష్ట్రంబును బలంబును యజ్ఞాదిసత్క్రియాకలాపంబును రక్షించునది. సేనాప్రజాసత్క్రియా రక్షణార్థం బయిన ధనసంగ్రహం బుభయలోకసుఖదంబు నితరంబు దుఃఖదంబు నగు. దారపుత్రార్థంబు నుపభోగార్థంబు నగు ధనసంగ్రహంబు నరకకారియ యగుంగాని లోకాంతరంబున సుఖంబు నీఁజాలదు. అన్యాయంబున నేవానినుండియేని ధనంబు నాఁచికొనురాజు వాని పాపంబు నొందు. పాత్రునివలన గ్రహించిన ధనము నతనికిచ్చిన ధనముఁ గ్రమంబుగ వర్ధిల్లు. స్వాగమియు సద్వ్యయుండును బాత్రుండును విపరీతుం డపాత్రుండును నగుదురు. రాజపాత్రుల సర్వస్వంబు హరియించియు నధర్మశీలు రయిన నృపాలురధనము హరియించియుఁ బాపభాజనము గాఁడు గావున నట్టివారి నుండియు బలంబున

నేని ఛలంబుననేని దస్యువృత్తినేని పరరాష్ట్రముల నుండియు ధనంబు తప్పక సంగ్రహించునది. సత్ప్రవర్తనము వదలి స్వదేశప్రజలఁ బీడించి యార్జించురాజు ధనసంచయంబు రాజ్యముతోఁ గూడ శత్రుల యధీనంబగు. రాజు లాపద లేని యపుడు దండ భూభాగశుల్కాధిక్యంబునను దీర్ఘదేవ కరగ్రహంబునను గోశవర్ధనంబు గావింపందగదు గాని శత్రువినాశార్థం బధికబలసంధారణంబు గావింప యత్నించునపుడు విశిష్టదండశుల్కాదుల లోకమునుండి ధనము హరింపఁదగు. మఱియు నాపత్కాలంబున ధనికులకు భృతియిచ్చుచు వారి ధనంబు పుచ్చికొని యాపత్సముత్తీర్ణుం డయి మరల దాని సవృద్ధికంబుగ నీవలయు. అట్లు కానినాఁడు ప్రజయుఁ గోశంబును రాజును క్షీణించు. మున్ను సురథాదులు ప్రబలదండంబున నశించిరి యని వినుము గాదె. స్వప్రజారక్షణక్షముఁడయిన రాజునకు దండభూభాగశుల్కాదులు గొనకున్నను వింశతివత్సరంబుల దనుకఁ దనకును దండునకును సంరక్షణక్షమంబయిన కోశంబు ధార్యంబగు. బలమూలంబు కోశంబును గోశమూలంబు బలంబు నని బుధులు స్మరియింత్రు గాన బలరక్షణంబు గావించు రాజునకుఁ గోశంబును రాష్ట్రవృద్ధియు నరిక్షయంబును బ్రజాపాలనంబున స్వర్గమును సిద్ధించు. ద్రవ్యము యజ్ఞార్థమును యజ్ఞంబు స్వర్గసుఖమునకు నుత్పన్నంబు లయ్యె. శత్రులయభావంబును బలమును గోశమును రాజ్యవృద్ధికరములు. క్షమాశీలుం డయిన, నృపునకుఁ దద్వృద్ధినీతి నైపుణ్యంబున నగునుగాన బుద్ధికోలఁదిఁ దదర్థంబు యత్నించుచుండవలయు.

మాలాకారుండు వృక్షములఁ బెనిచి పుష్పంబులఁ గొనునట్లు ప్రజల రక్షించి సంపాదించిన భాగమునను బగఱం గరదులఁ గావించి సంపాదించిన ధనమునను గోశంబు పెంచు రాజులు శ్రేష్ఠులు. కృషివాణిజ్యాది వైశ్యవ్యాపారముల ధనార్జనము సేయువారు మధ్యములును సేవను దండమునను దీర్ఘదేవకరగ్రహంబులను సొమ్ము సంపాదించువా రధములు నగుదురు. హీనధను లయిన జనులును మధ్యధను లయిన భృత్యులును రాజులకు రక్షణీయులు. అధికృతులుం బ్రతిభువులును ద్రవ్యవంతు లయినకొలఁది నుత్తము లగుదురు. ఉత్తమధనులయిన ధనికులు రాజులకు హీనాధికులు గాకుండువారు. పండ్రెండేండ్లు కుటుంబము రక్షింపఁజాలిన ధనము హీనమును బదియునాఱబ్దంబులు కుటుంబము రక్షింపఁ బర్యాప్తం బయినది మధ్యమంబును ముప్పదివత్సరంబులు ప్రోవ సమర్థంబయినది యుత్తమధనము నగు. మహార్ఘంబగు కాలంబునఁ బదార్థంబుల విక్రయించుచుఁ దక్కువవెల గల కాలంబున విలుచుచు వణిజులు భాండమునన కాని వృద్ధిచేత వ్యవహరింపరు. రాజు లాపత్కాలమునను వ్యవహారమునందలి ధనము గాక తక్కిన యెల్లవారల ధనముఁ గ్రమముగ రక్షింపవలయును. అట్లు కావింపనినాఁడు ప్రజాసంతాపంబు సాన్వయంబుగ నృపుని దహింపనోపు.

ధాన్యసంగ్రహము

రాజు లాయాయికాలంబుల రాష్ట్రార్థమును నాత్మహితార్థమును మూఁడేండ్ల భోజనంబునకుఁ జాలిన ధాన్యము

సంగ్రహించి యుంచునది. ధాన్యంబు చిరస్థాయియు నెల్ల సంపదలలో నధికము నగు. సుపుష్టమును గాంతిమంతమును బ్రశస్యజాతియు శుష్కముఁ గ్రొత్తదియు సుగంధియు సువర్ణమును జిరస్థాయియు రసవంతము నగు ధాన్యముఁ బరిశీలించి మహార్ఘం బయ్యు నట్టిదానిని సంగ్రహించి రక్షింపవలయు. విషమునను నగ్నిని స్పృష్టము నివము దాఁకినది గీటజుష్టము నగుకొల్చు సంధరింపఁ జనదు. సంగ్రహించిన ధాన్యము నిస్సారముగాక మున్న వెచ్చించుచు వ్యయపఱిచినవానికిఁ దుల్యపరిమాణం బగు క్రొత్తధాన్యం బేఁటేఁటఁ బ్రయత్నమున రాజు సంగ్రహించునది. మఱియు నోషధులు ధాతువులు (=ఖనిజములు) తృణకాష్ఠాదులు జంత్రములు శస్త్రాస్త్రములు నగ్నిచూర్ణము భాండాదులు వసనములు నింకను గార్యసాధకములగు నితరపదార్థములు సుప్రయత్నమున సంగ్రహించి సంగృహీతము లయినవాని రక్షించుచుండవలయు. ఆర్జనముననొందు శ్రమముకంటె రక్షణమున నాయాసము చతుర్గుణంబధికము. ఆర్జించినవస్తువు క్షణ ముపేక్షించిన నశియించు. సంపాదించిన వస్తువులు నశించిన సంపాదకునకు మిక్కిలి దుఃఖము పొడముగాని యతని స్త్రీపుత్త్రాదులకు నంతసుఃఖము వొడమదన నితరులకును జెప్పనేల? ఎవఁడు తనకార్యమున శిథిలప్రయత్నుం డగు నతని సహాయులు నట్ల యగుదురు. ఎవ్వఁడు తనకార్యంబున మెలఁకువపడు నతని సహాయులును వానికిం దుల్యు లగుదురు. ఎవ్వఁ డార్జింప శక్తుఁడయ్యు నార్జించిన వానిరక్షింప నశక్తుఁ డగు వానికంటె మూఢుఁడు వేఱొకఁడు లేఁడు. వానియార్జనశ్రమం బెల్ల వితథ

యగు. ఏకాధికారంబున నిద్దఱ నియమించువాఁడును జీవద్ద్విభార్యుండును నతివిస్రంభవంతుఁడును మహాధనాశుండు నలసుండును స్త్రీజితుండును జారచోరాతతాయులయం దేవానినేని సాక్ష్యం బడుగువాఁడును మూర్ఖులు. ఎల్లవాఁడును గృపణుండువోలె ధనంబుల రక్షించుచుఁ గర్జంబుతఱి విరక్తుండువోలె వెచ్చింపకున్నను నిరర్థకంబుగ వెచ్చించినను మూర్ఖుం బునొందు. వస్తువుల యాథాత్మ్యంబు పరీక్షింప మనుజుండు తాన యత్నింపవలయుం గాని యన్యుల నియోగింపఁ జనదు.

రత్నసంగ్రహము - వాని స్వరూపాదులును

రాజు పరీక్షకులచేఁ బరీక్షింపించి రత్నాదిపదార్థంబులఁ గాపాడునది. వజ్రంబును మౌక్తికంబును బ్రవాళంబును గోమేదంబు నింద్రనీలంబును వైడూర్యంబుఁ బుష్యరాగంబును బాచియు మాణిక్యంబు నను తొమ్మిదియు మహారత్నంబు లని విద్వాంసులు చెప్పుదురు. రక్తవర్ణంబు నింద్రగోపకాంతంబు నగు మాణిక్యంబు గాములపేనికిని రక్తంబును బీతంబును శ్యామంబు నగు మౌక్తికంబు చందురునకును, మాంజిష్ఠంబయిన ప్రవాళంబు నేలపట్టికిని మయూర చాషపత్రాభంబయిన పాచిబుధునకును స్వర్ణవర్ణం బయిన పుష్యరాగంబు బృహస్పతికి నత్యంతవిశదంబుఁ దారకాభంబు నగు వజ్రంబు శుక్రునకును వార్షికాబ్దనీలం బయిన నీలంబు శనైశ్చరునకు, నీషత్పీతారుణప్రభం బయిన గోమేదంబు రాహునకును మార్జారాక్షినిభం బయిన వైడూర్యంబు కేతుగ్రహంబునకును బ్రీతికరంబు లగు. రతనంబులలో వజ్రంబు శ్రేష్ఠ

తరంబును గోమేదవిద్రుమంబులు హీనంబులును గారుత్మత మాణిక్య మౌక్తికంబులు శ్రేష్ఠంబులును బుష్యరాగేంద్ర నీల వైడూర్యంబులు మధ్యమంబులు నని చెప్పంబడు. ఎల్ల రత్నంబులకంటె మహాద్యుతిమంతం బయిన యహిజం బగు మణి శ్రేష్ఠతమంబ కాని యది దుర్లభంబు. అజాల గర్భంబును గీఱలుం జుక్కలు లేనిదియు సద్వర్ణంబును సత్కోణంబును సుప్రభంబు నగు రత్నంబు శ్రేష్ఠం బని తద్విదులు చెప్పుదురు. శర్కరాభంబు దలాభంబు చిపిటంబు వర్తులంబు నని రత్నంబు లెల్ల నలుఁదెఱంగుల నుండు. సిత రక్త పీత కృష్ణంబు లయిన ప్రభావర్ణంబులు రత్నజంబులు. దోషవర్జితం బయిన రత్నంబు ప్రభావర్ణంబుల ననుసరించి యైశ్వర్యంబుం బుష్టియు శౌర్యంబు నాయువు ధరియించు వారి కొసఁగు. కోకనదచ్ఛవి యైన పద్మరాగంబు మాణిక్య భేదంబగు. పుత్త్రకామ యగునారి యెక్కప్పుడును వజ్రంబు ధరియింపఁ జనదు. నిర్దుష్టం బయిన రత్నంబునకు గౌరవంబు నను బ్రభావర్ణంబులను విస్తారంబున నాశ్రయంబున నాకారంబునను మూల్యం బధికం బగుచుండు. ముత్యంబుం బవడంబును ధరియింపఁ గాలంబున జీర్ణంబగు. ముక్తాప్రవాళంబులకంటె నితరంబు లగు మణులు పాషాణంబున నాయసంబునను నుల్లేఖ్యంబులు గావని రత్నవిదులు వక్కాణింతురు. సద్గుణంబయిన రత్నంబు విరివిగలిగి లఘువయిన నధికమూల్యంబునకును బరిమాణంబున నల్పంబయి గురువైన నల్పార్ఘంబునకును దగు. శర్కరాభంబయిన మణికి నల్పంబును జిపిటమునకును మధ్యమమును దలాభంబయిన దానికధికమును వర్తులంబయిన దానికి యథాకామముగను వెలయగుం గాని రాజదౌష్ట్యమున వాని కర్ఘం బధికంబు నల్పంబు నగుచుండు. ముక్తాప్రవాళేతరంబు లయినమణులు చిరకాలంబు ధృతంబు లయ్యు జీర్ణింపవు. ముత్తియంబులు మత్స్యాహిశంఖంబుల వలనను వేణువరాహజీమూతంబులవలనను శుక్తులవలననుం బుట్టును గాని వానియందు శుక్త్యుద్భవంబులు మెండయి యుండు. శుక్తిజంబులయందుఁ గృష్ణవర్ణంబులు ద్వికంచుకంబులు గనిష్ఠంబులును సితవర్ణంబును నాల్గుపొరలు గలదియు మధ్యమంబును బీతరక్తంబు సప్తకంచుకంబు శ్రేష్ఠంబును నగు. ఇట్టి ముత్తెంబులు వేధ్యంబులు నితరంబు లవేధ్యంబులు నగు. మఱియు సింహళద్వీపవాసులు కృత్రిమంబు లయిన తారల రచియింత్రు గాన సందియంబుదీరఁ బరీక్షకుఁడు వానిఁ బరీక్షించునది. లవణంబుతోడను జమురుతోడను గూడిన యుష్ణజలంబున నొక్కరే యునిచి వ్రీహులతో మర్దించిన వైవర్ణ్యంబు నొందని ముత్తియంబు లకృత్రిమంబు లనియుఁ దక్కినవి కృత్రిమంబు లనియు నెఱుఁగునది. శుక్తిజాతంబయిన మౌక్తికజాతం బుత్తమప్రభంబును దదితరజాతంబు మధ్యమప్రభంబు నగు. గోమేదకభిన్నం బయిన రత్నంబుల కెల్ల నర్ఘువు తులాకల్పితంబు గావలయు.

రత్నముల వెల

ముత్తియంబులకుఁ గాక యితరరత్నంబులకు వింశతి సంఖ్యాకంబు లయిన త్రుము లొక్కరతి యగు. ముత్తియంబులకు నాల్గుకృష్ణలంబులు మూఁడురక్తు లగు. ఇరువదినాల్గు

రతు లొక్క రత్నటంకం బగు. స్వర్ణవిద్రుమంబులకు నాల్గు టంకంబు లొక్కతోలం బగు. ఏకరక్తిమితం బయిన యేక హీరంబునకు సువిస్తృత దలంబునకుఁ బరీక్షకుఁ డుత్తమ మూల్యంబు పంచసువర్ణకంబులు నిర్ధరించునది. పరిమాణా ధిక్యంబును బెక్కుకోణంబులుం గలిగిన నధికమూల్యంబును మానంబు తక్కువయిన కొలఁది నల్పపువెలయు నిర్ణయింపఁ దగు. ఇం దెనిమిదిరతు లొక్కమాషంబును బదిమాషంబు లొక్క సువర్ణకంబు నగు. అయిదు సువర్ణంబుల మూల్యం బెనుబదిరాజతకర్షంబు లగు. వజ్రంబునకు బరువుంబట్టి రక్త్యనుసారంబుగ మూల్యంబు నిర్ణయించునపుడు చిపిటం బయినదానికి వెల మున్ను చెప్పిన వజ్రంబు వెలకంటె మూఁడవయంశంబు న్యూనంబుగ నేర్పడు. శర్కరాభం బయిన హీరంబునకు నుత్తమమూల్యంబునం దర్ధంబు వెల యగు. ఒక్కరతి పరిమాణంబు గల రెండు మగఱాలవెల సార్ధద్విసువర్ణకంబులును నంతియె పరిమితి గల పెక్కు మగ మానికంబులకు మూల్యంబుమీఁది దానియం దర్ధంబు నగు; మఱియు గుణహైన్యంబున వాని విలువ మున్ను చెప్పిన దాని యందు సగంబును నాల్గవపాలు నగు. దలాభంబులుఁ జిపి టంబులు వర్తులంబులు నగు వజ్రంబు లొక్కనివలన నొక్క మాఱు నూఱురతులకంటె నధికంబుగ విలిచెనేని శత శతం బునకు న్వింశతి రతులకు హ్రాసించి శేషించినవానిక మూ ల్యంబు గొన్నవాఁ డిచ్చుచుండవలయు; మఱియు శర్కరా భంబు లయిన నేఁబదిరక్తులయిన న్నలుబదిరక్తులైనం గొన్న ను నట్లు హ్రాసించియె వెల యీవలయు. కృష్ణవర్ణంబును

రక్తబిందుయుతంబునగు రత్నంబె నాఁడును శ్రేయస్కాముండు ధరియింపఁదగదు. గారుత్మతంబు మాణిక్యంబు నుత్తమంబు లయ్యెనేని రతి కొక్క సువర్ణం బుత్తమమూల్యంబు నంత కంటె నధికపరిమాణంబు గలిగినఁ దదనుసారముగ మూల్యం బునునగు. రక్తిపరిమితంబు లగు పుష్యరాగనీలముల కుత్తమ మూల్యము సువర్ణమునం దర్థంబగు. ప్రశస్తంబయిన వైడూ ర్యము నుత్తమమూల్యమునకుఁ దగు. తోలకమితం బయిన ప్రవాళంబుమూల్యం బర్ధసువర్ణకం బగు. గోమేదం బల్ప మూల్యంబు గావున నున్మానంబునకుఁ దగదు. అల్ప పరి మాణంబులయిన హీరభిన్నంబు లగు రత్నంబులకు సంఖ్యాన వెల నిర్ణయింపఁదగు. అత్యంతరమణీయంబులు దుర్లభంబులు నగు మణులకుఁ గ్రయద్రవ్యం బిచ్ఛానుసారంబుగ నుండు. మహాగుణసంపన్నంబు లయిన మణులకెల్ల మానంబునం గాక వెల యథాకామంబుగఁ గల్పింపఁ దగు. ఉత్తమం బయిన ముత్తియంబున కర్ధసువర్ణంబును దక్కువగుణంబు గలదానికిఁ దక్కువయును గ్రమంబుగ వెల యగు. రక్త వర్ణంబును బీతంబును సితంబును వర్తులంబు నగు ముత్తెంబు శ్రేష్ఠంబును జిపిటంబు శర్కరాభంబు నధమంబును దక్కి నవి మధ్యమంబులు నని తద్విదులు వల్కుదురు.

లోహస్వరూపమును – వాని మూల్యములును

రతనంబులందు స్వాభావికంబులును ధాతువులందుఁ గృత్రిమంబులు నగు దోషంబులు పెక్కులుండుం గాన విద్వాంసుండు వానిం బాగుగఁ బరీక్షించి యర్ఘంబు నిర్ణ

యించునది. స్వర్ణ రజత తామ్ర వంగ సీస రంగలోహంబు లేడును ధాతువులును దక్కిన యారకూటాదులు దత్సంకరంబులు, నిందుఁ బూర్వపూర్వంబు శ్రేష్ఠంబు నని ధాతువిదులు చెప్పుదురు. ధాతువులన్నిటను గాత్తస్వరంబు ప్రశస్యతమంబు. వంగతామ్రంబుల సంయోగంబునఁ గాంస్యంబును దామ్ర రంగంబుల సంయోగంబునఁ బిత్తలంబు నుత్పన్నం బగు. ప్రమాణంబున సమంబులయ్యు భర్మంబు తనువు నితరంబులు పృథులంబులు నయి కాన్పించు. జంత్రంబులయు నాయుధములయు నాకారము నొందిన లోహము సుహామూల్యం బగు. సువర్ణమునకు షోడశగుణంబయిన రజతమును దఱచుగ నశీతి గుణం బయిన తామ్రము రజతమునకును, సార్థకగుణం బయిన వంగమును ద్విగుణంబయిన రంగమును ద్విగుణంబయిన సీసమును షడ్గుణంబయిన లోహమును దామ్రమునకును మూల్యము లగు. ఇది విశిష్టంబయిన రత్నధాతుమూల్యకల్పనం బని తత్స్వరూపజ్ఞులు సెప్పిరి.

ఆవు మొదలగు పెంపుడు జంతువుల వెలలు

సుశృంగములు మంచివర్ణమును తేఁబ్రాయమును గలిగి బహుదుగ్ధయై సువత్సకయైనగో వల్పయేని మహతియేని మహార్ఘమునకుఁ దగు. పీతవత్స యయ్యుఁ బ్రస్థదుగ్ధ యైన గోవునకు రాజతం బయిన యొక్కపలము మూల్యం బగు. అయిదుగుంజ లొక్కమాషమును బదియునాఱుమాషము లొక్కనిష్కమును నాల్గునిష్కము లొక్కపలమును నగు. అజకు గోవునర్ఘమునం దర్ధంబును మేషి కందు సగంబును మూల్యంబగుం గాని యుద్ధశీలంబును సుదృఢంబు నగు మేషంబునకు రాజతంబయిన పలంబు వెల యగు. గోవులకుత్తమంపు వెల పదియే నెన్మిదేసి రజతపలంబులును నజావిజాతంబునకు మహార్ఘం బేకపలంబును నగు. మహిషికి గోవు వెలయు మఱియు నందర్ధంబు నుత్తమం బయిన వెల యగు. సుదృఢంబును బలవంతంబును సుశృంగంబును వోఢయు శీఘ్రగమనంబును నగు సప్తతాలప్రమాణం బయిన వృషభంబున కఱువది రాజతపలంబులును మహిషంబున కేడే నెన్మిదేని పలంబులును గజాశ్వంబులకు వేయేని రెండువేలేని మూడువేలేని, నాల్గువేలేని పలంబులును గ్రమేలకంబునకు మాహిషసమంబును మహార్ఘంబు లని తచ్ఛాస్త్రజ్ఞులచేఁ జెప్పంబడె. ఒక్కదివసంబునన నూఱుయోజనంబులు పోఁ గల యశ్వం బుత్తమంబును దానికిఁ బంచశతసువర్ణ ముత్తమమూల్యము సని నిర్ణీతంబయ్యె. ఏకాహమున ముప్పదియోజనములు నడువ శక్తి గల యుష్ట్ర ముత్తమమును దదుత్తమమూల్యము పలశతము నగు. సర్వవిధముల నుత్తమంబయిన గారున కుత్తమమూల్యము రెండు వేలనిష్కములు. నాల్గుమాషముల పరిమితి గల శాతకుంభంబొకనిష్కమును నైదురక్తు లొక్కమాషము నని గజమూల్యమున నిర్ణయింపఁబడె. భూమియం దప్రతిమములయిన వస్తువు లెల్ల రత్నభూతముల యగుం గావున వానిమూల్యము దేశకాలానుసారముగఁ బ్రభువులచేఁ గల్పనీయం బగు. వ్యవహారాశుమము గుణహీనము నగుపదార్థమునకు మూల్యము కల్పింపఁదగదు. ఎల్ల పదార్థములకు వెల నీచమధ్యమోత్తమ భేదమునఁ గల్పించునది.

పన్ను గ్రహించు పద్ధతి

పదార్థజాతము నమ్మినవారినుండియుఁ గొన్నవారినుండియు గ్రహియింపఁబడిన రాజభాగము శుల్కం బని బుధులు వ్యవహరింత్రు. హట్టమార్గములు నాకరంబులు సీమలును శుల్కదేశము లగు. రాజు వస్తుసముదాయమున కొక్కమాఱు జతనమునఁ దనరాష్ట్రమున సుంకము గ్రహింపఁదగుం గాని ఛలమునఁ బలుమాఱు గ్రహింపఁదగదు. విక్రేతనుండియేని క్రేతనుండియేని వస్తువునర్ఘమునందు ముప్పదిరెండవయంశము రాజు గ్రహించునది. సుంకము వింశాంశము షోడశాంశమునయినను మూల ద్రవ్యమునకు హాని సేయకుండు. కొన్న మూల్యమునకు సమంబుగను హీనముగను విక్రయించువారివలన రాజభాగంబు గొనఁదగదు. రాజెల్లపుడును సరకులఁ గొన్న వారిలాభము పరికించి యరి గొన శ్రేయంబగు. భూపతి బహుఫలములు మధ్యఫలములు నల్పఫలములు నగు భూప్రదేశములఁ గొల్పించి సంగోరు నిర్ణయించి కర్షకునధీనంబు చేసి పిమ్మట వానికినష్టము లేకుండ భాగంబు గొనునది; మఱియు ఫలతారతమ్యంబు లెస్సగఁ బరికించి యంగారకారునిఁ బోలక మాలాకారుం బోలి భాగంబు హరించుచుండవలయు. రాజభాగాదిసకలవ్యయంబుకంటె ద్విగుణంబగు లాభంబు గావించు కృషికృత్యంబు కృషీవలునకు సుఖదంబు నితరంబు దుఃఖదము నగు. వాపీకూపతటాకాది జలాశయంబుల సహాయమున ఫలించు భూభాగమునుండి తృతీయాంశమును వర్షమునన పండునేలనుండి తురీయాంశమును నదీమాతృకంబయిన యుర్వరనుండి సంగోరును గుల్మపాషాణాది సమాకులం బయిన

భూమినుండి షష్ఠాంశమును నగు ఫలము రాజు గ్రహించునది. ఏ కాఁపువలనఁ భూమీశున కేఁటేఁట శతరాజతకర్షమితంబయిన భాగము వచ్చునతని కిరువదిమానం దగు. ఖనిజంబయిన సువర్ణమునందు నర్ధంబును రూప్యమునఁ మూఁడవయంశమును దామ్రమున నాల్గవపాలును లోహసీసాదుల నాఱవభాగమును మణులయందును క్షారంబులందు నర్ధమును వ్యయశేషమునఁ గర్షకునకు లాభాధిక్యము గలుగునట్లు నృపతి స్వభాగము హరియించుచుఁ దృణకాష్ఠాదుల నరణ్యమునుండి సంగ్రహించి జీవించువానినుండి వింశాంశము కరంబు గ్రహించునది. అజావిగోమహిష్యశ్వంబుల వృద్ధియం దెనిమిదవయంశము రాజభాగం బగు; మఱియు గవాదిదుగ్ధంబుల షోడశాంశము రాజరి గొనునది. కారుశిల్పాదిగణంబువలనఁ బక్షమున కొక్కదినమునఁ బనిగొనవలయు. కొఱకులు నూతనముగ దున్నువారినుండియు భూమి ఫలవతిం జేయ వాపీకూపాదుల నేని కుల్య నేని త్రవ్వించిన కర్షకునివలనను వారి కయిన వ్యయముకంటె ద్విగుణముగ ధనము తత్ఫలమునఁ గూడునంత దనుక రాజు బలి గ్రహింపఁదగదు. భూమిఫలమున భాగమును నిర్వేశమును సుంకమును వడ్డియు నుత్కోచమును గప్పమును గాలవిలంబనము గావింపక బుద్ధిమంతుఁడు నియతకాలమున గ్రహింపవలయు. భూములయందు భాగము నిర్ణయించుకొని ధనవంతు నొక్కని లగ్నకుం బుచ్చికొనియైన వారివలన నేని కర్షకులవలన వేర్వేఱనేని నిరుడు వచ్చినంత సొమ్ము ముందు పుచ్చికొనియైన, నొక్క పర్యాయం బేని పెక్కుపర్యాయంబు లేని ధనము గ్రహింప నిశ్చయించు

కొనినయైన రాజు కర్షకుల కెల్ల స్వచిహ్నితము లయిన భాగపత్రంబులు వ్రాయించి యీవలయు. మఱియు నెనమండ్ర నేని పదుండ్ర నేని యంతకంటె నెక్కువ సంఖ్యగలవారి నేని గ్రామాయంబున నాఱవపాలికి మించకుండ వేతనంబు నియమించి గ్రామపాలుర నేర్పఱుచునది. గవాదిదుగ్ధంబుల విక్రయింపక కుటుంబార్థం బుపయోగించు గేస్తునివలన రాజు స్వభాగంబు హరియింపం జనదు. మఱియు ధాన్యవస్త్రాది పదార్థంబుల స్వోపయోగంబునకు విలుచువారివలన సుంకంబును గ్రహియింపం దగదు. వార్ధుషికునివలనం గౌసీదంబున ద్వాత్రింశాంశంబు రాజు గరంబు గొనవలయు. గృహంబుతో సంబంధించిన భూమికి వ్యవసాయంపుభూమికిం బోలెం బన్ను పుచ్చికొనం దగు. మఱియు నట్లె యాపణికులవలనం బ్రసారభూమికిని మార్గసంస్కరణార్థంబు పాంథుల వలన మార్గభూమికిని రాజు కరంబు గ్రహింపవలయు. ఎల్లవారి వలన ఫలము గ్రహించుచు రాజు ప్రజారక్షణమున దాసుండుపోలె జాగరూకుండు గావలయు. ఇట్లు చతుర్థాధ్యాయంబున ద్వితీయంబైన కోశప్రకరణంబు శనుండు చెప్పె.

చతుర్థాధ్యాయము

తృతీయప్రకరణము

రాష్ట్రస్వరూపము

అనంతరము మిశ్రముసం దృతీయం బైన రాష్ట్రప్రకరణంబుం సంగ్రహముగం జెప్పెద నని శుక్రుం డిట్లనియె. స్థావర జంగమాత్మకం బెల్లను రాష్ట్రంబని నీతికోవిదులు వ్యవహరింత్రు. రాష్ట్రం బెవ్వనివశంబున నెంతకాల ముండు నంతకాలంబది యతనిది. సర్వగుణ సంపత్తికంటె ధనసంపత్తి శతగుణం బధికంబును మహాతపఃఫలం బయిన యీశత్వంబు దానికంటె నధికమునని గఱువలు వల్కుదురు. పృథివియందుం బార్థివునికంటె దేవుండు లేండని స్మరింపంబడుం గాన నతండు తేజస్వియయి సర్వోత్కర్షంబున నుండు. లోకం బతని నాశ్రయించి జీవించుచు నతనియాచరణము గొనియాడి యాచరించుచుండు. రాజు రాష్ట్రఫలము పూర్ణముగ ననుభవించుం గాన దదఘంబుం బొందు. ఎవ్వానిదేశమున జనము స్వధర్మాచరణతత్పరం బగు ధర్మనీతి పరుండయిన యారాజు శాశ్వతంబయిన కీర్తి నడయు. భూమియం దెవ్వనికీర్తి యెంతకాల ముండు నతండంతవఱకును స్వర్గంబున నుండు. అకీర్తికంటె నరకం బనునది వేఱొండు లోకాంతరమున లేదు. నరదేహంబుకంటె నన్యదేహంబులెల్లను నరకములు నాధివ్యాధులు

మహాపాపస్వరూపములు నని విద్వాంసులు పల్కుదురు. ఈశుండు తాను స్వధర్మపరుండయి ప్రజ.న్స్వధర్మమున నియమించెనేని ప్రమాణభూతుండు ధర్మిష్ఠుండు నగు నతని నెల్లవారు ననుసరింత్రు. సనాతనములయిన దేశధర్మములును జాతిధర్మములుం గులధర్మములు మునిప్రోక్తము లయిన ప్రాచీనములు నూతనములు నగు నితరధర్మములును రాష్ట్రగుప్త్యర్థంబు సన్నృపు లెఱింగి సుయత్నమున రక్షించునది. ధర్మసంస్థాపనమున వారికిఁ జిరైశ్వర్యముం గీర్తియుం గలుగు.

చాతుర్వర్ణ్యస్థితియుఁ దద్ధర్మములును

మున్ను పద్మసంభవునిచేఁ గర్మములచేత జాతి దెఱంగులు భేదింపఁబడె. పిమ్మట ననులోమసాంకర్యమునను బ్రతిలోమసాంకర్యముననుజాత్యానంత్యము ప్రాప్తంబయ్యె. తదానంత్యము చెప్ప నశక్యము. మనుష్యునకు జన్మమున జాతిభేదము నెఱుఁగువారెల్లను నామకర్మములన యట్టి భేదము గలిగెనని యెఱుంగుదురు. సంగ్రహమునఁ బ్రాణులెల్లను జరాయుజములు నండజములు నుద్భిజ్జములు స్వేదజములునని చతుర్విధజాతులుగలవి. జన్మమున నుత్తముఁడయ్యు సంసర్గమున నీచుఁడగుం గాని నీచుఁడగువాఁడు సంసర్గమునఁ గాని జన్మమునఁగాని యుత్తముఁడు గానోపఁడు. జన్మముననుగర్మముననుగుణముననువిద్యాకలాశ్రయముననునీచోత్తమభావములు చిరంకాలంబునకు స్థిరంపడును; అదియ నామమున జాతి యనంబడు. యజ్ఞము నధ్యయనము దానము ననునివి ద్విజున కావశ్యకము లయిన కర్మములు. ప్రతిగ్రహము నధ్యాపనము యాజనము నవునవి బ్రాహ్మణునకు విశేషధర్మ

ములు. సద్రక్షణమును దుష్టశిక్షణమును స్వభాగహరణమును క్షత్త్రియునకును గృషి పాశుపాల్య వాణిజ్యములు వైశ్యునకును విశేషధర్మములు. సేవయు దానము నను రెండు ధర్మములు శూద్రునకు విహితములయ్యె. కర్మభేదమున నెల్లవారికి భృతివృత్తి నిందితముగాదు. స్మృతికర్తలయిన మన్వాదులు బ్రాహ్మణాదులకు సీరభేదమునఁ గృషి వేర్వేఱ విధించిరి. బ్రాహ్మణులకు షోడశగవంబును దక్కినవారికిఁ జతురాసంబగు లాంగలమును నంత్యజులకు ద్విగవమును నందు విహితములు. విప్రులకు గాని యితరులకు భిక్షావృత్తి గర్హితంబు. తపోవిశేషంబుతోడను విధిచోదితంబు లయిన వివిధవ్రతములతోడను సరహస్యముగఁ గృత్స్న వేదాధ్యయనము ద్విజునకు విహితము. విద్యలుం గలలు నేర్చినవాఁడెల్లవారికి గురువగుం గాని జాతిమాత్రమున ననధీతి యాచార్యకమునకు నర్హుండు గాఁడు.

విద్యాకలాస్వరూపసంఖ్యానిర్ణయము

విద్యలుం గలలు లెక్కింప శక్యముగా నన్ని కలవు గాని యందు ముఖ్యవిద్యలు ముప్పదిరెండు నట్టికల లఱువదినాలుగుం గలవు. వాగింద్రియసాధ్యం బయిన కర్మము విద్యయనియు మూకునిచే నయిన సుకరంబయినకర్మము కల యనియు విద్యాకలాస్వరూపము సంగ్రహముగఁ జెప్పి, యింక వానినామములు లక్షణములు వేర్వేఱుగఁ జెప్పెద వినుండని భార్గవుం డిట్లు చెప్పె. ఋగ్యజుస్సామాథర్వములు లను వేదంబులు నాల్గును నాయుర్ధను ర్గాంధర్వతంత్రంబు లను నుపవేదంబులు నాల్గును శిక్షావ్యాకరణములును నిరుక్తజ్యోతిష

ములును గల్పమును ఛందము నను వేదాంగము లాఱును దర్కమీమాంసలును సాంఖ్యమును వేదాంతమును యోగం బును బురాణేతిహాసములును మన్వాదిస్మృతులును నాస్తిక మతము నర్థశాస్త్రమును గామశాస్త్రమునుశిల్పంబు నలంకృతి గ్రంథంబులును గావ్యములును దేశభాషయుఁ బ్రస్తావజాత ము(అవసరోక్తియు)ను యావనమతమును దేశధర్మము నను ముప్పదిరెండును విద్యలనంబడు. ఋగాదులందు మంత్ర బ్రాహ్మణములు రెంటికిని వేదనామము ప్రోక్తంబయ్యె. వేని యుచ్చారణంబునను జపహోమాదులను దేవతాప్రీతియు నర్చనంబునగు నవి మంత్రంబులును వాని వినియోగంబుఁ జెప్పునది బ్రాహ్మణంబు నగు. ఋగ్రూపంబు లయిన మంత్ర ములు పాదములకొలఁది నర్థచ్ఛముల కొలఁదిం గలిగి పఠాత్ర మునకు సాధనంబయినది ఋగ్వేదంబు నాఁబడు. ఎందలి మంత్రంబులు ప్రశ్లిష్టపఠితములు నృత్తగీతవర్జితములుఁ ద్రిగుణ పఠితములు యత్ర ప్రతిపాద్యంబయిన కర్మంబాధ్వర్యవంబు నది యజుర్వేదము. జన్మంబులయం దుద్గీథము శస్త్రములకు సహితవిటతమో యది సామవేదంబు. ఉపాస్యోపాసనాస్వ రూపప్రతిపాదకం బాథర్వణము. ఇది సంక్షిప్తంబయిన వేదచతుష్కస్వరూపంబు.

ఓషధుల, నాకృతిని, నాయువు దేనఁ దేటపడు నది యాయుర్వేదంబు. యుద్ధశస్త్రాస్త్రకౌశలంబు వ్యూహరచనా విశేషంబును దెలుపునది ధనుర్వేదంబు. తంత్రులను గంఠం బునను నుద్ధితంబులు నుదాత్తాది ధర్మవిశిష్టంబులు నగు స్వరం బులతోను దాలంబులతోను గానవిజ్ఞానంబు గావించునది

గాంధర్వంబు. వివిధంబు లగు నుపాస్యంబులయిన మంత్రం బుల ప్రయోగంబులు నుపసంహారంబులును వానిధర్మంబులు నియమంబులు నెఱింగించువిద్య తంత్రంబు. ఇవి క్రమంబుగ ఋగ్యజుస్సామాథర్వంబుల కుపవేదంబులు. స్వరంబులను గాలంబునను స్థానప్రయత్నంబులను వర్ణపాఠంబు శిక్షించుటం జేసి శిక్ష యన్వర్థాభిధానం బయ్యె. బ్రాహ్మణశేషంబయిన వేదభాగంబున జన్నంబులఁ బ్రయోగంబుఁ దెల్పునది శ్రౌత కల్పంబు నుపనయనాది స్వరూపంబు నిరూపించునది స్మార్త కల్పంబు నని కల్పంబు ద్వివిధంబయ్యె. శబ్దంబులెల్ల ధాతు సంధిసమాసంబులతోఁ బ్రకృతిప్రత్యయవివేచనపూర్వకం బుగ లింగభేదంబుతో సిద్ధాన వ్యాకృతంబులయ్యె నది వ్యాక రణంబు. సంగ్రహంబుగ వాక్యార్థంబు సెప్పుచు వైదికశబ్దం బుల నిర్వచించు వేదాంగంబు నిరుక్తంబు. తిక్కలయు గాము లయు నడకలచేఁ గాలంబు నిర్ణయించు సంహితాహోరా రూపంబయిన గణితంబు జ్యోతిషంబు. మయరసతజభనగణం బులయు గురులఘువులయు స్వరూపంబును బద్యంబుల ప్రమా ణంబును బ్రస్తారక్రమంబును దద్భేదంబులును వేదపాద ప్రమాణంబును జెప్పునది ఛందశ్శాస్త్రంబు. వేదవాక్యంబు లకు విధినామధేయాది భేదంబున వ్యవస్థితంబుగ నర్థకల్ప నంబు గావించు న్యాయంబు మీమాంస యనంబడు. దీనికిఁ బ్రవర్తకుఁ డగు జైమినిముని ధర్మానుష్ఠానంబున నభిమతార్థ సిద్ధి యగు నని తత్స్వరూపాదినిర్ణయార్థంబు ద్వాదశలక్షణి యగు పూర్వమీమాంసం జెప్పె. అందు విధినామధేయా ద్యాత్మకంబయిన వేదవాక్యజాతంబునకు ననన్యాపేక్షంబుగఁ

ప్రామాణ్యంబు నిర్వహించి పెక్కులగు కర్మంబుల స్వరూ
పంబును వాని యధికారులను నిరూపించి ఫలతారతమ్యంబు
వివరించి "స్వాధ్యాయం బధ్యేతవ్యం" బనియు దాని కర్థావ
బోధంబు దృష్టఫలంబనియు దృష్టఫలంబు సంభవించుచుండ
నదృష్టఫలకల్పనం బన్యాయంబనియు బలవద్యుక్తిపూర్వకం
బుగ నిర్వచించి వేదంబులు స్మర్యమాణకర్తృకంబులు గామి
నపౌరుషేయంబులని స్థిరపఱిచి కర్మం బపూర్వద్వారంబున
స్వాతంత్ర్యంబునన. పురుషార్థము గావించునని యాముని
సిద్ధాంతించె. భావపదార్థంబులు నభావపదార్థంబులు నిరూపిం
చు కణాదాదిప్రణీతం బయిన గ్రంథంబు తర్కంబు నాఁబడు.

అందు గౌతముండు ప్రమాణ ప్రమేయ సంశయ
ప్రయోజన దృష్టాంత సిద్ధాంతావయవతర్క నిర్ణయ వాద
జల్పవితండాదులు పదియునాఱు పదార్థంబులు గల వనియు
వాని స్వరూపంబు దెలిసిన మోక్షంబు సిద్ధించుననియు నందుఁ
బ్రమాణంబు ప్రత్యక్షాది భేదంబుల నలుఁదెఱఁగు లయ్యె
ననియుఁ బ్రమేయంబు నాత్మయు శరీరంబు నింద్రియంబులు
విషయంబులు మనంబు బుద్ధియుఁ బ్రవృత్తియు దోషంబు
మరణంబు ఫలంబు దుఃఖంబు మోక్షంబు నని ద్వాదశవిధం
బు లయ్యె ననియుఁ జెప్పి యనిశ్చయాత్మకం బయిన జ్ఞానంబు
సంశయంబనియు నీలోకమం దేని పరలోకమం దేని మనుజులు
దేని సంపాదింప యత్నింతు రది ప్రయోజనంబనియు నుదా
హరణంబు దృష్టాంతం బనియుఁ బ్రమాణంబున నంగీకృతం
బయిన యర్థంబు సిద్ధాంతం బనియు యథార్థానుభవంబను
రెండవపేరుగల ప్రమితి నిర్ణయంబనియుఁ జెప్పి యిట్లితక్కిన

వానిని నిర్వచించె. మఱియును నందు దుఃఖజన్మప్రవృత్తి
దోషమిథ్యాజ్ఞానంబులలో నుత్తరోత్తరంబు నశియింపఁ
బూర్వపూర్వంబు నశియించిన నపవర్గంబు సిద్ధించు ననియు
నాత్మగాని దేహాదులం దాత్మ యను భ్రాంతి మిథ్యాజ్ఞానం
బనియు దేహాదుల కనుకూలంబు లయిన వస్తువులందు రాగం
బును బ్రతికూలంబులందు ద్వేషంబును దోషంబనియు నాదో
షంబునఁ బ్రేరితుండయి ప్రాణి శరీరంబున హింసాదిని షిద్ధ
కార్యంబులందును వాక్కున ననృతాదులందును మనంబునఁ
బరద్రోహాదులందును బ్రవృత్తికలవాఁ డగుననియు నిదియు
యధర్మంబనియు మఱియు నొక్కపుడు శరీరి శరీరంబున దా
నాదులను వాకున సత్యాదులను మనంబున హితసత్యాదు
లను బ్రవర్తిల్లు ననియు నిదియె ధర్మం బనియు నీయుభయ
ప్రవృత్తులఁ బ్రశస్తం బేని నిందితం బేని దేహంబు ప్రాణి
గ్రహించి యనుకూలంబయిన సుఖం బేని ప్రతికూలంబయిన
దుఃఖం బే నొందుచుండుననియు నిట్లీమిథ్యాజ్ఞానాదు లెడ తెగక
ప్రవర్తించునంతకాలము సంసారం బనువర్తించు ననియు నెపు
డేని యీ సంసారంబు దుఃఖాయతనం బని పురుషుండు
సుకృతపాకంబున నవిద్యాదుల విసర్జింప యత్నించు నప్పుడ
సమ్యగ్జ్ఞానంబు వొడముననియు దాన మిథ్యాజ్ఞానంబు నశి
యించుననియు దాన దోషంబును దానఁ బ్రవృత్తియు దాన
జన్మంబును దాన దుఃఖంబును నశియించు ననియు నిదియే
యపవర్గం బనియు స్పష్టపఱిచె. మూలప్రకృతియుఁ బ్రకృతి
వికృతు లయిన మహదహంకార తన్మాత్రంబులును గేవల
వికృతులయిన స్థూలభూతంబులు నింద్రియజాతంబును బ్రకృతి

వికృతిభిన్నుం డయిన పురుషుండును బంచవింశతి తత్త్వంబులని నిరూపించి వాని స్వరూపంబు నిర్వచించు కపిలాద్యృషిప్రణీతంబయినమతంబు సాంఖ్యంబు. బ్రహ్మం బేకంబు నద్వితీయంబు ననియు నీప్రపంచంబు నుత్పత్తికిం బూర్వము వేఱువస్తువు లేదనియుఁ బిమ్మట సర్వంబు నధిష్ఠానంబున ననిర్వాచ్యయగుమాయచేఁ గల్పితంబనియుఁ బ్రతిపాదించు నొపనిషదంబయిన మతంబు వేదాంతంబు. చిత్తనిరోధంబు యోగంబనియు నది ప్రాణాయామాదుల నలవడుననియుఁ జెప్పి ధ్యానసమాధుల స్వరూపంబు విదితంబు సేయు పాతంజలం బయిన సూత్రసముదాయంబు యోగశాస్త్రంబు. ఒక్క రాజుకృత్యంబు సెప్పు నెపంబునఁ బెక్కు కతలు ప్రాచీనంబులు దేనఁ జెప్పఁబడు నది యితిహాసంబు పురావృత్తంబు ననంబడు. సర్గప్రతిసర్గంబులును రాజవంశంబులును స్వాయంభువాది మన్వంతరంబులును రాజవంశ్యులయిన మహాపురుషుల చరితంబులును గల యది పురాణం బనంబడు.

బ్రాహ్మణాదివర్ణంబుల నాశ్రమంబులఁ దద్ధర్మంబులను వేదావిరుద్ధముగఁ గీర్తించు మన్వాదిప్రణీతంబయిన గ్రంథజాతంబు స్మృతి యనఁబడు. బలీయసి యగు యుక్తితో సర్వప్రపంచంబు స్వభావంబునన జన్మించు ననియు దేనికి నీశ్వరుండు కర్త గాఁడనియు వేదంబులు ప్రమాణంబులు గావనియుఁ బ్రతిపాదించునది నాస్తికమతంబు. "మృత్యుగోచరంబు గాని జంతువు ప్రపంచంబున లేదు గావునను భస్మీభూతం బయిన దేహంబు మరల రామిని నెల్లవాఁడు సుఖంబున జీవించునది" యను లోకగాథ ననుసరించి నీతి కామశాస్త్రను

సారంబుగ నర్థకామంబులు రెండు పురుషార్థంబు లని నిశ్చయించి పరలోకసిద్ధం బయిన యర్థంబు నపహ్నవించి ప్రవర్తించుటంబట్టి నాస్తికమతంబునకు లోకాయతం బని యన్వర్థాభిధానంబు గలిగియుండు. ఈమతంబునఁ బృథివ్యాదిభూతంబులు నాల్గుతత్త్వంబులు దేహాకారంబునఁ బరిణతంబులయిన వానివలనఁ గిణ్వాదుల సంయోగంబున మదశక్తియుంబోలెఁ జైతన్యం బుత్పన్నం బగుననియు నవి శిథిలంబు లయిన నశియించు ననియు నీవిషయంబున "విజ్ఞానఘన ఏవైతేభ్యో భూతేభ్యస్సముత్థాయ తాన్యేవానువినశ్యతి న ప్రేత్యసంజ్ఞాస్తి" యను మైత్రేయీబ్రాహ్మణవాక్యంబు ప్రమాణ మనియు నట్లగుటచేఁ జైతన్యంబుగల దేహమెయాత్మయనియుఁ బ్రత్యక్షాతిరిక్తంబు లయిన యనుమానాదులకుఁ బ్రామాణ్యంబు మనోరథమాత్రకల్పితరాజ్యతుల్యంబనియు దేహేంద్రియాతిరిక్తుఁడైనయాత్మఁడు లేఁడనియు నిహలోకసుఖంబులె పరమపురుషార్థంబనియు నది దుఃఖసంభిన్నంబయినను మత్స్యంబులం గోరువాఁడు సశల్కంబులు సకంటకంబులు నగు మీలం బట్టి గ్రాహ్యాంశంబు గ్రహించి యితరాంశంబు ద్యజించినట్లును ధాన్యార్థి సపలాలంబయిన ధాన్యంబు గ్రహించునట్లు నవశ్యప్రాప్తం బయిన దుఃఖంబుఁ బరిత్యజించి సుఖమాత్రంబు భోక్తవ్యం బనియు నాస్తికశిరోమణులు నిర్ణయించిరి. మఱియు నందు దుఃఖంబుతోఁ గూడినదను కారణంబున సుఖంబు త్యాజ్యంబు గాదు. మృగంబులు గలవను కారణంబున క్షేత్రంబుల శాల్యాదులు నాటకుందురా? మాధుకరవృత్తిని జీవించువారు బాధింతురని గృహంబులఁ బాకంబు మానుదురా? యనియుం జెప్పి

పారలౌకికసుఖంబు లేదేని బహువిత్తవ్యయ శరీరాయాస సాధ్యంబయిన యగ్నిహోత్రాదికర్మంబుల శ్రోత్రియు లెట్లు ప్రవర్తింతు రని యడిగిన ననృత పునరుక్తాది బహుదోష దూషితంబు గావున వేదంబునందు వైదికమ్మన్యులును బరస్పరంబు కర్మకాండజ్ఞులు జ్ఞానకాండంబునకును జ్ఞానకాండజ్ఞులు కర్మకాండంబునకును బ్రామాణ్యాలోపంబు కల్పింతురు గావునను త్రయి ధూర్తప్రలపితగావునను వేదాధ్యయనాగ్నిహోత్రాదులు పౌరుషహీనులకు జీవనార్థంబు కల్పితంబు గావునను వారిప్రవర్తనంబు ప్రమాణకోటిం బ్రవేశింప దనియు నైహికంబైన దుఃఖంబు నరకంబును సుఖంబు స్వర్గంబు ననియుఁ బ్రత్యక్షప్రమాణసిద్ధుం డయిన రాజు పరమేశ్వరుం డనియు దేహనాశంబు మోక్షం బనియు దేహాత్మవాదిమతంబున నేను కృశుండను గృష్ణుండను మొదలగు సమానాధికరణప్రత్యయం బుపపన్నంబగుననియు నాశరీరము నాచేయి మొదలయిన ప్రయోగంబులు "రాహువుశిర"మన్నట్టు లుపచారప్రయుక్తంబు లనియు సిద్ధాంతంబు చేయంబడె. శ్రుతిస్మృతివిరోధంబు లేకుండ రాజవృత్తంబు శాసించుచు యుక్తిపూర్వకంబుగ నర్థార్జనంబు తెలం గెఱిఁగించువిద్య యర్థశాస్త్రంబు. పురుషులయందు శశవృషాదిభేదంబుల ననుకూలదక్షిణాదిభేదంబులను స్త్రీలయందుఁ బద్మిన్యాదిభేదంబులను స్వీయాదిభేదంబులను స్త్రీపురుషుల యంతఃకరణలక్షణంబును వివరించునది కామశాస్త్రంబగు. ప్రాసాదంబులు నారామంబులు నిండ్లు ప్రతిమలు వాపీకూపంబులు నిర్మించు తెరవు దెల్పునది శిల్పశాస్త్రం బని ఋషులు చెప్పిరి.

సమముగను న్యూనముగను నధికముగను సాదృశ్యాదిభేదముల నన్యోన్యగుణభూషణాదివర్ణనంబు లెద్దానఁ జెప్పఁబడు నది యలంకృతి. మఱియు నందుఁ గావ్యభేదములును గుణములు రసములు ధ్వన్యాదులు నిరూపింపఁబడు. సరసములు సాలంకారములు సగుణములు నదుష్టములునగు ర్థములు కావ్యము లనంబడు; అవి పద్యాదిభేదమున విలక్ష చమత్కారజనకంబులగు; లోకసంకేతానుసారముగ నెల్ల నర్థంబు సులభముగ గ్రహించునట్లు ప్రయోగించువాక్య తము దైశికి యనంబడు. సమయానుసారముగఁ బ్రశంసిం వాక్యసముదయం బవసరోక్తి. ఇజ్జగమునుత్పత్తికి నీశ్వరుఁ కారణంబనియు నతఁ డెప్పుడు నదృశ్యుండనియు శ్రుతిస్మృ లతో వినాగ ధర్మాధర్మనిర్ణయం బగుననియుఁ బ్రతిపాదిఁ వేదవిరుద్ధములయిన యాచారములఁ బ్రకటించుమతము వనము. కల్పితశ్రుతి మూలము లేని యమూలము లేని లచే ధృతములయిన సదాచారములు దేశధర్మములు. దేశదేశమునందును గులకులమునందును వేర్వేఱ గ్రహిం వదియని యిట్లు విద్యలకెల్లఁ బార్థక్యమున లక్షణములు నె కలలకు నామములు లక్షణము నుశనుండు చెప్పెఁదొడం కలలకుఁ బ్రత్యేకము నామమును లక్షణమును లేవు గ యవి క్రియాభేదమున భేదిల్లు. హావభావాదులతోడి న మును, దతానద్ధాద్యనేకవిధంబు లయిన వాద్యముల వాదనవిజ్ఞానమును, స్త్రీలకుఁ బురుషులకు వేర్వేఱ వస్త్రాలంకారసంధానమును, బెక్కుభూమికలు రచియించు నైపుణ్యమును, సెజ్జలు నాస్తరణములు రచియించు నేర్పును

బలు తెఱఁగులఁ బుష్పమాల్యగ్రథనమును, ద్యూతాద్యనేక క్రీడనములఁ బ్రజారంజనమును, ననేకసంవిధానముల యువతీజనసంతోషణము నను కలాసప్తకము గాంధర్వమున నుదాహృతం బయ్యె. మద్యంబులుం బానకంబులు రచియించు వైశారద్యంబును, సిరావ్రణంబుల వేధించుటయందును గూఢంబులయిన శల్యంబుల నుద్ధరించుటయందును సామర్థ్యంబును, హీనరసంబు నధికరసంబు సమరసంబునగున ట్లన్నాదిపచనవిజ్ఞానంబును, వృక్షలతాదులకుఁ బ్రసవఫలాద్యుత్పత్తి తత్పాలనంబులకు సాధనంబులగు దోహదంబుల నెఱుకయు, ధాతుపాషాణాదులద్రుతియు వానిభస్మీకరణంబును, ఇక్షువు నుండి మధురపదార్థంబుల రచియించు నైపుణియు, ధాతువులఁ గలుపు విన్నాణమును వానిని వేఱుసేయు తెల్వియు, ధాత్వౌషధముల సంఘటించుజ్ఞానము, లోహంబుల సంయోగంబున లోహాంతరము నిర్మించు జ్ఞానమును, క్షారనిష్కాసనము, నను కలాదశకం బాయుర్వేదమున గ్రథితంబయ్యె. వేర్వేఱు పాదవిన్యాసముల నస్త్రప్రతిక్షేపణమును, సంధుల నాకర్షించియు బాధించియు మల్లయుద్ధము సేయు కౌశలమును, దూరమునుండి యస్త్రముల లక్ష్యవిభేదనమును, గాహళాదిసంకేతముల గ్రహించి వ్యూహముల రచియించు నైపుణియు, గజాశ్వాదుల గతివిజ్ఞానమున వానియుద్ధాదుల నియోగించు కౌశల్యము నను నైదుకలలు ధనుర్వేదోదితములు. మల్లయుద్ధ మశస్త్రముగఁ బిడికిళ్లతోడను బాహుల తోడన చేయునది. అందు మృతునకు స్వర్గముగాని కీర్తిగాని రాదు కాఁబట్టి బలదర్పము లుడుగునందాఁకన కావించునది; కాని ప్రాణాంతమువఱకుఁ గావింపరాదు. వివిధములగు నాసనముల ముద్రలను దేవతాతోషణము తంత్రోదితము. సారథ్యమును, గజాశ్వాదులకు గతిశిక్షణమును, మృత్తికను గాష్ఠమునను బాషాణములను సువర్ణాదులను రచింపఁబడిన భాండములకు మెఱుఁగు వెట్టుటయు నను నీనాల్గును వేఱుకలలయగు. చెఱువులు బావులు నూతులు మాడువులు నిర్మించు నైపుణియు, ఘట్యాద్యనేకయంత్రములయు వాద్యంబులయు నిర్మాణంబును, చిత్రాద్యాలేఖనంబును, వర్ణరంజనంబును, వాయ్వగ్ని జలసంయోగంబునను దన్నిరోధంబునను జమత్కారకరణంబును, రజ్జువిజ్ఞానంబును, బటచిత్రకం బలాదివయనంబును, రత్నంబుల దోషపద్విజ్ఞానంబును, నౌకారథాదియానకృతియు, స్వర్ణాదిధాతువుల యాథాత్మ్యవిజ్ఞానంబును, గృత్రిమంబులయిన స్వర్ణరత్నాదుల రచియించు నైపుణియు, స్వర్ణాద్యలంకార రచనాసామర్థ్యంబును, జర్మంబులకు మార్దవం బాపాదించురీతియు, లేపాదికరణంబును, పశుచర్మాంగనిర్హారక్రియాజ్ఞానంబును, దుగ్ధదోహంబును, దన్మథనంబున నవనీతాహరణంబును, గంచుకాదుల సీవనంబును నీతయు గృహభాండాది సమ్మార్జనంబును, వస్త్రసమ్మార్జనంబును, క్షురకర్మంబును తిలమాంసాదులనుండి చమురుదీయుట, హలకర్మంబును, వృక్షాద్యారోహణనైపుణ్యంబును, ప్రభుమనోనుకూలంబుగ సేవించు తెల్వియు, వేణుదళంబులను, తృణాదులను దాళపత్రంబులను వేత్రంబునను బుటికాకటాది నిర్మాణకౌశల్యంబును, గాచపాత్రంబులఁ జేయు చదురును జలంబుల సంధరించి విడుచు పాటవంబును, లోహంబున

శస్త్రాది క్రియాభ్యాసంబును, గజాశ్వాదులకుఁ బల్యాయనంబుల రచియించు నోడికంబును, శిశుసంరక్షణ ధారణ క్రీడనంబుల నేర్పును, దప్పుచేసినవారిని యుక్తంబుగఁ దాడితులఁ జేయు నేరిమియు, నానాదేశలిపిజ్ఞానంబును దల్లేఖనంబును, దాంబూలరచన రక్షణంబులుఁ, గలాగుణంబు లయిన శీఘ్రగ్రహణంబును, మందబోధనంబును గూడ నివి యఱువది నాల్గుం గలలు. ఎవఁ డేకల నాశ్రయించి జీవించు నిపుణుం డగు నతఁడ దానిం జేయునది.

ఇది విద్యాకలాస్వరూపనిరూపణ మను

తృతీయప్రకరణము

చతుర్థాధ్యాయము

చతుర్థప్రకరణము

ఆశ్రమములు

బ్రహ్మచర్యంబును గార్హస్థ్యంబును వానప్రస్థంబును సన్న్యాసంబు నను నాశ్రమంబులు నాల్గును బ్రాహ్మణులకుఁ గ్రమంబున విహితంబులు. క్షత్త్రియాదులకుఁ జరమంబు గాక తక్కిన యాశ్రమంబులు విహితంబు లయ్యె. విద్యాభ్యాసార్థంబు బ్రహ్మచర్యంబు నెల్లవారిం బోషింప గార్హస్థ్యంబును దీర్థసేవార్థంబును శమదమాద్యభ్యాసార్థంబును వానప్రస్థంబును మోక్షార్థంబు సన్న్యాసంబును విహితంబు లయ్యె. విప్రాదులెల్లను గులాచారంబులకు విరుద్ధంబుగఁ జరించిన రాజునకుఁ దప్పక దండ్యు లగుదురు. రాజుచే నుపేక్షితంబులు దండంబున నదండితంబులు నయి కులంబుల కులత్వంబు నకులంబులు కులీనత్వంబుం బొందును. వారు గ్రమంబున మంత్రజపపరాయణులును దపోనిష్ఠులును దీర్థసేవాసక్తులును సంచరణ శీలురును గావలయు. రాజు లుపేక్షించిన నాచారహాని వాటిల్లుం గావున జాగరూకులయి సదాచారప్రవర్తకులు గావలయు.

స్త్రీసాధారణము లగు ధర్మములు

స్త్రీలకుఁ బతిశుశ్రూష గాక జపతీర్థసేవాదికంబు గావింపం జనదు. స్త్రీలకుఁ బతికంటె వేఱుగాఁ ద్రివర్గసాధ

నంబు లేదు. భార్య భర్తకంటెఁ బూర్వము నిద్రనుండి లేచి ముఖప్రక్షాళనాది దేహశుద్ధిం గావించికొని పాన్పుల నుత్థాపించి మార్జన లేపనంబులచే గృహశోధనంబుఁ గావించి సానలంబయిన ముంగిటిం జేరి స్నిగ్ధంబులయిన యజ్ఞపాత్రంబుల నుష్ణోదకంబున శోధించి తొలఁచి యుండవలయుచోట్ల నిల్పి శోషింపఁజేసి పూరింపవలయువానితోఁ బూరించి రక్షించునది. మఱియు వంటయింటిపాత్రంబుల వెలికిఁ దెచ్చి ప్రక్షాళించి మృత్తికతోఁ బ్రొయ్యినలికి యం దగ్ని నింధనంబుల నునిచి రసంబు (పేయంబు)ల నన్నంబుల నింట నున్న ద్రవ్యంబుల వ్యవహారార్హభాజనంబులఁ జింతించి యత్తమామలకు మ్రొక్కి వారిచేతను మగనిచేతను,దల్లిదండ్రులచేతను, సోదర మాతులబాంధవులచేతను దత్తము లగు వస్త్రాలంకార రత్నములను ధరించుచుండునది. కలత్రం బిట్లు పూర్వాహ్ణకృత్యంబులం గావించి మనోవాక్కర్మంబుల శుద్ధురాలయి భర్తృనిదేశవర్తినియయి నీడయుంబోలె నెల్లపుడు ననుగతయై యతని హితకార్యంబులం జెలివలె నిర్దిష్టకార్యంబుల దాసివలె నుండునది. పిమ్మట నామె వంట గావించి మగనికి నివేదించి వైశ్వదేవార్థ ముద్ధృతమైన యన్నముకంటె మిగిలినదాన భోజనీయుల భుజియింపఁజేసి పిమ్మటఁ బతికి బోనంబు వడ్డించి తదనుజ్ఞాతయై తానును భుజింఘుంచి యా యవ్యయచింతచే నహశ్శేషంబుఁ గడపునది. సాధ్వియగు నింతి మరల సాయంకాలమునను మరలఁ బ్రాతఃకాలమున నిట్లు గృహశుద్ధిని బాకంబును గావించుచు సభృత్యుఁ డయిన పతిని భుజియింపఁ జేయుచుఁ దాను సాయంతనమున నధికంబుగాకుండ భుజి

యించి గృహకృత్యంబుఁ దీర్చి శయనీయంబులఁ బఱచి పతి కుపచారంబు సేయుచు నతఁడు నిద్రింపఁ దానును శయనంబు నధివసించి భర్తృగతమానసయు నప్రమత్తయు జితేంద్రియయు నవివసనయు నై శయనించునది. ఉచ్చైస్స్వనంబుగను బరుషంబుగను నేవారితోడను వివదింపను బ్రలాపింపను దగదు. మఱియు సాధ్వి ప్రమాదరోషేర్ష్యావచనంబుల నిందితవచనంబులఁ బైశున్య హింసాహంకారదర్పవచనంబుల నుడుగుచు నాస్తిక్య హింసాస్తేయదంభ 'సాహసంబుల వర్జించి ధర్మార్థావిరోధిని యయి యతివ్యయశీల గాక పతిని దైవతముగా భావించి యుపచరించుచున్నది యగుచు నీ లోకంబునఁ గీర్తిసుఖంబులను బరలోకంబునఁ బతిలోకంబును బడయు. ఇది యింతులకు నిత్యకృత్యంబు. మీఁద నైమిత్తికంబయిన కార్యంబు చెప్పంబడు. వనిత రజస్వల యయిన మున్ను చెప్పంబడిన కార్యముల నెల్ల నుజ్జగించి యెవ్వనికంటం బడక లజ్జితయై యంతర్గృహంబునకుం బోయి యేకవస్త్రయుఁ గృశయు దీనయు స్నానాలంకారవర్జితయు నప్రమత్తయు నై భూమిని పన్నుండుచు మూఁడు రాత్రులు వసించునది. అట్టి కాంత నాల్గవనాఁడు సూర్యుఁ డుదయింప సచేలస్నానంబు గావించి భర్తృముఖంబుం గాంచి శుద్ధురాలగుచున్నది. ఇట్లు శుద్ధయై పూర్వమునంబోలె నెల్లకర్మములం గావించునది. ఈ ధర్మంబు ద్విజాతిస్త్రీలకుఁ దఱుచుగాఁ బెఱయింతులకును విహితంబు. కాని పెఱయింతులు కృషివాణిజ్యాది పురుష కార్యంబులకు నుపకరించువారు గావలెను. భర్త మరణించిన ననుగమనంబు గావింపనినాఁడు పరగృహంబునకుఁ బోవ నిచ్ఛ

యింపక సర్వాభరణవర్జితయై బ్రహ్మచర్యంబుననుండి భర్తృవ్రతంబుఁ బాలించుచుండునది. ప్రోషితభర్తృకయు మంగళార్థంబులయిన యలంకారంబులఁ గాక తక్కినవాని వర్జించి పతిహితార్థంబు దేవతారాధనతత్పర యై యుండునది. స్త్రీలెల్లప్పుడును సంగీతంబులను మధురాలాపంబులను భర్త వశంవదుండగునట్లు ప్రవర్తించుచు భర్తృసముం డగు బంధువును సుఖంబును బ్రభువును లేఁడు గావున సర్వస్వంబుం బరిత్యజించి యతనిన శరణంబు నొందునది. ఇంతికిఁ దండ్రియు సోదరుండును బుత్రుండును జుట్టంబులును మితంబుగ నిత్తురు పతియొక్కండ సర్వస్వంబు నివేదించు. అట్టివానిఁ బూజింపని యువిదల కెట్టు సుఖంబు గలుగు.

శూద్రధర్మము

శూద్రుండు చతుర్థవర్ణుండయ్యు సత్కర్మానుష్ఠానంబున కర్హుండ కాని వేదోక్తంబు లయిన మంత్రంబులను స్వాహాస్వధావషట్కారంబులను వదలి పురాణేతిహాసోక్తంబులును నమోంతంబులు నగు మంత్రంబుల సకలకర్మంబులు సేయందగు. బ్రాహ్మణులచే వివాహితలగు యువతులందు జన్మించినవారు బ్రాహ్మణుండునుంబోలెను క్షత్త్రవిన్నలయందు జనియించినవారు క్షత్త్రియుండునుంబోలెను వైశ్యోఢలయందుఁ బుట్టువారు వైశ్యుండునుంబోలెను గర్మంబులు గావించువారు గావలయు. విప్రులవలనను క్షత్త్రియులవలనను వైశ్యాంగనలయందును శూద్రాంగనలయందు నుత్పన్ను లగువారు శూద్రుండునుంబోలెఁ గర్మంబులు గావించునది. అధముం

డగు పురుషువలన నుత్తమ యగు వనితయందు జాతుండు శూద్రాధముఁడు గాన వారికంటె హీనంబుగ నమోమంత్రంబునన సత్కర్మంబుల నాచరించునది. పాశ్చాత్త్యులు నుత్తరదేశవాసులు నగు యావనులు వేదంబు లప్రమాణంబులనియుఁ దద్భిన్నంబు లయిన వచనంబులు ప్రమాణంబులనియుఁ జెప్పుదురు. వారికి హితార్థంబుగ వారి యాచార్యులచే నట్టిశాస్త్రంబు నిర్మింపఁబడె; కాని లోకవ్యవహారానుకూలంబయిన నీతిశాస్త్రం బెల్లవారికి సమం బయి యుండును.

జన్మగుణముల ప్రాశస్త్యము

విశ్వామిత్ర వసిష్ఠ నారదాదులకుఁబోలె నీచమధ్యమాదిభావంబు లొక్కప్పుడు క్షేత్రమాహాత్మ్యంబునను మఱియొకప్పుడు బీజానుభావంబునను జనులకుఁ గల్గుచుండు. విశ్వామిత్ర వసిష్ఠ నారదాదులు స్వతపస్సామర్థ్యంబునన యుత్తమత్వంబు వడసిరి కాని జాతివలనం గారు. ఎల్ల జాతుల వారుం దమకు విహితంబులుం బూర్వాచరితంబులు నగుధర్మంబుల నాచరింపకున్న రాజులచే నవశ్యంబు దండనీయు లగుదురు. ఎల్లకులంబులవారు నెల్లయాశ్రమంబులవారు వేర్వేఱు చిహ్నంబులఁ దెలిసికొనఁదగినట్లుండ వలయు.

పనివాండ్ర రక్షణము

ధాతుకారుల జంత్రంబులు లోనగు పదార్థంబు లెల్ల రేల నారెకులచే ఱేండ్లు రక్షించుచుండ వలయు. మఱియుం గారుశిల్పాదిగణంబు నెల్ల స్వరాష్ట్రంబునఁ గాలాంతరంబుననేని కార్యంబు గలుగనోపు నని రక్షించుచు నందు మిగుల

ధూర్తు లుందురు గానఁ బెక్కం డ్రున్నయెడ వార లలసులు గాకుండ సేవాకార్యంబుననేని కృషికర్మంబుననేని భృత్యపదంబుననేని నియోగించునది.

గంజాగృహంబు గ్రామోపశల్యంబున నిర్మింపించి మద్యపుల నందు నిల్పుచు దివాభాగంబునఁ దనదేశంబున నొక్కఁపుడేని మద్యపానంబు లేకుండఁ జేయుచు నిక్కార్యంబున రాజు మిగుల మెలఁకువ గల్గియుండునది.

వృక్షలతాది స్థాపనము

మఱియు గ్రామంబున గ్రామ్యంబులు నరణ్యంబున నారణ్యకంబులు నగు వృక్షలతాదుల నుత్తమంబు లగువాని వింశతికరంబుల దూరంబునను మధ్యమంబు లగువాని బదియు నయిదుహస్తంబుల దూరంబునను సాధారణంబులగువాని బదికరంబుల దూరంబునను గనిష్ఠంబులగు వాని నైదుమూరల దూరంబునను నాఁటించి యజావి గోమహిష్యాది శకృత్తులను జలంబులను మాంసాదిదోహదంబులను వానికిం దగునట్లు రక్షణంబు రాజు గావించుచు వృద్ధియగునట్లు సేయవలయు. వృక్షలతాదులు దేశంబున వృద్ధి యగుకొలఁదిని క్షేమంబు గలుగు నని పెద్దలు సెప్పుదురు. ఉదుంబరాశ్వత్థవటచించాచందనజంభలంబులును గదంబాశోకవకుల బిల్వామృత కపిత్థంబులును రాజాదనామ్ర పున్నాగచంపకంబులును నీపపరశదాడిమాక్షోటంబులును శింశుపా బదర నింబజంబీరంబులును ఖర్జూర కుద్దాలలవలీ ధాత్రీ మాతులుంగకంబులును నారికేళ గంభాజంబువులు చాంపేయమల్లికాకురువకంబులు

నింకను సుఫలంబులు సుపుష్పంబులు నగు నితరవృక్షంబులును గ్రామ్యంబులు గాన వానినెల్ల గ్రామంబులందునేఁ దత్సమీపంబుననే నారోపించి వర్ధిల్లఁజేయుచుఁ గంటకవతంబులును ఖదిరాదులును దమాలకుటజార్జునపలాశంబులును సప్తపర్ణ శమీ దేవదారువికంకతంబులును భూర్జవిషముష్టి కరవీరకాదులును హారీతక భల్లాతపుష్కరంబులును బీతద్రు శాల్మలివిభీతకంబులును బబ్బులాదులు గుల్మవంతంబు లగు నీవృక్షంబులు నారణ్యాకంబులు గావున వాని నరణ్యంబునందు నాటించి భూపతి పెరుఁగఁజేయునది.

కూపాదులనిర్మాణము, దేవాలయాదినిర్మాణము

మఱియు బావులు నూతులుఁ బుష్కరిణులుం దటాకంబులును విశాలంబులుగఁ ద్రవ్వించి నలుప్రక్కల సోపానంబులు గట్టించి రాజు తనదేశంబున నెల్ల జలసమృద్ధి యగునట్లు సేయుచు నదులయందు సుమనోహరంబుగ సేతువులు నిర్మింపఁ బంచుచు వానియందు నౌకాదితరణసాధనంబు లుభయపారంబుల నుండ నియోగించుచు నేజాతి విద్య కెవ్వఁడు గురువగు మఱియు నేజాతికి నెద్దేవుఁడు పూజ్యుం డగు వారి గృహంబు లావీథికి మొదల నిర్మింపించుచు శృంగాటకంబుననేని గ్రామమధ్యంబున నేని శివునకు విష్ణునకు గణపతికిని రవికిని దేవికిని మేర్వాది షోడశవిధంబులలో నెట్లయినను మనోహారంబులు సచిత్రంబులు జలమూలంబులు సమండపప్రాకారంబులు నగు ప్రాసాదంబుల వర్తులంబులనేని చతురశ్రాకారంబులనేని యంత్రాకారంబులనేని శాస్త్రోక్తంబులయిన ప్రతి

మలతో నిర్మింపించునది. వీనియుచ్ఛ్రాయంబు వైశాల్యంబునకు ద్విగుణంబేని త్రిగుణంబే నగు. సహస్రశిఖరంబులచే రమ్యంబును సపాదశతభూమికంబును సహస్రహస్తవిశాలోచ్ఛ్రాయంబునయిన యాలయంబు మేరుసంజ్ఞం బొలుచు. ఒకదానికంటె నొకటి యష్టమాంశహీనంబు లగునవి మందరాదులు. ఋతుమాలియు ద్యుమణియుఁ జంద్రశేఖరంబు మాల్యవంతరబుఁ బారియాత్రంబు రత్నశీర్షంబు ధాతుమంతంబు పద్మకోశంబు పుష్పహాసంబు శ్రీకరంబు స్వస్తికంబు మహాపద్మంబు పద్మకూటంబు విజయంబును నాదిపదగ్రాహ్యంబులు. వీనికిం దగినంతయుఁ బాదహీనంబగు నుచ్ఛ్రాయంబు గలదియు నగు మండపంబును ముందటి ప్రదేశంబునఁ గల్పింపవలయు. ఇట్లు దేవళంబులు గల్పించి వానియందుఁ బ్రతిష్ఠాపకులారాధ్య దేవతాధ్యానపూర్వకంబుగఁ బ్రతిమలఁ బ్రతిష్ఠింపవలయు.

ప్రతిమాభేదము, వాని స్వరూప నిర్మాణాదులు

ధ్యానయోగసిద్ధికై ప్రతిమా లక్షణంబు చెప్పంబడె. ప్రతిమలం జేయువాఁడు ధ్యానపరుండయి ధ్యానానుసారముగ నిర్మించునది. ధ్యానముకంటెఁ బ్రతిమాలక్షణముఁ దెలిసికొన వేఱుసాధనము లేదు. ప్రతిమానిర్మాణంబునఁ బ్రత్యక్షపరిశీలనము ననుపయుక్తము. ఇసుముతోడను బిండితోడను రంగులతోడను గాజురంగుల పూతతోడను మంటితోడను గఱ్ఱులతోడను రాలతోడను వెండి బంగారు మొదలగు వానితోడను జేయంబడిన విగ్రహంబులలో నుత్తరోత్తరంబు

స్థిరంబని యెఱుంగునది. శాస్త్రోక్తంబులగు నవయవంబులతోఁ బూర్ణంబు సుమనోహరంబు నగు విగ్రహంబు పుణ్యంబు గల్గించు. వేఱువిధం బగునది యాయుర్ధనహరంబు నెల్లపుడు దుఃఖము వర్ధిల్లఁజేయునదియు నగు. దేవతావిగ్రహములు విలక్షణంబులయ్యు శ్రేయస్కరంబులు స్వర్గ్యంబులు నగు. కాని మానవాదిబింబంబులు సలక్షణంబులయ్యు నసుఖంబులు నస్వర్గ్యంబులు. శాస్త్రోక్తప్రమాణంబు కంటె నధికంబు హీనంబుగాని బింబంబు రమ్యంబు నాఁబడు. దేవతాప్రతిమ లెల్ల సాత్వికాదిగుణభేదంబునఁ ద్రివిధంబులయి యుండు. విష్ణ్వాదిప్రతిమల కెల్ల నెచట నెట్టిపూజ తగియుండు నచట నట్టిపూజ ప్రతిష్ఠాపకులు చేయించుచుండవలయు. యోగముద్రాన్వితయు వరాభయకరయుతయు స్వస్థయు నింద్రాదిదేవతాస్తుతినుతయు నగు ప్రతిమ సాత్వికి యనంబడు. నిల్చియున్నదియేని వాహనంబున నున్నదియేని నాభరణభూషితయు శస్త్రాస్త్రాభయవరకరయు నగు ప్రతిమ రాజసి యగు. శస్త్రాస్త్రంబులతోఁ గూడి దైత్యాదుల హింసించుచున్నదియు నుగ్రరూపయు యుద్ధాభినందినియు నగు ప్రతిమ తామసి యగు. సంగ్రహంబుగ వాని ధ్యానంబును సువిస్తరంబుగ నాప్రతిమలయు వానియంగంబులయుఁ బ్రమాణంబును నింకఁ జెప్పఁబడు

ఎల్లవారికిని వారివారి పిడికిట నాల్గవయంశం బంగులంబనియు నట్టి యంగులంబులు పదియు రెండయిన నొక్కతాలం బనియుఁ బ్రమాణజ్ఞులు చెప్పుదురు. వామని యగు మూర్తి సప్తతాలయు మానుషియగుమూర్తి యష్టతాలయు దైవియగుమూర్తి నవతాలప్రమాణయు రాక్షసమూర్తి దశ

తాలమితయుఁ గావలయు. మూర్తులకు దేశభేదంబున సప్త తాలాద్యున్నత్యంబు కల్పితం బయ్యె. స్త్రీమూర్తియు వామన మూర్తియు నెన్నండు సప్తతాలోన్నతయ కావలయు. నర నారాయణ విగ్రహంబులును రామప్రతిమయు నరసింహ మూర్తియు దశతాలప్రమాణంబు లయి యుండు. బాణుండు బలీంద్రుఁడు భార్గవుండు నర్జునుండును దశతాలు రని చెప్పం బడిరి. క్రూరులగు చండీభైరవవేతాలురును హయశీర్షుండును షోడశతాలురు. మఱియుఁ బైశాచీవిగ్రహంబులు నాసురవిగ్రహంబులు నెల్లపుడు షోడశతాలోన్నతంబుల కావలయు. హిరణ్యకశిపుండును వృత్రుండును హిరణ్యాక్షుండును రావణ కుంభకర్ణులును నముచియు శుంభనిశుంభులును మహిషాసురుండును రక్తబీజుండు ననువారి విగ్రహంబులు షోడశతాలోన్నతంబులై యుండునది. బాలవిగ్రహంబులు పంచతాలంబులును కుమారవిగ్రహంబులు షట్తాలంబులు నగు. కృత యుగంబున విగ్రహంబు లెల్ల దశతాలప్రమాణంబులును త్రేతయందు నవతాలయుతంబులును ద్వాపరంబున నష్టతాల మాత్రంబులును గలియందు సప్తతాలద్వయసంబులు గావలయు ననియుం జెప్పుదురు. నవతాలప్రమాణంబు మూర్తి యగునపుడు ముఖం బేకతాలంబు లలాటంబు చతురంగులంబును బిమ్మట నంతయె నాసికయు నాసికకుఁ గ్రిందిభాగంబు హనువువఱకును నాల్గంగులంబులును గ్రీవ నాల్గంగులంబులును హృదయం బొకతాలంబును నెదకుఁ గ్రిందటి ప్రదేశంబున సురమ్యంబయిననాభి యొకతాలప్రమాణంబును దానికిఁ గ్రిందిభాగంబున ననురూపం బగు లింగంబును నూరుపరిమా

ణంబు రెండుతాలంబులును జానువులు నాల్గంగులంబులును జంగలు రెండు తాలంబులును గుల్ఫంబులకుఁ గ్రింద నాల్గంగులంబులు నుండునట్లు శిల్పిచేఁ బ్రతిష్ఠాపకులు ప్రతిమల నిర్మింపఁజేయునది. ఇది నవతాలప్రమాణం బయిన విగ్రహావయవనిరూపణం బని బుధులు సెప్పుదురు. దీని ననుసరించి సప్తతాలప్రమాణంబులకు నష్టతాలప్రమాణంబులకు దశతాలోన్నతంబులకు నవయవనిరూపణంబు సేయందగు. మఱియు నెల్లయర్చలకు సిగమొదలు కేశాంతంబుదనుక మూఁడంగులంబుల పరిమాణంబును బాహువులంగులులతో నాల్గు తాలంబుల పరిమాణంబు గలవియు నందుఁ గందంబు మొదలు కొని కూర్పరంబుదనుక నిరువది యంగులంబుల పరిమితి గలవియు నగునట్లును గక్షంబులనుండి కూర్పరంబుదాఁకఁ బదియు మూఁడంగులంబు లుండునట్లును మధ్యమాంతంబయిన కరం బిరువదియెన్మి దంగులంబులు గలిగియుండునట్లును జేయించు టుత్తమంబు. మఱియుఁ గరతలంబున కే డంగులంబులును నడిమివ్రేలి కయిదంగులంబులు నుంగుటంబునకుఁ దర్జనీమూల పర్వంబు నొందునట్లుగాఁ బరిమాణంబు సార్ధత్ర్యంగులంబును రెండుపర్వంబులును దక్కినవానికి మూఁడేసి పర్వంబులును దర్జన్యనామికలకు మధ్యాంగులంబుకంటె నర్ధాంగులంబు న్యూనంబుగను గనిష్ఠిక కనామిక కంటె నొక్కయంగులంబు తక్కువ పరిమాణంబును నుంచునది. పిమ్మటఁ బాదంబులకుఁ బదియు నాలుగంగులంబులును దక్కిన వ్రేళ్ళకు సార్ధైకాంగులంబును బరిమాణంబు గలుగునట్లు శిల్పజ్ఞుఁ డొనర్చునది.

ఇంకను పాణిపాదములును గుల్ఫములును సిరలు గన్పింపకుండునట్లును బ్రతిమావిశారదులు నిర్ణయించిన యీ యవయవంబు లింతకంటె నధికంబుగను న్యూనంబుగను నుండనట్లును శిల్పులు మిగుల మెలఁకువతో విగ్రహంబులఁ జేయునది. కృశంబులనేని స్థూలములనేని యన్ని యవయవంబులను రమ్యంబు లయిన యర్చలు పెక్కిటియం దొక్కటి యుండుం గాని యన్నియు నుండవు. శాస్త్రవిహితపరిమాణానుసారంబుగ నిర్మింపఁబడిన యంగంబులతోఁ గూడిన ప్రతిమలె విద్వాంసులకు రమ్యంబులగుంగాని తద్విరుద్ధంబులట్టివి గానోపవు. మనంబు రంజించు విగ్రహంబులె రమ్యంబులు గాని శాస్త్రవిహితంబులు గావని కొందఱందురు. మఱియు మున్ను చెప్పిన పరిమాణం బౌన్నత్యంబునకును మీఁదం జెప్పునది వైశాల్యంబునకు నగు.

విగ్రహంబులకు నెనిమిదంగులంబుల విశాలంబయిన లలాటంబును నంతటి భ్రూవులును మూఁడంగులంబుల నేత్రంబులు నందు నడుమ నొక్కంగులంబు కనీనికయు రెండంగులంబుల భ్రూమధ్యంబును నాసామూల పరిధి యొకయంగులంబును దద్బిలద్వయంబున కంగులద్వయ వైశాల్యంబును శ్లక్ష్ణంబయిన నాసిక యౌన్నత్యంబు సార్ధైకాంగులంబును గంధరామూలంబు మొదలుకొని యంసపర్యంతము నెన్మిదంగులములు రెండుబాహువుల నడిమితావు రెండుతాలంబులును స్తనమధ్యం బేకతాలంబును రెండుకర్ణంబుల నడిమితావు పదియు నాఱంగులంబులును గర్ణంబులకు నెలవులకు మధ్య నెన్మిదంగులంబులును నాసకు గర్ణంబులకు మధ్య

నంతయె యంతరంబును నేత్రంబులకుఁ గర్ణంబులకు మధ్య నాల్గంగులంబులును శిరంబునకుఁ జుట్టుకొలఁది ముప్పదిరెండంగులంబులును దైర్ఘ్యంబు ద్వాదశాంగులంబును గ్రీవామూలంబు చుట్టుకొలఁత యిరువదిరెండంగులంబులు గలుగునట్లు నుదరమధ్యపరిధి యేఁబదినాల్గంగులంబులును హృదయపరిధి నలువదియేడంగులంబులును స్తనదేశంబు మొదలు చరమాంగంబువఱకు నొక్కతాలంబు పృథుతయుఁ గటిపరిమాణంబు ముప్పదియెనిమిదంగులంబులును స్తనోత్సేధంబు నాల్గంగులంబులును విస్తారంబు నాఱంగులంబులును స్త్రీప్రతిమ యైనయెడ నితంబం బొకయంగులంబధికంబుగను భాహుమూలపరిధి పదియు నెనిమిది యంగులంబులును నగ్రపరిధి పదియు నాఱంగులంబులును పాదతలంబునకుఁ గరతలంబునకుఁ బరిధి పంచాంగులంబును నూరు మూలపరిధి ముప్పది రెండంగులములును వాని యగ్రపరిధియిరువదియంగులములును జంఘామూలమునఁ బదియు నాఱంగులములును గనిష్ఠికాంగుల మూలపరిధి మూఁడంగులములును దక్కిన వ్రేళ్ల మొదటిపరిధి సార్ధత్ర్యంగులమును మొదటి పరిమాణముకంటెఁ జివర నర్ధాంగుల హీనమును హస్తపాదాంగుష్ఠ మూలపరిధి క్రమంబుగ నాలుగు నయిదంగులములు నుండునట్లును నాభిమండలమున కంగులమును స్తనమండలమునకు నొకటియు నఱయంగులమును వైశాల్యము గలుగునట్లును సర్వావయవములకు శోభకుందగునట్లు పాటవముఁ బ్రతిష్ఠాపకుఁడు నిర్మింపించునది. ప్రతిమ నూర్ధ్వదృష్టిని నధోదృష్టిని నిమీలితాక్షి నుగ్రదృష్టిని గావింపక ధ్యానాను

కూలముగఁ బ్రసన్నాక్షిని గావించి ధ్యానించునది. ప్రతిమా పరిమాణమున సగముననేని మూఁడవయంశముననేని విగ్రహమునకుఁ బీఠముగల్పించి తత్పరిమాణముకంటె ద్విగుణముగ నేని త్రిగుణముగ నేని యెత్తుగ నాలయద్వారము నిర్మింపించి పీఠౌన్నత్యముకంటె దశకరోన్నతముగ గోడవెట్టించి ద్వారము నుచ్ఛ్రాయముకంటె ద్విగుణముగనేని త్రిగుణముగ నేని యధికముగఁ బ్రాసాదంబు నిర్మింపించి యందేకభూమిక మొదలు సపాదశతభూమికాపర్యంతము శక్త్యనుసారముగఁ గట్టించి నలుదిక్కుల మండపములు స్థాపకుఁడు నిర్మింపించునది. ప్రాసాదములనేని మండపములనేని శిఖరము నిర్మింపించు నెడల స్తంభములు నుపకుడ్యముల నిర్మింపించునది. గర్భాలయవిస్తారము విగ్రహప్రమాణముకంటె నయిదుగుణము లేని యాఱుగుణము లేని ప్రతిమకన్ని దెసలను లేకున్న నెదుటిదెసనయినను విశాలముగ నుండవలయు. ఏదేవతలకు రూపము చెప్పఁబడకుండు నాదేవతలకు నాల్గుభుజములును నాయుధంబులు చెప్పఁబడకున్న మీఁదికరముల నభయవరముద్రలును గ్రిందికరముల శంఖచక్రము లేని యంకుశపాశము లేని డమరుశూలము లేని కమలకలశంబు లేని జపమాలాపుస్తకము లేనియు యథాకామముగ నిలుపం దగు. ఏదేవునకు శిరోబాహుల్యము చెప్పంబడు నక్కడ గ్రీవాముకుటకంఠములు వరుసతో నేత్రకర్ణయుతముగ శిల్పి నిర్మింపఁ దగునుగాని బాహుబాహుల్యంబు చెప్పినచో స్కంధభేదంబు గల్పింపక మోచేతి క్రింది ప్రదేశమున దృఢముగ హస్తములఁ గల్పించునది. బ్రహ్మవిగ్రహమునకు మొగములు నలు

గడల నిర్మించునది. హయగ్రీవ వరాహ నరసింహ గణేశ్వర విగ్రహములకు ముఖభాగము గాక తక్కిన యవయవము లెల్ల నరాకారములయి యుండవలయు. నరసింహునకు నఖములును సింహనఖసదృశము లయి యుండవలయు.

ప్రతిష్ఠాపకుఁ డిష్టదేవతాప్రతిమను న్వాసనమునఁ గాని వాహనమునఁ గాని కూర్చున్నట్లును మీఁదటి లక్షణంబులతో హీనశ్మశ్రుని మేషయు షోడశవర్షదేశీయయు దివ్యాభరణభూషాఢ్యయు నాప్రపదంబు వస్త్రగూఢయు నగునట్లును నిర్మింపవలయును గాని ప్రతిమల హీనాంగుల నధికాంగులఁ గావింపం జనదు. హీనాంగి ప్రతిష్ఠాపకుని నధికాంగి శిల్పిని హింసించు. మఱియు నది కృశ యయ్యెనా దేశంబునకు దుర్భిక్షంబును స్థూల యయ్యెనా రోగంబును గావించు.

గూఢసంధ్యస్థిధమని యగుప్రతిమ శిల్పికిం బ్రతిష్ఠాపకునకు దేశంబునకు సుఖాభివృద్ధి గావించు. వరాభయశంఖాబ్జహస్త యయిన విష్ణుప్రతిమయు మృగడమరు వరాభయహస్త యగు శివమూర్తియు వరాభయకమల లడ్డుకహస్తం బయిన గణపతి విగ్రహంబును బద్మమాలాభయదకరంబయిన సూర్యవిగ్రహంబును వీణాభయవరాబ్జహస్త యగు లక్ష్మీమూర్తియు సాత్వికంబులు నితరలక్షణలక్షితంబు లితరంబులు నగు. మఱియు నీప్రతిమ లెల్ల లేఖ్యయు లేప్యయు సైకతియు మృణ్మయియుఁ బైష్టియు వార్క్షియు ధాతుపాషాణమయియు నని పలువిధములు. ఈ ప్రతిమలం దుత్తరోత్తర ప్రతిమ స్థిరయగు. ఇందు మొదటి యయిదింటికిని లక్షణంబు

లేకున్నను దోషంబులేదు. మఱియు బాణలింగంబులందును స్వయంభూవిగ్రహంబులందును జంద్రకాంత విగ్రహంబునందును గండకిం బుట్టిన మూర్తులందును మానదోషంబు లేదు. సువర్ణాదిధాతువులను బాషాణంబులను నిర్మించిన విగ్రహంబున దోషవిచారంబు సేయునది. కృతయుగంబున శ్వేతశిలను త్రేతను బీతశిలను ద్వాపరంబున రక్తశిలను గలిని గృష్ణశిలను శిల్పి విగ్రహంబులఁ జేయందగు. శ్వేత సాత్త్వికియు రక్తయుఁ బీతయు రాజసియుఁ గృష్ణవర్ణ తామసియు నని విద్వాంసులు సెప్పుదురు. కొందఱు కృతంబున సువర్ణంబునను త్రేతను రజతంబునను ద్వాపరంబునఁ దామ్రంబునను గలిని నారకూటంబునను విగ్రహనిర్మాణంబు చెప్పిరి. శివప్రతిమ శ్వేతవర్ణయు విష్ణుప్రతిమ కృష్ణవర్ణయు సూర్యశక్తి గణేశ్వరప్రతిమలు తామ్రవర్ణంబులును గావలయు నని బుధులు చెప్పుదురు. ఇట్లు లోహాసీసాదుల నిర్మించు ప్రతిమలను శాస్త్రవిహితప్రకారంబున నిర్మింప వలయు నని బుధులు వక్కాణించిరి. చలార్చయందేని స్థిరార్చయందేని సలక్షణంబయిన ప్రతిమ నాలయంబున స్థాపింపవలయును గాని సర్వసౌఖ్యవినాశనియయిన విలక్షణప్రతిమ నేవాఁడును స్థాపింపఁదగదు. మీఁదటి ప్రతిమాలక్షణంబు లన్నియు సేవ్యసేవకభావంబునందుఁ జెప్పఁబడినవి గాని ప్రమోదంబునకుఁ గల్పితంబులందుఁ గావు. ప్రతిమలయందుఁ బెక్కుదోషంబు లున్నను బరమేశ్వరాయత్తచిత్తుం డయిన యర్చకుని తపోబలంబున నవియన్నియు నశియించు. దేవత కెదుటనుండు మండపంబున విగ్రహంబులకంటె నర్ధపరిమాణంబున నేని పూర్ణపరిమా

ణంబున నేని యధికంబుగ నుండునట్లు శిల్పి వాహనంబులఁ గల్పించునది.

గరుడవాహనంబు రెండుబాహులు మోమునఁ జంచువు మంచికన్నులు శోభనపక్షంబులు నరాకారంబును గిరీటంబును గవచంబు నంగదంబులు గలిగి బద్ధాంజలియు నమ్రశీర్షంబు సేవ్యపాదాబ్జలోచనంబు నయి వెలయవలయు. మఱియు దేవతలకు వాహనత్వంబు నొందినపక్షులు సింహవృషభాది మృగంబులును గామరూపంబుల కాని విద్వాంసు లయిన శిల్పులు వానినామంబులకుఁ దగిన యాకారంబులతోడన దేవాలయమండపంబుల సుభూషణభూషితంబులుఁ దత్తద్దేవతాధ్యానతత్పరంబులు నగునట్లు నిర్మించునది. మార్జాలంబు నాకృతియుఁ బచ్చని వర్ణంబును నల్లనిచాఱలును పెద్దశరీరంబుం గలిగి సటలు లేనిది వ్యాఘ్రంబును సన్నంపునడుమును బెద్దకన్నులును విశాలంపుఁ జెక్కులును స్థూలంబులగు గనుబొమలును గలిగి ధూసరవర్ణంబయి కృష్ణలాంఛనంబులు లేనిదియై జడలుగల మనోహరాకారం బయిన మహాసత్త్వంబుగల జంతువు సింగంబు. సింగంబునకును శార్దూలంబునకును భేదంబు కేసరంబులచేతను లాంఛనంబులను వర్ణంబునన కాని తక్కిన యాకారంబునఁ గాన్పింపదు. గజాననునాకారంబు పృథూదరంబును లంబకర్ణంబును మహాస్కంధంబును సంక్షిప్తచరణంబును బీనహస్తంబును దీర్ఘశుండంబును భగ్నవామదంతంబు నిచ్ఛానుకూలవాహనంబును నగు నట్లును గూఢంబులగు నస్థులు సంధులు ధమనులు గలుగునట్లును బరిమాణానుసారంబుగ శిల్పులు నిర్మింపవలయు. శుండాదండం

బునకు నాల్గుతాలంబులు నాలంగులములును మస్తకము నకుఁ బదియంగులములును భ్రూగండంబులకుఁ జతురంగులంబులును గర్ణములకు దశాంగులదైర్ఘ్యము సప్తాంగులవిస్తారమును గర్ణముల కంతరంబు పదునాల్గంగులంబులును మస్తక పరిధి షట్త్రింశదంగులములును నేత్రములకుఁ గ్రిందికర పరిధి రెండుతాలములు రెండంగులములును దంతమున కాలంగులంబుల దైర్ఘ్యంబును, నూరుమూలపరిధి ముప్పదియాఱంగులంబులును, దదగ్రపరిధి యిరువదిమూఁడంగులంబులును, జంఘామూలంబునకు నిరువది యంగులంబులును, బాహుమూలపరిధి యంతకంటె రెండంగులంబు లధికంబును గంఠంబునకు మూఁడంగులముల దైర్ఘ్యంబు, నుదరంబునకుఁ జతుస్తాలపరిణాహంబును, గణపతి విగ్రహంబునకుఁ బరిమాణంబు విశేషజ్ఞులచేఁ జెప్పంబడియె. శక్తివిగ్రహంబులకుఁ బయోధరోత్సేధం బయిదంగులంబులుం గటి వైశాల్యంబు మూఁడు తాలంబులు రెండంగులంబులు నయియుండు. స్త్రీ విగ్రహావయవంబు లెల్లను సప్తతాలవిగ్రహంబునకుఁ దగినట్లు నిర్మించునది. అట్లయినను మొగము ద్వాదశాంగులంబు గావలయు. కంధరంబువలె శిరంబు వర్ధిల్లదు గాన శిశువిగ్రహంబులు హ్రస్వకంధరంబును బృథుశిరంబును గలిగియుండవలయు. బాలావయవంబులకుఁ బరిమాణనియమంబు లేదు గావున నవి శోభాఢ్యంబు లగునట్లు కల్పించునది. అయిదేండ్లకుఁ బిమ్మట నిరువదేండ్ల దనుక బాలుండును బదియునాఱేండ్లదనుక బాలికయు మిగుల వర్ధిల్లి తర్వాతఁ బూర్ణావయవసంపత్తి నొందుదురు. సప్తతాలాదిప్రమాణంబు విగ్రహంబుల కవయవసంపత్తి పూర్ణంబయిన వెనుక నిర్ణీతంబయ్యె.

కొన్ని విగ్రహంబులు బాల్యంబునను గొన్ని తారుణ్యంబునను గొన్ని వార్ధకంబునను నున్నట్లు రచియింప మిగుల శోభాఢ్యంబులగు. సప్తతాలమితం బయిన విగ్రహంబునకు మోము నకుఁ గ్రిందఁ గంఠంబున మూఁడంగులంబులును హృదయంబున నుదరంబున నొక్కొక్కట నవాంగులంబులును సక్థి సప్తదశాంగులంబులును జానువుల మూఁడంగులంబులును జంగలఁ బదియు నెన్మిది యంగులంబులును గుల్ఫంబులకుఁ గ్రింద మూఁడంగులంబులును బరిమాణం బుండవలయు. అష్టతాలమిత ప్రతిమకు జంగలయు నూరులయు మానంబు నిరువదియొక్క యంగులంబులును దక్కినవాని పరిమాణంబు సప్తతాలప్రతిమావయంబులకంటె నొక్కొక్క యంగులంబున నధికంబుగను నుండవలయు.

దశతాలంబయిన మూర్తికి ముఖహృదయంబులు నుదరవస్తులును త్రయోదశాంగుల మితంబులును గుల్ఫాధోభాగంబును గ్రీవయు జానువులును బంచాంగుళ మితంబులును నూరువులు జంగలు నిరువది మూఁడంగులంబుల పరిమితి గలవియు నేకాంగులమితం బయిన శిరోమణియు నేఁబది యంగులంబుల బాహువులు నుండవలయు. ఇంతకంటె హీనప్రమాణంబులయిన ప్రతిబింబంబుల యవయవంబులకెల్ల రెండేసి యంగులంబుల పరిమాణంబు తక్కువయై యుండు. దశతాలాధికప్రమాణంబు లయిన మూర్తుల యవయవంబులెల్ల మీఁదటి మూర్తుల యవయవంబులకంటె నొక్కొక్క యంగులంబున నధికమగు పరిమాణంబు గలవి యగునట్లు బుద్ధి

మంతుఁడయిన శిల్పి రచియించునది. దీర్ఘోరుజంఘయుఁ గ్రూరాకారయు భీషణియు నగు మూర్తి యాసురి యనియు నదియె మిగులం గృశయయ్యేనేని పైశాచియనియు విబుధులు వ్యవహరింతురు. సర్వప్రమాణంబులయందును జేతి నడిమి వ్రేలికి నాలంగులంబులకంటె నధికంబుగను నయిదంగులంబుల కంటె హీనంబుగను బరిమాణంబు శిల్పి నిర్మింపఁదగదు. మఱియు విగ్రహంబులు బాలసదృశంబులుం దరుణసదృశంబులు నిర్మింపఁదగుం గాని యెక్కుడేని వృద్ధసన్నిభంబులు సేయందగదు. దేశాధిపతు లిట్లు శాస్త్రప్రకారంబునఁ జేయంబడిన విగ్రహంబులఁ దమదేశంబున నెల్లచోట్ల బ్రతిష్ఠింపించి ప్రతివత్సరంబును వానికి మహోత్సవంబులు సేయింపించుచు దేవాలయంబున మానహీనయు భగ్నయు నగు ప్రతిమ నుండనీక శిథిలంబు లగు దేవళంబుల నుపేక్షింపక మహాయత్నంబున నుద్ధరించుచుఁ బ్రజలచేఁ జేయింపంబడు నుత్సవంబులెల్ల వర్ధిల్లఁజేయుచు దేవతలఁ బురస్కరించుకొని నృత్తగీతవాద్యాది సుఖంబు లనుభవించుచు బ్రజల దుఃఖంబున దుఃఖంబును దత్సుఖంబున సంతోషంబుం బొందుచుండునది.

ఇది శుక్రనీతిసారంబునఁ జతుర్థాధ్యాయంబునఁ జతుర్థప్రకరణము

చతుర్థాధ్యాయము

పంచమప్రకరణము

రాజధర్మము

ప్రజ స్వతంత్ర యయ్యెనేని స్వేచ్ఛానుసారంబుగఁ జరయించుం గాన రాజు జనుల వ్యవహారంబు లన్నియు బాగుగం బరిశీలించుచు దుష్టుల నిగ్రహించు చుండవలయు.

ఇష్టహాని గావించువాఁడు శత్రువును బాహ్యప్రచారుండు దుష్టుండు నని చెప్పంబడుదురు. రాజునకుఁ బ్రజేష్టసంపాదనంబు న్యాయ్యంబు. అదియె పాలనంబు ననంబడు. ఏవాఁడు నెవనికి ననిష్టంబు గావింపకుండ నివారించుటయె శత్రునాశంబును నేవాఁడును బాపంబుసేయకుండ శాసించుటయె దుష్టనిగ్రహంబు నని నీతికోవిదులు వల్కుదురు. సదసద్వివేకపూర్వకంబుగ నీ రెండు గుణంబులు గల రాజులకు స్వప్రజాధర్మసంస్థాపనంబును స్వార్థసంసిద్ధియు సులభంబు లయి యుండు.

సభానిర్ణయము

పార్థివుండు క్రోధలోభవర్జితుండయి యమాత్యుల తోడను బురోహితునితోడను బ్రాహ్మణులతోడను, బ్రాడ్వివాకునితోడను గూడి సమాహితాంతఃకరణుం డయి ధర్మశాస్త్రానుసారంబుగ రాచకజ్జంబులఁ గ్రమంబుగఁ బరిశీలించు

నది. బుద్ధిమంతుఁ డయిన రాజొండె సభ్యుఁడొండె నొక్క-
రుండు తగవులఁ బరిష్కరింపను రహస్యంబున వాదిప్రతి
వాదుల వివాదాంశంబు విననునొక్కపుడుం దగదు. రాగ
లోభ భయద్వేషంబులును నేకతంబున వాదుల యభిప్రా
యంబు వినికియు నను నైదును బక్షపాతారోపహేతువు లని
నీతిజ్ఞులు వల్కుదురు. ఏ రాజు సుఖ యయ్యుఁ బౌరజానపద
కార్యంబులు విచారింపకుండు నతఁడు ఘోరనరకంబునం బడు.
మఱియు నేయధిపతి మోహంబున నధర్మంబుగఁ గార్యం
బులఁ దీర్చు నతఁడు శీఘ్రకాలంబున శత్రువశుండగు. వాది
ప్రతివాదుల వచనంబులు విని శాస్త్రసభ్యనిరపేక్షంబుగ
రా జొక్కరుండ వివాదంబు దీర్చిన నుత్తమలోకహానియు
నాయుర్హానియు శత్రులవలని భయంబును స్వజనాపదయుఁ
బాటిల్లుం గాన శాస్త్రంబును సభ్యులం బురస్కరించికొని
వివాదంబులఁ దీర్చుచుండవలయు. రాజునకుఁ గార్యనిర్ణయంబు
సేయ నెడము లేనియెడ జితేంద్రియుండు నపక్షపాతియు
శాంతప్రకృతియుఁ బరలోకభీరువు ధర్మశాస్త్రజ్ఞుఁడు ననల
సుఁడు వేదవిదుండు నగు విప్రునిఁ దద్విషయంబున నియోగించు
నది. విద్వాంసుఁడగు బ్రాహ్మణుఁడు లభింపఁడేని ధర్మశాస్త్ర
జ్ఞులగు క్షత్రియాదుల నియోగించునది; కాని శూద్రు వర్జించు
నది. మఱియు రాజవంశ్యులు ప్రాయికంబుగ బుద్ధిమంతు లయి
యుందురు గాన వారినైనఁ దద్విషయంబున నియోగింపఁదగు.
వ్యవహారంబు నెఱిఁగినవారు ప్రాజ్ఞులు సద్వృత్తశీలురు గుణా
న్వితులుం బగఱయందు నెయ్యురయందు సములు సత్య
వాదులు నరివర్గంబు జయించినవారు ననలసులు ప్రియంవదులు

నగు నెల్లజాతుల వారిని సభ్యుల (Councillors) నృపతి కార్య
నిర్ణయార్థం బేర్పఱుచునది. మఱియుం గృషీవలులును గారు
వులును శిల్పులును వృద్ధిజీవులు శ్రేణులును నర్తకులును
మఱియు లింగులుం జోరులును వారివారి జాతితో సంబం
ధించిన ధర్మనిర్ణయంబు సల్పునపుడు తజ్జాతిధర్మంబు లితరు
లకు దుర్విజ్ఞానంబులు గావునఁ దత్తజ్జాతివృద్ధులన వాని
నిర్ణయింప రాజు నియోగించునది. ఆత్మహితంబు గోరు
రాజు బ్రహ్మచర్యాద్యాశ్రమంబుల నున్న వారి కాశ్రమ
ధర్మనిర్ణయార్థంబు వివాదంబు వొడమినపుడు విరుద్ధంబుగ
భాషింపక యోగులుం దపస్వులును మాయావిదులును సులభ
కోపులు గావున వారి వివాదంబులు వేదవిదులచేతన తీర్పింప
వలయును గాని స్వయముగఁ బరిశీలించి తీర్పఁదగదు. రాజు
లెస్సగ నెఱింగినవాఁడయ్యుఁ దపస్వులకు నాచార్యులకు నుప
దేశింపఁదగదు. అరణ్యవాసులను సార్థంబువారిని సైనికులను
వారివారి వివాదంబులు దీర్ప రాజు నియోగింపవలయు. ఎవ్వా
రెం దభియుక్తులు మఱి యెవ్వారెందు నియుక్తులు వారు దాని
గుణదోషంబులఁ బరిశీలింప రా జాజ్ఞాపింపవలయు. మఱియు
ధార్మికులు సుపరీక్షితులు పుంగవంబులువోలె వ్యవహారధు
రంధరులు నగు సభ్యులను ధర్మనిర్ణయార్థంబు నియోగించునది.
లోకాచారజ్ఞులును వేదజ్ఞులును ధర్మశాస్త్రజ్ఞులు నగు విప్రు
లేడ్గురేని యైదుగురేని మూవురేని యెచ్చట వసింతు రాసభ
(Assembly) పరమపావని యగు. ఆ సభయందుఁ జేయు ధర్మ
నిర్ణయంబు విచక్షణు లగువారు విన ననుజ్ఞ ధర్మాధికృతుం
డీవలయు. సభయందు నియుక్తుండయిన ననియుక్తుండయినను

ధర్మజ్ఞుండు శాస్త్రానుసారంబుగను సత్యంబుగను బల్కఁగానఁ బల్కనగు. విద్వాంసుఁ డట్టిసభకుఁ బోవఁదగదు. పోయిన సత్యంబు పలుకం దగు. ఎఱిఁగియు సత్యంబు పల్కనివాఁడును విరుద్ధంబు పల్కువాఁడును గిల్బిషంబు నొందు. రాజుచే విదితంబు లయిన కులగణాదు లెల్లను స్వకులోచితకర్మంబులఁ గావించుచు స్త్రీయాది దుష్కర్మంబులఁ గావింపక చరియించు. కులంబువారు విచారింపలేని కార్యంబు సభ్యులును వారు విచారింప శక్తులు గాని కార్యంబు తదధ్యక్షుండు (Officer) నతనికి సాధ్యంబుగాని కార్యంబు రాజును విచారింపవలయు. కులంబువారికంటె సభ్యులును వారికంటె నధ్యక్షుండు నెల్ల వారికంటె ధర్మాధర్మనియామకుఁ డయిన రాజు నధికులు గదా! ఉత్తమాధమమధ్యంబు లయిన వివాదంబులఁ దీర్చునపుడు ప్రభుబుద్ధులందఱ నతిక్రమించి వర్తిల్లు. ఒకవిద్య నధిగమించినవాఁడు ధర్మనిర్ణయంబు సేయ సమర్థుండు గాఁడు గావున రాజుచేఁ బెక్కువిద్యలు నేర్చిన యుత్తముఁడు వివాదంబుల ధర్మనిర్ణయార్థంబు నియోగింపఁబడవలయు. పెక్కుశాస్త్రంబుల నెఱిఁగిన యుత్తముండు చెప్పినది ధర్మం బగు. అధ్యాత్మవిచారంబు సేయువాఁ డొక్కఁ డయినను ధర్మనిర్ణయంబు సేయందగు. ఱేఁడు శ్రేష్ఠులయిన వేత్వేఱు ధర్మాధికారులతోఁ గూడి వ్యవహారానుచింతనంబు పెక్కుసారులు కావింపవలయు. ఎవఁడు వాదిప్రతివాదులను సభ్యులను లేఖకులం బ్రేక్షకులను ధర్మప్రతిపాదకవాక్యంబుల రంజించు నతఁడు సభ్యపదంబును దదధ్యక్షపదంబును బొందఁదగు.

సభాంగములు

నృపుఁడును, నధికృతుఁడు (Officer), సభ్యులును (Councillors) ధర్మశాస్త్రంబును, గణకుఁడు (Accountant), లేఖకుఁడును, హేమంబు, నగ్నియు, జలంబును, భటులు, ననుపదియు ధర్మాధికరణంబున కంగంబులు. ఈ దశాంగములు గల యేసభ నధివసించి రాజు కృతమతియై న్యాయము విచారించు నాసభ యజ్ఞసదృశం బయి వెలయు. ఈ యంగముల యందు నధికృతుఁడు వివాదవక్తయు రాజు శాసకుండును సభ్యులు కార్యపరీక్షకులుఁ గావలయు. స్మృతి నిర్ణయమును జపదానాదులం జెప్పును. హిరణ్యాగ్నులు శపథార్థమును జలము తృషానివారణార్థము నుపయోగించు. గణకుఁ డర్థముల గణియించు. లేఖకుఁడు ప్రకృతంబయిన న్యాయము లిఖియించు. (భటు లూడిగము సేయవలయు.) శబ్దార్థముల నెఱిఁగినవారు శుచులు నానాలిపిజ్ఞులు గణనాకుశలులు నగు గణక లేఖకులు రాజుచే నియోగింపఁబడవలయు. ఎల్లజనుల వ్యవహారములు ధర్మశాస్త్రానుసారముగ నిందు మిగులఁ బరిశీలింపఁబడుటం జేసి యీసభ ధర్మాధికరణము (Court of Justice) నాఁబడు. పార్థివుండు వ్యవహారముల విచారింపఁగోరి శుచులగు బ్రాహ్మణులతోడను మంతనంబు నెఱిఁగిన యమాత్యులతోడను వినీతవేషుండై సభం బ్రవేశించి ధర్మాసనం బధిష్ఠించి కార్యవిచారంబునకుఁ దొడంగి యర్థిప్రత్యర్థులయందు సముఁడయి వారి వివాదాంశంబుల నడిగి శాస్త్రసిద్ధంబులు లోకసిద్ధంబులు నగు హేతువులతో జాతిధర్మంబులు జనపదధర్మంబులు శ్రేణీధర్మంబులు గులధర్మంబులు బాగుగం బరికించుచు క్షత్రధర్మంబు నతిక్రమింపక తీర్పవలయు.

వాడుకలో నున్న ధర్మములు

పురాతనంబు లయిన జాతి దేశ కుల ధర్మంబులు రాజు రక్షింపకున్నఁ బ్రజ మిగుల క్షోభించు. దాక్షిణాత్యులయిన ద్విజులు మాతులకన్య నుద్వహింతురు. మధ్యదేశంబునఁ గర్మకరులును శిల్పులును గోమాంసంబు భుజియింత్రు. అచటి నరు లెల్లరు మత్స్యములం దినువారును స్త్రీలు వ్యభిచారాసక్తలు. ఉత్తరదేశమునఁ బెక్కండ్రు స్త్రీలు మద్యంబు ద్రావువారును గలరు. మఱియు నచట రజస్వలలు మనుజులకు స్పృశ్యలగుదురు. ఖశజాతుల భర్తృకయైన భ్రాతృభార్యం బెండ్లియాడుదురు. ఈజనుల కివి యపరాధంబు లని యెంచి రాజు ప్రాయశ్చిత్తంబునేని దమంబునేని విధింపఁదగదు. ఎవరి కే యాచారంబులు పరంపరాప్రాప్తంబులుం బూర్వానుష్ఠితంబులు నగు నవి వారి కనుష్ఠేయంబుల కాని యితరుల కవి దూష్యంబు లగు. కలియుగంబున శ్రీమంతులు జ్ఞానలవదుర్విదగ్ధులును వేదవిముఖులుఁ దంత్రకర్మరతులుం బరస్త్రీధనలుబ్ధులును బ్రాయికంబుగ నగుదురు గాన రాజు వారినధికముగ దండించి ధర్మమార్గంబునకుం ద్రిప్పునది.

రాజు వాదిం బరీక్షించి యతనివాదమును వినువిధము

రాజు పూర్వాహ్ణంబున స్మృతులం బరిశీలించుచు మధ్యాహ్నంబున న్యాయంబులు విచారించునది కాని మనుష్యమారణంబు స్తేయంబుం బ్రజలకతిపీడాకరంబయిన యపరాధంబును గాలనియమంబుసేయక తత్క్షణంబ విచారింపవలయు. వాది (Plaintiff) ధర్మాసనగతుం డయి మంత్రులతోఁ

గూడియున్న నృపుఁ జేరి సత్యంబు చింతించుచు నధర్మంబు నకుఁ జొరక జాగరూకుఁ డయి నివేద్యాంశంబు లిఖియించి నమస్కరించి ప్రాంజలియై వినమ్రుం డగుచు నివేదించునది. రాజట్లు నివేదింప నేతెంచినవానిం జూచి యథార్థంబుగ సత్కరించి బ్రాహ్మణులతో సాంత్వనంబున నతనికి దుఃఖోపశమనంబు సేసి యేకర్జంబున నిచటి కేతెంచితి వేదుష్టునిచే నేకాలంబున నేచోట నేకారణంబున నేపీడ నందితివి సత్యంబు చెప్పు మని యడిగి యతఁడు చెప్పునది వినవలయు. మఱియు నాచెప్పినదాని లేఖకుఁడు ప్రసిద్ధంబయిన లిపిని సులభార్థంబగు భాషను వ్రాయవలయు.

శిక్షార్హులు

వాది ప్రతివాదులు చెప్పినదానికి విరుద్ధముగ వ్రాసిన లేఖకునిఁ జోరదండమున దండించుచు నట్టివ్రాఁతను మన్నించు సభ్యులను బలాత్కారంబున లిఖితంబు గ్రహించువారిని నట్లు దమియించుచు రాజు వ్యవహారముల విమర్శించుచుండవలయు.

న్యాయముల విచారించువిధము

రాజు సభకు రానియపుడు ప్రాడ్వివాకుఁడు సభాగతుని నట్లడిగి రాచకర్జముల విచారించునది. వాదిప్రతివాదులఁ బృచ్ఛ సేయుటచేఁ బ్రాట్టనియు వారు చెప్పినదాని విని విచారణసేయుట నేని సభ్యులతోఁ (Assessors) గూడి ధర్మాధర్మములు నిర్ణయించి పలుకుట నేని వివాకుం డనియు నివి రెండును గలవాఁడు ప్రాడ్వివాకుఁ డనియు నీతిజ్ఞులు నిర్వచిం

త్రు. సభయందుఁ బరహితులు గార్యదక్షులు సాధువులు నగువారు సభ్యు లనంబడుదురు. స్మృతికిని సదాచారమున కును విరుద్ధంబగు మార్గమునఁ బెఱలచే నాధర్షింపఁబడిన వాఁడు రాజునకు విన్నవించిన నా యాధర్షణనివేదనము వ్యవహారపదంబు. (Subject Matter of Law-suit) రాజేని రాజపురుషుఁడేని పరులచే నివేదింపఁబడని తగవులఁ దమబుద్ధిబలమున నుత్పాదించి రాగమున నొండెఁ గ్రోధమున నొండె లోభంబున నొండెఁ బ్రజల బాధింపఁ దగదు; కాని ముందు చెప్పంబడు ఛలములు నపరాధములు నృపతిపదములును స్వయముగ నేని స్తోభకునిచేత నేని సూచకునిచేత నేని యెఱిఁగి యావేదకులు నివేదింపకున్నను రాజు గ్రహించి విచారింపవలయు. శాస్త్రంబున నిందితుఁడును రాజుచే ననియుక్తుఁడు ధనముం గోరువాఁడు నయి యెవఁడు రాజునకుఁ గార్యము నావేదించు నాతఁడు స్తోభకుఁడును రాజుచేఁ బరదోషవీక్షణమున నియుక్తుఁడయి నృపునకుఁ గార్యము సూచించు వాఁడు సూచకుఁడు నని చెప్పంబడుదురు.

ఛలంబులు

మార్గభంగంబును, బరనిందయుఁ, బ్రాకారలంఘనంబును నిపాన (Water-reservoir) వినాశంబును గృహనాశనంబును గ్రామరక్షణార్థంబు త్రవ్వించిన పరిఖం బూడ్చుటయు, రాజలోపప్రకాశనమును, శుద్ధాంతమును వాసగృహమును భాండాగారమును బానసము నాన వొందక చొచ్చుటయు, నట్లు భోజనదర్శనమును, రాజు నెదుట బుద్ధిపూర్వకముగ నిష్ఠీవనాది ప్రక్షేపణమును, బర్యంకాసనబంధమును, రాజాధిక

వేషమును ముందటఁగూర్చుండుటయు నపద్వారమున నకాలమున నన్యగృహప్రవేశమును, బ్రభువు నాజ్ఞ నొందక యాసనాదిగ్రహణమును, నృపునెదుట శయ్యాసనపాదుకాగ్రహణమును జేని పగఱ సేవించుటయు రాజు శయనింప నాసన్నుఁడగుటయు, భూపతి సమీపంబున నన్యవస్త్రాభరణ ధారణము, నదత్తతాంబూల గ్రహణమును, బుష్పమాలాధారణమును, ముక్తకేశత్వము, నభ్యంగనముఁ, బరిధానవిధూననము, నవకుంఠ నవిచిత్రాంగత్వంబులు నేకవస్త్రధారణంబు, ననుజ్ఞఁ బ్రార్థింపక భాషించుటయుఁ, గర్ణనాసావిశోధనంబు, వ్యసనాసక్తియు, దంతకర్షణంబు, నుష్ణీషధారణంబుఁ బరచ్ఛిద్రాన్వేషణంబు రాజనిందయు మొదలగునవి ఛలంబులు.

అపరాధంబులు

రాజశాసనాతిక్రమణంబును, బరస్త్రీగమనమును, స్త్రీవధంబును, వర్ణసాంకర్యంబును, జౌర్యంబును, భర్తృసంబంధము లేకుండ గర్భధారణంబును, వాక్పారుష్యంబును, దండపారుష్యంబును, గర్భపాతంబును, నవాచ్యవాదంబు, ననునవి యపరాధంబు లగు; ఉద్వేజనంబును, సస్యఘాతంబును, గృహాదిదాహంబును, రాజద్రోహంబును, రాజముద్రాభేదంబును=తప్పునాణెముల సృజించుట.

నృపతిపదములు, రాజజ్ఞేయములు

తన్మంత్రభేదంబును, రాజభాగాపహరణంబును స్వత్వంబు లేని వస్తువుల దాన విక్రయంబులును, రాజశాసన ఘోషణాచ్ఛాదనంబును, బంధీ విమోచనంబును, రాజద్రవ్యం బేని యస్వామిక ద్రవ్యం బేని యపహ

రించుటయు, జంతులయంగవినాశంబు, ననునివి నృపతి పదంబు లని చెప్పంబడు. ఇవియన్నియు, నెవ్వరు నావేదింపకున్నను, రాజు తెలిసికొని విచారించి యపరాధుల దండించునది. క్రూరవేషుండును గర్వితుఁడును దాంభికుఁడును స్థేయునితోఁ దుల్యుంబుగ నాసనంబున నున్నవాఁడు నగువాది (Complainant) రాజునకు దండ్యుఁ డగు. వాదిచే రాజునకు నివేదింపఁ బడిన యంశం బావేదనం (Plaint) బనియు నదియె యఖిల వ్యవహారంబు తెలియునట్లు ప్రాడ్వివాకునకు సభ్యులకు విన్నవించినఁ బూర్వపక్షంబనియుఁ వ్యవహారజ్ఞులు చెప్పుదురు. వాది చెప్పిన పూర్వపక్షము విని సభ్యాదులు విచారించి యధికసాక్ష్యంబు త్యజియించి లోపంబున్నం బూరించిన పిదప రాజు వాదిచేనంకితంబయిన యా వాఙ్మూలంబునఁ దన ముద్ర వేయింపవలయు. ధర్మాధికారులు రాగలోభ భయంబుల వాదిచెప్పినపక్షంబు శోధింపక పక్షపాతులయి యుత్తరంబు = (Statement) వ్రాయించినయెడ రాజు వారి శాసించి స్మృత్యర్థం బధికారంబునుండి తొలఁగించునది. మఱియు రాజు వివాదంబులు గ్రాహ్యంబులు (పట్టఁదగినవి) నగ్రాహ్యంబులు (పట్టఁదగనివి) బాగుగ విమర్శించి తగినవానిన గ్రహించి వాది పూర్వపక్షంబు సేసినవెనుక నతని విడచునది.

ఆసేధభేదము

చెప్పినదాని నతిక్రమించుననియు వక్తవ్యాంశంబు బాగుగఁ జెప్పఁడనియుఁ దోఁచెనేని వాది ప్రతివాదిని రాజాజ్ఞ నొంది సత్యవచనులు, దృఢులు, శస్త్రాస్త్రధారులు నింగితజ్ఞులు ననలసులు నగు రాజభటులచేత నేని తనశపథంబుల

నేని వివాదంబు తీర్పనాహ్వానంబు (సమను) (Summons) చేయుదనుక నాసేధించునది. స్థానాసేధంబు కాలాసేధంబుఁ బ్రవాసాసేధము గర్మాసేధము నని యాసేధము (Detention) నలుఁదెఱంగులనుండు. ఆసిద్ధుఁడెన్నఁడు నాసేధంబుల్లఘింపఁ జనదు. ఉల్లంఘించిన దండ్యుండగును గాని యింద్రియ వ్యాపారమునకు నిరోధము గలుగునట్లును శ్వాసనిరోధము గలుగునట్లు నాసేధింపఁబడినయెడ నాసేధము నతిక్రమించినను దండార్హుండు గాఁడు; మఱియు నట్లాసేధించినవాఁ డవశ్యము దండ్యుఁ డగు. తత్త్వమున నేని సందేహమున నేని వాది యెవ్వనిపై నభియోగము దెచ్చునతనిన రాజు స్వముద్రాముద్రితంబయిన లేఖ్యమున నేని కేవల భటులచేత నేని వివాదంబు పరిశీలింప నధికరణంబు (Court) నకు రావించునది. విచక్షణుండయిన తీర్పరి యసత్సంసర్గంబునను బూర్వచరిత్రానుభవంబునను శంకయు లోప్త్రద్రవ్య దర్శనంబునఁ దత్త్వంబు నెఱుంగవచ్చు.

సభకు రాఁదగనివారు

రోగార్తులను విపన్నులను రాజకార్యవ్యగ్రులను మఱియొక్కచో నభియోగంబు గలవారి నుత్సవాసక్తులను భృత్యులను మత్తులను సూతికలను వ్యసనులను యియత్తులను దత్తత్కాలంబునను కులీనలు ననదలు నగు నువిదలను నుత్తమలగు కన్నెలన జ్ఞాతప్రభుకలయిన యింతులను బాలురను వృద్ధులను నొక్కపుడును రాజు పిలిపింపను నాసేధింపనుందగదు. మఱియు గోవుల మేపుతఱి గోపాలురను, సస్యావాపకాలంబునఁ గృషీవలులను గర్జంబులు సేయునపుడు

శిల్పులను బాలికలన నున్నపుడు జోదులను వచ్చినపని కావింపకున్న దూతలను దానాభిముఖుండగు దాతను వ్రతంబు పూర్ణంబగు దనుక వ్రతిని సాక్షులఁగాఁ బిలిపింపను నిరోధింపను దగదు.

ఎపుడెల్లవారును సభకురావలె

దేశోపద్రవాదులయం దాసేధంబు నతిక్రమించినవాఁ డపరాధి గాఁడు. ఱేఁడు దేశకాలంబులను గార్యంబుల బలాబలంబులను బాగుగం బరిశీలించి యొకప్పు డకల్యాదుల నయినను మందమందంబుగను యానాదిసహాయంబునను రప్పింపనుం దగు. అభియోగంబు నెఱింగినవా రరణ్యవాసులగు పరివ్రాజకాదులయినను గార్యగౌరవంబు గలప్పు డనుశాసకుఁడు వారలకుఁ గోపంబు వుట్టకుండ రప్పింపన వలయు. అర్థియేఁ బ్రత్యర్థియేఁ గార్యాంతరాకులుండౌండె వ్యవహారానభిజ్ఞుండౌండె నగునపుడు తజ్జ్ఞుడయిన ప్రతినిధిని (Pleader) రాజంగీకరింప వలయు.

ప్రతినిధులు = (Pleaders)

మఱియు వాది ప్రతివాదులప్రగల్భులు, నున్మత్తులు, వృద్ధులు, స్త్రీలు, బాలురు, రోగులు నయినయెడ వారిబంధువేని నియుక్తుఁడేని పూర్వోత్తరపక్షంబులుచేసి వ్యవహారంబు నిర్వహింప రాజంగీకరింప వచ్చు. వాది ప్రతివాదులు లేకున్నను వారిమాతాపితలేని సుహృద్బంధులేని భ్రాతలేనియున్నయెడ వాదంబు ప్రవర్తింపఁ జేయవలయు. మఱియు నియోగంబుననేని చుట్టఱికంబుననేని యేనాఁడయినం బ్రతినిధియై

చేసినదంతయుఁ దన్నియోగంబు గావించినవాఁడు చేసినట్లయప్రతిహతంబుగ రాజు గ్రహింపం దగు.

నియుక్తు (Pleader) నకు వివాదద్రవ్యంబున షోడశాంశంబేని వింశాంశంబేని దాననర్ధంబేని తదర్ధంబేని తదర్ధంబేని భృతి న్యాయాధికారి యిప్పించుచు ద్రవ్యం బధికంబయిన కొలఁదిఁ దక్కువపాలు నల్పంబయినకొలఁది నెక్కువపాలు నిప్పింపవలయు. నియోజకుఁడు పెక్కండ్ర నియోగించెనేని వారికా వాసరంబు వెచ్చమునకుఁ దగినంతసొమ్మయిన నిప్పింపవలయు. ధర్మజ్ఞుఁడు వ్యవహారజ్ఞుఁడు నగువాఁడు ప్రతినిధిపదంబున కర్హుండుగాని యితరుఁడు గాఁడు. అనర్హుఁడు ప్రతినిధియై వేతనంబు గొనెనేని రాజతని దండించునది. రాజు తన యిచ్చ ననుసరించి సంతతంబు నొక్కప్రతినిధి నియమింపఁ గూడదు. మఱియు వాదులచే నియుక్తుండయిన ప్రతినిధి లోభంబునఁ గార్యహాని చేసెనేని యవశ్యం బతని దండింప వలయు. ఎవఁడు వాదిప్రతివాదులకు సోదరుఁడేని పితయేని పుత్త్రుఁడేని నియుక్తుఁడేని కాక వ్యవహారంబుల వాదించుచు వివిధంబులగు నసంబద్ధాలాపంబులు వల్కు నతఁడు రాజునకు నెట్టన దండ్యుఁడగు. గృహంబునఁ బెత్తనంబు సేయు స్త్రీలను స్వైరిణులను గణికలను నిష్కులులను మహాపాతకంబులు గావించిన వెలందులను వివాదంబుల విచారించునపుడు ఱేఁడాహ్వానంబు నంపి యధికరణంబునకు రావింపఁ దగు. మఱియు వాదంబు ప్రవర్తిల్లిన యనంతరము వాది ప్రతివాదులు మృతులయిన నావ్యవహారం బెఱిఁగినపుత్త్రుల

వారిస్థానంబున నిల్పి వ్యవహారంబుల నిర్వహింప వలయు. పౌరసు లావ్యవహారం బెఱుఁగకున్న నెత్తివేయవలయు.

ప్రతినిధుల నంగీకరింపరాని నేరములు

మనుష్య మారణంబును బరదారాభి మర్శనంబు నభక్ష్యభక్షణంబు కన్యాహరణంబు దద్దూషణంబును బరుష దండప్రయోగంబును బరుషవాక్ప్రయోగంబును గూటకరణంబును రాజద్రోహంబు నను నపరాధంబులందుఁ బ్రతినిధి నంగీకరింపక యపరాధియె వాదించుకొనునట్లు రా జేర్పఱుచునది. అభియోగమున నాహూతుండయి యెవఁడేని బంధుబలంబుననేని యితర దర్పముననేని రాక యాజ్ఞను నిరాకరించు వాని నావివాదానుసారముగ లోకమర్యాదార్థంబు రాజు ధండింప వలయు.

ప్రతిభూగ్రహణము

రాజభటులచే నాహూతులయి వచ్చిన ప్రాప్తధర్షణులగు వాది ప్రతివాదులకుఁ దగిన లగ్నకుల రాజాలోచించి గ్రహించునది. ఇతఁడీనియెడ నింత సొమ్మిచ్చెదనని యొప్పికొన్నవాఁడు దానప్రతిభువును వీని మీసమీపమునకుఁ గావలసినపుడు తీసికొని వత్తునని యొప్పికొన్నవాఁడు దర్శనప్రతిభువును బంధకంబు నీతనిచేఁ దెప్పింతుననియు నీతనిచేఁ గార్యంబునేఁ జేయింతుననియు నీతనివలన భయములేదనియు నితఁడు వృత్తిమంతుఁడనియు సత్యవాదియనియుఁ జెప్పి యొప్పికొన్నవాఁడు ప్రత్యయ ప్రతిభువనని చెప్పంబడుదురు. రాజు ప్రగల్భుఁడు విశ్రుతుండు ధనియు స్వతంత్రుఁడు నగులగ్నకుని వాదికేని ప్రతివాదికేని యంగీకరింప వలయు. మఱియు

వివాదంబుల విమర్శించునపుడు వివాద సాధనంబులయిన లిఖితాదులతోఁ గూడినవారును స్వతంత్రులే నస్వతంత్రులే యగు వాది ప్రతివాదుల నిరోధించి కూటసాధన సందేహమున సత్యము తెలియంగోరి బాగుగ విమర్శించునది.

గ్రాహ్యాగ్రాహ్య పక్షాదులు

ప్రతిజ్ఞాదోషంబులు (మొదటి వాఙ్మూలమునకు విరోధము) లేనిదియు సత్కారణాన్వితంబు సాధ్యంబు నిశ్చితంబు లోకసిద్ధంబునగు నభియోగవిషయంబు పక్షంబని విద్వాంసులు చెప్పుదురు. అన్యార్థము నర్థహీనంబు ప్రమాణవర్జితము హేతుశూన్యంబు హీనలేఖ్యంబు నధికలేఖ్యంబును జ్యుతాంశంబు నను నివి లిఖితమున భాషాదోషములని చెప్పుదురు. అప్రసిద్ధమును నిరాబాధమును నిరర్థకము నసాధ్యమును లోకవిరుద్ధంబు నగు నభియోగవిషయము పక్షాభాసముగావున దాని ఱేఁడు వర్జింపవలయునుగాని గ్రహింపందగదు. మూఁగ నన్నుఁ దిట్టెననియు వంజకొడుకు నన్నుఁ గొట్టెననియు నేవాఁడు నన్నుఁడు విననిదియుఁ జూడనిదియు నగు వాదం బప్రసిద్ధంబు. నాయింటిసమీపమున నొకఁడు తనయింట నధ్యయనంబు సేయుచుండుననియు సుస్వరమున గానము సేయుచుఁ గ్రీడించుచుండుననియు నాసుఖమున సుఖమును దుఃఖమున దుఃఖమును లోకము వొందదనియు నానిశాంతంబునొద్ద నొకఁడు వీథి కభిముఖముగఁ గ్రొత్తగుమ్మము నిర్మించెననియుఁ జేయు నభియోగము నిరాబాధము నిరర్థకమునగు. నాకూఁతు నల్లుఁడు తీసికొనిపోయెననియు మృతుండు మాట్లాడుట లేదనియుఁ జేయువాదము లోకవిరుద్ధము నసాధ్యంబునగు. వాది

తనకార్యము రాజునకు మున్నా వేదించి పిమ్మట దానికి విరుద్ధముగ భాషించినను వివాదము వదలుకొన్నను బ్రతిపక్షంబు నాశ్రయించినను జితుండును దండ్యుండునగు. నిశ్చింతముగ వాది పూర్వపక్షము (ఫిర్యాదు) చేసినవెనుక గ్రాహ్యాగ్రాహ్యాంబుల బాగుగం బరిశోధించి సదస్యులచే ననుజ్ఞాతుండయి ప్రాడ్వివాకుఁడు ప్రతివాదిచే నుత్తరము వ్రాయించునది. అభియోగము చేసిన నానిసన్నిధి నభియోగంబు నంశంబు విని పూర్వపక్షమున కంతకు వర్తిల్లునదియు సారవంతము నసందిగ్ధంబు వినువారికి సుబోధంబు నగునుత్తరంబు (Answer) ప్రతివాది లిఖించునది. సందిగ్ధమును బ్రకృతాంశముకంటె భిన్నమును నత్యల్పము నతివిస్తారముఁ బత్త్యైకదేశ వ్యాప్తంబు నగు నది యుత్తరము గాదు. వాదిగానేని ప్రతివాదియేని (Defendent) యాహూతుండయి యేమియుం జెప్పకున్న నతఁడోడినవాఁడును దండ్యుండు నగు. వాదిపూర్వపక్షము యథార్థంబగుచుండఁ బ్రత్యర్థి యుత్తరంబీయనియెడ విచారపతి సామాద్యుపాయముల నుత్తరంబిప్పించునది. అజ్ఞానంబున నేని శాఠ్యమున నేని వాది విడిచినయంశం బుత్తరమున నున్న నట్లు ప్రతివాది యుత్తరం బీయనియంశము పూర్వపక్షమున నున్నను వారిద్దఱ నడిగి యాయంశము యుక్తిచాతుర్యమున న్యాయాధిపతి గ్రహించునది. ఉత్తరము సత్యంబు, మిథ్యోత్తరము, ప్రత్యవస్కందనము, పూర్వన్యాయము నని నలుఁదెఱంగుల నుండు. వాది చెప్పినది సత్యంబని యంగీకరించి యిచ్చిన యుత్తరము సత్యంబగు. అదియె ప్రతిపత్తియు ననంబడు. పూర్వపక్షము విని యందలి

శబ్దంబున నేని యర్థంబున నేని నిషేధించిన దాని మిథ్యోత్తరం బందురు. వివాదాంశము నేనెఱుఁగననియు, నీవ్యవహారము జరిగినపుడు నేజన్మింపలేదనియు, నే నీ వ్యవహారకాలమున నచట లేననియు నిది మిథ్యయనియు నిషేధభేదమున మిథ్యోత్తరము చతుర్విధంబయ్యె. వాది చేసినవాదము ప్రతివాది యొప్పికొని యీకారణమున నిది గ్రాహ్యము గాదని నిషేధించిన నది ప్రత్యవస్కందనంబు. ఈవిషయమున నాకు నీ వాదికి మున్ను వివాదము జరిగెననియు నం దీవాది యోటువడియె ననియు జయపత్రమున నేని సభ్యులచేత నేని సాక్షులచేత నేని తెలియఁజేసి నిషేధించిన నది పూర్వన్యాయంబని కోవిదులు వల్కుదురు. వాది ప్రతివాదుల సమక్షమున నుత్తరంబు గొనక రహస్యమున నట్లు చేసిన సభ్యులను రాజు దండింపవలయు. ప్రతివాది లిఖియించిన యుత్తరంబు శోధింపఁబడినపిమ్మట నిర్ణయంబు (Decision and judgment) నకుఁ గారణంబయిన క్రియాభాగంబు ప్రవర్తిల్లు.

లిఖితాదిపరీక్ష

పూర్వపక్షంబు నుత్తరంబుం గ్రియయు నిర్ణయంబు నను నాల్గును ప్రతిపత్త్యుత్తరంబు గాని వ్యవహారంబులకుఁ బాదంబులు. అర్థిప్రత్యర్థులకార్యంబు సాధ్యంబును దద్కార్యసాధనంబు క్రియయు ననంబడు. అర్థియేని ప్రత్యర్థియేని తృతీయపాదంబునఁ గార్యసాధనంబగు సాక్షి లేఖ్యాది రూపంబయిన క్రియం బ్రదర్శింప వలయు. రాజు వివాదంబులఁ గ్రమంబుగ నేని కార్య గౌరవంబు నాలోచించి యక్రమంబుగ నేని వర్ణానుసారంబుగ నేని విచారింపవలయు.

సభ్యులు ప్రతివాదిచే నుత్తరంబు వ్రాయించినవెనుక నిర్ణయార్థం బెవ్వఁడు సాక్ష్యాదిక్రియ ముందు సేవలయునో బాగుగ నాలోచించి వాని కాజ్ఞ యీవలయు. అట్లనుజ్ఞ యిచ్చినతరువాత నతఁడు తాఁ జెప్పినదాని నిర్వహించుక్రియఁ జేవలయు. ఒక వివాదంబున వాది ప్రతివాదుల కిద్దఱకును సాక్ష్యాదిక్రియ యనావశ్యకంబయి యుండు. మిథ్యోత్తరంబున వాదియుఁ బ్రత్యవస్కందనంబునను బూర్వన్యాయంబునను బ్రతివాదియుఁ గ్రియాభారంబు (Burden of proof) నిర్వహింప సభ్యు లనుజ్ఞ యీవలయు. ఒకప్పుడు కారణవిశేషంబువలనఁ బూర్వపక్షంబు నుత్తరపక్షం బగు. అప్పుడు ప్రతివాది యుత్తరం బిచ్చినవెనుక వాది తన వాగ్మూలము ధ్రువపర్చుక్రియ లిఖియించి యిచ్చునది. పైనఁజెప్పినక్రియ, మానుషంబు దైవంబునని ద్వివిధంబగు. అందు మానుషంబు లిఖితంబు భుక్తి సాక్షులు నని త్రివిధంబు. ఈసాధనంబులు సంభవిల్లనినాఁడు దివ్యంబులయిన ప్రమాణంబులు గావలయు. అట్టిదైవమానుష సాధనంబులు తత్త్వంబులు ఛలంబులు నని యిరుదెఱఁగుల నుండు. నిజంబు చెప్పునది తత్త్వంబును కూటంబు (False) చెప్పునది ఛలంబునని వ్యవహారవిదులు చెప్పుదురు. రాజు యుక్తులను సామాద్యుపాయంబులను కూటంబు చెప్పు సాక్ష్యాదుల నెఱిఁగి నిరసించి నిజంబు చెప్పువాని గ్రహించి వివాదంబులఁ దీర్చునది. మఱియు సాక్షిలిఖితాదులఁ జేఁ జిరకాలంబు గడువిచ్చిన ధర్మహానిరూపంబైన దోషంబు సంభవిల్లుఁగాన దానఁ గాలహరణంబు చేయింపఁ దగదు. రాజు లిఖితాది సాధనంబుల వాది ప్రతి

వాదుల యెదుటన గ్రహింప వలయును గాని వారి పరోక్షంబున గ్రహింపఁ దగదు. ఒండొరుల సాక్ష్యాదిసాధనంబులఁ గల దోషంబులు విచారణకాలంబున నర్థిప్రత్యర్థులు ప్రకటింపవలయు. వారికిం దెలియని గూఢంబు లగుదోషంబులు విచారనియుక్తులయిన సభ్యులు శాస్త్రదర్శన పూర్వకంబుగ నిరూపింపవలయు. శాస్త్రవిరుద్ధంబు లగు దోషంబులఁ బ్రకటించినవాఁడు దండ్యుఁడును సాధ్యార్థంబునుండి తొలఁగినవాఁడు నగుంగాన రాజు సాధనంబుల మెలఁకువతోఁ బరిశీలించునది. మఱియుఁ గూటసాక్ష్యంబు నట్టి లిఖితంబుం దెచ్చినవాని నవశ్యము దండించుచు ననృతవాదియైనట్టి సాక్షిని నిజంబు దెలిసియుం జెప్పని సాక్షిని ద్విగుణంబుగ దండింపవలయు. మున్ను బ్రహ్మచే ననుభూత వ్యవహారంబునకు స్మారకంబుగ లిఖితంబు సృజియింపఁబడె.

లిఖిత=(దస్తావేజుల) విభాగము.

అట్టి లిఖితంబు రాజకీయంబు, లౌకికంబు నని ద్వివిధంబు. అదిమరల స్వహస్తలిఖితంబుఁ బరహస్తలిఖితంబునని రెండు తెఱంగులు. మఱియు నివియెల్లను సాక్షిమంతంబులు నసాక్షిమంతంబులు నని ద్వివిధంబులు. ఇవి యన్నియు దేశస్థితి ననుసరించి చెల్లందగినవియు. అందు లౌకికంబయిన (Non-official) లిఖితంబు భాగదానక్రయ ఋణాదులయిన నిమిత్తంబులచే వివిధంబగు. రాజకీయంబు (Official) శాసనార్థంబు జ్ఞాపనార్థంబు నిర్ణయార్థంబునని మువ్విధంబులనుండు. దాయాదుల కభిమతంబును సాక్షిమంతంబునగు భాగపత్రంబు కార్య

సిద్ధిం గావించుంగాని యట్టిది గానిది జనకుచే వ్రాయింపఁబడి నన్దు జెల్లదు. దానక్రయ విక్రయ పత్రంబులు సాక్షిమంతంబులు దాయాదులకు సమ్మతంబులుం గావలయు. మఱియు నవి స్థావరవిషయంబులైన నందు గ్రామాధికారుల సాక్ష్యంబు బలవత్తరంబు. రాజహస్తంబునలిఖితంబుముద్రితంబు ప్రకృతులచే నంకితంబు నగు లేఖ్యంబు రాజకీయంబు. ఆలేఖ్యంబున సంవత్సరంబును మాసంబును బక్షంబును దిథియు వారంబును వేళయుఁ బ్రదేశంబును విషయంబును జాతియు నాకారంబును బాయంబును బ్రమాణంబులయిన సాక్షిపత్రాదులును గ్రమసంఖ్యయు నామంబును వారి నివాసంబును దల్లిదండ్రుల నామంబులు నభియోగ కారణంబును నివాదగ్రస్తంబయిన వస్తువు నార్జించినవానిని దాని నిచ్చినవానిని గ్రమంబుగ లిఖించి రాజు తన పేరును వాసస్థలంబును మఱియుం గార్యసాధకంబు లగు నితరవిషయంబులను వ్రాసినం బ్రమాణంబును వీని వ్రాయకున్న నప్రమాణంబు నగు. మఱియుం గ్రమభంగంబుగలదియు విపరీతార్థ బోధకంబును బ్రకీర్ణార్థంబు నర్థశూన్యంబు నతీతకాల లిఖితంబును నప్రగల్భుని చేత నింతిచేతను వ్రాయఁబడినదియు బలాత్కారంబున వ్రాయించికొన్నదియు నగు లిఖితంబు (దస్తావేజు) ప్రామాణ్యంబుం బొందదు. సభ్యులే వాని వ్యవహారంబులయందు లేఖ్యంబుల సాక్షుల భోగంబుల దివ్యంబుల బరిశీలించి ప్రామాణ్యంబు నిర్ణయింతు రతఁ డీలోకంబునఁ బరలోకంబునను సుఖంబు వడయు.

సాక్షిస్వరూపము

వాది ప్రతివాదులకంటె నన్యుండు వివాదాంశంబు బాగుగ నెఱింగినవాఁడును సాక్షి యనంబడు. అతఁడుచూచినవాఁడును విన్నవాఁడు నని ద్వివిధుండగు. మరల నతఁడు కృతాకృతభేదంబున ద్వివిధుఁడు. వాదిప్రతివాదులయెదుట మున్ను తనచే శ్రవణదర్శనంబుల ననుభూతంబైన యంశంబు తుల్యంబుగ విన్నవించుసేని యతఁడు సాక్షియగు. చిరకాలంబుననేని స్మృతియు బుద్ధియుఁ దొలంగని వాఁడును గరణపాటవంబు గలిగినవాఁడు వ్యవహారజ్ఞుఁడును సత్యంబు చెప్పువాఁడును సాక్ష్యంబునకుఁ దగు. ఇద్దఱువాదులకును సమ్మతుండగు ధర్మజ్ఞుఁడైన సాక్షి యొక్కఁడ యభియోగ నిర్ణయంబునకుఁ జాలు. అనుభూత సత్యవచనుండు నొకఁడ చాలు. వాదులకు సజాతీయులు స్వతంత్రులు యువలు విద్వాంసులు గృహస్థులు నప్రవాసులు నెల్ల వివాదంబుల సాక్షులు గావలయును; కాని చౌర్యంబు దండపారుష్య వాక్పారుష్యంబులు నను నపరాధంబులయం దెల్లజాతులవారికి నెల్లవారు సాక్షులు గావచ్చు. ఇంతుల వివాదంబున నింతులుసాక్ష్యంబీనర్హులు.

అగ్రాహ్యసాక్షులు

అజ్ఞానంబున బాలుండు నసత్యంబువలన నింతియుఁ బాపపుంగర్జంబుల నలవాటునఁ గపటియు, నెయ్యంబు కలిమిని జుట్టంబు, నభిమానంబున విజాతీయుఁడును, లోభంబున శఠుండును, బగఁదీర్పం గడఁగుట నరియును, జీవన లోపభయంబున సేవకుండును, మఱియు ధనసంబంధంబు

గలవారును దేహసంబంధంబు గలవారును విద్యాసంబంధంబు గలవారును శ్రేణులలో నొక్కనితో వివాదంబు గలప్పు డాశ్రేణివారును దెలిసినదానికి విరుద్ధంబుగఁ బల్కనోపుదురు గాన సాక్ష్యంబునకు నర్హులుగారు.

సాక్షివిచారము

రాజు సాధ్యార్థంబున సాక్షులవిచారింపఁ గాలహరణంబు సేయక వాది ప్రతివాదులసన్నిధిని విచారింప వలయుంగాని వారిపరోక్షంబున నెన్నఁడు విచారింపఁ దగదు. ప్రత్యక్షమునఁ బ్రవర్తిల్లిన విషయంబున నాదిష్టులయి సాక్ష్యంబంగీకరింపని వారు దండ్యులగుదురు. ఎవఁడు మొదట వాదులచే సాక్షిపదంబున నిర్దేశింపఁబడక యాహ్వానంబునొందక రాజుచే నాదిష్టుండునుం గాక తథ్యంబేని మిథ్యయేని చెప్పు నానరాధముండును రాజునకు దండ్యుఁడగు. సాక్షులవచనంబు ద్వైవిధంబైనఁ బెక్కండ్రు చెప్పినదానిని బెక్కండ్రు పెక్కు తెఱంగులఁ జెప్పినయెడ గుణవంతుల వచనంబును గుణవంతులు ననేక ప్రకారంబులఁ జెప్పిన గుణవత్తరుల వచనంబును రాజు గ్రహించునది. మొదట నిర్దిష్టుండు గాకున్నను గన్నులతోఁ జూచిన దానిని జెవులతో విన్న దానిని రాజడిగినప్పుడు సాక్షి సత్యంబు తప్పక చెప్పవలయు. వేఱువేఱుకాలంబుల వివాదంబునందలి యొక్కొక్కయంశంబు నెఱింగినవారి నొక్కొక్కనిం బిలిచి రా జాయాయి యంశంబులఁ బరికించునది యని సనాతనంబయిన యాచారంబు గలదు. మఱియు సాక్షులు స్వభావంబునఁ జెప్పినపలుకులు గ్రహింప వలయుం గాని బలం

బున నేమియుఁ జెప్పింపను సాక్ష్యంబు పూర్ణంబయినవెనుక మరల సాక్షి నేమియు నడుగనుం దగదు.

సాక్షి శ్రావణము.

రాజు విచారణ కాలంబున సాక్షిం బిలిచి ప్రమాణంబు సేయించి పురాణంబులయందలి సత్యవచనంబుల మహిమంబు ననృతంబువలని దోషంబును గీర్తించి మెల్ల మెల్లఁగ నసత్యంబు వలుక వెఱపు పుట్టించి యేదేశంబున నెక్కాలంబున నేకారణంబున నెట్టివివాదాంశంబు నెఱిఁగితివని యడిగి లిఖితంబు వ్రాసిన సాక్షివైన నీవేమి లిఖించితివి సత్యంబు చెప్పుమని నియమించి సత్యంబు చెప్పినసాక్షి కీర్తియు నుత్తమలోకంబుం బడయు ననియు సత్యవచనంబున సాక్షి పూతుండగుననియు సత్యంబున ధర్మంబు వర్ధిల్లుననియు నీ కారణంబున నెల్ల వివాదంబుల సాక్షులు సత్యవాదులు గావలయుననియు నాత్మ యెల్లవారికి సాక్షియనియు ననృతంబు వల్కువాఁ డాత్మ నవమానించు ననియుఁ బాపాత్ముండు తనవృత్తం బెవ్వరు నెఱుంగరని తలఁచుఁగాని దేవతలు నాత్మయుఁ జూచుచుందురనియు నీవనృతంబు వలికి యేవాని కపజయంబు గలిగింతు వాతఁడు పెక్కు జన్మంబులం జేసిన పాపంబు నీకును నీ వనేక జన్మంబులఁ జేసినపుణ్యం బాతనికిని సంక్రమించుననియు వానికి సభయందు వినిపించి మఱి విచారింప వలయు.

సాధనములు (లిఖిత భోగాదులు) వాని బలాబలంబులు.

రాజులు వాదికేని ప్రతివాదికేని లిఖితాది సాధనములఁ బ్రదర్శింప దైవికంబు. రాజకృతంబు నగు నిమి

త్తంబు పరికించి దేశానుసారంబుగఁ గొంతకాలం బెడమీఁదగు. లిఖితం బెక్కారణంబున నయిన నశించెనేని సాక్షులచేతను భోగంబులచేతను సాక్షులును లిఖితంబును లేకున్నను జిరకాల భోగంబు (Enjoyment or possession) చేతను భోగంబు లేకున్న సాక్షి లిఖితంబులచేతను రాజు వివాదంబుల నిర్ణయంబు సేయందగును; కాని కేవలసాక్షులచేతను భోగంబులచేతను లేఖనంబుచేతను నిర్ణయంబు సేయందగదు. కుటిలులు (Hypocrites) నిపుణులు నగువారు లేఖ్యబింబంబుల వ్రాయ సమర్థులు గానఁ గేవల లేఖ్యంబు సామర్థ్యంబునను స్నేహలోభభయంబుల సాక్షులు కూటంబు పల్కుదురనుశంకచేఁ గేవలసాక్షిబలంబునను బలవంతులు సస్వామికంబేని యస్వామికంబేని ద్రవ్యంబు బలదర్పంబున ననుభవింతురు గానఁ గేవల శంకిత భోగంబులచేతను విచారపతి వివాదనిర్ణయంబు సేయందగదు. సభ్యులు సందిగ్ధంబులయిన వ్యవహారంబులన సందేహింపవలయుం గాని యెల్ల వ్యవహారంబుల సంశయింప వలదు. అట్లు శంకించిన సభ్యుల రాజు శాసింపకున్న ననవస్థయగు. మఱియు లోకంబు భేదిల్లు; వ్యవహారంబును ధర్మంబును గ్రమంబుగ నశియించు. దానాదిలిఖితంబు గలదియు నిరాక్రోశంబు క్రమాగతంబు ప్రతివాది సన్నిధానంబున భుక్తంబు నగు చిరకాల భోగంబు ప్రమాణవంతంబు. ఎవఁ డెప్పుడును లిఖితంబు లేదనియు భోగవ్యాజంబునన తనకు వివాదవిషయంబైన పదార్థంబు తావలెననియు వాదించు నాతఁడు తస్కరుండగు. మఱియు నేకొలఁదియు భోగంబులేని లిఖితంబును బలవంతంబు గాదు

గాని యేధని తనయెదుటఁ దనపదార్థంబు పరు లనుభవించుచుండ నెఱిఁగియుఁ బదియేం డ్లుపేక్షించు నాతఁ డావస్తువు మరలఁ దనకు రావలయు నని వ్యవహారపదంబు సేయం దగఁడు. ఎవఁడు సమర్థుండయ్యుఁ దనభూమి నితరు లనుభవించుచుండ రాజునకు విన్నవింపక యిరువదేం డ్లుపేక్షించు నాతం డాభూమిని మరలఁ బొందఁ దగఁడు. కాని యెవఁడేని యనాగమంబుగఁ బరద్రవ్యంబు చిరకాలం బనుభవించినను రాజు వానిం జోరదండంబున దండించి ద్రవ్యంబు స్వత్వవంతున కిప్పించునది. ఎవఁడు లిఖితంబు నొందకున్నను నఱువదేండ్లెడ తెగకుండ నేభూమి ననుభవించు రాజాతనినుండి యాభూమి దొలఁగింపఁ దగదు. ఆధియు (తాకట్టువస్తువు-తనఖా భూమి) సీమయుఁ బరులయింట దాఁచిన ధనాది జంగమ పదార్థంబును బరుల కొప్పగించిన గృహాది స్థిరపదార్థంబును బాలుని (Minor) ద్రవ్యంబును రాజద్రవ్యంబును శ్రోత్రియ ద్రవ్యంబును జిరకాలంబు పరానుభూతంబు లయ్యును స్వత్వంబునకు హాని పుట్టింప నోపవు. అయినను బూర్వోక్తంబయిన కాలం బతిక్రమించునంతదనుక నుపేక్షించిన యాతఁడా ద్రవ్యంబుఁ బొంద నర్హుండుగాఁడు. ఇది సంక్షేపంబున సాక్షి భోగలిఖితంబుల స్వరూపంబు.

అగ్న్యాది పరీక్ష

ఇంకఁ బ్రమాదంబున నీ మూఁడు సాధనంబులు లేని యేధనియగు వాదిపాదంబు ప్రతివాది యపహ్నవించు నాతని కార్యంబు సాధింప సమర్థంబు అగు దివ్యోపాయంబులు చెప్పంబడు. యుక్తియుఁ జోదనాప్రతికాలంబును శపథం

బునట్టి క్రమంబుగఁ గార్య సాధనంబులు. శాస్త్రంబునకు శిష్టాచారంబునకు విరోధంబు లేకుండఁ దత్త్వనిర్ణయార్థంబు రాజుచేఁ దర్కింపఁబడినయోజన యుక్తి యనంబడు. దానంబును బ్రలోభనంబును భేదోపాయంబును దానికి సాధనంబులగు. వాది చెప్పినయంశంబు మాటిమాటికి నడిగిన దానిం బ్రతివాది నిరాకరింపకున్న నది చోదనాప్రతికాలంబగు; వీనిచే నర్థనిర్ణయంబు సాధ్యంబు గానపుడు దివ్యంబులయిన శపథంబులచే సత్యంబు రా జెఱింగి ధర్మంబు శాసించునది. మున్ను మహాత్ములైన దేవతలు దుష్కరార్థంబున నీప్రమాణంబు లుపయోగించిరి గాన వీనికి దివ్యంబులని నామంబు గల్గె. మఱియు వసిష్ఠాదులయిన సప్తర్షులు భిక్షాహరణకాలమున నాత్మశుద్ధ్యర్థం బీప్రమాణంబు నంగీకరించిరి. అట్టి మహాత్ములచే నంగీకృతంబయిన యీప్రమాణంబు జ్ఞానదర్పంబున నంగీకరింపనివాఁడు ధర్మతస్కరుం డగు. ఏబ్రాహ్మణుండు జ్ఞానహీనుండయి దివ్యంబు నిరాకరించు నాతని యర్థధర్మంబుల దేవతలు హింసింతురు. ఎవఁ డాత్మవిశుద్ధ్యర్థంబు దివ్యంబు చేసి శుద్ధుఁడగు నతఁడు స్వర్గంబు నుత్తమకీర్తియుం బొందు. అగ్ని విష జలంబులు, తులయు, ధర్మాధర్మంబులు, తండులంబులు, శపథంబులును దివ్యనిర్ణయంబున సాధనంబులని మునులచే నిర్దిష్టంబు లయ్యె. దివ్యంబులన్నియు బలవంతంబులకాని యిందు లోకవిశ్వాసంబుం బట్టి పూర్వపూర్వంబు బలీయంబు. తప్తాయోగోలంబు గరంబున ధరియించి యేడడుగులు నడుచుటయేని కాలినయింగలంబుల నన్నియడుగులు నడుచుటయేని తప్తతైలంబున నున్న లోహంపుగుళిక చేతఁ దీయుట

యేని సుతప్తంబయిన లోహశలాక నాల్కనుస్పృశించుటయేని యగ్నిపరీక్ష యగు. విషంబు గ్రహించుటయుండేఁ గృష్ణసర్పంబు హస్తముల నుద్ధరించుటయుఁగడె విషపరీక్షయు. స్వేష్టదేవత కభిషేకించిన జలంబు ద్రావి నియమితకాలమున నీట మునిఁగియుంట జలపరీక్షయునగు. తుల నధిరోహించి మొదటను దరువాతను హీనుఁడు నధికుఁడు నగునో కాఁడో శోధించుట; తులాపరీక్ష. ధర్మాధర్మమూర్తుల నదృష్టంబుగ గ్రహించుట ధర్మాధర్మపరీక్షయుఁ గర్షమాత్రమితంబు లగు తండులంబుల నమలించుట తండులపరీక్షయు నగు. పూజ్యులపాదంబులు స్పృశియించియుఁ బుత్త్రునిశిరంబు తట్టియు ధనంబు ముట్టియు నేనీపాపంపుఁగార్యంబు చేసితినేని నాసుకృతం బెల్ల నశియించుఁ బాపము వర్ధిల్లునని బాససేయుట శపథంబగు. సహస్రంబపహృతంబయిన నగ్నిపరీక్షయు నందు మూఁడంశము లపహృతంబయిన విషపరీక్షయు నర్థంబపహృతంబయిన జలపరీక్షయు మూఁడవవంతు తక్కువగా నపహృతంబయిన ఘటాపరీక్షయుఁ జతుర్థాంశం బపహృతంబయిన ధర్మాధర్మశోధనంబును దదర్ధంబయినఁ దండుల[illegible]యుఁ [illegible] బపహృతంబయిన శపథంబును రాజు [illegible]యించునది. [illegible]సన్నిధిన దివ్యశోధనము చేయవలయు. దివ్యనిర్ణయమున [illegible]దర్శనమువలనఁ బ్రతివాదికి దివ్యము నిర్ణయించునది. [illegible]వాఁడును వాది నేనాఁడును దివ్యంబులు నియోగింపఁ [illegible] గాని వాది యిచ్చచే దివ్యప్రమాణంబు సేయం జను. వాది ప్రతివాదులలో నొకఁడు దివ్యంబు సేయునపుడు రెండవవాఁడు సమ్ముఖస్థితుండు గావలయు. దస్యులచే నిలిచి[illegible] [illegible]డని నిర్ణ

శింపఁబడినవానికిని రాజుచేశంకితుఁ డగువానికి నాత్మశుద్ధిపరులకు దివ్యంబు నిర్ణయింపఁ దగుం గాని యపుడు రెండవవాఁడు సమ్ముఖమందున్న వాఁడుగానక్కఱలేదు. పరదారగమనంబున నగమ్యాగమనమున మహాపాతకమునను దివ్యంబావశ్యకము. చౌర్యాదికార్యముల శంకితులకు సుతప్తగోళోద్ధరణము విధింపవచ్చు. ప్రాణాపాయకరంబయిన వివాదమున సాధనములున్నను వాది ప్రమాణము గోరెనేని వానివిచారణం బనావశ్యకము. కాని యా సాధనములు కపటపూర్ణంబులయినట్టు రాజునకు విదితంబయ్యెనేని ధర్మాసనగతుండయి వాని దివ్యాదుల శోధించునది. నిర్జనారణ్యమునను నిశీథమున నంతర్గృహంబునను జరిగిన యపరాధంబులందును స్త్రీలశీలాభియోగంబునను బ్రతివాది వాదిచెప్పిన సర్వార్థంబు నపహ్నవించినపుడు మానుషసాధనంబు లయిన సాక్ష్యాదులు లేని యపుడు నవిదుష్టంబు లయినపుడును రాజు కార్యంబుల దివ్యసాధనంబుల శోధించునది. మఱియు సాక్షు లున్నను మహాపాతకంబుల యభియోగంబులందును నిక్షేపహరణంబునను దివ్యసాధనంబుల విచారించునది. రాజు వేనియుం దుత్తములుం దక్కిన వారునగు సాక్షులు వేఱువేఱువిధముగా సాక్ష్యంబు సెప్పుదురో యావాదంబుల శపథంబులఁ దీర్చునది. స్థావరవిషయంబు లయిన వివాదంబులందును దానంబుచేసి మరలఁ బుచ్చికొన్నవానియందును క్రయముచేసి సొమ్ము పుచ్చికొన నిచ్ఛయింపఁదను వాదంబునను పూగశ్రేణిగణంబులయు, స్వామిభృత్యులయు వివాదంబులందును సాక్షులను లిఖితంబును భుక్తిని బరిశీలించి రాజు తీర్పవలయుం గాని దివ్యంబులఁ దీర్పందగదు.

వివాహ విషయంబును, ద్యూతసంబంధంబు, దేవోత్సవాది సంబంధంబు నయిన వివాదంబులయందు సాక్షులన కాని యితరసాధనంబుల విచారింపఁ దగదు. ద్వారమార్గాదులయుఁ బరీవాహాదులయు వివాదంబుల భుక్తియ కాని యితరంబు రాజు పరిశీలింపఁ దగదు. మీఁదటి వివాదంబుల వాది ప్రతివాదులలో నొకఁడు మానుషసాధనంబులు నొకఁడు దైవసాధనంబులును విచారింపఁ గోరినను రాజు మానుషంబు లయిన సాక్షిభోగాదులు వివాదాంశంబున నేకదేశవ్యాప్తంబులయినను వానిన గ్రహించి విచారింపవలయును గాని దివ్యంబుల విచారింపఁ దగదు.

తీర్పు

సాక్షి లిఖితాదిసాధనంబులను వాదకారణంబులను వాదుల చరిత్రంబునను శపథంబులను రాజాజ్ఞను వాది యంగీకారంబునను నిర్ణయం (Decision) బాఱు తెఱంగుల నుండు.

ఏ వివాదంబుల సాక్షి లిఖితాదులును దివ్యావకాశంబును లేకుండు నా వివాదంబుల రాజు తనయిచ్ఛం దీర్పవచ్చు. సందిగ్ధంబులయి నిశ్చయింప నశక్యంబులయిన సీమానిర్ణయాదులను బ్రభువుగాన రాజు ప్రమాణము. రాజు స్వాతంత్ర్యుఁడయి తీర్చెనేని కిల్బిషంబు నొందుం గావున ధర్మశాస్త్రానుసారంబుగ విచారింప వలయు. రాజామాత్యులలోభంబున వ్యవహారంబుల దోషంబు లొదవుఁ లోకంబు ధర్మచ్యుతి నొంది కూటకార్యంబులఁ బ్రవర్తిల్లు. కామక్రోధాదుల యతిశయంబున వ్యవహారంబు జరిగెనేని వాది ప్రతివాదులను

సాక్షులను సభ్యులను రాజును శాపంబు నొందుఁ గాన లేదు లోభాదికారణంబులఁ బోవడచి తగవుల విమర్శింప వలయు. ఏవారు రాజునకు ననర్థంబర్థవంతంబని విపరీతంబుగ నివేదింతురు వారును వారుఁ జెప్పినది విచారింపక సత్యంబని తలఁచి యాకార్యంబున నట్లు ప్రవర్తించిన రాజును పాపంబు చేసిన వారికంటె నెనిమిది మడుంగు లెక్కువ పాపం బనుభవింత్రు. రా జధర్మప్రవృత్తుండయిన సభ్యు లుపేక్షింపక ధర్మంబు నివేదించునది. అట్లుచేయక యుపేక్షించినవారును రాజుతోఁ గూడ నధోముఖులయి నరకంబునఁ గూలుదురు. ధిగ్దండంబును వాగ్దండంబును సభ్యులును, ధనదండంబును వధదండంబును రాజును విధింప వలయు.

వాదముల పునర్విమర్శనము

ఎవఁడు రాజు తీరితమును అనుశిష్టము (Judgment and Decree) నధర్మంబని తలంచు వానివలన మునుపటి దండధనంబుకంటె ద్విగుణధనంబు పూఁట పెట్టించి (డిపాజిట్ చేయించి) వివాదమును మరల విమర్శించునది. తీర్పయిన పిదప సాక్షులచేతనేని సభ్యులచేతనేని యవసన్నుని (బాధింపఁబడినవాని) చేతనే నమాత్యులచేతనేఁ బత్రంబున దూషణంబు ప్రకటింపఁబడెనేని రాజు తాను విచారించిన తగవులయందును బునర్విమర్శము చేయు విధిగలదు. అమాత్యుఁడేని ప్రాడ్వివాకుఁడేని సభ్యుఁడేని యధర్మంబుగ న్యాయస్థానంబునఁ దగవులఁ దీర్చిన రాజు వాని మరలఁ బూర్ణంబుగ విచారించి తీర్పరుల సహస్ర ధనదండంబున దండించునది. క్రమంబుగ దండింపఁబడిన నే

వాఁడును సన్మార్గంబునఁ బ్రవర్తిల్లఁడు; కాన సభ్యదోషంబు ప్రకటింపఁబడెనేని రాజా వాదమును మరల విమర్శించునది. వాది వాదము యుక్తిచే స్థిరపఱిచి కొనుటవలనను న్యాయాధిపతి యంగీకరించుటవలనను జయపత్రమును గొనుటవలనను జయి యగు. వాది వాదంబు ప్రాడ్వివాకాదులు శోధించి సత్యంబని యంగీకరించినను బ్రతివాది యొప్పికొన్నను రాజు జయించినవానికి జయపత్రంబీవలయుఁగాని వాదివాదం బసత్యంబని ప్రతివాది చెప్పినపుడు సభ్యులును విచారించి యట్లు నిర్ణయించిరేని వాదిని మిథ్యాభియోగమునకుఁ దగునట్లు బహువత్సరంబులు నిరోధించి (ఖైదుచేసి) ప్రతివాదిని గౌరవింపవలయు. కామక్రోధంబులు విసర్జించి ధర్మశాస్త్రానుసారంబుగ వివాదంబులఁ దీర్చు జేని నదులు సముద్రంబుంబోలె నెల్ల ప్రజలు ననువర్తింతురు.

పదార్థ స్వామ్యము - వాని విభాగమును

తల్లిదండ్రులు జీవించినంతకాలంబును బుత్రుఁడు వృద్ధుఁడయినను జరస్థిర పదార్థంబులయందు స్వతంత్రుండు గాఁడు. ఆయిద్దఱియందును దల్లికంటెఁ దండ్రి బీజప్రాధాన్యమువలన స్వాతంత్ర్యంబున నధికుఁడు. తండ్రి లేనియపుడు తల్లి స్వతంత్రురాలయ్యెడు. వారియభావమున జ్యేష్ఠుఁడు స్వతంత్రుఁడగు. జ్యేష్ఠత్వంబు వయోగుణంబుల లభియించు. తండ్రికిం బెక్కండ్రు భార్యలున్న వారియందుఁ బుత్రుండు తల్లియందుంబోలె భక్తిం జూపుచుఁ దనభాగంబునకు సమంబయిన యొక భాగంబున వారినెల్లఁ బోషింప వలయు. కార్యంబులయం దెల్లఁ

ప్రజ లస్వతంత్రులును రాజు స్వతంత్రుఁడునగు. శిష్యాచార్యులలో నాచార్యుఁడు స్వతంత్రుఁడు. పుత్రునకు నతనిభార్యకు నుపదేశింపను వారి శిక్షింపను దండ్రికి స్వాతంత్ర్యంబు గలదుగాని పుత్రుని దానంబు సేయను విక్రయింపను స్వాతంత్ర్యంబు లేదు. స్వతంత్రులెల్లను బరతంత్రుల ననుశాసింపను వారి వస్తువుల దానంబు సేయను దగుదురు. మణిముక్తాది పదార్థంబులెల్లను దానంబుసేయను విక్రయింపను దండ్రి స్వతంత్రుఁడ కాని స్థావరంబుల నట్లు చేయఁ దండ్రి కేని తాత కేని స్వాతంత్ర్యంబు లేదు. భార్యయుఁ బుత్రుండును దాసుండునను మువ్వు రధనులు. వారు సంపాదించిన ధనంబు వారియెడ స్వాతంత్ర్యంబుగలవారిద యగు. ఏధనం బెవనిచేత నుండు దానికెల్ల నతఁడే స్వామి గాఁడు. స్తేయంబు మొదలయినవానిచే నొకని సొమ్మింకొకనిచే నుండుటఁ జూచుచుంటిమిగాదే? కావున శాస్త్రానుసారంబుగఁ బ్రాప్తంబయిన స్వామ్యంబు స్వామ్యంబు గాని తనవశంబున నున్నదాని కెల్ల స్వామ్యంబు లేదు. అస్వతంత్రుల ధనంబు స్వతంత్రులు పుచ్చికొన్న వారిధనంబు వీరపహరించిరి యనం గూడదు.

శాస్త్రంబున వర్ణానుసారంబుగఁ బూర్వాచార్యులచే లోకస్థితి కారణంబుగా విహితంబయిన ధనార్జనోపాయంబు మ్లేచ్ఛులకును గ్రాహ్యంబు. ధనస్వామి పుత్రులకుం బత్నులకు సమభాగంబును గన్నెకందర్ధంబును నందు సగంబు దౌహిత్రునకు నీవలయు. తండ్రి మృతుండయినయెడఁ బుత్రాదులు పూర్వోక్తభాగులయగుదురు; కాని కొమరుండు తల్లికిఁ దన

ధనంబున నాల్గవపాలును సహోదరి కెనిమిదవపాలును మేనల్లునకు షోడశాంశంబు నిచ్చి తక్కిన దంతయుఁ దాను బుచ్చుకొనందగు. కొమరుఁడును మనుమఁడును బెండ్లమును గూఁతురును దత్పుత్రుండును దల్లియుం దండ్రియు భ్రాతయు నతనికొడుకును బూర్వపూర్వుండు లేనపుడు మృతుండయినవానిసొమ్ముఁ గ్రమంబుగ ననుభవింపఁ దగుదురు. సౌదాయికంబయిన ధనంబు స్థిరంబయినం జరంబయినను దద్దాన విక్రయాదులందు స్త్రీలకు స్వాతంత్ర్యంబు గలదు. ఊఢ కేని కన్య కేని తల్లిదండ్రులచేతనైన భర్తచేనయిన నితరబంధుల చేతనయిన నీఁబడిన పదార్థంబు సౌదాయికంబనంబడు. తండ్రి మొదలగు ప్రాచీనులధనంబుతో సంబంధంబు లేకుండ నెవ్వఁడేధనం బార్జించు దాని నతఁ డిచ్ఛానుసారంబుగ ననుభవింపఁ దగు; మఱియు నం దితరులకు భాగంబు లేదు. జలంబువలనను దస్కరులవలనను రాజువలనను నగ్నివలనను నుపద్రవంబు ప్రాప్తించి నపుడు స్వబలంబున దాని రక్షించినవానికి నందు దశమాంశం బుపాయనం బీవలయు. సొన్నారులు మొదలగువారు పెక్కండ్రేకీభవించి శిల్పాదులం జేసిరేని వారికిఁ గార్యానురూపంబుగ వేత్వేఱ నిర్వేశం బీవలయు. కళలనేర్చి వస్తువులకు సంస్కారంబు సేయు విజ్ఞానంబుగలవాఁడు శిల్పియని విద్వాంసులు చెప్పుదురు. హర్మ్యంబులు, నుపకరణంబులు ప్రాసాదంబులు వాపీకూపతటాకంబులేకీభవించి నిర్మించువారిలో ముఖ్యునకు నితరుల భృతికంటె రెండంశంబులధికంబుగ గృహస్థుఁ డీవలయు. నర్తకులలో గాయనులకు సమభాగంబును దాళగానికం దర్ధంబును

విద్వాంసులు నిర్ణయించిరి. రాజు ననుజ్ఞ నొంది శత్రురాష్ట్రంబు నుండి ధనంబాహరించిన చోరు లందాఱవపాలు రాజునకు నివేదించి తక్కినదాని నందఱు సమంబుగఁ బంచికొనునది. కాని యందెవ్వరైనం బలరులచేఁ బట్టువడిన నతని విడిపింప నయ్యెడు వ్యయం బెల్లవారు సమంబుగ వహింపవలయు.

హేమరస ధాన్యాదిపదార్థంబులు పెక్కండ్రేకీభవించి సమాదిభేదంబున భాగంబు లేర్పఱిచికొని వాణిజ్యంబు సేసిన నందలి లాభంబు మొదల వారేర్పఱిచికొన్న భాగంబుల క్రమంబునఁ బంచికొనవలయు. సమంబుగను న్యూనంబుగను నధికంబుగను బాళ్లేర్పఱిచికొన్న వారు భాగానుసారంబుగ ముందు ధనంబు వెచ్చించి చేయవలసిన కార్యంబులు చేసి పిదప లాభంబు గ్రహింపవలయు. కర్షకులుం బెక్కండ్రు కృషిచేసిన నిట్లె పంచికొనందగు. సామాన్యధనంబును యాచితంబును న్యాసంబును దాసుఁడు తద్ధనంబు నాధియు నిక్షేపంబును వంశమున్నపుడు సర్వస్వము నన్వాహితమునను వాని దన కెంత యాపదయైన బండితుఁడు విక్రయింపను దానంబు సేయను దగఁడు. ఈయఁగూడని వస్తు విచ్చినవానిని బుచ్చికొనం దగనిదానిఁ బుచ్చికొన్నవానిని రాజు చోరదండంబున దండించి ద్విగుణధనంబు స్వత్వవంతున కిప్పింపవలయు. తస్కరులవలనను గృహస్వామికంటె నితరులవలనను రహస్యంబున వస్తువులం గొనుచు నట్లు విక్రయించుచున్న వాఁడు చోరుఁడునుం బోలె రాజున కవశ్యము దండ్యుఁడగు. సజ్జనుండగు యజమానుం బరిత్యజించిన పురోధసు నట్టి పురోధసుం బరిత్యజించిన యజమానుని రాజు దండింపవలయు. రాజు

వణిజులమ్ముపదార్థములకు వ్యయంబును దేశకాలములను ననుసరించి ద్వాత్రింశాంశమేని షోడశాంశంబేని లాభంబు నిర్ణయింప వలయు. మఱియు నేవాఁడైన లాభంబు నర్థంబు గ్రహించుచు వ్యవహరింప వడ్డీ లేకుండనప్పియవచ్చు. అధమర్ణునివలన నుత్తమర్ణునకు మూలధనంబునకు ద్విగుణంబుగ వృద్ధిధనంబు వచ్చినతరువాత వడ్డిపుచ్చికొనం గూడదని బేహారులకాజ్ఞ యీవలయు. ధనికులు చక్రవృద్ధిమిషంబునఁ బ్రజాధనంబు హరింపఁ జూతురుగావ వారివలన జనులను రాజు సుయత్నంబున రక్షించునది. సమర్థుఁడయ్యు నెవ్వఁడు ధనవంతులయొద్ద నప్పుపుచ్చికొని హరియింపఁ జూచు నతనిచే సామాద్యుపాయంబులఁ బ్రభువు వారిసొమ్మిప్పింపవలయు. మఱియు నెవఁడేని వ్రాయించుకొన్న లిఖితంబు ప్రమాదంబున నష్టంబయినట్లు విన్నవించుకొన్న సాక్షులచే బాగుగం బరిశీలించి మరల మునుపటియట్లు వ్రాయించి యిప్పింపవలయు.

దండింపఁ దగినవారు

ఇతరుల పదార్థంబుల నీయకుండఁ బుచ్చికొన్నవానిఁ గూటపణ్యంబు (సంకరపుసరకు) లమ్మువానిని, మున్నిచ్చిన వాని మరలఁ గోరువానిని, ధర్మజ్ఞుఁడయిన రాజు తప్పక శాసించునది.

గనులనుండి తీయువస్తువుల కర నిర్ణయము

శిల్పులకు వారుచేయు వస్తువులను వారిగుణంబులను బరికించి నృపుఁడు దినవేతనంబు నిర్ణయింపవలయు. ప్రతిదిన

ము గనులనుండితీసి రజతము నమ్మువానికిఁ దన్మూల్యంబున నైదవపాలేని నాల్గవభాగమేని మూఁడవయంశంబేని యర్ధంబేని పన్ను నిర్ణయింపం దగుం గాని యంతకంటె నధికంబు నిర్ణయింపం దగదు.

చేసిన వస్తువులస్వరూపము

చేసినవస్తువులం గరఁగినపుడు నూఱుపలంబులకు మించని శుచిస్వర్ణంబున నేమియుఁ దఱుగఁగూడదు. రజతంబునఁ జతుశ్శతాంశంబును దామ్రంబున నూటికొక్కపాలును వంగజసదసీసంబుల షోడశాంశంబును నాయసంబున నష్టమాంశంబును హీనంబగు; నంతకంటె నెక్కువ హీనంబయిన శిల్పియవశ్యంబు దండ్యుఁడగు.

స్వర్ణరజతాది వస్తునిర్మాణమునకు భృతి

స్వర్ణంబున నదుకులుగల మెడపులఁ జేసిన ద్విశతాంశంబును రాజతంబుల నట్టివానిం జేసిన నూటికొక్కపాలును దఱుఁగును. సుసంయోగంబున(=మంచిటంకము కూర్పున)షోడశాంశంబు వర్ధిల్లు. వాని నిర్మాణవిశేషంబున వృద్ధిహ్రాసంబుల నెఱుంగుచు నెక్కువ తఱిఁగిన స్వర్ణకారు నవశ్యంబు రాజు శిక్షించునది. మఱియు స్వర్ణంబున నుత్తమవస్తువుల రచియించునపుడు తన్మూల్యంబున ముప్పదవయంశంబును మధ్యవస్తువులఁ జేయునపు డఱువదవయంశంబును హీనంబులయిన వానిం జేయునపు డందర్ధంబును హీనతరంబులయిన కటకాదుల నిర్మించునపుడు మీఁదటిదానియందు సగంబును

(240 వ యంశము) తేఁడు భృతి నిర్ణయింపవలయు. కేవల విద్రుతికిఁ బైదానియం దర్ధంబ భృతి యగు. మఱియు రజతమున నెక్కుడు జతనంబున రచియింపబడు నుత్తమవస్తువులకుఁ దన్మూల్యంబున నర్ధంబును మధ్యవస్తువులకు నాల్గవపాలును సాధారణంబులకు నెనిమిదవయంశంబును గటకాదులకు షోడశాంశంబును నిర్వేశంబు గావచ్చు. తామ్రవంగాదుల కార్యంబులకు వానిమూల్యంబున నాల్గవవంతును లోహకార్యంబుల కర్ధంబేని సమంబేని ద్విగుణంబేని యష్టగుణంబేనియుఁ గూలి భూపతి నిర్ణయించునది. మఱియు సువర్ణాది ధాతువులయందుఁ గూటంబు సేయువానిని ద్విగుణంబుగ దండింపవలయు. మున్ను మునులచే నిరూపితంబును లోకులచే ననుష్ఠితంబు నగు వ్యవహారంబు పెక్కుతెఱంగులు కలదియయి యుండు. అదియంతయుఁ జెప్ప నశక్యంబు గావున దిఙ్మాత్ర మిం దుదాహృతం బయ్యె. ఇం దనుక్తంబులగు గుణంబులను దోషంబులను లోకంబునను శాస్త్రంబునను దేఁటెఱిఁగి వ్యవహరింపవలయు.

ఇది శుక్రనీతిసారంబున నాంధ్రీకృతంబునఁ జతుర్థాధ్యాయంబున

రాజధర్మనిరూపణం బను పంచమప్రకరణము

చతుర్థాధ్యాయము

షష్ఠప్రకరణము

దుర్గభేదములు

ఇట్లు రాజధర్మంబు నిరూపించి శుక్రుండు సంగ్రహంబుగ షష్ఠంబయిన దుర్గప్రకరణంబు చెప్పందొడంగె. ఖాతంబునను గంటకపాషాణంబులను దుష్పథంబయినది యైరిణంబయిన దుర్గంబును నలుదిక్కుల మహాఖాతంబు గలది పారిఖంబు నిష్టకోపల మృద్భిత్తికాప్రాకారంబు గలది పారిఘంబును మహాకంటకవృక్షసముదాయ వ్యాప్తంబయినది వనదుర్గంబును నలుఁగడల జలాభావంబు గలది మరుదుర్గంబు నన్నిదెసల మహాజలావృతంబయినది జలదుర్గంబును మీఁద జలంబుగలదై వివిక్తోన్నతస్థలమునందు శిరోగృహయుతంబుగ నిర్మితంబయినది గిరిదుర్గంబును నభేద్యంబు వ్యూహవిదులగు వీరులచే గుప్తంబు నగునది సైన్యదుర్గంబును శూరులతోడను ననుకూలు రగు బాంధవులతోడనుం గూడినది సహాయదుర్గంబు నగు. పారిఖంబుకంటె నైరిణంబును దానికంటెఁ బారిఘంబు నంతకంటె వనదుర్గంబును దానికంటె ధన్వదుర్గంబు నన్నిటికంటె జలదుర్గంబు నంతకంటెను గిరిదుర్గంబును శ్రేష్ఠంబులని నీతిజ్ఞులు వల్కుదురు. సహాయదుర్గంబును సైన్యదుర్గంబునను నివి యెల్ల దుర్గంబుల కలంకారంబులు నవి లేని దుర్గంబులు నిష్ఫలంబులు నగు. మఱియు రాజునకు నన్నిదుర్గంబులకంటె సేనాదుర్గంబు శ్రేష్ఠంబని యుఁ దక్కిన దుర్గంబు లెల్లఁ దత్సాధకంబులనియు సేనాదుర్గంబుగల రాజునకు భూమి వశ్యయగుననియు నది లేనిదుర్గంబులెల్ల బంధనాగారంబులనియు విద్వాంసులు చెప్పుదురు. కాఁబట్టి రాజుదాని నవశ్యము నాశ్రయించి రక్షించునది. దుర్గస్థుఁడయినజోదు శస్త్రధరుండయినఁ బ్రతియోధశతంబు నే నోడింపఁజాలును. రాజుల కాపత్కాలంబున దుర్గాశ్రయంబుత్తమంబగు. మఱియు సైన్యదుర్గంబు గల శూరునకు స్థలంబెల్ల దుర్గప్రాయంబ యగు. రాజులు దుర్గంబుల నెల్ల ధాన్యపుష్టంబులు వీరాస్త్రసంయుతంబులు యుద్ధసంభారపూర్ణంబులుం గోశసహితంబులు గావించి రక్షింపవలయు. సహాయయుతంబయిన దుర్గంబునకు విజయంబు నిశ్చితంబు గావున నది యుత్తమంబు. మఱియు సహాయవంతం బెల్ల ఫలవంతంబగుం గావున దుర్గంబుల యానుకూల్యంబున రాజునకుఁ దప్పక విజయంబుగలుగు.

ఇది శుక్రనీతిసారంబున నాంధ్రీకృతంబునఁ జతుర్థాధ్యాయంబున

దుర్గనిరూపణం బను షష్ఠప్రకరణము

చతుర్థాధ్యాయము.

సప్తమప్రకరణము-దాని భేదములును

సేనాస్వరూపము-దాని భేదములును

ఇట్లు దుర్గప్రకారంబు సంగ్రహంబుగఁ జెప్పి సైన్యనిరూపణం బయిన సప్తమప్రకరణంబు భార్గవుండు చెప్పం దొడంగె. శస్త్రాస్త్రసంయుక్తంబయిన మనుష్యాదిగణంబు సేన నాఁబడు. సైన్యంబు స్వగమంబు నన్యగమంబు నని ద్వివిధంబగు. ఉభయంబును దైవియు నాసురియు మానవియు నని త్రివిధంబయ్యె. ఈ మూఁటిలోఁ బూర్వపూర్వంబు బలాధికంబు. అందుఁ బరాపేక్ష లేకుండ గమనశీలంబు స్వగమంబును యానసహాయంబునం బోవునది యన్యగమంబు ననంబడు. పాదాతంబయిన సైన్యంబు స్వగమంబును దక్కినది యన్యగమంబు నగు. అన్యగంబు రథాశ్వగజగభేదంబునం ద్రివిధంబు. సైన్యవంతునక. కాని రాజ్యంబును ధనంబును బరాక్రమంబును సిద్ధింపవు. మఱియు బలవంతున కల్పజనున కేని యెల్లవారు వశులును దుర్బలునకు శత్రులు నగుదురు; రాజునకుం జెప్పనేల. శరీరబలంబును శౌర్యబలంబును సేనాబలంబు నాస్త్రికబలంబును బంచమంబయిన ధీబలంబు నాయుర్బలంబును గలరాజు ప్రత్యక్షవిష్ణు వగు. దేవాసురాదులును సేనాసహాయంబు నొందక యన్యోపాయంబుల స్వల్పశత్రునేని జయింప సమర్థులుగారు. మఱియు సేనయే రిపుపరాజయంబునకుఁ గారణంబగుట రాజవశ్యంబు నభేద్యంబయిన బలంబు సంతరించునది. సేనాబలంబు స్వీయంబు మైత్రంబు నని ద్వివిధంబు. అది మౌలసాద్యస్క-భేదంబున నిరుదెఱఁగులనుండు. ఇది యెల్లను సారంబు నసారంబు ననియు శిక్షితంబు నశిక్షితంబు ననియు గుల్మీభూతంబు నగుల్మీభూతంబు ననియు దత్తాస్త్రవాహంబు స్వాస్త్రవాహంబుననియు రెండువితంబులనుండు. సౌజన్యంబునఁ గార్యసాధకంబయిన బలంబు మైత్రంబును భృతిపాలితంబు స్వీయంబు నగు. అనేకవత్సరంబులనుండి యనుబంధించినది మౌలంబును నూతనంబుగ సంపాదించినది సాద్యస్కంబు నని తద్విదులు వల్కుదురు. సుయుద్ధకాముకంబు సారంబును విపరీతం బసారంబును వ్యూహాదికుశలంబు శిక్షితంబును విపరీతం బశిక్షితంబును సాధికారికంబు గుల్మీభూతంబును స్వస్వామికం బగుల్మకంబును రాజశస్త్రాస్త్రంబులు గ్రహించునది దత్తాస్త్రంబును దక్కినది స్వశస్త్రాస్త్రంబును దేజస్సున స్వాధీనంబయిన కిరాతాదికం బారణ్యకంబును శత్రులచే నుత్సృష్టంబయి తన భృత్యవర్గంబునఁ జేరినదియు భేదోపాయంబున స్వాధీనంబయిన సైన్యంబును శత్రుబలంబు నని చెప్పంబడు. ఇందుఁగడపటిబలంబులు రెండును దుర్బలంబులును గేవలకార్యసాధకంబులు గానివియు నగు. సములు నియుద్ధకుశలులు నగు సంగ్రామదక్షులయిన వీరులతో నియుద్ధార్థంబు వ్యాయామంబునను బలపోషకంబులయిన యాహారంబులను శారీరబలంబును వ్యాఘ్రాదిమృగంబులతోడి మృగవ్యంబునను శస్త్రాస్త్రాభ్యా

సపాటవంబునను శూరసంసర్గంబునను శౌర్యబలంబును దగిన భృతిచే సేనాబలంబును దపస్సామర్థ్యంబున నస్త్రబలంబును విద్వత్సంగంబున ధీబలంబును స్వగోత్రంబున రాజ్యంబు చిరస్థాయిగావించు సత్కార్యానుష్ఠానంబున నాయుర్బలంబును రాజు వర్ధిల్లఁజేయునది. ఎందనుక గోత్రంబున రాజ్యంబు సుప్రతిష్ఠితంబగు నందనుక మృతుఁడయ్యు బుత్త్రపౌత్త్రపరంపరచే జీవించినవాఁడయగు. ఆశ్వికంబయిన సైన్యంబుకంటెఁ జతుర్గుణంబయిన పాదాతంబును బంచమాంశంబయిన వృషబలంబు నష్టమాంశంబయిన క్రమేలకబలంబును దానం జతుర్థాంశంబు గజబలంబును దానియం దర్ధాంశంబయిన రథికబలంబును దద్బలంబుకంటె ద్విగుణంబయిన బృహన్నాళీకబలంబును రాజు లెల్లపుడు సంధరింపవలయు. మఱియుఁ బదాతిబహులంబును మధ్యమాశ్వంబు నల్పగజంబును సాధారణోష్ట్ర వృషభంబు నగు సైన్యంబు రాజు సంగ్రహింప వలయుంగాని గజాధికంబగుదాని సంగ్రహింపఁ జనదు.

ఆయమునుబట్టి గ్రహింపవలయు సేనయు - సంవత్సర వ్యయమును

ఏఁటేఁట లక్షకర్షమితం బయిన యాయంబు గల రాజు వయస్సార సంపన్నంబయి శస్త్రాస్త్రకుశలంబయిన పదాతి శతంబును లఘునాలిక యంత్రకుశలం బయిన పదాతి శతత్రయంబును నశీత్యశ్వంబుల నొక్క రథికుని బృహన్నాళధారుల నిద్దఱను బదియుష్ట్రంబులను రెం డిభంబులను రెండుశకటంబులను బదియునాఱు వృషభంబులను నాఱుగురు లేఖకులను మంత్రిత్రితయంబు నవశ్యంబురక్షించుచుఁ బ్రతిమాసంబు దానభోగార్థంబు సార్ధసహస్రం

బును లేఖక జీవితార్థంబు శతంబును మంత్రిరక్షణార్థంబు త్రిశతంబును దారపుత్త్రాది పోషణార్థంబు శతత్రయంబును విద్వదర్థంబు శతద్వయంబును సాద్యశ్వాది జీవనార్థంబు చతుస్సహస్రంబును గజోష్ట్రవృషాది పోషణార్థంబు చతుశ్శతంబును వెచ్చించుచు మిగిలినదానిఁ గోశాగారంబునఁ జేర్చుచుండవలయు. మఱియు సైనికులవలనఁ బ్రతివర్షంబు వేషార్థంబు రాజు కొంతసొమ్ము పుచ్చుకొను చుండవలయు.

రాజులు సంపాదింపవలయు రథ గజాదులు

అయస్సార నిర్మితంబును జక్రసుగమంబును బర్యంకాసనంబును నాందోలంబుంబోలె నారోహణ స్థానంబుగలదియు శస్త్రాస్త్రసంధార్యుదరంబును బ్రియచ్ఛాయంబును మనోరమంబు మధ్యమాసనసారథికంబు సదశ్వకంబు నగు నరదంబు రాజుచే రక్ష్యంబగు. నీలతాలువు నీలజిహ్వంబు వక్రదంతంబు నదంతంబు దీర్ఘక్రోధంబు క్రూరమదంబుఁ బదింటికంటెనే నెనిమిదింటికంటెనేని దక్కువ నఖంబులు గలదియు మందంబును భూశోధన పుచ్ఛంబు నగుగజం బనిష్టావహంబును విపరీతంబు శుభావహంబునగు.

గజభేదమును - దల్లక్షణంబును

గజంబులు మంద్రభద్ర మృగమిశ్ర భేదంబులఁ జతుర్విధంబులయ్యె. అందు మధునిభదంతంబును సుబలంబును సమాంగంబును వర్తులాకారంబును సుముఖంబును శ్రేష్ఠావయవంబునగు గజంబు భద్రజాతీయంబనియు స్థూలకుక్షియు సింహదృష్టియు బృహత్త్వగ్గల శుండంబును దీర్ఘకాయంబును మంద్రంబనియుఁ దనుకంఠ దంతశుండంబును హ్రస్వా

ధర లింగంబును స్థూలాక్షంబును వామనంబు నగు నది
మృగసంజ్ఞంబనియు మిలితంబులయిన మీఁదటి లక్షణంబులు
గలది మిశ్రంబనియుఁ దజ్జ్ఞులచే వ్యవహరింపఁబడు. గజంబుల
కెల్లఁ బ్రమాణంబు వేఱ్వేఱ గ్రంథకర్తలచేఁ గీర్తితం
బయ్యె. గజమానంబున నెన్మిది యవోదరంబు లొక్క
యంగులంబు నిరువది నాల్గంగులంబు లొకకరంబు నని విద్వాం
సులచేఁ జెప్పంబడియె. భద్రగజంబున కేడుహస్తంబుల యౌ
న్నత్యంబు నెనిమిదికరంబుల దైర్ఘ్యంబు దశకరమితంబయిన
యుదరపరిణాహంబు నుండు. మంద్రమృగంబుల ప్రమాణంబు
భద్రప్రమాణంబుకంటె నేకహస్తహీనంబుగాని దైర్ఘ్యంబు
భద్రమంద్రంబులకు సదృశంబని మునులు చెప్పిరి. శుభ
లక్షణ సంయుతంబును విశాల భ్రూగండఫాలంబును శీఘ్ర
గతియునగు వారణం బెల్లవానియందుఁ బ్రశస్యతమంబగు.

అశ్వపరిమాణమును-లక్షణములును-వాని భేదములును

పంచయవాత్మకంబయిన యంగులంబునన వాజి
మానంబు వేఱుగ స్మృతంబయ్యె. చత్వారింశ దంగుల
ముఖంబయిన యశ్వం బుత్తమోత్తమంబును షట్త్రింశ
దంగుల ముఖంబయిన గంధర్వం బుత్తమంబును ద్వాత్రింశ
దంగులముఖంబయిన వాహంబు మధ్యమంబు నష్టా వింశ
త్యంగుల ముఖంబయిన సైంధవంబు నీచంబునని చెప్పఁ
బడు. హయంబులకు ముఖమానంబున సర్వావయవమానంబు
కల్ప్యంబు. ముఖమానంబుకంటె వాజానేయంబులకు నౌన్న
త్యంబు త్రిగుణాధికంబును శిరోమణినుండి పుచ్ఛమూలంబు
దనుకఁ దృతీయాంశాధికంబయిన చతుర్గుణ దైర్ఘ్యంబు నుదర

వైశాల్యంబు త్ర్యంగులాధికంబయిన త్రిగుణంబు నుండు. ఇది
సాధారణ పరిమాణం బింక నష్టావింశత్యంగులముఖంబయిన
యశ్వంబు నవలంబించి విశేషపరిమాణంబు చెప్పంబడు.
శఫంబులయౌన్నత్యంబు మూఁడంగులంబులును మణిబంధం
బునకు నాలుగంగులంబులును జంగలకు నిరువదంగులంబులును
జానువులకు మూఁడంగులంబులును కూర్పరాంతంబయిన
యూరువులకుఁ జతుర్దశాంగులంబుల యౌన్నత్యంబును కూర్ప
రంబు సంధినుండి కందంబుదనుక సప్తత్రింశదంగులంబుల నిడి
వియును బ్రత్యగూరువులకు ముఖసదృశ పరిమాణంబును
జంఘ కందు మూఁడంశంబుల యౌన్నత్యంబు నుండుననియు
సుప్రసారిత గ్రీవాదైర్ఘ్యంబు ముఖపరిమాణముకంటె షష్ఠాం
శాధికంబయిన ద్విగుణంబును దాని యౌన్నత్యంబు సార్ధ
పాదహీనంబును స్కంధంబునుండి ముష్కమూలంబువఱకును
గ్రీవాసమదైర్ఘ్యంబును ద్రికదైర్ఘ్యం బష్టాదశాంగులంబును
బుచ్ఛదండ దైర్ఘ్యంబు ముఖార్ధంబును దదర్ధంబు లింగ ము
ష్క దైర్ఘ్యంబును షడంగులం బేని పంచాంగులం బేని చతురం
గులం బేని కర్ణ దైర్ఘ్యంబును శఫపరిణాహంబు పదియు నైదం
గులంబులును దదర్ధంబు మణిబంధంబునకును జానుజంఘ
లకుం బరిధియు నూరుపరిధి యేకాదశాంగులంబును బశ్చి
మోరుమూలపరిధి ద్వాదశాంగులమును మణిబంధమణి పరి
మాణంబు నవాంగులమును నూరుమధ్యంబునం బక్షమూల
చిహ్నమున కంగుష్ఠ పరిమాణంబు నుండునని బుధులు చెప్పు
దురు. అశ్వోరసంబులకు గ్రీవోపరిభాగంబున శిరోమణినుండి
స్కంధాంతంబుదాఁక సార్ధాంగులంబైన సటాస్థానంబు

ప్రశస్తంబగు. నట హస్తమాత్రాయతంబు నధోగమంబు నగునట్లు చేయింపఁదగు. పుచ్ఛవాలంబుల పరిమాణంబు సార్ధహస్తంబేని ద్విహస్తంబేని యయిన సుశోభనంబగు. కర్ణదైర్ఘ్యంబు సప్తాంగుళంబేని యష్టాంగుళంబేనియు నవాంగుళంబేని దశాంగుళంబేనియు వానివైశాల్యంబు చతురంగుళంబేని త్ర్యంగుళంబేనియు నై యుండు.

తురంగంబుల కంధరంబు స్థూలంబేని చిపిటంబేని కాకమయూరకంఠసన్నిభంబయిన శుభావహంబగు. మఱియు వానిగ్రీవాగ్ర పరిధి పిడికింట నెక్కువయిన ముఖపరిమాణంబు గలదియుఁ దన్మూలపరిధి దశాంగుళోనంబయిన ద్విగుణంబును ముఖపరిమాణంబుకంటెఁ గ్రోడంబుకొలఁది తృతీయాంశహీనంబును నేత్రోపరిభాగపరిణాహంబు మొగంబుకొలఁదికంటె సప్తాంగుళాధికంబును నాసికకు మీఁదను నేత్రంబులకుఁ గ్రిందనున్న భాగంబు చుట్టుకొలత ముఖపరిమాణంబునఁ దృతీయాంశ హీనంబును నేత్రవైశాల్యంబు ద్వ్యంగుళంబును వానిదైర్ఘ్యంబు త్ర్యంగుళంబును ముఖతృతీయాంశం బూర్వాంతరంబునకు నేత్రాగ్రంబుల మధ్యంబునకు ముఖపంచమాంశంబును గర్ణంబులయుఁ గర్ణనేత్రంబులయు మధ్యభాగంబునకు నంతయె పరిమాణంబును భూగతంబులయిన ఖురంబుల యంతరంబునకుఁ గర్ణాంతర సమ్మితంబయిన పరిమాణంబును మణినేత్రాంతరంబునకును భ్రూమధ్యంబునకును నాసానేత్రాంతరంబునకును సక్థి పరిమాణంబున మూఁడవయంశంబును నోష్ఠంబయిన ప్రోథంబునకు ముఖతృతీయాంశంబును నాసారంధ్రాంతరంబునకుఁ దద్దైర్ఘ్య

నవమాంశంబును గాయవిస్తారంబు నర్ధ పరిమాణంబును, ద్రికవిస్తారంబు నరహృదయ ప్రమాణంబును, బాహుమూలంబునకుఁ గ్రింద హృదయవిస్తారంబు నరచతుర్థాంశంబును, నధరోష్ఠంబునకుఁ జిబుకంబునకు నౌన్నత్యంబు సార్థైకాంగుళంబునుండు. ఉన్నత గ్రీవంబును నతపృష్ఠంబు నగు తురంగమంబు శోభిల్లు. దానిరూపంబు పటంబున వ్రాయంగోరు శిల్పివరుండు తదాకారంబు పరిశీలించి మనంబున నిల్పి వ్రాయవలయు. ఇట్లు చత్వారింశదంగుళముఖంబు మొదలగు నశ్వంబులకు సర్వావయవమానంబు బుద్ధిమంతు లూహించునది. శ్మశ్రుహీనముఖంబును గాంతోత్తుంగ నాసికంబును దీర్ఘోద్ధత గ్రీవముఖంబును హ్రస్వకుక్షి ఖురంబును ఖర్వశ్రవసంబును బ్రచండవేగంబును హంసమేఘనిస్వనంబు నాతిక్రూరంబును నాతిమృదువు నలౌకిక బలసంపన్నంబును సుకాంతి గంధవర్ణంబును సద్గుణావర్తాన్వితంబు నగునశ్వంబు మనోహరంబును సంగ్రాహ్యంబునగు. ఆవర్తంబులు వామదక్షిణ భేదంబున ద్వివిధంబులు. అవి మరలఁ బూర్ణాపూర్ణ భేదంబునను హ్రస్వదీర్ఘ భేదంబునను ద్వివిధంబులగు. వామీదేహంబున వామభ్రమంబులును హయదేహంబున దక్షిణభ్రమంబులును యథోక్తఫలదంబులగు. కాని విపరీతంబు లట్లు శుభాశుభ ఫలంబుల నీఁజాలవు. భ్రమంబులకు నిమ్న భావంబునను దిర్యగ్భావంబున నూర్ధ్వభావంబునను ఫలభేదంబు గలుగుచుండు. శంఖచక్రగదాపద్మ వేదిస్వస్తిక సన్నిభంబులును బ్రాసాదతోరణ సంకాశంబులును ధనుఃకలశ సదృత్తంబులును స్రఙ్మీన ఖడ్గాభంబులునగు భ్రమంబులు శుభంబులగు. నాసికాగ్రం

బునను లలాటంబునను గంఠంబునను మస్తకంబునను శుభావర్తంబులుగల హయంబు లుత్తమంబులును; హృదయంబునను స్కంధంబునను గలంబునను గటియందును నాభిని గుక్షిని శుభభ్రమంబులుగలవి మధ్యమాశ్వంబులును నగు. ఎద్దానిలలాటంబున రెండుసుడులు మస్తకంబున నొక్కసుడియు నుద్భవంబగు నాహయంబు స్వామికిఁ బూర్ణహర్షదాయకంబు గావునఁ బూర్ణహర్షంబను నన్వర్థాభిధానంబు గలదియు నుత్తమంబు నగు. వెన్నెమ్మున నొక్క యావర్తంబు గల యశ్వంబు సూర్య సంజ్ఞకంబును స్వామికి బహ్వాశ్వసంపాదకంబునయి యుండు. లలాటంబున నడ్డంబుగ నుత్తరావర్తంబు లయినమూఁడు భ్రమంబులు గల యశ్వంబు త్రికూటనామకంబు నశ్వాభివృద్ధికరంబునగు. మీఁదటి యట్లు సమభ్రమత్రయంబు గ్రీవయందున్న నది వాజీశంబయి రాజమందిరంబున నుండు. ఎద్దాని కపోలద్వయంబున నావర్తద్వయంబు శోభిల్లు నది రాజ్యవృద్ధికరంబు స్వామికి యశస్కరంబు నగు. అట్లుగాక యేకకపోలంబున నేకావర్తంబు గలది సర్వనామకంబు స్వామినాశకంబు నయ్యెడు. గండంబున దక్షిణాశ్రితంబయిన యావర్తంబు గలది స్వామికి సుఖదాయకంబు గావున శివంబునాఁబడు. మఱియు నాభ్రమణంబు వామాశ్రితంబయినఁ బ్రభువునకు ధనక్షయకారియగు. అవి రెండును రెండు గండంబులనున్న నింద్రాక్షంబులను పేరు వొంది స్వామికి రాజ్యాభివృద్ధి దాయకంబులగు. కర్ణమూలంబునను స్తనమధ్యంబునను నశ్వంబులకుఁ గల భ్రమద్వయంబు విజయనామకంబు గావున రాజునకు సమీకంబున

కీర్తి దాయకంబయ్యెడి. స్కంధపార్శ్వంబున నున్న యావర్తంబు పద్మలక్షణంబు నాఁజాలి స్వామికి మహాధనంబు సుఖంబు నీఁజాలు. ఏవాహంబు నాసామధ్యంబున నేకావర్తంబేని యావర్తత్రయంబేని వర్తిల్లు నా యశ్వంబు భూపాలనామకంబు గంధర్వ చక్రవర్తియు నగు. కంఠంబున శ్రేష్ఠంబయిన యొక మహావర్తంబుగల హయంబు స్వామికిఁ జింతితార్థ ప్రదంబగుటఁ జింతామణి యనంబడు. గుల్ఫంబుల ఫాలకంఠస్థంబులయిన యావర్తంబులు శుక్లనామకంబులు వృద్ధికీర్తిదంబులునగు. ఏవాజికి నావర్తంబులదోయి వక్త్రగతంబేని కుక్షిప్రాంతగతంబేనియగు నావాజి తనకేని స్వామికేని నాశంబు గావింప నోపు. జానువుల నున్న యావర్తంబులు ప్రవాసక్లేశదంబులును లింగంబున నున్నవి విజయశ్రీ వినాశమును గావించు. హయత్రికంబున నావర్తంబున్న స్వామికిఁ ద్రివర్గహానియగు. పుచ్ఛమూలావర్తంబు ధూమకేతువగుట ననర్థదంబగు. గుహ్యపుచ్ఛత్రికావర్తంబు గృతాంతనామకమును భయప్రదంబునగు. పార్శ్వవర్తినియైన మధ్యదండంబను నశ్వచిహ్నం బుంగుటంబు కొలఁది యయిన నతిదుష్టంబు. అదియె కచంబున నున్న శతపదియనియు దీర్ఘంబయినకొలంది దుష్టయనియుఁ జెప్పుదురు. నేత్రహనుగండ దృగ్గల ప్రోథంబులందును వస్తిదేశంబునను గటీకకున్నాభి గుహ్యంబులందును దక్షిణ కుక్షిపాదంబులందును ముష్కదేశంబునందును నున్న భ్రమంబులు నశుభదాయకంబులనియు గలమధ్యంబునను బృష్ఠ మధ్యంబునను బెదవులను గర్ణనాసాంతరంబునను వామకుక్షి

పార్శ్వంబులను నూరువులను హయములకుఁ గలయావర్తం బులు శుభదములు ననియు విద్వాంసులు చెప్పుదురు; మఱియు ఫాలమున సాంతరములయిన రెండావర్తములున్న శుభఫల దంబులు నవి రెండు నతిసన్నిహితములయిన మధ్యమఫలదం బులు నతిలగ్నము లయిన దుష్ఫలములు నగుననియు నందురు. అశ్వములకు లలాటమున నూర్ధ్వముఖంబయిన యావర్తత్రిత యము సాంతరంబయియున్న స్వామికి శుభమును నచటనే మూఁడుకొనలు గలభ్రమత్రయమున్న నశుభము నగు. హయములకు గలమధ్యమున నొక్కశుభావర్తమున్న సర్వా శుభచిహ్నములదోషము వారింపనోపుననియుఁ బాదముల నధోముఖములు ఫాలమున నూర్ధ్వముఖములు నగు భ్రమ ములు శుభఫలదము లనియుఁ బ్రత్యఙ్ముఖియగు శతపది యత్యంతాశుభదాయిని గాదనియుఁ బెద్దలు చెప్పుదురు. లింగంబు వెనుకను స్తనాగ్రంబునను నావర్తంబుగలయశ్వంబు శుభదాయిగాదు. అశ్వముల కర్ణసమీపమున నున్న యేకా వర్తము శృంగియనియు నింద్యంబనియుఁ జెప్పుదురు. గ్రీవో పరిభాగమున నేకపార్శ్వంబున నావర్తంబుగల యశ్వంబేక రశ్మి. పాదమున నూర్ధ్వముఖావర్తము గలదియుఁ గీలోత్పా టియనగు నశ్వంబు సంగ్రాహ్యము గాదు. శుభచిహ్నములు నశుభచిహ్నములు గల యశ్వములు మధ్యమములు. ముఖ మునం బాదములను సితంబయినది పంచకల్యాణంబనియు హృదయమునను గండమునను బుచ్ఛమునను నల్లయినది యష్ట మంగళంబనియు నవి రెండును స్వామికి శుభకరంబు లనియుఁ జెప్పంబడు. ఏకకర్ణంబున శ్యామంబును దక్కినసర్వావయవం

బుల నేకవర్ణంబునగు హయంబు శ్యామకర్ణనామధేయంబును మేధ్యంబు ననియు శ్యామైకకర్ణంబును దక్కినసర్వావయవం బుల ధవళైకవర్ణంబునయినది మేధ్యతరంబుం బూజ్యతరంబు ననియు వ్యవహరింపఁబడు. వైడూర్యసన్నిభంబు లగునేత్ర ములు గల యశ్వంబు మిశ్రవర్ణంబయ్యు నేకవర్ణంబయ్యు సుందరంబయ్యెనా జయమంగలనామకంబుం బూజ్యంబునగు. కృష్ణపాదంబులును శ్వేతైకచరణంబులునగు హయంబులును ధూసరవర్ణంబులు రూక్షంబులు గర్దభాభంబులు నగువాహం బులును గృష్ణతాలుజిహ్వోష్ఠంబులగు వాజులును బుచ్ఛంబున వలతుములు దక్కిన యవయవముల నెల్ల గృష్ణవర్ణము గల ఖురువులును నింద్యము లగు. ఉన్నతపాదన్యాసగతియు ద్వీప వ్యాఘ్రగమనమును హంసమయూరపారావతగతియు మృగో ష్ట్రవానరగతియు నగుహయం బుత్తమంబుం బూజ్యము నగు. అతిభోజనంబు నతిపానము గావించిన సాదియు నెట్టిగమనం బునఁ బీడనొందకుండు నట్టిగమనము నట్టిగమనంబు గావించు తురంగమును శ్రేష్ఠములని కోవిదులు వల్కుదురు. సుశ్వేత తిలకమును వర్ణాంతరమునుం గలసప్తి యాశ్వికసేనాభంజ కమగు; మఱియు నశ్వములు స్నిగ్ధవర్ణములు బలాధిక ములు సుగతులు మహాకాయములు నాతిక్రూరములు సర్వాం గసుందరంబులు నయ్యెనేని భ్రమదూషితములు వర్ణదూషిత ములు నయిన బూజ్యంబులగు. అశ్వారోహణం బధికం బయిన మానిసికిఁ గార్శ్యమును వ్యాధియు జనియించు. దాని నేకాలందిని నేరకున్న నాలస్యము వొడము; మఱియు నశ్వం బు లపోషితంబులయిన క్షీణంబులు నతిపోషితము లయిన

రుగ్ణంబులు నిత్యశిక్షణమున సుగమనంబులు నశిక్షణమున దుర్గమనములు నగు. సుశిక్షకుఁ డశ్వము నారోహించి ఋజుకాయుండు స్థిరాసనుండునయి సమముగ ఖలీనము వట్టికొని జాన్వధోభాగముఁ బాదములు నార్చుచు నతిమృదువు నతిక్రూరముగాని కశాఘాతమునఁ దగినస్థలమునఁ గాలానుసారముగఁ దాడనము సేయుచు నడిపించునది. అశ్వహృదయజ్ఞులు గుఱ్ఱము సకిలించినఁ గక్షమునను దొట్రుపాటొందినఁ బార్శ్వములను వెఱపుఁజెందినఁ గర్ణాంతరమునను నున్మార్గగామియయిన గ్రీవయందును గోపించిన బాహుమధ్యమునను భ్రాంతచిత్తంబయిన నుదరమునను గశాఘాతము గావింతురు గాని యొకపుడేని యన్యస్థలమున నట్లు చేయరు. మఱియుం గొండఱు హేషగావించుడుఁ గందమునను స్ఖలితమునొందిన జఘనమధ్యమునను భీతంబయిన వక్షమునను నుద్వృత్తంబయిన వక్త్రమునను రోషితంబయినఁ బుచ్ఛసంఘాతంబునను భ్రాంతంబయిన జానువులను దరటుచేయవలయు నంద్రు; కాని పలుమాఱుకాలమున నస్థానమునను స్వాశ్వంబు నొప్పింపఁ దగదు. అట్లు నొంచినఁ గొన్నిదోషములు పుట్టి యశ్వమున్నంతదనుక విడువకుండు; మఱియు శిక్షకుఁడు దుష్టాశ్వంబు దండహీనుండయి యారోహింపక దండమున నొంచుచుండవలయు. ఉత్తమాశ్వంబు షోడశమాత్రలకాలంబునఁ (Sixteen seconds.) జతుశ్శతహస్తంబుల దూరంబు పోనోపు. గతిహీనంబయినకొలఁది నశ్వంబు హీనంబగుచుండు. హయగతిశిక్షయందు సహస్రచాప (4000 గజములు) ప్రమితమండలభ్రమణం బుత్తమంబుం దదర్ధము మధ్యమంబుం దదర్ధము

నీచమును శతధనుఃపరిమితంబల్పంబుం దదర్ధం బత్యల్పంబు నగు. ఎట్లు నేర్పిన నశ్వంబు లేకదినమునన నూఱుయోజనంబులు వోఁ జాలు నట్లు మండలభ్రమణముల సుశిక్షకుఁడు శిక్ష వానికలవర్చునది. హేమంతశిశిర వసంతంబులయందు సాయంప్రాతస్సమయంబులును గ్రీష్మర్తువునందు సాయాహ్నంబును శరదృతువున యందుఁ బ్రాతఃకాలము నశ్వారోహణమునకుఁ దగిన యవి. వర్షర్తువందును విషమభూములందును నొక్కపుడేని యశ్వము నడిపింపఁ దగదు. శోభనంబయిన గమనమున నశ్వములకు జాఠరమును దార్ఢ్యమును శరీరకాఠిన్యము నారోగ్యమును వర్ధిల్లు. భారపరిశ్రాంతము మార్గపరిశ్రాంతంబు నగుహయంబును శిక్షకుఁడు మందమందంబుగం బలుమాఱు ప్రచరింపఁజేసి పిమ్మట శర్కరాసక్తు మిశ్రంబయిన స్నేహంబును ద్రావించి సుపక్వంబులయిన చణకంబు లేని మాషంబు లేని ముద్గంబు లేనియుఁ బక్వంబులయిన యార్ద్రశుష్క మాంసంబులను భక్షణార్థం బొసఁగునది. మఱియు మార్గసమాగతం బయిన హయంబునకుఁ బల్యాణంబు వదలింపకయె సలవణంబయిన గుడంబు బలరక్షణార్థం బొసంగి గతస్వేదంబు శాంతంబు నయిన పిదప బృష్ఠబంధంబు వదలించి ఖలీనంబు నవతరించి తద్గాత్రమర్దనంబు సేయించి పాంసుమధ్యమున వివర్తింపించి స్నానాదులఁ జేయించి పోషింప వలయు. అశ్వములకు మద్య రసంబును మాంసరసంబును సర్వవ్యాధి హారణంబగు. మఱియు శక్త్యనుసారముగ ఘృతయుతం బేని క్షీరయుతం బేని వారియుతం బేని సక్తువు వానిచేఁ ద్రావించుచుండవలయు.

హాయంబు లాహారము భుజించిన యనంతరమును జలపానముఁ జేసినపిమ్మటను విశ్రాంతి వొందకుండ నారోహించిన వానికిఁ గాసశ్వాసాదిరోగము లుప్పతిల్లు. వాజులకు భోజనార్థము యవలుం జణకములు శ్రేష్ఠములును మాషములు మకుష్ఠములు మధ్యమములును మసూరములు ముద్గములు నీచములు నగు.

అశ్వగతులు

అశ్వగతులు ధారా స్కందిత రేచిత ప్లుత ధౌరీతక వల్గిత భేదమున నాఱు తెఱంగుల నుండు.

అతివేగితంబయిన గమనంబు ధారయనియుఁ బార్ష్ణి నోదితంబయి యాకుంచితంబులయిన యగ్రపాదంబుల నెగురుచు నశ్వంబు వోయిన నాస్కందితంబనియుఁ గొంచియరబెగిరి యఖండంబుగం బోయిన రేచితంబనియు మృగంబుం బోలి నాల్గుపాదంబుల నెగురుచుం బోయినఁ బ్లుతంబనియు ససంవల్గితంబులయిన పాదంబులతో సువ్యక్తంబుగను ద్రుతంబుగనుం బోయిన ధౌరీతకంబనియు నిది రథవహనంబున వరంబనియుఁ గుంచితంబులయిన పదంబులతో మయూరంబువోలె నున్నతగ్రీవంబయి డోలాయితంబయిన యర్ధశరీరంబుతోఁ గావించిన గమనంబు వల్గితంబనియు నశ్వగతిజ్ఞులు వల్కుదురు.

వృషభోష్ట్రస్వరూపము

ముఖపరిణాహంబుకంటె నుదరపరిణాహంబు చతుర్గుణంబును సకకుదంబయిన యుదరౌన్నత్యంబు త్రిగుణంబును సార్ధత్రిగుణంబయిన దైర్ఘ్యంబును సప్తతాలౌన్నత్యంబునుం

గలిగి వోఁథయు స్వంగసుందరంబు నక్రూరంబు నగువృషభంబు ప్రశస్యంబును సంగ్రాహ్యంబు నగు. ఒక్కనాఁటను ముప్పదియోజనంబులు నడువ సమర్థంబయి నిచ్చలు భారవహనక్లేశసహంబయి సుదృఢంబయి నవతాలోన్నతంబయిన యుష్ట్రంబు ప్రశస్తంబగు.

నరాదులవయో నిర్ణయము

నరులకుం గుంజరంబులకు నూఱువత్సరంబులు నశ్వంబులకు ముప్పది నాలుగేండ్లును వృషోష్ట్రంబులకు నిరువదియైదు వర్షంబులును బరమాయువని బుధులు సెప్పుదురు. మఱియు నరులకు నేనుంగులకు నిరువది యబ్దంబులదనుక బాల్యంబును మానసుల కఱువదింటిదాఁకను హస్తుల కెనుబదింటివఱకును మధ్యవయసును దర్వాత వార్ధకంబుననియు నశ్వవృషభోష్ట్రంబుల కైదేండ్లదాఁక బాల్యంబును షోడశాబ్దపర్యంతంబు మధ్యమ వయసును బిమ్మట వార్ధకంబుననియు విద్వాంసులు చెప్పుదురు. వృషభంబులకు నశ్వంబులకును దంతోద్గమంబున నాయువు సువిజ్ఞేయంబగు.

ఎద్దు మొదలగువాని వయసు పరీక్షించు విధము

అశ్వంబులకుఁ బ్రథమాబ్దంబున నాఱుసితంబు లయిన దంతంబులును ద్వితీయవర్షంబునఁ గృష్ణలోహిత వర్ణంబు లయిన యధోగత దంతంబులుం బుట్టు.

తృతీయాబ్దమున మఱి రెండు దంతము లుత్పన్నములయి యవిషష్ఠాబ్దమున నలుపువొందు. చతుర్థాబ్దమున వాని ప్రక్కదంతములు రెండును బంచమవర్షమున నంత్యము లయిన రెండు దంతములు నుద్భవిల్లి యవియుఁ గ్రమముగ నాఱవ

యేట నీలములు నవమవత్సరమునఁ బీతములునయి ద్వాదశాబ్దమున మరల సితములుం బంచదశవత్సరమునఁ గాచాభములు నష్టాదశమున మధుసంకాశములు నేకవింశాబ్దమున శంఖాభములు నగు. హయముల కిరువదినాలుగేం డ్లతిక్రమించిన పిదప మూఁడు మూఁడేండ్లకు దంతముల ఛిద్రములు చలనముం బాతముం గలుగుచుండు. అశ్వములకుఁ బ్రోథమున వలయాకారములయిన మూఁడు రేఖలున్న బూర్ణాయువు నా రేఖలు దక్కువయిన కొలఁది నల్పాయువు నగు. వృషములకుఁ జతుర్థాబ్దమున నెనిమిదిదంతములు సితములయియుండు. పంచమాబ్దంబున నందుఁ జరమంబులు రెండూడి మరలవచ్చు. ఆఱవ యేఁట నుపాంత్యములయిన రెండుదంతములుంబుట్టు. అష్టమమున మధ్యదంతములు పతితోత్పన్నము లవశ్యమునగు. ఇవి క్రమముగ రెండేసి యేండ్లకుఁ గృష్ణపీతసితరక్త శంఖచ్ఛాయములుగ మాఱుచుండు. పిదప రెండేసి యేండ్లకుం జలనపాతములఁ బొందు. ఉష్ట్రములకు నశ్వములకుఁ జెప్పినరీతిన వయఃపరీక్ష చేయునది.

గజాదుల శిక్షాసాధనములు

ఆకర్షతుల్య ముఖంబయిన యంకుశము గజనిగ్రహమునకు సాధనము గావున హాస్తిపకుఁడు దానన దాని వినీతము సేయునది. ద్వాదశాంగుల మితములు నూర్ధ్వాగ్రములు దృఢములు నగు పార్శ్వరజ్జువలయితము లగు రెండాకర్ష ఖండములతోడం గూడిన ఖలీనమున (కళ్ళెమున) రాహుత్తుం డశ్వముల వశపఱచికొనం దగు. నాసికాకర్ష రజ్జువునన యుష్ట్రములను వృషములను దచ్ఛిక్షకుఁడు వశగతములఁ జేయునది. ఈ జంతువులకు మలశోధనార్థము తీక్ష్ణాగ్రమును సప్తఫాలము నగు దండము గావలయు. మనుజులఁ బశువులను సుతాడనమున వినీతులఁ జేయుచుండవలయు. మఱియు సైనికులు ధనదండమున లోఁగరు గాన వారికి విశేషించి తాడనము గావలయు.

వృషభాదుల రాజు విడియించుచోట్లు - దండు విడలు విధము శత్రుల వశపఱచుకొను విధమును

వృషాశ్వముల ననూపమునను గజోష్ట్రముల జాంగలమునను సాధారణప్రదేశమునఁ బదాతులను విడియింప నుచితంబగు. రాజు స్వరాష్ట్రమున నెల్లెడల యోజనయోజనమునకు నొక్కొకచోట శతశతసైనికుల నిలుపవలయు. యుద్ధసంభారములు వహింప గజములు నుష్ట్రములు నశ్వములు శ్రేష్ఠములకాని వర్షేతరకాలమున నాకార్యమున కన్నిటికంటె శకటము లుత్తమము లగు. రాజు జల్పరిపు జయింపనేనియు నల్పసాధనమునఁ జనక బుద్ధిమంతుఁడయి సాద్యస్కంబయిన మహాసైన్యముతోఁ బోవవలయు. మఱియు మహాశత్రుల జయింపం బోవునెడ మూలబలముతోడఁ జనునది. అశిక్షితము నసారము నగు సాద్యస్కబలము తూలముం బోలె నిస్సారము గావున దాని యుద్ధేతరకార్యముల బుద్ధిమంతుఁడు నియోగింపవలయు. ప్రాణాత్యయము ప్రాప్తించుడు నల్పుండును విపరీతకార్యము సేయ యత్నించు నన శూరుండును వికారకరణక్షముండును క్షమియింపఁ డని చెప్ప నేల. మహాబలసంపన్నుం డయ్యు నశూరుండు శత్రుముఖమున నిల్వనోపఁ డన నల్పసాధనుం డగునట్టివాఁడు నిల్వఁజాలఁ డని

దనంబున స్వకార్యధ్వంసంబు సేయంజనదు. శతానీకుఁడు పర్యంకాసనంబున నుండి సేనాకార్యంబు పరిశీలించుచుండవలయు. రాజునకు రాష్ట్రంబునకు హితంబు గోరు సైనికులు మోహారంబు సంకేతంబుల మీఱక చరింపవలయు. శత్రులచే భేదితం బయిన స్వసైన్యంబుం దెలిసికొని రాజు వధింపించునది; మఱియు జోదులు నూతనం బయిన కార్యంబు సేసినపుడు వారికిం దగిన పసదనంబును గ్రమ ప్రాప్తంబు లయిన మహోత్సాహోద్యోగంబుల నిచ్చుచుఁ దృణాగ్ని జల సంరోధంబు గావించి శత్రులఁ బీడించి విషమంబున వేగపడి హింసించుచుఁ గపటంబునను మహాస్వర్ణదానంబునను ద్విషద్బలంబు భేదించుచు విస్రంభసంసుప్తంబును బ్రజాగరక్లాంతంబు నగుదాని మోసంబున జాగరూకుఁడయి నశింపఁజేయునది. వ్యసనానక్తంబయినఁ బగఱకు సహాయంబు సేయ నేతెంచిన దళంబులకు హానిసేయం దగదు. మఱియు నెట్టి శత్రుచే నయినను దనకు సమీపతరం బయిన మండలంబు గ్రహింపఁజేయక క్షణంబు యుద్ధసన్నద్ధుఁడయి మరల క్షణం బపసరించుచు రాజప్రమత్తుఁడయి దస్యుండువోలె దూరంబు నుండి యాకస్మికపాతంబున నెక్కుడమ్మడి నన్నిప్రక్కల శత్రుబలంబు ముట్టడించుచుండవలయు; మఱియు యుద్ధంబుల యోధులకు సంతసంబు పుట్టించుచు రజతంబును హేమంబును గుప్యంబు నెవఁ డెద్ది జయించు దానిం గార్యానురూపంబుగ వాని కిచ్చుచు నట్లు పగఱ జయించి విజితునివలనఁ గరంబేని రాజ్యాంశం బేని సర్వరాజ్యం బేని గ్రహించి తనకు వశు లయిన యచ్చటిప్రజలఁ బుత్రులంబోలె రంజించుచుఁ

శస్త్రాస్త్రస్వరూపమును - వానిభేదమును

మంత్రమున నేని జంత్రమున నే నగ్ని నే నెద్ది క్షిప్తం బగు నది యస్త్రమును దద్భిన్నంబయిన యసికుంతాదికము శస్త్రము ననంబడు. అస్త్రము మాంత్రికము నాళికము నని ద్వివిధము. మంత్రప్రయోజ్యం బయిన యస్త్రము సంభవిల్లనినాఁడు నృపతి శస్త్రములతోఁ గూడ నరిజయార్థంబు నాలికం బయిన యస్త్రము సంపాదించునది. అస్త్రశస్త్రములు లఘుదీర్ఘాకారధారాభేదంబులను బ్రయోగభేదంబులను వ్యవహారార్థము బహుప్రకారము లగునని తద్విదులు వల్కుదురు. నాళికము బృహన్నాలికము క్షుద్ర (లఘు) నాళికము నని ద్వివిధము. తిర్యగూర్ధ్వరంధ్రమూలంబును నఱువది యంగుళముల పొడవు నాలంబు గలదియు మూలాగ్రముల లక్ష్యభేదకము లయిన చిన్నముండ్లు గలదియు జంత్రము ద్రిప్పిన నగ్న్యుత్పాదకంబును బ్రస్తరచూర్ణముల ధరించు కర్ణమూలమునుం గలిగి బలిష్ఠం బయిన యంగకాష్ఠ బుధ్నమును మధ్యాంగులపరిమితబిలమును నాలాంతరమున నగ్నిచూర్ణము సంఘటించు శలాకాయుతము దృఢము నగునది లఘు నాలికాస్త్రం బగు. (తుపాకి) ఇది పదాతులకును సాదులకును సమీకకాలమున ధార్యం బగు. ఈ యస్త్రము బలంబు కొలఁదిని త్వక్సారంబు బృహద్దీర్ఘగోలము స్థూలబిలాంతరము నయిన కొలఁదిని దూరలక్ష్యభేదకం బగు. మఱియు నిదియె మూలకీలభ్రమణమున లక్ష్యసమసంధానముఁ బొందునదియుఁ గాష్ఠావృతమును శకటాదివాహ్యమునయిన బృహన్నాలికంబని వ్యవహరింపఁబడు. అది సుయుక్తం బయిన విజయప్రదంబు.

అగ్నిచూర్ణ స్వరూపము

అయిదుపాళ్లు శుద్ధంబయిన సువర్చలవణము నొక భాగము గంధకమును ధూమంబు వెడలకుండం గాల్పఁబడిన యర్కస్నుహ్యాద్యంగారం బొక యంశమును గ్రహించి వేర్వేఱఁ జూర్ణముచేసి యివి యన్నియుం గలిపి యర్కస్నుహ్యాదిరసోనరసములఁ బాకముచేసి యాతపమున నెండించి చక్కెరంబోలె మరల నూఱిన నగ్ని చూర్ణం బగు. (తుపాకి మందు. టపాకాయమందును.) ఆఱుపాళ్లు లేని నాల్గుభాగము లేని సువర్చలవణమును నొక్కపాలు లింగలము నొకపాలు గంధకమును గ్రహించి మీఁదటియట్లు చేసినఁ గేవల నాళార్థంబయిన యగ్ని చూర్ణం బగు. లఘునాలికమునకుఁ గేవల లోహమయం బేని సీసగర్భం బేని యన్యలోహగర్భం బేని యగు గోలము గావలయు. నాలికాస్త్రము లోహసారమున నిర్మించిన నితరధాతువుల నిర్మించినను నిత్యసమ్మార్జనమున స్వచ్ఛము సేయించుచుఁ దదస్త్రధారులచే రక్షింపించుచుండవలయు. అంగారగంధకములయు మణిశిలాహరితాలములయు సువర్చలవణ సీసమలములయు హింగులాయోరజములయుఁ గర్పూరజతుచూర్ణములయు నీలీసరలనిర్యాసములయు యథోక్తము లయిన సమన్యూనాధికభాగములఁ జంద్రికాదికాంతిమంతము లయిన యగ్నిచూర్ణముల నభిజ్ఞులు పెక్కుతెఱంగుల నిర్మించి నాలగము లయిన గోలముల నగ్నిసంయోగమున లక్ష్యములఁ జిమ్ముదురు. నాలికము ధరించువాఁడు తదస్త్రము ముందు శోధించి దాన నగ్నిచూర్ణము నించి నాలమూలమునకుఁ బోవునట్లు శలాకమ ఘట్టించి పిమ్మట

గోలము నందువైచి యనంతరము కర్ణమూలమున నగ్నిచూర్ణంబు ప్రయోగించి యగ్నినిలిపి గోలంబు లక్ష్యమునఁ జొనుపునది.

బాణముల విడుచువిధము - నాయుధ పరిమాణమును

ధానుష్కుఁడు నారినుండి విడువంబడిన బాణంబు లక్ష్యభేదియగునట్లు బాగుగ సంధించి మఱి విడుచునది. శిలీముఖంబు లెల్లను ద్విహస్తపరిమితంబులును గుదియ జోదునకు హృదయపరిమితంబును నెనిమిదియంచులు గలదియు స్థూలమూలంబును బట్టసంబు ప్రయోక్తృసమంబు నుభయముఖంబును బిడి గలదియు నయి యుండు. ఖడ్గంబు లీషద్వక్రంబులు నేకధారంబులు నాభిసమంబులుఁ జతురంగులవిస్తారంబులు చంద్రకాంతంబులు దృఢముష్టులు నయి యుండు. ప్రాసంబు చతుర్హస్తదండనిర్మితంబు క్షురాననంబును గుంతంబు దశహస్తమితంబు వర్తులశంకునిర్మితంబు ఫలాగ్రంబును గావలయు. చక్రాయుధంబునకుఁ జుట్టుకొలఁది యాఱుహస్తంబులు క్షురసదృశంబయిన ప్రాంతంబును సునాభియు నుండవలయు. హస్తత్రయమితంబును ద్రిశిఖంబు నగు లోహరజ్జువిశేషంబు పాశాయుధం బగు. లోహమయంబయిన కవచంబు శిరస్త్రాణంబుతోఁ గూడ గోధూమసమ్మితస్థూలపత్రంబున (గోధుమగింజంత దళసరిగలతేకుతో) దృఢంబుగ రాజు నిర్మింపించునది.

ఎట్టిరాజు యుద్ధకాముఁడు గావలయు?

యుద్ధసంభారంబుఁ బూర్ణంబుగ సమకూర్చి కొని శస్త్రసంపన్నుం డయి షాడ్గుణ్యమంత్రవిదుం డయిన రాజు

యుయుత్సుండు గావలయుం గాని యితరుఁ డట్టిఁడయిన దుఃఖంబు బొందుటయ కాక స్వరాజ్యభ్రంశంబు నొందు.

యుద్ధ స్వరూపమును దానిభేదములును

శత్రుభావంబు ధరియించిన నిశ్చయాత్ము లగు నిద్దఱు రాజులకు స్వకార్యసిద్ధ్యర్థం బస్త్రాదుల నయినవ్యాపారంబు యుద్ధంబు నాఁబడు. అది మంత్రాస్త్రముల నయిన దైవము నాలాద్యస్త్రముల నైన నాసురమును ఖడ్గాదిశస్త్రములను బాహులను నయిన మానవము ననంబడు. మఱియు యుద్ధము లొకని కనేకులతోడను బెక్కండ్రకుఁ బెక్కండ్రతోడను నొకని కొకనితోడ నిద్దఱతోడను నిర్వుర కిద్దఱతోడను గావచ్చు. దేశకాలములను బగఱబలమును దనబలమును షడ్గుణంబులు నుపాయములును బాగుగం బరికించి రాజు యుద్ధ కాముకుండు గావలయు.

యుద్ధానుకూలకాలము - దేశము

యుద్ధంబునకు శరద్ధేమంతశిశిరంబు లుత్తమంబులు వసంతంబు మధ్యమంబు గ్రీష్మమధమంబు నగు. వర్షాకాలంబున సామోపాయంబునఁ గార్యంబు నిర్వహింప వలయుం గాని యుద్ధంబునం గాదు. మఱియు రా జెపుడు యుద్ధ సంభారసంపన్నుఁడు నధికబలుండు నుత్సాహవంతుఁడును శుభశకునుండు నగు నక్కాలంబు సమీకంబున కుత్తమం బగు. ఆవశ్యకంబయిన కార్యంబు ప్రాప్తించుడు నకాలంబు నను మనంబు నీశ్వరునందు నిల్పి ధీరుండు మృధంబు గావింపన తగు. గోవులకు న్విప్రులకును స్త్రీలకు నాపద వాటిల్లిన భూపాలుం డకాలంబునను జివ్వకుం జొచ్చునది. ఎద్దేశంబున

స్వసైనికులకు వ్యాయామభూములు సులభంబులు శత్రుసైనికులకు గడు దుర్లభంబులు నగు నా దేశంబు జన్యంబున కుత్తమంబు. నేవిషయంబునఁ దనకుం బెఱలకుఁ దుల్యంబు లయిన వ్యాయామభూము లుండు నది మధ్యమంబు. నేజనపదంబున విరోధివర్గంబునకు సుపర్యాప్తం బయిన వ్యాయామభూములును దనకుం దద్వైపరీత్యంబు నుండు నది యధమంబు నని తచ్ఛాస్త్రజ్ఞులచేఁ జెప్పంబడు.

అసారాది బలములకు నెపుడు జయముగల్గు?

అరిబలంబు స్వబలంబునఁ దృతీయాంశహీనంబయిన నసారంబు నశిక్షితంబునగు సాద్యస్కబలం బయినను స్వవిజయప్రదంబగు. మఱియుం బుత్రతుల్యంబుగఁ బాలితంబును దానమానంబుల వర్ధితంబును యుద్ధసంభారపూర్ణంబు నగు సైన్యంబునకు విజయంబు గలుగు.

సంధివిగ్రహాదుల స్వరూపమును వానివిభాగములు నుపయోగించువిధమును

సంధి విగ్రహ యా నాసన, ద్వైధీభావ సమాశ్రయంబులను నాఱును మంత్రగుణంబులు. బలవంతుఁ డయినదాయయు నేక్రియ నైన్మైత్రి వహియించు నాక్రియ సంధి యనంబడు. దానికై రాజు సుప్రయత్నంబు సేయవలయు. ఎద్దాన బాధింపఁబడి శత్రువు స్వాధీనుం డగు నాక్రియాకలాపంబు విగ్రహంబు నాఁబడు. ఏఁ డాక్రియకై మంత్రులతో మఱిమఱి యాలోచించునది. శత్రునాశార్థంబు స్వాభీష్టసిద్ధ్యర్థంబు నయినదాడి యానంబు నాఁబడు. ఎద్దాన నాత్మరక్షణంబు శ్శత్రునాశంబు నగు నాయునికి యాసనం

బగు. ఎవ్వరిచే గుప్తుండయి దుర్బలుండును బలవంతుం డగు వారి నాశ్రయించుట యాశ్రయం బగు. స్వసైన్యంబులఁ బ్రతిగుల్మంబు నిల్పుట ద్వైధీభావంబు. బలీయసుం డయిన రిపునిచే నభియుక్తుం డయిననృపుఁ డనన్యప్రతిక్రియుం డయినఁ గాలయాపనంబు సేయుచు సంధి నపేక్షించునది. కేవలహితకరం బయిన యుపహారంబున నొకటన సంధియగు. మైత్రీవర్జితంబు లయిన సమ్మేలనప్రకారంబు లన్నియు నుపహారభేదంబున నగు. అభియోక్త బలీయసుఁడు గాన నాత్మహితం బయినయుపద గ్రహింపక నివర్తింపమి నది యిచ్చుటం గాక యన్యప్రకారంబున సంధి పొసఁగదు. అభియుక్తుండు శత్రుబలానుసారంబుగఁ గన్యనేని భూమినేని ధనమునేని తగిన యుపాయనంబు నభియోక్తకు సమర్పించునది. ఆవశ్యకం బయిన సేవయు నంగీకరింపందగు. మఱియు రాజు శత్రుజయార్థము తన సామంతులతోడను మైత్రి గావించునది; అనార్యులతోడ నయినను మున్మున్న స్నేహంబు గావించి పిదపఁ దదుత్పాదనంబునకు యత్నింపవలయు. నిబిడకంటకవృతం బయిన వేణుకుంజంబుంబోలె సంఘాతవంతుఁడును దురుచ్ఛేదుం డగు. మహాబలు లయిన పగఱయందు సంధియు సమబలులయందు యుద్ధంబును దుర్బలులయందు యానమును సుహృదులం దాశ్రయంబును దుర్గములందు సైన్యవిభాజనంబును రాజున కవశ్యకర్తవ్యంబులు. శత్రుబాహుల్యంబు గలప్పుడు బలవద్రిపులతో సంధి కావించికొని యాత్మరక్షణంబు గావించుకొనువాఁడు బుద్ధిమంతుండు. బలవంతునితో యుద్ధంబు సేయవలయు ననునెడ నిదర్శనంబు గానరాదు. గాలికిఁ బ్రతిముఖంబుగ మేఘంబు వోఁజాలదు గదా. బలవంతునెడ వినమ్రులయి కాలంబునఁ బరాక్రమించువారిసంపదలు నిమ్నగలువోలెఁ బ్రతీపంబు నొందవు. బుద్ధిమంతుఁ డయిన ఱేఁడు సంధిచేసికొనియుఁ బరిపంథిని నమ్మంజనదు. మున్ను ద్రోహంబు సేయకుండ సంధిచేసికొన్న యింద్రుఁడు వృత్రాసురు హింసించె.

ఆపన్నుం డయ్యు నభ్యుదయంబు గోరువాఁడు శత్రులచేఁ బీడ్యమానుం డయ్యు దేశకాలబలోపేతుం డయి విగ్రహంబు సేయ జతనంబు సేయవలయు. భిన్నమంత్రబలుండు నతివిషయాసక్తుఁడు ప్రజాద్రవ్యాపహారకుండు దుర్గతుఁడు నగు శత్రుని రాజవశ్యము ముట్టడించి పీడించునది; అట్లు చేయుట విగ్రహంబు నితరంబు కలహంబు నని చెప్పంబడు. అల్పబలుండు బలీయసునితో విగ్రహంబు సేసిన సర్వనాశంబు గల్గనోపుం గాన నట్లు సేయం దగదు. ఏకార్థాభినివేశంబు కలహకారణం బగుం గాని యుపాయాంతరంబునం గర్జంబు సిద్ధింపనినాఁడ మన్నీఁడు విగ్రహంబునకుం దొడరునది. విగ్రహించియు సంధిచేసికొనియు నేకీభవించియు ఛలంబు గావించియు నుపేక్షించియుఁ గావించుటం జేసి యానం బయిదువిధంబు లయియుండు. రాజు శత్రులతోడం దన్మిత్రులతోడను విగ్రహించి చేయుయానంబు విగృహ్యయానంబును మఱియొక్కనితో యుద్ధంబు సేయంజనునెడఁ బార్ష్ణిగ్రాహుం డయినయరితో సంధిచేసికొని కావించునది సంధాయయానంబు నొకభూమీశుండు శక్తిశౌర్యసంపన్నులు సాంగ్రామికులు నగు పెక్కండ్రుసామంతులతో నేకీభవించి చేయు

యానంబు సంభూయయానంబు నొక్కచోటికిం బ్రయాణంబు పగటి వేఱొకచోటికిం బ్రయాణంబు సేయుట ఛలయానంబును బలవంతుఁ డభిషేణనంబు గావించి పరాజయంబు నొంది యుపేక్షించి చేసినది యుపేక్షాయానంబు నని విజ్ఞులుం గులీనులు నగు బుద్ధిసచివులు వల్కుదురు. (వేఱొక పుస్తకమున ఛలయానమునకు బదులుగాఁ బ్రసంగయాన మనియు నది యొకచోటికిం బోవుచుఁ బ్రసంగమున వేఱొకచోటికిం బోవుట యనియు నున్నది.)

సేనానాయకుని ముఖ్యకార్యము

దుర్వృత్తుండు నకులీనుండు నయిన నుదారునందు సైన్యంబు రంజిల్లుం గాన దానంబున సేనల రంజిం చుచుఁ బ్రవీరపురుషావృతుం డయి నాయకుండు ముందు వోవుచు సురక్ష్యంబు సారసంపన్నంబు నగు ధనంబును బ్రభువును బలమధ్యంబున నుంచి సదోద్యుక్తుండయి ధ్వజినీ రక్షణంబు గావించు చుండునది. భయస్థానంబు లయిన నద్యద్రివనదుర్గంబులందు వాహినీపతి వ్యూహాకృతంబు లయిన బలంబులతోఁ జనునది.

సేనాపతి యెపుడెట్టి వ్యూహమును రచింపవలయు

పురోభయంబు ప్రాప్తించునపుడు మకరవ్యూహంబున నుభయపక్షభయంబున శ్యేనవ్యూహంబున నేని ధీరవక్త్రం బయిన సూచీవ్యూహంబున నేనియుఁ బశ్చాద్భయంబున శకటవ్యూహంబునను నలుప్రక్కల వెఱపుప్పతిల్లిన సర్వతోభద్రంబున నేని వ్యాలంబున నేని చక్రవ్యూహంబున నేనియుఁ బడవాలు సేనల నడిపించునది. మఱియు దేశానుసారంబుగఁ

బరబలభేదకం బయిన వేఱొకయొడ్డనం బేనియుఁ బన్నందగు. వాయిదంబుల నేని బాసనేని సమీరితంబు లయిన వ్యూహరచనాదిసంకేతంబులు స్వసైనికులకుం దక్క నితరునకొకని కేనియుం దెలియకుండ నేర్పఱిచి గజంబులకు నశ్వంబులకుఁ బదాతులకు వేర్వేఱుతెఱంగుల యొడ్డనంబుల నియోగించుచుఁ దత్సంకేతంబుల రాజు సేనామధ్యంబున నేని వామదక్షిణపార్శ్వంబుల నేని యగ్రభాగంబున నేని నిల్చి సైనికులకు వినిపించుచు ననుశాసనంబు వారు మీఱక చేయునట్లనుజ్ఞ యిచ్చుచుండ వలయు.

సైనికులు పోవువిధము

వ్యూహస్థులెల్లను సంమీలనప్రసారణంబులును బరిభ్రమణాకుంచనంబులును బర్యాయంబున యానసాముఖ్యంబులును గావించుచు నష్టదలంబుం బోలెను గోలంబుం బోలెను సూచీతుల్యంబుగను శకటాకారంబున నర్ధచంద్రసదృశంబుగను నిల్చుచు వేర్వేఱుగ నల్పాల్పంబుగఁ బంక్తిపూర్వకంబుగఁ బ్రవేశించుచు శస్త్రాస్త్రమోక్షణంబును సత్వరంబుగ నస్త్రసంధానంబును లక్ష్యభేదనంబు నాత్మరక్షణంబు సేసికొనుచు, నొకఁడొకఁడుగఁ గాని యిద్దఱు మువ్వురుం గలిసి కాని ప్రవేశించుచు ముందఱకుం బోవుచు వెన్కకు మరలుచు మరల సమీపించుచు విమోక్షణార్థంబు సమీపించుచు విముక్తాస్త్రుండయి యపయానంబు గావించుచు ముం దాసీనుండగువానిం జూచి సమీపించి నేర్చినట్లొకటి నేని రెంటి నేని సంఘంబుకొలఁది నేని యస్త్రంబుల విడుచుచుండ వలయు.

వ్యూహస్వరూపము-వానిభేదములును

ఆకసంబునఁ గ్రౌంచపుంబక్షులు బారులుగట్టి పోవు నట్లు దేశానుసారంబుగ సేన సంచారంబు గావించినఁ గ్రౌంచ వ్యూహం బగు. సూక్ష్మగ్రీవంబును మధ్యపుచ్ఛంబును స్థూల పక్షంబును విశాలపార్శ్వంబును దనుముఖంబుం గలుగున ట్లొడ్డిన శ్యేనవ్యూహంబు. చతుష్పాదంబు దీర్ఘస్థూలవక్త్రోష్ఠంబు నగు నది మకరంబును సూక్ష్మముఖంబును దీర్ఘంబు సమంబు నగు దండాంతంబున ఛిద్రసంపన్నం బయినది సూచీ వ్యూహంబును నేకమార్గంబు నెన్మిదిప్రకారంబుల వేష్టితంబు నగునది చక్రవ్యూహంబును నలుగడల నష్టపరిధి గలది సర్వతోభద్రంబును సర్వతోముఖంబు నష్టవలయము నమార్గము నగునది గోలకమును ననంబడు. మఱియు శకటాకారం బయి నది శకటమును వ్యాలాకృతి యగునది వ్యాలంబు నందురు. సైన్యంబుకొలఁదియు రణస్థలంబురీతియు మార్గముం బరికించి సేనాని యేకవ్యూహం బేని బహువ్యూహంబుల నేని కల్పించునది.

రాజు సేనల నెటనిల్పవలయు? శత్రు నెట్లు వశపఱిచి కొనవలయు?

జంత్రములనేని యస్త్రములనేని యేస్థలంబున నిల్చిన శత్రుసేనాభేదంబు సులభంబగునట్టిచోట్ల మూఁకల నెకిమీఁడు నిల్పునది. అట్లు నిల్చుటయు నాసనంబగు. విజిగీషువు శత్రు బలపోషకము లయిన తృణాన్నజలసంభారంబులను యవసైంధవంబులను దక్కనవియుఁ జిరకాలంబు నిరోధించి యాసనమున నిరుద్ధవీవధాసారుండు భిన్నప్రకృతికుండు నగుపగతునిఁ గాలానుసారంబుగ వశుంజేయునది. అరివిజిగీషులు యుద్ధంబున

హీయమానులై సంధిచేసికొని సమయంబు నిరీక్షించుచుంట సంధాయాసనంబగు. బలవంతునిచేఁ బరాజితుండయినవాఁడు నిరుపాయప్రతిక్రియుం డయి కులీనుని సత్యవచనుని బలోత్కటుని నాశ్రయించుట యాశ్రయంబు.

ఓడినవాని సొమ్ము గ్రహింపవలయువారు

మఱియు విజిగీషునకు సహాయంబు గావించిన సుహృత్సంబంధిబాంధవులును వేతనంబు గ్రహియించు నితరులును బరాజితునిధనంబు విభజించి గ్రహింపవలయు; అట్లు సహాయంబు సేయువారును దుర్గంబులు నాపత్కాలంబున రాజులకు నాశ్రయంబుల యగు నని బుధులు చెప్పుదురు.

రాజుపాయమును నిశ్చయింపని యపు డెట్లుండవలయు?

అనిశ్చితోపాయకార్యుం డయి నృపుఁడు కాకాక్షియుం బోలె ననుపలక్షితంబుగ సమయంబు ననుసరించి ద్వైధీభావంబునఁ జరియించువాఁడయినను వేఱుకార్యంబు చూపి యన్యకార్యంబునం బ్రవర్తించువాఁడయినం గావలయు.

కార్య మెట్లు సిద్ధించును? ఎట్లు సిద్ధింపదు?

సదుపాయంబులను సన్మంత్రంబునను సదుద్యమంబుల నల్పజనులకేని కార్యసంసిద్ధి యగునన నృపతికిం జెప్పనేల. మఱియు నుద్యోగంబునఁగాని మనోరథమాత్రంబున నేకార్యంబును సిద్ధింపదు. సుప్తమృగేంద్రముఖంబున గజంబులు స్వయంబుగం జొరవుగదా. అభేద్యంబయిన యయస్సారంబు నుపాయంబుల ద్రవీభవించు. వహ్నికి వారి నియామకం బని లోకప్రసిద్ధంబు; మఱియు నుపాయోపగృహీతంబైన యగ్ని చే

నుదకంబు శోషిల్లు; సదుపాయంబున హస్తిశిరంబున మానిసి పదంబు నిలుపు.

రా జేయుపాయము నేగుణమును గ్రహింపవలె?

ఉపాయంబుల భేదంబును షడ్గుణంబుల నాశ్రయంబును బ్రశస్తంబులు గావున విజిగీషు వగు నృపున కవి రెండు నవశ్యంబు గ్రాహ్యంబు లగు. రాజెన్నఁడును వాని విడనాడి యనికి యత్నంబు సేయందగదు; మఱియు శత్రురాజునకు నతని ప్రజలకును స్త్రీలకును సైనికులకుఁ దన్నాయకునకు భేదంబునఁ బరస్పర ప్రాతికూల్యంబు గలుగునట్లు మిగుల జతనంబు సేయవలయు. రాజు తనకును శత్రునకును గల యుపాయంబులను షడ్గుణంబులను బాగుగఁ బరిశీలించి సర్వస్వంబునకుఁ బ్రాణంబులకు నత్యయంబు ప్రాప్తించు నెడ యుద్ధంబునకుం దొడరునది.

రా జెపుడు యుద్ధము తప్పక చేయవలయు?

బ్రాహ్మణులకు గోవులకు నింతులకు నాపద సంభవించినపుడు తాఁడు యుద్ధపరాఙ్ముఖుఁడు గాఁ జనదు; అట్లయ్యెనేని దేవతలచే నతఁడు మిగుల హింసింపఁబడు. మఱియు నుత్తములచేతనేని మధ్యములచేతనేని యధములచేతనేని పగఱచే నాహూతుం డయినపుడు ప్రజాపాలకుఁడు క్షత్రధర్మంబు స్మరియించి సంగ్రామనివృత్తుండు గాఁ జనదు. సంగ్రామనివృత్తుం డయిన రాజు, నప్రవాసి యగు బ్రాహ్మణుని, భూమి, బిలేశయంబుల సర్పంబుం బోలె, గ్రసియించు.

యుద్ధమును బ్రాహ్మణుఁ డెపుడు చేయవచ్చు?

క్షత్త్రంబు బ్రహ్మోద్భవం బగుట నాపత్కాలంబున క్షత్త్రధర్మంబునఁ బ్రవర్తనంబు బ్రాహ్మణులకును బ్రశస్తంబ కాని నిందితంబు గాదు.

రాజున కెట్టిమరణము ప్రశస్తము?

అవిక్షతంబయిన దేహంబుతో శ్లేష్మములఁ గ్రక్కుచుఁ గృపణంబుగ విలపించుచు సెజ్జ స్మరణించుట క్షత్త్రియునకధర్మం బని యైతిహాసికులు వల్కుదురు. క్షత్త్రియుఁడు స్వగణంబుతోఁ గూడి మార్తునితో యుద్ధంబు సేసి సువిక్షతుండయి వధంబునొంద నర్హుండు గాని తనగీమునఁ గృపణంబుగ మరణంబు నొంద నర్హుండు గాఁడు. ఆహవంబున మహీక్షితులు పరస్పర జిఘాంసువులయి యపరాఙ్ముఖులయి తమ శక్తికొలఁది యుధ్యమానులయి స్వర్గంబు వొందుదురు. మఱియు స్వామికార్యార్థంబు వాహినీముఖంబున ననివర్తితుండయి విక్రమించిన శూరునకు ననంతం బయిన స్వర్గంబు సంభవిల్లు. ఆలంబున వెఱపులేక పరాక్రమించి మృతుం డయిన శూరుండు సర్వపాపనిర్ముక్తుం డయి యుత్తమలోకంబు నొందుఁ గాన నతనికి జ్ఞాతులు వగవం బనిలేదు. ఆయోధనంబున మృతుండయిన శూరుంజూచి యచ్చరలు నేన వేల్తు నేన వరియింతు నని త్వరమాణ లయి ప్రధావింత్రు. మునులు చిరకాలంబు దీర్ఘంబయిన తపంబు సేసి పడయు నుత్తమపదంబు యుద్ధాభిముఖ నిహతుం డయిన శూరుండు శీఘ్రంబు వొందు. యుద్ధంబునఁ బలాయనంబు నొందమి సనాతనంబయిన ధర్మంబును బుణ్యంబును సర్వాశ్రమకర్మానుష్ఠానఫలదంబు నగు.

శౌర్యాభివర్ణనము

శౌర్యంబుకంటె నుత్కృష్టం బొండు ముల్లోకంబుల లేదు. శూరుండు సర్వలోకంబుం బాలింపనోపు. మఱియు నతనియందు సర్వధర్మంబులు సుప్రతిష్ఠితంబు లయియుండు. చరంబుల కచరంబులును దంష్ట్రుల కదంష్ట్రంబులును బాణిమంతంబుల కపాణులును శూరులకుఁ గాతరులు నన్నం బని బుధులు చెప్పిరి. ఈ లోకంబున యోగయుక్తుం డయిన పరివ్రాజకుఁడును రణంబున నభిముఖముగ హతుఁడయిన శూరుండు నను నిద్దఱు సూర్యమండలభేదు లగుదురు. శ్రుతి కలిమిం జేసి యాతతాయు లయిన బ్రాహ్మణులను విద్వాంసులను గురువుల నయిన వధియించి శక్తుఁడు యుద్ధమున నాత్మరక్షణము కావించి కొనవలయు.

రాజు విద్వాంసులతో నెపు డాలోచింపవలయు? నెపుడు గూడదు

మహాభయము ప్రాప్తించుడుఁ గారుణికులు ప్రాజ్ఞులు నపాపదర్శులు నగు నాచార్యులతో నాలోచింపక ప్రతీకారమునకుం గడంగునది. విచిత్రములయిన ప్రాసాదములను బ్రమదావనములను గోష్ఠులను వివిధము లగు కథలఁ గావించు నపుడు విద్వాంసులు శోభిల్లుదురు. మఱియుం బరవివరజ్ఞానమునను దత్త్వనిర్ణయాదు లందును హస్త్యశ్వాది జంతుకార్యకథనము లందును నన్న సంస్కారదోషముల కథనమునను బండితులు శోభిల్లుదురు. కేవల గుణపక్షపాతులయిన విద్వాంసులఁ బురస్కరించుకొనక యరిచిత్తగుణము లెఱిఁగి యెట్లయిన ఱేఁడు శత్రువధమునకు యత్నించునది.

రాజు బ్రాహ్మణాదుల నెపుడు చంపిన దోషి గాఁడు?

ఆతతాయియయిన బ్రాహ్మణుండును శూద్రసముం డని యెన్నంబడు. ఆతతాయిని వధియించిన వాని కేదోషమును లేదు. శస్త్రము ధరించి చంప నేతెంచిన బాలకు నేని చంపిన దోషి గాఁడు. కాని యట్టివాని నుపేక్షించినఁ జంపిన దోషంబ యగు. ఉద్యతాయుధుండు క్రుద్ధుఁడు నపలాయితుండు నగు బ్రాహ్మణుని క్షత్రబంధుం బోలె యుద్ధమున హింసించినను బ్రహ్మహత్యాదోషము లేదని ధర్మశాస్త్రములనిశ్చితంబయ్యె.

రాజు యుద్ధమునఁ బలాయితుఁ డయిన నేమి?

జీవితార్థియై యెవ్వఁడు యుద్ధమునుండి యపసరించు నా నరాధముండు జీవన్మృతుం డయి రాష్ట్రకృతంబయిన యఘంబెల్ల ననుభవించు. ప్రాణభయమున నెవ్వఁడేని మిత్రుని స్వామిని విడిచి రణమునుండి నిర్గమించు నాతఁడెల్లరచే నింద్యజీవనుం డయి యంతమున నరకలోకమున నుండు. ఆపద్గతుం డయిన మిత్రున కుపకరింపక యుపేక్షించినవాఁ డీలోకమున నకీర్తినొంది మృతుఁడయి నరకమునం బడు.

రా జెవని విడువరాదు?

విస్రంభమున శరణము నొందినవానిఁ ద్యజియించినవాఁడు బహుమన్వంతరములు ఘోరనరకమునే వసియించు.

బ్రాహ్మణు లెట్టికాలమున యుద్ధముచేసిన దోషులుగారు?

బ్రాహ్మణులు శస్త్రాస్త్రములతో యుద్ధముచేసి సువృత్తుండయిన క్షత్రియుం జంపియుం దోషభాక్కులు గారు.

మఱియుక్షత్త్రకులము హీనంబయినపుడు శూద్రులు లోకముఁ బీడింప బ్రాహ్మణులు వారి నవశ్యము సరగ నశియింపఁ జేయునది.

యుద్ధ మెద్ది యుత్తమము ? ఎద్ది తదితరము ?

మాంత్రికాస్త్రములతోడి యుద్ధ ముత్తమమును నాలికాస్త్రములతోడి యనీకము మధ్యమమును శస్త్రములతోడి సమీకంబధమమును నియుద్ధం బంతకంటెను హీనతరంబు నని తద్విదులు వల్కుదురు.

యుద్ధస్వరూపము

మంత్రప్రేరితము లయిన మహాశక్తిబాణాదుల నయిన శత్రుసంహారము మాంత్రికాస్త్రయుద్ధమును సర్వయుద్ధముల నుత్తమము వని చెప్పంబడు. నాలముల నగ్నిచూర్ణము ఘటించి లక్ష్యముల గోలనిపాతనము గావించుచుఁ జేయునది నాలికాస్త్రయుద్ధమును రిపుభయంకరము నగు. నాలాద్య భావమునఁ గుంతాది శస్త్ర సంఘాతమున శత్రునాశనము గావించుట శస్త్రయుద్ధం బయ్యె. కౌశలంబున శత్రుశరీర గ్రంథుల [illegible]ంచియు బాహుల బంధించియుఁ జేయుఘాతనంబు బాహుయుద్ధం బగు.

బాహుయుద్ధవిభాగము

వామహస్తమునఁ గచోత్పీడనమును, బలాతిశయమున నేలం బొరలించి నిష్పేషణము గావించుటయు, శిరమునఁ బాదప్రహరణమును, జానులతో నుదరపీడనమును, మాలూరాకారం బయిన ముష్టిని గపోలములయందు దృఢతాడనమును, మాటిమాటికిఁ గపోణిప్రదేశముతోఁ బొడుచుటయు, నెల్లశరీరమునఁ దలముల మర్దించుటయు, ఛలమున గిరగిరం ద్రిప్పుటయు, నని బాహుయుద్ధం బెన్మిది తెఱంగుల నుండు. నియుద్ధకుశలుం డందు నాలుగు తెఱంగుల బాహుయుద్ధముల క్షత్త్రియుని నైదువిధముల క్షత్త్రియాధముని నాఱువిధముల వైశ్యుని నేడుప్రకారముల శూద్రుని నెన్మిదిరీతుల యుద్ధములను దదితరునిఁ జంపవలయు. యుద్ధము లెన్నండును శత్త్రుల యం దుపయోగింపవలయుం గాని మిత్త్రులయందుఁ గూడదు.

యుద్ధమున సేనలనిల్పు విధము

జిగీషువు లఘువులు మహాంతములగు నాలికాస్త్రముల ముందిడుకొని వానివెనుకం బదాతుల నిల్పి గజాశ్వములఁ బార్శ్వముల నునిచి భిన్నామాత్యబలుం డగు నరితో యుద్ధ మారంభించునది. సంగ్రామమునకుఁ దగినభూమి లభియించుదనుక మున్ముంద యర్ధసైన్యమున జన్యము సేనానాయకులకుఁ గర్తవ్యం బని సమీరితం బయ్యె. పిమ్మట నమాత్యరక్షిత సైన్యములతో నమాత్యులకును బిదప రాజరక్షిత పృతనలతోఁ బ్రాణాత్యయమున రాజులకును యుద్ధం బవశ్యకర్తవ్యంబు.

రాజు స్వసేనల నెపుడు రక్షింపవలె ?

రాజు దీర్ఘప్రయాణమునం బరిశ్రాంతమును క్షుత్పిపాసా పీడితమును వ్యాధిదుర్భిక్షబాధితమును గరకాక్లాంతమును దస్యువిద్రుతమును బాంసుపంకజాలస్కన్నమును బ్రసుప్తమును బరిశ్రమాతురమును దుర్గతమును నగ్నిభయభ్రాంత

మును వృష్టివాతసమాహతము భోజనవ్యగ్రము నగు స్వసైన్యము జాగరూకుఁ డయి రక్షించుచు శత్రుసైన్యంబుల నశియింపఁ జేయుచుండ వలయు.

మనీషులు మీఁదఁ జెప్పిన సేనావ్యసనము లన్నిటి కంటె భేదము పాపిష్ఠము ముఖ్యము నని చెప్పుదురు. భేదోపాయమున శిథిలం బయిన నానాప్రకారాగతనూతనసైన్యమును జేని కతిశ్రమము గావింపనోపునన మూలం బట్లు చేయు నని చెప్పనేల?

యుద్ధకాలమున రాజు చేయవలయు నేర్పాట్లు

వీరవ్రతాభిలాషి శత్రువర్గములయు నాత్మబలములయు షడ్గుణములు నుపాయములు మంత్రబలములుం బరికించి ధర్మయుద్ధమున నేని కూటయుద్ధమున నేని రిపులజయించునది. రాజు యుద్ధయాత్రాకాలమున భృత్యులను నాల్గవపాల నధికం బగు వేతనమున రంజించుచుఁ జర్మమునను గవచమునను స్వదేహరక్షణము గావించుకొను చుండవలయు. మఱియు వీర్యవర్ధనము లయిన మదద్రవ్యములు సైనికులచేఁ ద్రావించి వారల నుత్తేజితులను నిస్సందేహులను జేసి యుద్ధమున నియోగించి నాలికాస్త్రములను ఖడ్గాది శస్త్రములను శత్రుపాతనము సేయించునది. సాదులు కుంతములను రథికుఁడు గజస్థుఁడును బాణములను రణము సేయవలయు. మఱియు గజారూఢుఁడు గజారూఢునితోడను దురగారూఢుఁడుతురగారూఢునితోడను రథికుఁడు రథికునితోడను బదాతి పదాతితోడను యుద్ధము సేయను శస్త్రముల శస్త్రముల చేతను నస్త్రముల నస్త్రముల చేతను నివారింపను రాజాన యీ వలయు.

యుద్ధమున వధానర్హులు

యోధులు సజ్జనులు చెప్పిన యుద్ధధర్మము స్మరియించి డాఁగిన వానిఁ గ్లీబునిఁ గృతాంజలిని ముక్తకేశుని నాసీనుని 'నీయధీనుండ' నని చెప్పినవాని సుప్తుని యుద్ధసన్నాహము సేయనివాని నగ్నుని నిరాయుధుని రణముఁజూడ వచ్చినవాని వేఱొకనితోఁ బోరుసేయువానిఁ బానముసేయువాని భోనము సేయువాని నన్యకార్యవ్యాపృతుని భయభ్రాంతుఁ దొలఁగి చనువాని వధియింపఁ దగదు. మఱియు బాలుని వృద్ధుని స్త్రీలోకమును గేవలనృపుని రణమున హింసింపఁ దగదు గాని వీరభావమునఁ బ్రతిఘటించి హింసించినను ధర్మహాని వాటిల్లదు.

కూటయుద్ధము

ఈ నియమము లన్నియు ధర్మయుద్ధంబునన కాని కూటయుద్ధంబున లేవు. బలవద్రిపునాశంబునఁ గూటసదృశంబు వేఱొండు లేదు. పూర్వ మింద్రాదులును రామకృష్ణాదులును గూటయుద్ధంబు నాదరించి దానవముచిని వాలిని గాలయవనునిఁ జంపిరి.

స్వకార్యము సాధించు విధము

ప్రఫుల్ల వదనంబునను గోమలవాక్యంబుల నపరాధాంగీకారంబునను సేవాదానంబులను నతిస్తవంబుల నుపకారంబులను దివ్యంబులను స్వాశయంబులను బరులనమ్మించి క్షురధారాసదృశం బయిన మనంబున వారియంతరం బన్వేషించుచుండవలయు. ప్రాజ్ఞుఁ డవమానము స్వీకరించియు మానంబు విడిచియు స్వార్థంబు సాధించుకొనవలయుం గాని మోఱకుఁ

దనంబున స్వకార్యధ్వంసంబు సేయంజనదు. శతానీకుఁడు పర్యంకాసనంబున నుండి సేనాకార్యంబు పరిశీలించుచుండవలయు. రాజునకు రాష్ట్రంబునకు హితంబు గోరు సైనికులు మోహారంబు సంకేతంబుల మీఱక చరింపవలయు. శత్రులచే భేదితం బయిన స్వసైన్యంబుం దెలిసికొని రాజు వధింపించునది; మఱియు జోదులు నూతనం బయిన కార్యంబు సేసినపుడు వారికిం దగిన పసదనంబును గ్రమ ప్రాప్తంబులయిన మహోద్యోగంబుల నిచ్చుచుఁ దృణాగ్ని జల సంరోధంబు గావించి శత్రులఁ బీడించి విషమంబున వేగపడి హింసించుచుఁ గపటంబునను మహాస్వర్ణదానంబునను ద్విషద్బలంబు భేదించుచు విస్రంభసంసుప్తంబును బ్రజాగరక్లాంతంబు నగుదాని మోసంబున జాగరూకుఁడయి నశింపఁజేయునది. వ్యసనాసక్తంబయినఁ బగఱకు సహాయంబు సేయ నేతెంచిన దళంబులకు హానిసేయం దగదు. మఱియు నెట్టి శత్రుచే నయినను దనకు సమీపతరం బయిన మండలంబు గ్రహింపఁ జేయక క్షణంబు యుద్ధసన్నద్ధుఁ డయి మరల క్షణం బపసరించుచు రాజప్రమత్తుఁ డయి దస్యుండువోలె దూరంబు నుండి యాకస్మికపాతంబున నెక్కుమ్మడి నన్నిప్రక్కల శత్రుబలంబు ముట్టడించుచుండవలయు; మఱియు యుద్ధంబుల యోధులకు సంతసంబు పుట్టించుచు రజతంబును హేమంబును గుప్యంబు నెవఁ డెద్ది జయించు దానిం గార్యానురూపంబుగ వాని కిచ్చుచు నట్లు పగఱ జయించి విజితునివలనఁ గరంబేని రాజ్యాంశంబేని సర్వరాజ్యంబేని గ్రహించి తనకు వశు లయిన యచ్చటిప్రజలఁ బుత్త్రులంబోలె రంజించుచుఁ

దూర్యాది మంగళఘోషంబులతో స్వపురంబుం బ్రవేశించి యేకాలంబున నేదేశంబున నేపాత్రంబున నేయుపాయంబునఁ గార్యంబుల నాదిమధ్యావసానంబుల నెట్టిఫలంబు గల్గు నది యాలోచింప నన్యంబయిన మంత్రిగణంబు నియోగించునది. మంత్ర్యాద్యధికృతులు కార్యంబు నాలోచించి మున్ను యువరాజునకు నివేదింపవలయు. పిమ్మట యువరాజు వారలతోఁ గూడ నది రాజునకు నివేదించునది. మొదట రాజు సదసద్వివేకపూర్వకంబుగా యువరాజునకుఁ గార్యోపదేశంబు సేయును బిమ్మట నతఁడు మంత్రిగణంబున కుపదేశింపనుం దగు. పురోధసుండు రాజునకు నట్లు మున్ముందు కార్యోపదేశంబు సేయందగు. రాజు సైనికులను గ్రామోపకంఠంబున నిల్పుచు గ్రామస్థులకు సైనికులకు నప్పు లిచ్చి పుచ్చుకొను వ్యవహారంబు లేకుండం జేయుచు వారి యుపయోగార్థంబు పణ్యాంబుల వేఱుగ నచట నుండ నియమించుచు నొక్కచో సైన్యంబు వత్సరంబు పూర్ణం బగునంతదనుక నుండ నీక పరివర్తించుచుండునది. క్షణంబునన భటసహస్రంబు యుద్ధసన్నద్ధం బగునట్లు నృపుఁ డనుశాసనము సేయుచు నెన్మిదిదినముల కొకమాఱు సైనికుల కుగ్రకోపంబును నాతతాయితనంబును రాచకర్జంబుల విలంబనంబును రాజుననిష్టంబు నుపేక్షించుటయు స్వధర్మపరిత్యాగంబును బెఱలతోడి సంభాషణంబును ఱేని యానతి నొందక గ్రామప్రవేశంబును గావింపఁజన దనియుఁ దమయధికారుల తప్పులయినం బ్రకటింపవలయు ననియు స్వామికార్యంబునం బరస్పరమైత్రి కల్గి వర్తిల్లుఁ డనియు సూజ్జ్వలంబులయిన యస్త్ర

శస్త్రంబుల వసనంబుల నన్నంబును జలంబును బహ్వన్న సాధకం బయిన పాత్రోత్కరంబును రక్షించుకొనుచుండవలయుననియు శాసనంబు మీఱి చరించువారిని జముని నిశాంతంబున కతిథులఁ జేయుదుననియు శత్రులనుండి ధనంబు గ్రహించి భేదంబు నొందిన సైనికుల నాకుఁ దెల్పుఁడనియు స్వనియమముల విన్పించుచుండ వలయు; మఱియ సైనికులకు నిచ్చలు మొగ్గరంబులలవర్చుచు నయనంబున కొకసారి యస్త్రపాతంబున లక్ష్యభేదనంబు (గుఱికొట్టుట) గావించుచుఁ బ్రాతస్సాయంసమయంబుల సైనికుల గణియించుచు జాత్యాకృతి వయోగ్రామవాసంబుల లిఖియించుచు భృతిపరిమాణంబునం దిచ్చినదాని నీవలయుదాని నిచ్చిన పారితోషికంబులం బరిశీలించుచు నిచ్చినవాని కెల్లఁ బ్రాప్తిపత్త్రంబు (Receipt) గ్రహించుచు వేతనపత్త్రంబిప్పించుచు శిక్షితులయిన భటుల కెల్లఁ బూర్ణవేతనంబును వ్యూహాభ్యాసనియుక్తు లయినవారికం దర్ధంబు నిచ్చుచు దుష్ప్రభు నాశ్రయించిన సేనల శత్రుభావంబున నశింపఁజేయుచు నృపుని (తన) దుర్గుణంబులకు సంతసించువారిని సద్గుణంబుల ద్వేషించువారిని వానియం దుదాసీనులగు వారిని బరిశీలించుచు దుష్టుల హింసించుచు సద్గుణు లయ్యుఁ గేవలసుఖాసక్తు లయిన భృత్యులఁ ద్యజియించుచు నంతఃపురాదులను ధనాదివ్యయంబులను విశ్వస్తులు శుభాంతఃకరణులు నగు సేవకుల నిల్పుచుండవలయు. విస్రబ్ధులు లోకపూజితులు నగువారు రాజకార్యంబుల నియోగింపఁబడకున్నఁ గేవలనింద కల్గు. శత్రురాజసంబంధు లెవ్వరాతని దుర్గుణంబుల నేవ పుట్టి భిన్ను లయి యతనిచే నవ

మానితు లయి తన్ను సేవింత్రు కార్యసాధకు లయిన యట్టి సేనపులను మంత్రిగణంబు నితరులను రాజు మహాభృతిచేఁ బోషించుచుఁ గేవల లోభంబున శత్రులనుండి విముఖు లయిన వారినం దర్ధంబునఁ బాలించుచు శత్రులచే విడువంబడిన సుగుణుల నధికభృతిచే రక్షించుచుండవలయు. మఱియు భేదోపాయంబునఁ దనకు వశులయిన యెవ్వారి సహాయంబునఁ బరరాష్ట్రంబు హృతం బగు వారి కది మొదలు వేతనంబు లిచ్చుచు వారియనంతరము పుత్రు లున్నవారికి నందర్ధంబును స్త్రీలున్న నందర్ధంబును మానక యీవలయు. జయశాలి హృతరాజ్యుండయిన శత్రునకు గుణశాలియగు పుత్రుఁడున్న నతనిరాజ్యంబునఁ జతుర్థాంశంబును గుణహీనుఁడున్న ద్వాత్రింశాంశంబు నీవలయు; మఱియు జితునినిచితకోశంబు భోగంబున కేని కుసీదంబున కేని హరియింపనగుం గాని కుసీదంబున కుపయోగించిన ద్విగుణం బగునంతదనుకన యుపయోగింపనది. జయించినరాజు స్వమాహాత్మ్యంబు ప్రకటింపఁ బరాజితుల రాజోచితమానంబుల రక్షింపవలయుం గాని వారు దుర్వృత్తు లయినం బీడించునది. పుడమిఱేఁడు యామికులం బరికించి వారియుపయోగార్థంబు రేయుంబవలు నెన్మిదిప్రకారంబులనేని పదిప్రకారంబులనేని ద్వాదశప్రకారంబులనేని విభజించి నల్వురకంటె నధికులయిన వారిం దత్కార్యంబున నియోగించి కార్యగౌరవంబు గలప్పుడు పెక్కండ్ర నియోగించుచు నంతకంటె న్యూనుల నెన్నఁడు నియోగింపక రక్ష్యంబులయిన వస్తులఁ జూపి వారి సమక్షంబున నొప్పించునది. వారు తమ కొప్పగించిన ద్రవ్యంబుల నప్రమత్తు లయి

రక్షించునది. యామికుఁడు తనకు నియమించిన కాలంబున స్వర్ణాదిపదార్థంబులఁ గీలకోష్ఠంబున (తాళము వైచినగది లో) రక్షించుచు నవసానంబున నన్యయామికునకు రక్ష్యవస్తువుల యాథార్థ్యంబు బోధించుచుండవలయు. ప్రతిక్షణంబును యామికులకుఁ గార్యంబు బోధించుచు మే లయిన నియమంబులఁ బాలించునపుడ నృపుఁ డెల్ల వారికిం బూజ్యుం డగు. ఎవనికిఁ గార్యాభినివేశంబును సత్కార్యంబుల నౌదార్యంబు నసత్కార్యంబుల వైముఖ్యంబును గల్గు నతఁడు రాజ్యంబు చిరకాలం బనుభవించు. ఎవని వచనంబు కార్యంబు సాధుభావంబు నస్థిరంబు లతఁడు శీఘ్రంబ స్నేహంబునుండియు రాజ్యంబునుండియుం దొలఁగు. మృగేంద్రంబు శాసింప వ్యాఘ్రగజాదులు శక్తంబులు గాని యట్లు స్వచ్ఛందగామి యగు రాజు ననుశాసింప మంత్రులు స్వక్తులు గారు. తూలభారంబు గజంబుఁ బద్ధంబు గావింపలేని యట్లు సారహీనులు రాజు నాఁగఁ జాలరు. పంకమగ్నం బయిన గజంబు నుద్ధరింప గజంబ సమర్థం బగునట్లు నీతిభ్రష్టుండయిన రాజును నయజ్ఞుఁడయిన తేఁ డుద్ధరింప శక్తుఁ డగు. బలవంతుఁడయిన నృపునకు భృత్యవర్గం బల్పంబయిన నతనియందు సిరియుం దేజంబు నపారంబయి యుండుం గాని హీననృపునియందు నతని మంత్రిగణంబునందు నట్లు గాదు. రాజునకుఁ బెక్కండ్రతో నైకమత్యంబు బలవత్తరంబు; బహుసూత్రవేష్టితంబయిన రజ్జువు సింహాదుల నాకర్షింపఁ జాలు. హీనరాజ్యుండు రిపుభృత్యుండు నగు రాజు మహాసైన్యంబు ధరియింపక స్వపుత్రాద్యభివృద్ధ్యర్థంబు కోశసంచయంబు గావించునది.

రాజు లెల్లను శయనంబును భోజనంబును నిద్రాక్షుధాకాలంబుల గ్రహింపవలయు; అట్లు కానినాఁడు శీఘ్రంబు నెవ్వవచ్చు. రాజు లీప్రకారంబున వెచ్చింపవలయుం గాని యన్యప్రకారంబునఁ గూడదు. ధర్మవిహీనులు నీతివిహీనులు దుర్బలులు నగు రాజులు ధర్మబలసంపన్ను లయిన నరవరులచే నవశ్యంబు చోరులుం బోలె దండ్యు లగుదురు. నీచనృపుఁ డయ్యు సర్వధర్మావనంబున శ్రైష్ఠ్యంబు నుత్తమనృపుఁ డయ్యు ధర్మనాశనంబున నీచత్వంబునుం బొందు. రాజ్యంబు నొందినవాఁడు లోకంబునం బ్రశస్యుఁడును ధర్మాధర్మప్రవృత్తికిం గారణంబు నగు. మన్వాదులచే నాదృతంబయిన యర్థంబు ద్వావింశతిశతశ్లోకంబుల భార్గవునిచే నీతిసారంబున నుక్తంబయ్యె. శుక్రునిచేఁ బ్రోక్తంబయిన యీ నీతిసారంబు ననిశంబుఁ జింతించునేత వ్యవహారధురంబు వహింప సమర్థుఁ డయి యుండు. శుక్రునకుఁ దుల్యుఁ డగునీతిమంతుఁడు మూల్లోకంబుల లేఁడు గావునఁ దత్కృతంబయినది సన్నీతియు నన్యకృతంబయినది వ్యవహారులకుఁ గునీతియు నగు. మందభాగ్యు లగు నే నృపు లసామర్థ్యంబున నేని లోభంబున నేని నీతి నాశ్రయింపరు వారు నరకభాజను లగుదురు.

ఇది శుక్రనీతిసారంబున నాంధ్రీకృతంబునఁ జతుర్థాధ్యాయంబున

సేనానిరూపణం బను సప్తమప్రకరణము నధ్యాయమును.

సమాప్తము.

శ్రీరస్తు

శుక్రనీతిసారము

పంచమాధ్యాయము

నీతిశేషము

శాస్త్రసమ్మతంబును, సప్తాంగంబులకు రాజ్యంబునకు సర్వజనంబులకును, హితకరంబునయిన నీతిశాస్త్రశేషంబుఁ జెప్పెద నని శుక్రుండు పలాసుల కిట్లనియె. జనుఁడు నూఱేండ్లతిక్రమించిన పిమ్మట నయినను బగఱ వశపఱిచికొందుమనని యెడదఁ బరికించి వారలఛిద్రంబు లన్వేషించుచుండవలయు. భూమీశుండు మంత్రబలసంపన్నుండయి యరిహీనమంత్రబలుండయి భృత్యవర్గంబునుండియు రాష్ట్రంబునుండియు ననర్థాగమం బుత్ప్రేక్షించునట్లు చేయుచు నూఁడిగంబు సేయువ్యాజంబున నేని వాణిజ్యంబు సేయు నెపంబున నేని రిపురాష్ట్రంబుఁ బ్రవేశించి పరిశీలించుచు సావధానుండయి మార్జారంబుంబోలెను లుబ్ధకుండుబలెను బకంబుంబోలెను సమయంబు వేచియుండి నిర్భయుఁడును వ్యసనాసక్తుండు నగు పగతు నున్మూలించునది.

మఱియును యుద్ధకాముకుండు శత్రుజనపదంబునఁ గాఁపురంబున్న దాని నేకాంతంబునఁ దన్ను ద్వేషించుదానిని

విడిచి ప్రత్యనీకవినాశని యగు సేనను యుద్ధంబున నియోగించుచు సాహసించి స్వసైన్యనాశంబు గావింపక రక్షించునది. భృత్యులును దాసమానవియుక్తులయ్యు జీవితంబు ధనంబు నపేక్షించి సమయంబునఁ బెఱలకు వశంవదులు గాకుండునది. మేఘోదకంబుల సస్యంబులకుఁ బుష్టిగల్గినట్లు నద్యాదిజలంబులఁ గల్గదు గదా; అట్లె రాజద్రవ్యంబునఁ బ్రజాపుష్టిగల్గినట్లు ధనికులధనంబునఁ గల్గదు. మహావీర్యబలుండయ్యు రాజు మార్దవంబు ప్రకటించుచు ముందు శత్రురాజ్యంబు ప్రవేశించి యతనికార్యంబు నిర్వహించుచు సంజాతదృఢమూలుండయి యతని రాష్ట్రంబు సర్వంబు హరియించి మూలంబు నున్మూలింపఁ గోరి తర్వాత నతనిదాయాదులను సేనానాయకులను దద్రాజ్యాంశదానంబున వశపఱిచికొనునది. వృక్షంబు సంక్షీణమూలం బయినఁ దచ్ఛాఖలు క్రమక్రమంబుగ శుష్కించునట్లు భూపతి నశియించుడుఁ దక్కిన యతనిసేవకులు గ్రమంబుగ నశియింత్రు. రాజ్యవృక్షంబునకు మూలంబు నృపతియు స్కంధంబు మంత్రిగణంబును శాఖాసముదయంబు సేనపులును బల్లవంబులు సేనయుఁ గుసుమంబులు ప్రజలును ఫలంబులు భూమిభాగంబులును బీజంబు భూమియు నని చెప్పంబడు. ఱేఁడు విశ్వాసంబుఁ జెందినవాని నయినను శత్రుభూపాలుని నమ్మి యల్పపరివారయుతుండయి యేకతంబున నతనిగీముఁ జొరరాదు. మఱియు రూపంబునను వేషంబునను స్వసదృశులగుజనులఁ బెక్కండ్రనికటంబున రక్షించుచు గుప్తవిశిష్టచిహ్నుండయి సమయంబున నన్యాదృశుండగుచు వేశ్యలచేతను నటులచేతను

మద్యంబులచేతను గాయనులచేతను రిపుల మోహింపఁ
జేయుచు సువస్త్రాభరణంబులతోడను గుటుంబంబుతోడను
విశిష్ట చిహ్నంబుతోడను యుద్ధరంగంబు నొకపుడుం బ్రవే
శింపక స్త్రీ పుత్ర భృత్యవర్గంబును శత్రువర్గంబును క్షణంబు
నుపేక్షింపక సావధానుండు గావలయు. జీవించియున్నంత
వఱకు సద్గుణుం డగు పుత్రునందును రాజు స్వాధికారంబు
సర్వంబును సమర్పింపఁదగదు. అట్లు సేయుట మహానర్థంబు
మదంబుం గలిగించుం గాన విష్ణ్వాదులును దమ యధికా
రంబు పుత్రులందు సమర్పింపరైరి. ఆయువు స్వల్పావశిష్టం
బగుడు ఱేఁడు స్వామ్యంబు సత్పుత్రునందు నిల్పునది; యువ
రాజాదులు స్వామ్యలోభచాపలభారంబున క్షణంబునరా
జకం బయిన రాష్ట్రంబు ధరియింపఁ జాలరు. రాజపుత్రుఁ
డుత్తమపదంబు నొంది సునీతిఁ బ్రజలఁ బాలించుచుఁ బూర్వా
మాత్యులందుఁ దండ్రియందుఁ బోలె గౌరవంబుఁ జూపు
చుండునది. పూర్వమంత్రులును నూతనరాజశాసనంబు
యుక్తం బేని మునుపటికంటె నధికంబుగ గారవించుచు నయు
క్తం బేని సమయాంతరంబున నిదికార్యంబని నిషేధింపవలయుం
గాని యతనికిఁ దోడ్పడి ధనాశచే దుర్నయంబునఁ బ్రవర్తింపఁ
దగదు; ప్రవర్తించిరేని యాతేనితో వారును బదభ్రష్టు
లగుదురు. కులభక్తులయినభృత్యుల ద్వేషించుచు నూతనుల
భజియించురాజు శత్రువశుండయి ధనప్రాణంబులతో వియో
జితుం డగును. నవ్యంబయినజనంబును గుణవంతంబు నీతి
మంతంబు నయిన వారిచరితం బిమ్ముగం బరీక్షించి ప్రాచీన
సేవకులతోఁ దుల్యంబుగఁ గార్యంబుల నియోగింప నగు.

మాయావులు కార్యంబు గలంతకాలంబును మృదువచనంబు
లను స్తుతులను నతులను సేవలను దానంబులను జేసి
సేవింత్రు; సాధువు లెల్లకాలమును బ్రత్యక్షంబునం బరో
క్షంబునను సమంబుగను నిష్కపటంబుగను సేవింత్రు;
భూమ్యాకాశంబులకుం బోలె వీరి కింతయంతరంబు గలదు.
ధూర్తులుం జోరులు జారులు నని విఖ్యాతులు మాయకు జన
కులును బరస్వాహరణంబున నిందితులు నగుదురు గానియందు
మొదటివాఁడు ప్రత్యక్షంబునను దక్కినవారు పరోక్షంబు
నను బరధనంబు హరియింత్రు. ధూర్తులగువా రజ్ఞులకు హితం
బహితంబనియు నహితంబు హితంబనియు బోధించి తమ
కార్యంబు నెఱవేర్చికొని మిగుల నమ్మించియు ఛద్మంబున
హాని చేయుదురు. మానిసి యెవని కప్రియంబు సేయం
దలంచు వానికి మున్ముందు ప్రియంబు సేయ వలయు,
వ్యాధుండు మృగవధార్థంబు సుస్వరంబుగ గానంబు సేయు.
మాయ సేయకుండ జనునకు మహాద్రవ్యంబు శీఘ్రం
బుగ సంఘటిల్లదు. పరస్వంబు హరింపకుండ నెవ్వఁడు మహా
ధనుండు గాఁడు. మాయ నవలంబించినం గాని యాప్సి
తార్థసిద్ధి యొదవ నేరదు. నృపులు పరధనాపహరణంబు
పరమం బగు స్వధర్మం బని తలంచి యొందొరులతో
మహాయుద్ధంబు గావించి ప్రాణంబులుం ద్యజియింత్రు.
రాజునకుఁ బరస్వాహరణంబునఁ బాపంబు లేదేని దస్యు
వులకును లేకుండెడు; కాని పాపం బాశ్రయభేదంబున
ధర్మరూపం బయి యుండు. పెక్కండ్రచే స్తుతింపఁబడిన
వ్యాపారంబు ధర్మంబును బలువురచే నిందితంబధర్మంబు

నగుం గాని ధర్మతత్త్వం బేవారికిఁ దెలియ నశక్యం బయి యుండు. అతిదానంబు తపంబును సత్యంబు నీలోకంబున దారిద్ర్యంబు గావించు. ధర్మార్థంబుల సాధింపఁజాలనివాని వచనంబు నిష్ఫలం బగు. అర్థంబును ధర్మంబు నార్జింపఁ గుశలుండును దేశకాలజ్ఞుండును నిస్సంశయుండు నగువాఁడు పూజ్యుండగుం గాని సంశయంబు నెల్లెడలఁ గలవాఁడు సమ్మతుండుఁ గాఁడు. పురుషుం డర్థంబునకు దాసుండు, నర్థం బేవానికి దాసభావంబు నొందమి నెల్లవాఁడు నర్థంబు సంపాదింప మిగుల జతనంబు గావించునది. అర్థంబునన ధర్మంబును గామంబును మోక్షంబును నరులకు సిద్ధించు. శస్త్రాస్త్రశూన్యంబయిన శౌర్యంబును స్త్రీవిహీనంబయిన గార్హస్థ్యంబును గ్రాహకుని వినాఁ గౌశలంబును యోధుల కైకమత్యంబు లేని యుద్ధంబును సుసహాయరేబు లేని యాపదయు మహాదుఃఖజనకంబులగు; మఱియు నాపత్కాలంబున మిత్రసమంబయిన సహాయంబు లేదు. అవిభక్తధనులగు జ్ఞాతుల మైత్రిని విభక్తధనుల నియతభృతిని మిత్రుని సత్యంబునను స్వసదృశభోగంబులను దన్పుచు ఱేనిం జుట్టంబుల సంగాతకాండ్రఁ గొలువుడుకాండ్ర సంతసంపెట్టుచుఁ దనధనంబుల ననుభవించు నరుఁడు సుఖి యగు. ఱేఁడు దర్పంబును గార్పణ్యంబును మానంబు ద్వేషంబు భయంబును విడిచి విశేషభృతిదానంబునను ప్రేమమానంబులను గారవించి భృత్యుల స్వార్థసిద్ధ్యర్థంబు నియోగించునది. కాని మఱియొక ప్రకారంబున నియోగింపఁ గాదు. బ్రాహ్మణులకు దానంబున నగ్నికి జన్నంబులను బాంధులకుఁ బానీయదానంబునను దృప్తి చేయుచు నుండువాఁడు

సుఖియు విపరీతుఁడు దుఃఖియు నగు. పరుల నవమానించు తలఁపు దర్పంబును, నే నెల్లవారికంటె నధికుఁడ నను నభిప్రాయంబు మానంబును, వ్యయంబున దైన్యంబు కార్పణ్యంబును, స్వనాశశంకభయంబును, మనశ్చాంచల్యం బుద్వేగంబు నని ప్రకీర్తితంబు లయ్యె. క్షుద్రునకే నవమానంబు గావింప మహావైరం బగు. దానమానసత్యశౌర్యమార్దవంబులు సౌహార్దకరంబులు. రాజాపత్కాలంబున బుధులను గురులను సోదరులను బంధువులను భృత్యులను జ్ఞాతులను సభ్యులను సభకు రావించి వినతుండయి యీయాపద సంతరించు నుపాయంబు చెప్పుఁడని కోరి మీరు మాకుం బరమమిత్రులరు గాని భృత్యులు గారనియు మీకుం దుల్యంబగు సహాయంబు మా కొండు లేదనియు భృతియందు మూఁడవయంశం బేని యర్ధం బేని భోజనార్థం బిపుడు గ్రహింపుఁడు తక్కినదాని నాపత్సముత్తీర్ణుండ నయి యుపకారంబు మఱవక యొసఁగెద ననియు స్వాభీష్టంబు వేఁడునది. షోడశాబ్దంబులు గుటుంబంబు పోషింప సమర్థం బగుధనంబు గలభృత్యుఁ డెనిమిదేండ్లదనుక వేతనంబు గ్రహింపకయ స్వామికార్యంబు సేయ నగు; మఱియు నితరుఁడును స్వధనానుసారంబుగ భృతిం గొనకయ ఱేనికార్యంబునఁ బ్రవర్తిల్లంజను; కాని నిర్ధనుండన్నవస్త్రంబులం గొనియె ప్రవర్తించునది. ఎవ్వానివలన సుఖం బనుభవించె నతనిదుఃఖంబున దుఃఖంబుం బొందని కృతఘ్నుని స్వామియేని యన్యులేని నిందింపక మానరు. ఎవనియన్న మొకమాఱయిన బాగుగ భుజియింపఁబడె నతని కార్యార్థంబు జీవితంబు త్యజియించిన భృత్యుండు సుశ్లోకుం

డు గాన నాపత్కాలంబున సేవాఁడును రాజును విడువం
దగదు; మఱియు భృత్యునికార్యంబు సేయఁ బ్రాణంబులు
వీడిన రాజు నుత్తముఁ డనంబడు. రాముని నీతిసామర్థ్యంబున
వానరులును సుభృత్యత్వంబు నంగీకరించిరి గాన నతనికిం
దుల్యుండగు నీతిమంతుండు పృథివిని లేఁడు. చోరుల నైక
మత్యంబును గ్రామనాశనంబు గావింప నోపు నన రాజభృ
త్యుల నైకమత్యంబు శత్రునాశంబు గావించునని చెప్పనేల?
కృష్ణుండునుం బోలెఁ గూటనీతిజ్ఞుఁడయిన రాజు లోకంబున
నొకఁడు లేఁడు. ఆతఁడు తనచెలియలి సుభద్ర నర్జునునకు
ఛలంబున నిప్పించె. నీతిమంతుల యభిప్రాయంబున స్వశ్రే
యస్సాధనం బఖిలంబు యుక్తి యనంబడు. మధ్యస్థుఁడు
మొదల స్నేహంబు గావించి పిమ్మట నతనికార్యంబు చేసి
ధర్మవాదంబున స్వకార్యంబు సాధించికొనవలయు. పరస్పర
ప్రీతి గల్గునట్లు గుణంబుల వర్ణించుచు నిష్టాన్నధనవసనా
దులఁ బ్రలోభనంబు గావించినఁ గార్యసిద్ధి యగు. కుట్టినులకు,
మాయికులకు, మధ్యస్థులకు, శపథావలంబనంబును మిథ్యా
సల్లాపంబును ధైర్యవర్ధనంబును (సంతసము పెంచుట) గార్యం
బు సాధించు నుపాయంబులు. ఆత్మరక్షణోపాయంబుఁ జింతిం
పనివాఁడు పశువుకంటెను జడుఁడు; యువతులును దుశ్చరి
త్రంబు దాఁప [illegible] గల్పింతురు గాదె. యుక్తి ఛలాత్మికయు
సత్యాత్మికయు నని ద్వివిధ యగు. కపటారులయందు ఛలం
బుపయోగింప వలయు. కానినాఁడు మహాత్ములకేని శీల
నాశం బగు. లోకంబునం బెక్కండ్రు బుద్ధిమంతులు కలరు
గాని యొక్కఁడ కాఁడు; కావునఁ దాత్త్వికంబయిన యుక్తి

నిష్ఫలం బగుటం జూచి కుశలు లగువారు దేశకాలానుసారం
బుగఁ బురుషానుసారంబుగను బెక్కువిధంబుల యుక్తులం
గల్పింతురు. మాయాకుశలు లగువారు మంత్రముల నౌషధు
లను వేఱువేఱు వేషములను గాలమును వచనమును సంశ్ర
యించి పెక్కుతెఱంగుల మోసంబు చేయుదురు. విక్రీతం
బేని దత్తంబేని యగు వస్త్రభాండాదిపదార్థంబుల నధికారి
సమక్షంబునన యాత్మచిహ్నంబు శాశ్వతం బగునట్లు గ్రహీత
వేయించునది. మఱియు స్తేయకూటాదినివృత్తికై యావస్తు
వులు రాజజ్ఞాతంబులు(రిజిష్టరు చేయఁబడినవి)గఁ జేయించునది.
రాజును దనయొద్ద నిడిన జడాంధబధిరబాలుర ద్రవ్యంబులకు
వృద్ధి యీవలయు. స్త్రీలు స్వీయాదిభేదంబున ముత్తెఱంగుల
నున్నట్లు భృతకులు నుత్తమాదిభేదంబున మువ్విధంబుల నుం
దురు. స్వామీతరులయం దనురాగంబు నొందక స్వామియం
దనురక్తుం డగువాఁ డుత్తముఁడు నధికభృతి నపేక్షించి యితరు
లను స్వామిని సేవించువాఁడు మధ్యముఁడును స్వామిచే నధికం
బుగఁ బుష్టుఁ డయ్యు నన్యుని సేవించువాఁ డధముఁడు నగు
దురు. అపకృతుం డయ్యు నుపకరించువాఁ డుత్తముఁడును
సామ్యం బభిలషించువాఁడు మధ్యముఁడును స్వకార్యైక
తత్పరుం డధముఁడు ననియు వ్యవహరింపఁబడుదురు. ఉప
దేశంబు నొందకుండ నేవారికిని గేవలప్రమాణంబుల సుజ్ఞా
నంబు వొడమదు. బాల్యంబుం దారుణ్యము నారబ్ధకార్యము
నకు సమాప్తిదము లగుం గాని వార్ధకంబట్టిదిగాదని ధీమంతుఁ
డెఱిఁగి యశ్రమంబుగ సమాప్తి నొందఁ దగినకార్యం బారం
భించునది. ఏకకాలమున బహుకార్యారంభము సుఖావహము

గాదు గావున నారబ్ధకార్యము సమాప్తి నొందుదనుక నన్య కార్యము ప్రాజ్ఞుఁడారంభింపఁ దగదు. ముం దొక కార్యం బారంభించి యది సిద్ధింపకమున్న వేఱొకదాని నారంభించిన నదియు నిదియుం జెడుం గావునఁ గృతి, సుఖముగ సమాప్తి నొందు దానిన యారంభించునది. కార్యసిద్ధి నాపాదించు కలహమును వరం బగుం గాని నిరర్థకం బయినయది యాయు ర్ధనసుహృద్యశోధర్మహరం బగు. ఈర్ష్యయు లోభమును మద మును బ్రీతియుఁ గ్రోధమును భీతియు సాహసము నను నీ యేడు ను గార్యప్రవృత్తిచ్ఛిద్రమునకు హేతువు లని బుధులు పల్కు దురు. అనాపదయందుఁ గార్యం బెట్లునడిపిన నచ్ఛిద్రంబు విద్వ త్సమ్మతంబుఁ గాలాంతరంబునన బాధంబు నగు నట్లు బుధులు నడుపుదురు. దశగ్రామాధిపతియు శతానీకుఁడు నశ్వారూఢు లయి పరిచారకులతోఁ గూడి చరింప వలయు. మఱియు గ్రామాధికృతులు నట్లు చేయవలయు. సాహస్రికుఁడును శత గ్రామపాలుండును శస్త్రాస్త్రధారు లగు పదుండ్రు పదాతుల తోడ నేని యాశ్వికులతోడ నేని కూడి యేకాశ్వరథారూఢు లయి చరింపవలయు. సహస్రగ్రామాధిపతియు నాయుతికుం డును శిబికారూఢుండేని ద్వ్యశ్వరథారూఢుఁడేని గజారూ ఢుఁడేని యగుచు వింశతిసేవకులతోఁ గూడి చరింప వలయు. అయుతగ్రామపాలుండును బంచాయుతసేనానాయకుఁడును బహుసేవకపరివృతు లయి యేయానంబున నేని చతురశ్వ రథంబున నేని యేగుచుండవలయు. పిమ్మట నాధిపత్యాధి క్యంబు వీక్షించి గౌరవాధిక్యమును గల్పించుచు ధనికులందును గుణవంతులందు నట్లాధిక్యానుసారముగ నేర్పఱుచుచు స్వదే

శంబున శ్రేష్ఠుఁడు మానహీనుండును, నీచుఁ డధికమానయు తుండు గాకుండ శ్రేయోర్థి యగు రాజు చేయునది.

మఱియు రాజు గ్రామంబులను బత్తనములను హీన మధ్యమోత్తములకు గృహార్థము భూములీవలయు. ముప్పది రెండుహస్తముల దైర్ఘ్యముఁ బదియునాఱుహస్తముల వైశా ల్యము గల వాసభూమి యధమయు నర్ధాధిక మధ్యమయు ద్విగుణయుత్తమయు నగు; మఱియు వాసభూమి కుటుంబ స్థితికిఁ దగినదిగ నుండవలయుం గాని యధికయు న్యూనయుఁ గాఁజనదు. రాజుచే నధికారమున నియుక్తులెల్లను గ్రామ బహిర్భాగమున నుండం దగినవారు. సైనికులయుం దొకఁ డును నృపునికార్యంబు లేనియపుడు గ్రామమునం బ్రవేశిం పను గ్రామజనులఁ బీడింపనుం దగదు. మఱియు గ్రామ్య జనులు వారితో నెప్పుడు వ్యవహరింపనుం దగదు. సైనికుల కనుదినమును శౌర్యవృద్ధి గావించుధర్మము నట్టివాద్యనృత్త గీతములును జేఁడు కుశలులచే వినిపించుచు యుద్ధకార్యంబు నన కాని యన్యకార్యమున వాని నియోగింప కుండునది. సత్యాచారు లయిన ధనికులు వ్యవహారమున హాతు లయిన రాజు వారి నుద్ధరించుచు నష్టి వొందిన కృషీవలుల నయితము రక్షించునది.

సైనికులలో ధనికులున్న వారికిం దగినభృతి యిచ్చుచు వారి వ్యయముకంటెఁ ద్రింశాంశం బధికముగఁ బరదేశగమ నార్థము ధనంబిచ్చుచు నాత్మకోశమువోలె వారి ధనమును సుయత్నమున రక్షించుచు మిథ్యాచారులయిన ధనికులధనము హరియించుచుండవలయు. ధనికులచే వృద్ధి చతుర్గుణముగ

గృహీతంబయిన పిదప నధమర్ణులవలన నతనికి మరల ధన మిప్పింపఁదగదు.

ఇది శ్రీ భారద్వాజసగోత్రాపస్తంబసూత్ర పురాణపండ
వంశమణి భద్రయ్యశాస్త్రి తనూభవ విద్వద్విధేయ
మల్లయనామధేయాంధ్రీకృత మైన శుక్రనీతి
సారమున సర్వమును బంచమాధ్యాయము
సమాప్తము.

శుక్రనీతిసారము

కఠినపదముల కర్థము

పదము	అర్థము
సర్గము	సృష్టి
విస్తృతము	విశాలము
క్రమైకదేశబోధకము	సేర్వవలయు వానిలో నొకభాగముం దెల్పునది
అధిగమించు	నేర్చికొను
వృష్టి	వర్షము
వితె	వ్యర్థము
క్లీబులు	అసమర్థులు
అతివాదము	అధికసంభాషణము
ప్రధావించు	పరువెత్తు
జంఘాలంబు	వడిగఁబోవునది
అపథ్యాశి	దేహమున కనుకూలములు గాని వస్తువులం దినువాఁడు
కుంటిశిఖరంబు	పర్వతాగ్రము
అత్యాహితకరము	మిగులభయమును గల్గించునది
హ్రాసము	క్షయము
అసిధారావలేహనము	కత్తివాతిని నాల్కతో స్పృశించుటం బోలునది
స్వారాధ్యుఁడు	శ్రమలేకుండ సేవింపఁ దగినవాఁడు
దురారాధ్యుఁడు	శ్రమచే సేవింపఁ దగినవాఁడు
పసుపఱుచు	అలవాటుచేయు
సీరకాష్ఠము	నాఁగలి
అనుగలము	అనుకూలము
అనుమేయించు	ఊహించు
ఉత్పన్నము	నశించునది
విజిగీషువు	జయింపఁగోరువాఁడు
షండతిలలు	నూవుతప్పలం బోలినవారు
ప్రణిధి	వేగులవాఁడు
సొగియు	సుఖియించు
అకర్ణధారంబు	చుక్కాని పట్టువాఁడు లేనిది
కలంబు	దోనె
వైశ్రవణుఁడు	కుబేరుఁడు
దాంతి	మనోనిగ్రహము
అరినిషూదనుఁడు	శత్రుల జయించువాఁడు
ఉద్వేజనకరంబు	పీడించునది
చికిత్సితగదుఁడు	రోగమునకు వైద్యము చేయించుకొన్నవాఁడు
నిష్ఠ్యూతానల ధూమధూమ్రముఖంబు	ఉమియుచున్న యగ్నియొక్క పొగచే బూడిదరంగు గల మోము గలది
విపశ్చితులు	విద్వాంసులు

పదము — అర్థము

సంవననము=వశీకరణసాధనము
ప్రణిపాతము=నమస్కారము
అలంభావము=సంపూర్తి
విషయామిషము = విషయములను భోగ్యము
ఆకృష్టుఁడు=ఆకర్షింపఁబడినవాఁడు
ఉత్కర్తనము=కత్తిరించుట
అరిగాఁపులు=రయితులు
అనీకము=సేన
కరదులు=పన్నిచ్చువారు
గద్యాణము=ఒక తెలుఁగు బంగారు నాణెము, వరహా
బహుభుజపరిణాహ=పెక్కు చేతుల వైశాల్యము గలది
సత్రికక్షము = మూఁడు ముంగిళ్లు గలది
పరివర్తకులు=మాఱువారు
యామికులు = గుమ్మమును గాచువారు
ఉపకార్యాట్ట సంయుతము = మేడతోడను బురుజులతోడను గూడినది
దూష్యము=వస్త్రగృహము
కోష్ఠము=గది
బృహన్నలికయంత్రము=ఫిరంగి
గౌల్మికము = సేనావిశేష సంబంధమైనది, జీతము పుచ్చుకొని పని చేయు సైనికులు గల సేన గుల్మమని కొందఱు
ప్రకృతులు=మంత్రులు
అధికృతులు=ఉద్యోగులు
పద్య=సన్నమార్గము

పదము — అర్థము

సుధాశర్కరలు = సున్నముం గంకరయును
ప్రహరము=మూఁడుగంటల కాలము
ఆరటులు=గస్తితిరుగువారు
ప్రతిభువు=జామీనుదారు
నిర్యాసము=జిగురు
ఉత్కోచము=లంచము
పైశున్యము=కొండెగానితనము
ఆధర్షణము=బెదరింపు
ఉన్మానంబు=తూనిక
దత్తాభయుఁడు = అభయమీఁబడినవాఁడు
బ్రదిమి=జీవనము
కుసీదము=వడ్డివ్యాపారము
ఆనృశంస్యము=హానిచేయమి
శిఖి=నెమిలి
కేక=నెమిలికూఁత
అనవద్యచరితులు = మంచినడవడికలవారు
పర్వము=పండువు
స్వత్వనివర్తనపురస్సరముగ=హక్కు విడుచుకొనునట్లుగ
గ్రహీతృజీవితావధికము=పుచ్చుకొన్నవాఁడు జీవించియున్నంతకాలము హద్దు
గోష్ఠము=గోశాల
సాహిణము=గుఱ్ఱపుసాల
అంధువు=నూయి
ఘరట్టము=తిరుగల్లు
ఉచ్ఛ్రాయము=ఎత్తు
అపవరకము=గది
కర్పరము=ఇల్లునేయు పెంకు

పదము — అర్థము

గుల్మము=సేనావిశేషము
సోరణగండ్లు=కిటికీలు
సుయంత్రితము= బాగుగఁగట్టంబడినది
కార్పటికుఁడు=నిత్యముం బ్రయాణము చేయువాఁడు
చరుఁడు=వేగులవాఁడు
ఛలంబు=కపటము
వర్షిష్ఠుఁడు=పెద్దవాఁడు
సిద్ధాస్త్రుఁడు=సిద్ధమైన యస్త్రవిద్య గలవాఁడు
నగ్నశస్త్రుఁడు=ఒరనుండి తీసిన కత్తి ధరించినవాఁడు
ఛది=ఇంటికప్పు
దస్యువృత్తి=దొంగతనము
నిర్ఘృణుఁడు=దయలేనివాఁడు
భాగధేయము=అదృష్టము
అనలసులు = చుఱుకుఁదనము గలవాఁడు
కృత్రిముఁడు = తలిదండ్రులవదలి యొచ్చటనేని తిరుగువానిం దెచ్చి పుత్త్రుఁడుగా భావించిన నతఁడు కృత్రిముఁడు
స్వామ్యము=హక్కు; ప్రభుత్వము
కైతవము, కపటము
అభిజనవంతుఁడు=సద్వంశమున జన్మించినవాఁడు
ఒడ్డనము=సేనను యుద్ధానుకూలముగఁ బన్నుట
వితథము=వ్యర్థము
సౌచికులు=కుట్టుపనిచేయువారు
తంతువాయులు=సాలీలు
క్లిశ్యమానుఁడు = కష్టపెట్టఁబడుచున్నవాఁడు

పదము — అర్థము

వేఁగి=పెద్దపులి
అకృష్టభూమి=దున్ననిభూమి
కొఱఁకులపంట=బీళ్లలోనిపంట
అవద్యము=దుష్టము
భృతకుఁడు = కూలిపుచ్చుకొని పనిచేయువాఁడు
చదుకము = నాల్గువీధులుం గలియుచోటు
ఉద్వమించు=క్రక్కు
స్పశుఁడు=చారుఁడు
పార్థక్యము=వేఱిమి
మైమఱువు=కవచము
కవాటము=గవ్వ
కార్యాక్షముఁడు = పనిచేయలేనివాఁడు
సాధిలేఖ్యము=తాకట్టుపత్త్రము
అభిశప్తుఁడు = నిందింపఁబడినవాఁడు
సాద్యస్కము=అప్పుడున్నది
ఉపభుక్తము=అనుభవింపఁబడినది
వినిమయాత్మకము=మార్చుకొన్నది
నిశ్చితాన్యస్వామికము=పరులదియని నిశ్చయింపఁబడినది
భాటకము=బాడిగ
పునరావర్తకము=మరలవచ్చునది
భృతకము=కూలి
త్రివర్గశూన్యము = ధర్మార్థకామములలో నెద్దానిని సాధింపలేనిది
అనుల్బణము=అధికముగానిది
సంభిన్నాలాపము=ఇతరులు మాట్లాడుకొనుచుండ నడ్డముగ మాటాడుట
స్కన్నము=ఆఱిపోయినది
శీర్ణతరి=శిథిలమైనపడవ

పదము	అర్థము
అతివిప్ప = మిక్కిలి సంపాదింపఁబడె	
నను నిచ్చు [కుఁడు	
వేగితుఁడు = మలమూత్రాది బాధ	
గంజః=కల్లుదుకాణము	
శత్రునమనము=శత్రులవంచుట	
ప్రత్యుత్పన్నమతి=సమయోచితమై	
న తెలివిగల [కొన్నవాఁడు	
జిఘాంసకుఁడు = హింసింపఁదలఁచి	
విఘసాశనుఁడు = అతిథిపూజ మొద	
లగునవి కావించి తచ్ఛేషమును	
భుజించువాఁడు	
స్వస=చెల్లెలు	
స్నుష=కోడలు	
లగ్నకుఁడు=జామీనుదారుఁడు	
పర్యుదంచనము=అప్పు	
అధమర్ణికము = ఋణస్థులయొద్ద ను	
న్నది [న్నది	
ఉత్తమర్ణికము = ఋణదాతయొద్ద	
అజర్యము=మైత్రి	
వావదూకత=మాట్లాడుశక్తి	
సాక్షికులు=సాక్షులు	
హిం[redacted]ఁడు=[redacted]ఁడు	
[redacted] ఘాతుఁడు[redacted]ఁడు	
దేవజీవకుఁడు[redacted]ఁడు	
ప్రొత్తడి=పతివ్రత	
జరభి=చెడునడవడిగల స్త్రీ	
పాలసుఁడు=మూర్ఖుఁడు	
విస్రంభార్హులు=నమ్మఁదగినవారు	
హట్టము=బజారు	
ఉత్థానశీలుఁడు=శత్రువులమీఁదికిఁ	
బోవు స్వభావముగలవాఁడు	
ధర్షణి=కులట	

పదము	అర్థము
కర్ణేజపుఁడు=కొండెగాఁడు	
అజాలగర్భము=లోపల గుల్లలేనిది	
వ్రీహి=ధాన్యము	
చిపిటము=తప్పు	
దలాభము=ఉరుకలెనున్నది	
నిర్వేశము=కూలి	
వార్ధుషికుఁడు=వడ్డిచేజీవించువాఁడు	
ప్రసారభూమి=బజారు	
గరువలు=విద్వాంసులు	
కృత్స్నము=పూర్ణమైన	
స్మర్యమాణకర్తృకము=తలఁపంబడి	
న కర్తగలది	
శకృత్తులు=పేడ మొదలగు యెరువులు	
బబ్బులాదులు = బూరుగ మొదలగు	
నవి	
ఆరకూటము=ఇత్తడి	
చలార్చ=ఉత్సవవిగ్రహము	
ప్రాట్టు=అడుగువాఁడు	
వివాకుఁడు=చెప్పువాఁడు [కుండు	
నిపానము = నూతిదగ్గఱనున్న నీళ్ల	
ఘోషణాచ్ఛాదనము=చాటింపును	
గప్పిపుచ్చుట	
ఆవేదనము=పిర్యాదు	
ఆసేధించు=అడ్డగించు	
యియక్షులు=యజ్ఞముచేయువారు	
అధికరణము=న్యాయస్థానము	
కూటకరణము=కల్తీచేయుట	
ప్రాప్తాధర్షణులు = బెదరింపఁబడిన	
వారు మొదలగువారు	
పక్షము=పిర్యాదు. దావా	
ధిగ్దండము=చీవాట్లు పెట్టుట	
పాస్నారులు=స్వర్ణకారులు	

పదము	అర్థము
నిర్వేశము=కూలి	
స్వగమము=స్వయముగాఁ బోవునది	
అన్యగమము=వాహన సహాయమునఁ	
బోవునది [సైన్యము	
మౌలము = తండ్రి తాతల నాఁటి	
భృతిపాలితంబు = జీతమునం గాపా	
డఁ బడినది	
ఉత్సృష్టము=విడువఁబడినది	
బృహన్నాళికము=పెద్దనాళము గల	
యాయుధమును (ఫిరంగిని) ధరిం	
చినది	
లఘునాళికము=తుపాకి	
ఆజానేయము=ఉత్తమాశ్వము	
కఫంబు=పశువుల కాలిగిట్ట	
కూర్పరము=మోచేయి	
కంఠంబుదనుక=మెడవఱకును	
శఫపరిణాహము = డెక్కల వైశా	
ప్రోథము=గుఱ్ఱపుముట్టె [ల్యము	
గ్రీవ=మెడ	
సమీకము=యుద్ధము	
పత్తి=గుఱ్ఱము	
భ్రమదూషితము=చెడుసుడులుగలది	
కార్శ్యము=చిక్కుట	
ఖలీనము=కళ్లెము	
కశాఘాతము=చబుకుదెబ్బ	
శతధనుఃపరిమితము = నూఱుధనువుల	
పరిమాణము గలది	
జాఠరము=గర్భమునందలి యగ్ని	
సక్తువు=పేలపుఁబిండి	
క్షిప్తము=చిమ్మంబడినది	
ప్రస్తరచూర్ణము=రాతిపొడుము	

పదము	అర్థము
అర్కాస్నుహ్యాదికాష్ఠము = జిల్లేడు	
కట్టెలు, జెముడుపుల్లలు	
గోలకము=తుపాకిగుండు	
సుపర్యాప్తము=మిక్కిలి చాలినది	
అభియుక్తుఁడు=విద్వాంసుఁడు	
ఉపహారభేదము=వెవ్వేఱు కానికలు	
ఉత్సాదనము=నాశము	
నిమ్నగలు=నదులు	
ఏకార్థాభినివేశంబు=ఒక కార్యమునం	
మన్నీఁడు=ప్రభువు	
అభిషేణనము=సేనలతో శత్రు నెది	
రింపఁబోవుట	
ధ్వజినీరక్షణము=సేనా సంరక్షణము	
ఒడ్డనము=సేనల పన్నుగడ	
సమీరితము=చెప్పఁబడినది	
సంమీలనము=[illegible]నుట	
ప్రసారణము=[illegible]	
ఆకుంచనము=ముడుచుట	
వ్యాలము=క్రూరమృగము	
అయస్సారము=ఉక్కు	
అవిక్షతము=[illegible]బడనిది	
అపసరించు=తొలఁగు	
గీము=ఇల్లు	
జిఘాంసువు=హింసింపఁదలఁచువాఁడు	
యుధ్యమానులు = యుద్ధము చేయు	
వారు	
క్షత్రబంధువు=రాజాధముఁడు	
పృతన=సేన [సినది	
శరకాక్రాంతము = రాలవానచే నల	
దస్యువిద్రుతము=దొంగలచేఁ దఱు	
మఁ బడినది	

శుక్రనీతిసారము

తప్పొప్పుల పట్టిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
7	19	హోళ కర్మంబు	హోళిఁ గర్మంబు
13	2	జవ్వనంబుఁ బ్రదిమి	జవ్వనంబును బ్రదిమి
	18	వినయవంతుడు	వినయవంతుఁడు
40	9	రైన దామట్టి	రైనఁ దామట్టి
48	7	లోకంబున బరలోక	లోకంబునఁ బరలోక
46	1	బులు	బుల
65	13	శేషండ	శేషండ విధి యంగీకృతమని
93	8	సంధానమునను	సంధానమును
100	21	తేజస్వ్వి	తేజస్వి
106	13	సేనాని	సేనాని
112	16	బావించునది	బాలించునది
135	9	తేజప్స్వి	తేజస్వి
136	17	జన్మమున... గాఁబోఁడు	జన్మమున సుక్షత్రియుండైనను సంసర్గమున నీచుండగుఁ గాని జన్మమున నీచుండగు వాఁడు సంసర్గమున సత్తముఁడు గాఁబోఁడు. English Translation
138	17	సాహివిటత	సాటవిదిత
143	17	ధావార్థి	ధావార్థి
146	1	గ్రథనము	గ్రథనము

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
	15	గ్రధితం	గ్రథితం
165	18	వ్యాఘ్రంబున	వ్యాఘ్రంబు
180	28	రోసాండ...నిధిరో	యోషాండ...నిధియై
188	11	నివాద	వివాద
193	14	బాలుని...బున	బాలుని...బున దాసులగు స్త్రీలు పూటపెట్టిన ధనంబును
208	3	పత్త...దాని...రాలును	సప్తమప్రకరణము
237	24	సురయు[illegible]	సురయుక్తం
239	23	కర్మా[illegible]	కర్మానుష్ఠాన
265	19	[illegible]రుల	రొండొరుల

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము
సుల్తాన్ బజారు - హైద్రాబాదు
ఈ దిగువ పేర్కొనబడిన తేదినాడు కాని అంతకు పూర్వము కాని ఈ పుస్తకము వాపసు చేయవలెను. (తిరిగి ఈయవలెను)

18 MAY 1960	

తేది.	ఈయవలసిన తేది.	ఈయవలసిన తేది.
1960		

END OF TITLE